# బహుళ


త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

సంపుటి - 2 సంచిక - 1 https://www.bahulabyjwalitha.com అక్టోబర్ - డిసెంబర్ 2022




## ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక












స్మృత్యంజలి - 30 లో

'వందేళ్ళ అమ్మ మధురమ్మ'

మరణం: 01-11- 2022.

# మాలతీ బేడేకర్ నవల 'జోకాలియ మేలె' లో స్త్రీ వాదం



**మాలతి బేడేకర్ ( 1905 -2001) జోకాలియ మేలె (తూగుటుయ్యాల పైన)**

**కన్నడంలోకి : డి .ఎస్ .కులకర్ణి .**

కల్యాణి నీలారంభం

విజయవాడ kneelarambham@gmail.com

మాలతి బేడేకర్ ఇంచుమించు మొదటి తరం స్త్రీవాద రచయిత్రి. బహుశా ఆమె కాలంలో ఆమె రచనలు విప్లవాత్మకం అనిపించి ఉండాలి. ఆమెను ప్రభావితం చేసినవి రెండు. మొదటిది అభ్యుదయ భావాలు కలిగిన తల్లిదండ్రులు, రెండవది మహర్షి కార్వే నెలకొల్పిన పాఠశాలలు. ఆమె పుణెలో జన్మించి అక్కడే జీవించారు. మహిళల కోసమే పెట్టిన SNDT విశ్వవిద్యాలయంలో బీఏ పట్టా తీసుకోవడమే కాక అక్కడ టీచర్ గా పని చేశారు. గిరిజన సంక్షేమ విభాగంలో పనిచేసినప్పుడు వారికి జరుగుతున్న అన్యాయాలపట్ల అవగాహన కలిగింది. ఆమె భర్త విశ్రామ్ బేడేకర్ రచయిత, సినిమాలకు స్క్రీన్ ప్లేలు కూడా రాశారు. మాలతీబాయ్ కూడా ఓ మరాఠీ సినిమాకు స్క్రీన్ ప్లే రాశారు. ఆమె కాలానికి ఆమె అభ్యుదయ భావాలు, ఇన్ని రంగాల్లో ఆమె పని చేయడం ఓ అద్భుతం అనిపిస్తుంది. 96 ఏళ్ల సుదీర్ఘ జీవితంలో ఆమె స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం చాలా కృషి చేశారు.

జన్మనామం బాళ్తాయి ఖరె, కానీ కలం పేరు విభావరీ శిరూర్ కర, బి ఏ. వివాహం అయ్యాక మాలతి బేడేకర్ అయ్యారు. ఆమె కల్పనా సాహిత్య, నాకు దొరికిన వివరాలను బట్టి :1933 –51 మధ్య కాలంలో కళ్యాంచె నిశ్వాస్ (మొగ్గల నిట్టూర్పు) కథా సంపుటి, హిందోళ్యావర (తూగుటుయ్యాల పైన), విరలేలె స్వప్న (వాడిన కలలు), శబరి, బళి (బలి ), ఆఖరిది గిరిజనుల దుఃస్థితి గురించి. మిగిలిన వాటిల్లో ఆమె స్త్రీల సమస్యలకు ఓ కంఠాన్ని ఇచ్చారు. అలా ఎందుకు అంటున్నానంటే అంతవరకు ఇవన్నీ మూసిన తలుపుల వెనుక ఉండేవి. స్త్రీల చదువులు, ఉద్యోగావకాశాలు, సమాన హక్కుల గురించి మాట్లాడేవారు సంఘసంస్కర్తలు ఉండేవారు.బాల్య వివాహాలను ఖండించేవారు కూడా. కానీ స్త్రీలకు ఉండే లైంగిక సమస్యలు, స్వేచ్ఛా రాహిత్యం పట్ల మౌనమే కాక ఎవరైనా మాట్లాడితే సహించే గుణం కూడా ఉండేది కాదు.

స్త్రీలకు విద్య, ఉద్యోగావకాశాలు మెరుగైన కొద్దీ వారి వివాహపు వయసు పైకి వెళుతూ వచ్చింది. బాల్య వివాహాలు విఫలమయి ఒంటరిగా మిగిలిన స్త్రీలు, వితంతువులై ఒంటరిగా మిగిలిన స్త్రీలు.. వీరు సమాజంలో ఓ పెద్ద సమూహంగా మిగిలారు. అందులోనూ చదువుకుని ఉద్యోగం చేసే కూతుళ్ళకు పెళ్లి చేయకపోతే తల్లిదండ్రులకు ఆర్థిక భద్రత ఉంటుందన్నది కూడా వీరు ఒంటరిగా మిగలడానికి ఓ కారణమయిందని చెప్పక తప్పదు. ఈ సమూహం, ఆనాడూ ఈనాడు కూడా, పెద్దది అని ఒప్పుకోక తప్పదు.

ఇలాంటి స్త్రీల సమస్యలను, వారి అంతరంగంలోని సంఘర్షణలను మాలతి బేడేకర్ తమ కథలలో, నవలల్లో చిత్రించారు. ముఖ్యంగా తోడుకోసం, పిల్లల కోసం పడే తపన మనం చూస్తాం. 'జోకాలియ మేలె' నవలలో అచల, ఆమె అన్నయ్య, చెల్లెలు చిన్నప్పుడు తల్లిదండ్రులు పోతే చిన్నాన్న పిన్ని పెంచిన పిల్లలు. కథాకాలానికి వారు ముగ్గురి జీవితాలలో మంచీ చెడూ, సుఖదుఃఖాల్ని చూస్తాం మనం. ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. కానీ అచల భర్త వినాయక రావు చెడు అలవాట్లు కారణంగా ఆమె జీవితం సజావుగా సాగదు. పెళ్ళైన పదేళ్ళకు వినాయక రావు ఏదో నేరం పైన జైల్లో ఉంటాడు. అంతకు ముందే పుట్టింటికి వచ్చేసిన అచల ఆగిపోయిన చదువుని తిరిగి మొదలు పెట్టుకుని బిఏ చదువుతుంది. బడిలో టీచర్ గా పని చేస్తూంటుంది. ఆమె జీవితం అన్న, చెల్లి వారి సంసారం చుట్టూ తిరుగుతూంటుంది. అచల ఇష్టపడే వదిన, ప్రియమైన అన్నా, ఐనా వారి మధ్య తాను అడ్డు అనిపిస్తుంది. చెల్లి పిల్లలతో చాలానే కాలక్షేపం ఔతుంది కానీ మరిదితో తాను చేసే మేధోపరమైన వాదనలు ఎక్కువ సంతృప్తినిస్తాయి. కానీ అది చెల్లెలికి నచ్చడంలేదని అర్థమవుతుంది. వీరికి దూరంగా ఉండడమే మంచిదని నాగపూర్ లో ఉద్యోగం వస్తే అక్కడికి వెళ్తుంది.

అచల మంచి టీచర్, ముగ్ధమనస్కులైన పిల్లల మనసుని సులభంగా ఆకర్షిస్తుంది. అందులోనూ ఓ విద్యార్థిని ఇంగ్లండ్ లో వున్న తండ్రికి ఉత్తరాల్లో అచలను పొగడడం, చదువులో మంచి సాధన చేయడంతో ఆ తండ్రి మెప్పుని పొందుతుంది. ఆయన ఆ బడి ఫంక్షన్ కి ముఖ్య అతిథిగా వచ్చి అచలను తన స్పీచ్ లో పొగడడంతో తోటి టీచర్ల అసూయకు గురి అవుతుంది. మామూలుగా కూడా తోటి టీచర్లు, పెళ్ళయిన వారు, పెళ్లి కాబోయే వారు కూడా ఏ కారణం వల్లనైనా ఒంటరిజీవనం గడుపుతున్న సహోద్యోగుల నైతికతను శంకించడం, వారిని అవమానించడం అచలను దుఃఖపెడతాయి. అక్కడ దొరికిన ఒక్క స్నేహితురాలు రాధిక అన్న స్నేహితుడు విరాగ్, లాయర్ వృత్తి, ఆమె దృష్టిని ఆకర్షిస్తాడు.

ఇక్కడినుండి ఆమెలోని ఊగిసలాటను చిత్రిస్తారు రచయిత్రి. పుస్తకాలు, ఉద్యోగం ఏవీ కూడా ఆమెలోని శారీరక వాంఛలను అణగదొక్కలేకపోతాయి. మాతృత్వపు వాంఛను కూడా. ఓ మారు శెలవులకు ఊరికి వెళ్లి వచ్చాక ఆమె ఊగిసలాట ఎక్కువ అవుతుంది. అందులోనూ గర్భిణి ఐన వదినకోసం ఏర్పాటు చేసిన ఉయ్యాల పండుగ ఆమె కోరికలను ఇంకంత రెచ్చగొడుతుంది. అదేసమయంలో వారింట్లో పని చేసే ఆమె చాలా సులభంగా, సహజంగా పనికిమాలిన భర్తను వదిలి మారుమనువు చేసుకోవడం కూడా ఆమె ఆలోచనలను ప్రభావితం చేస్తాయి.

ఇప్పుడు అచల మనసులో జరిగే సంఘర్షణ కీలకం ఈ నవలకు. రొమైన్ రోలా The Enchanted Land లో పెళ్లి కాకుండా తల్లి అయిన ఆనెట్, తన బిడ్డకు తండ్రి వారసత్వాన్ని కూడా ఇవ్వకుండా సమాజాన్ని ఎదిరించే ఆనెట్ ఆమె ఆలోచనలకు ఓ పరిష్కారాన్ని సూచిస్తుంది. ఆఖరికి అచల తన ఉద్యోగం వదిలి విరాగ్ తో సహజీవనం మొదలు పెట్టడంతో నవల ముగిసింది.

ఈ నవలలో ప్రత్యేకత: రచనాకాలం 1933లో ఓ అవివాహిత స్త్రీ (రచయిత్రి వివాహం 1934 లో జరిగింది ) ఓ ఒంటరి స్త్రీ మనసులో చెలరేగే కోరికలను, ఎక్కడా ఎవరినీ నిందించకుండా సహజంగా చిత్రీకరించడం. పైకి కోరికలు లేవని అంటున్న యువతుల మనసులో ఉన్న కాంక్షలను బయట పెట్టడం. అంతేకాకుండా అచల విరాగ్ ల సంబంధానికి లేనిపోని భావనలను అంటకట్టకపోవడం.

# అమ్మలూ మనదే బాధ్యత



"నీ కథను చెప్పాలనుకుంటే
నువ్వెలా స్వేచ్ఛనొందావో చెప్పు
అది నీకు మాత్రమే ప్రత్యేకం"
(థేరీగాథలు– బొల్లోజు బాబా)

థేరీగాథల్లో 'ఉపచాల' చెప్పినట్టు మన ప్రయాణం గురించి చెప్పేటప్పుడు మనం ఓడిగెలిచిన నెత్తుటి గాయాలను గురించి మాట్లాడాలి.

'పదుగురాడు మాట పాడియై ధర జెల్లు', 'మెజారిటీ ఈజ్ రూల్' అంటారు కదా.. అయితే ఏ మెజారిటీ చెప్పింది రూల్ అవుతుంది ఈ పితృస్వామ్యంలో.. 'ఏ పదుగురు ఆడిన మాట న్యాయంగా చెప్పబడుతుంది ?' ఈ స్వార్ధ ప్రపంచంలో.. అత్యాచార భారతంలో మహిళలకు రక్షణేది.. పసిపిల్లల నుండి వృద్ధురాళ్ళ వరకు అందరూ మాంసపు ముద్దలుగా లైంగిక హింసకు గురవుతున్నారు. వీటి మూలాలు పురుషాహంకార మెదళ్ళలో ఉన్నాయి. సవరించాల్సిన బాధ్యత మన పైనే ఉన్నది.

'ఎంత పెద్ద ప్రయాణమైనా ఎవరో ఒకరు వేసే తొలి అడుగుతోనే మొదలవుతుంది'. ముళ్ళు, రాళ్లు, బురద ఉన్న నేలను తొక్కుతూ అడుగులు వేసిన వారందరూ మనకు కొత్త తొవ్వలు వేశారు.

మరి మనమేమి చేస్తున్నాం మనం అంటే అమ్మలు అమ్మమ్మలు నానమ్మలు అత్తమ్మలు పెద్దమ్మలు టీచరమ్మలు డాక్టరమ్మలు లాయరమ్మలు పోలీసమ్మలు రచయితమ్మలు.. అదేనండీ.. అమ్మలందరం ఏమి చేస్తున్నాం..? అమ్మాయిలకు జాగ్రత్తలు చెపుతున్నా.. వారితోపాటే మనమే కని, పెంచుతున్న అబ్బాయిలను ఉపేక్షిస్తున్నాము.. అమ్మాయిలతో ఎలా మసులుకోవాలో నేర్పటం లేదు. అమ్మాయిలకు తోడు వెళ్ళమని కాపలా పంపుతున్నాం.. అమ్మాయిల ఆత్మవిశ్వాసాన్ని గౌరవించమని, వారిపట్ల మర్యాదగా ఉండమని నేర్పడం లేదు. 'నేను మగాణ్ణి' అని ఒక పసివాడి వీడియో హల్చల్ చేసింది ఈమధ్య సోషల్ మీడియాలో.. ఎక్కడ నేర్చుకున్నాడు వాడు. మగాడు ఏమైనా చెయ్యచ్చు అనే కుటుంబ వాతావరణంలో.. మగాళ్ళకే ప్రవేశమనే గుళ్ళలో...మగరాయుడిలా ఆ మాటలేంటి అరుపులేంటి అనే సమాజంలో.. తమ్ముడితో పోటీ ఏమిటి అనే అమ్మల దగ్గర. కాదంటారా..

ఒకామెను రాళ్ళతో కొట్టిచంపారు, ఒకామె ముక్కు చేవులు కోసారు, ఒకామె పాలుతాగుతూ ప్రాణాలు పీల్చి చంపారు, కాపాలాఉన్నామెను సంహరించారు, వేదాలు చదివినందుకు చంపారు, ప్రశ్నించినందుకు చంపారు అని పాఠాలు చెప్పి అబ్బాయిలకు హింసనునేర్పి, అమ్మాయిలకు భయపడి బతకడం నేర్పే బదులు.. చట్టాల పట్ల అవగాహన కలిగించాలి..

అమ్మాయిలు అణకువగా మర్యాదగా ఆత్మగౌరవం లేకుండా, తమ హక్కులు తెలియకుండా పెరుగుతున్నారు.. వారి పక్కనే అహంకారంతో మగపిల్లలం మాకేంటి.. అర్ధరాత్రి వరకు రోడ్డమ్మట తిరగచ్చు.. ఎదురైన ప్రతి ఆడపిల్లను అవమానపరచొచ్చు.. స్మార్ట్ ఫోన్ అంతర్జాలంలో దొరికే ఉచిత అశ్లీల వీడియోలు రేకెత్తించే ఉన్మత్తతతో అత్యాచారాలు చేయొచ్చు అనే హామీ ఇస్తున్నాం.. ఎక్కడైనా దొరికితే భవిష్యత్తు పాడవుతుందని కేసులు పెట్టకుండా వదలేస్తారు.. జైలుకెళ్ళినా క్షమభిక్షతో వదులుతారు.. సన్మామానాలు చేస్తారు.. కానీ అమ్మాయిల పట్ల అమానవీయంగా వ్యవహరిస్తే ఫోక్సో చట్టం ఉంటుందని.. దాని ద్వారా కఠినమైన శిక్షలు పడతాయని చెప్పము..

2012లో వచ్చిన ఫోక్సో చట్టం (The Protection of Children from Sexual Offences Act, 2012) 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్ష అమలయ్యేలా ఈ చట్టాన్ని రూపోందించారు . వారిపై అత్యాచారం పాల్పడ్డ దోషులకు మరణశిక్ష విధిస్తారు. అనే అవగాహనను కలిగించాలి

అది మనమే చెయ్యాలి.. తల్లిదండ్రులు పిల్లలకు ర్యాంకుల కోసం తరమకుండా.. బాధ్యత గల పౌరులుగా పరస్పరం గౌరవంగా వ్యవహరించేట్టు పెంచాలి.. పిల్లలే రేపటి దేశాభివృద్ధికి మూలస్తంభాలు. అత్యంత విలువైన మానవవనరులు వారిని కాపాడే బాధ్యత మనదే అమ్మలూ..

పసిపిల్లల ముందు వెలిగే దీపాన్ని పెడితే అందమైన పువ్వనే భ్రమతో పట్టుకుంటారు. రోగనిరోధక శక్తి లేని శరీరాలు సకల రోగాలకు ఆహ్వానం పలుకుతాయి. అజ్ఞానంతో వెలిగే మెదళ్ళు అనేక సమస్యలకు, నేరాలకు పరికరాలుగా మారుతాయి. తాము నష్టపోవడమే కాక సమాజానికి కూడా నష్టం కలిగిస్తాయి. కానీ మేధావులు, సిద్ధాంతాలను వల్లించేవారు స్వార్ధపుటాలోచనలతో ఒకతరం సమూహాలను దారులు మళ్ళిస్తాయి. జరిగినది అవగాహన చేసుకునేందుకు, వెళ్లాల్సిన దారులు తెలుసుకునేందుకు జీవిత కాలం చాలదు. లంచం తీసుకునే వాడు ఎంతటి అవినీతిపరుడో లంచం ఇచ్చేవాడు కూడా అవినీతికి అంతే బాధ్యుడు. చట్టాలు ధర్మాలు న్యాయవ్యవస్థ అన్నీ ఈ సమాజ శ్రేయస్సును కోరేవే. కానీ స్వార్ధంతో బాధ్యత విస్మరించిన వారంతా సంఘవిద్రోహులే. మౌనంగా ఉన్న మేధావులు, పదవులకు బిరుదులకు అవార్డులకు అమ్ముడు పోయేవారు, సంఘ శ్రేయస్సును విస్మరించిన సమూహాలలో భాగస్వామ్యులే. నేరం చేసే వాడితో పాటు నేరం జరుగుతుంటే మౌనంగా చూస్తూ ఉండేవాడు కూడా నేరస్థుడే. వారిని సమర్ధించే వారు కూడా..

ఎండా వాన నుండి రక్షక చర్యలు (గొడుగు వంటివి) లేకుండా ఎండలో వానలో బయటికి పోయి తడిచి లేదా ఎండ దెబ్బ తగిలి బాధపడట్టే. బయట భద్రతా సమాజం లేనప్పుడు అర్ధరాత్రి ఒంటరిగా బయలెల్లి ఆపదలకు గురవుతున్న స్వేచ్ఛా జీవుల వలెనే.. మొదటిసారి ఒక బాలుడు ఏనుగెక్కి దెబ్బతిని పాఠం నేర్చుకున్నా.. విజయం పొందినట్టే. మరోసారి జాగ్రత్త పడతాడు. ఈవ్ టీజింగ్ కు గురైన బాలిక భయపడకుండా జాగ్రత్తపడినట్లే.. విషాదం ఏమిటంటే కత్తులు సుత్తులు కొడవళ్ళు తమ వేళ్ళను గాయపరుస్తాయనే సత్యం బోధపడక, సిద్ధాంతాల రాద్ధాంతాల మధ్య అయోమయానికి గురవుతారు. వయసుతో సంబంధం లేకుండా దోపిడీకి వివక్షకు గురవుతున్నట్టే.. అనేక మంది పిల్లి కళ్ళుమూసుకుని పాలుతాగినట్టు. పబ్బం గడుపుకొని 'కెరీరిజం' కోసం పరిగడుపని ప్రచారం చేస్తూంటాయి.. రంగునీళ్ళలో మునిగిన నక్కలను గుర్తించాలి. అమాయకులు బలికాకుండా జాగ్రత్త పడాలి..

– జ్వలిత, ప్రధాన సంపాదకురాలు 9989198943.


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**సంపాదక వర్గం**
డా. తిరునగరి దేవికీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి
ఆచార్య సూర్య ధనుంజయ
ఆచార్య కె. ఆశాజ్యోతి
డా. వంగరి త్రివేణి
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. నందిగామ నిర్మల కుమారి
డా. మారోజు దేవేంద్ర
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**

రచనలు పంప వలసిన చిరునామా :
జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ – 500072, తెలంగాణ editorbahula@ gmail.com

విషయ సూచిక


| | | | | |
|---|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | మల్లోజుల మధురమ్మ/జ్వలిత & గత సంచికల ముఖ చిత్రాలు | | 1 |
| 2. | అనువాద సాహిత్యం | మాలతీ బేడేకర్ నవల 'జోకాలియ మేలె' లో స్త్రీ వాదం | – కల్యాణి నీలారంభం | 2 |
| 3. | వ్యాసం | మహిళా లోక శిరోమణి లక్ష్మీబాయమ్మ | – డాక్టర్ దాసోజు పద్మావతి | 5 |
| 4. | వ్యాసం | గుల్ దస్తా | – కొల్లాపురం విమల | 6 |
| 5. | వ్యాసం | స్త్రీత్వ వేదనలో అనుమాండ్ల కౌసల్య | – డా॥ వంగరి త్రివేణి | 11 |
| 6. | వ్యాసం | స్త్రీ నవలా సమీక్ష జీవించగలిగే చోటుకు! | – శృంగవరపు రచన | 16 |
| 7. | అనువాద సాహిత్యం | నేను ఫణియమ్మను.....! మూలం: ఎం.ఎస్.ఆశాదేవి | – ఆచార్య కె.ఆశాజ్యోతి | 19 |
| 8. | అనువాద సాహిత్యం | Till it happens to you నీకు జరిగే దాకా... లేడీ గాగా.. డేన్ వారెన్ తో కలిసి రాసిన కవిత. | – గీతాంజలి | 23 |
| 9. | వ్యాసం | పురాణ ప్రక్షిప్తాలలో జనపదులు | – డా. నందిగామ నిర్మల | 25 |
| 10. | వ్యాసం | సమాచారాన్వేషణా.. ఓ నైపుణ్యమే..!! | – నాంపల్లి సుజాత | 28 |
| 11. | వ్యాసం | స్మృత్యంజలి | – అనంచిన్ని వెంకటేశ్వరరావు | 30 |
| 12. | వ్యాసం | బొట్టు భోజనాలు కథలో దళిత స్త్రీ మానసిక స్థితి | – డా. పసుపులేటి నాగమల్లిక | 32 |
| 13. | వ్యాసం | ఆడపిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలకు చరమగీతం ఎప్పుడు? | – వాసరచెట్ల జయంతి | 34 |
| 14. | వ్యాసం | ముసలమ్మ మరణం – స్త్రీ దృక్పథం | – డా. కందేపి రాణీప్రసాద్. | 36 |
| 15. | వ్యాసం | సృష్టిలో స్త్రీ ఒక బహుమతి | – నిరుపమ | 38 |
| 16. | ఇంటర్వ్యూ | డాక్టర్ తిరునగరి దేవకీదేవితో ముఖాముఖి | – జ్వలిత | 39 |
| 17. | ఇంటర్వ్యూ | ప్రొఫెసర్ సి.హెచ్. సుశీలమ్మతో ముఖాముఖి | – జ్వలిత | 43 |
| 18. | కథ | ధర్మపన్నము | – తమ్మెర రాధిక | 47 |
| 19. | కథ | ఆకలిరాజ్యం | – కోటమర్తి రాధాహిమబిందు | 51 |
| 20. | కథ | రంగుటద్దాలు | – స్వాతి శ్రీపాద | 53 |
| 21. | కథ | ఒక విజేత కథ | – సరోజన బోయిని | 55 |
| 22. | కథ | పచ్చి ఎచ్చాల డబ్బా పసరు మందు | – జాజుల గౌరి | 59 |
| 23. | కథ | నాన్నా నువ్వెక్కడ? | – వేలూరి ప్రమీల | 62 |
| 24. | కథ | ఆమె కథ | – చల్లా సరోజినీదేవి | 65 |
| 25. | కథ | చిమ్మ చీకట్లలో – దివ్యకాంతులు | – ఝాన్సీ కె.వి. కుమారి | 72 |
| 26. | కథ | సంతానం | – ఆసూరి ఉషారాణి | 78 |
| 27. | కథ | పెద్దక్క ముచ్చట | – సుమతి చురకంటి | 79 |
| 28. | కథ | అరిటాకు | – డా॥బండారి సుజాత | 80 |
| 29. | కథ | విశ్రాంత జీవనం | – డా. లక్ష్మీ రాఘవ | 83 |
| 30. | కథ | అతివ మనసు | – లంక సీత | 85 |
| 31. | కథ | చీకటిలో చిరుదీపం | – యేముల/ సిరిపురం వాణిశ్రీ | 87 |
| 32. | కథ | ముంతాజ్ | – గుగులోత్ తులసి. | 88 |
| 33. | అనువాద కథ | రంగు వెలిసిన కల | – వనజ తాతినేని. | 93 |
| 34. | పిల్లల నవల | నీలాకాశంలో నిధి (పిల్లల నవల – రెండవ భాగం) | – శాంతి ప్రబోధ | 98 |
| 35. | కవిత | చినుకు | – మహెజబీన్ | 10 |
| 36. | కవిత | తూరుపు శిశువు | – శైలజామిత్ర | 18 |
| 37. | గజల్ | గజల్ | – నిర్మలారాణి తోట | 21 |
| 38. | కవిత | ఎరుపెక్కాల్సిన పసి పిడికిలి | – రమాదేవి బాలబోయిన | 22 |
| 39. | కవిత | మూలకు తోసిన మూలకారణాలు | – చంద్రకళ దీకొండ | 24 |
| 40. | కవిత | మనం మనమేనా.. | – శీలా సుభద్రాదేవి | 27 |
| 41. | కవిత | అమ్మనడత– మనకుఆత్మబోధ...! | – జి. శాంతారెడ్డి | 29 |
| 42. | కవిత | ఓరి ధూర్తులార...! | – చింతోజు పద్మావతి | 31 |
| 43. | కవిత | దగగీతం | – చొక్కరతాతారావు | 46 |
| 44. | కవిత | రెక్కల లెక్క | – డా. సముద్రాల శ్రీదేవి | 50 |
| 45. | కవిత | ఎంపిక | – మందరపు హైమావతి, | 52 |
| 46. | కవిత | ''జడ''త్వమ్ !? | – ఎం. వి. ఉమాదేవి | 77 |
| 47. | కవిత | నిజం | – నస్రీన్ ఖాన్ | 82 |
| 48. | కవిత | అల్జీమర్స్ | – హిమజ | 84 |
| 49. | కవిత | ఆరాధన | – వాసంతి శ్రీ | 86 |
| 50. | కవిత | డీజందర్లుగా మారితే | – జి. విజయలక్ష్మి | 92 |
| 51. | కవిత | బాలలం – భావి భారత పౌరులం | – లకావత్ సునీత | 105 |
| 52. | కవిత | మనస్సున కళ్ళు | – కె. మెరెల్ మెరబ్ | 106 |
| 53. | బాల బహుళ | సాన్వి, శ్రేష్ఠ | | 106 |
| 54. | కవిత | స్నేహమయం | – స్వప్న మేకల | 107 |

# మహిళా లోక శిరోమణి లక్ష్మీబాయమ్మ



- డాక్టర్ దాసోజు పద్మావతి

ఇబ్రహింపట్నం, 9441286794

ఆమె ఒక వ్యక్తి కాదు. మహాశక్తి అని నిరూపించిన ధీర వనిత. తెలంగాణ వీరనారి. స్త్రీల ఆత్మాభిమానానికి ఆమె దిక్సూచి. మహిళాభ్యుదయానికి పాదుకొల్పిన స్వతంత్ర సమర యోధురాలు. భరత మాత ముద్దుబిడ్డ. మన సంగం లక్ష్మీ బాయమ్మ.

రంగారెడ్డి (ప్రస్తుతం మేడ్చల్) జిల్లాలోని ఘట్కేసర్ లో 1911 జులై 27వ తేదీన లక్ష్మీబాయమ్మ జన్మించారు. ఆమె తల్లిదండ్రులు సీతమ్మ గోగు రామయ్యలు.తల్లిదండ్రులు పెట్టిన పేరు సత్తెమ్మ లక్ష్మీబాయమ్మ కు చిన్నతనంలోనే దుర్గా ప్రసాద్ యాదవ్ తో వివాహం జరిగింది

అత్తింటి వారు లక్ష్మీ బాయి అని మార్చారు. ఆమె బాల్యంలోనే తల్లిదండ్రులని కోల్పోయింది. వివాహమైన కొద్ది కాలానికే భర్త మరణించాడు. ఆమె మేనమామ సంగం సీతా రామయ్య శారదా నికేతన్ లో చేర్పించేటప్పుడు ఇంటి పేరు సంగెంగా వ్రాయించడంతో సంగం లక్ష్మీ బాయమ్మ అయింది.

ఆమె శారదా నికేతన్ లో చదువు కుంటున్న రోజుల్లో నే తన తోటి అమ్మాయిలను ప్రోత్సహించేవారు. విద్యార్థి దశ నుంచే జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

1927లో సైమన్ కమిషన్ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. కల్లు, సారా అమ్మకాలు నిషేధించాలని స్త్రీలతో కలిసి ఉద్యమించారు.విదేశీవస్త్ర బహి ష్కరణలో చురుకుగా పాల్గొన్నారు.1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని అరెస్ట య్యారు రాయ వెల్లూరు జైల్లో సంవత్సరకాలం శిక్షణ అను భవించారు. జైల్లో ఉన్నప్పుడు కూడా స్త్రీలకు ప్రత్యేక మైన గదులు కేటాయించాలని ఉద్యమించారు. జైలు నుండి విడుదలైన తర్వాత మద్రాస్ వచ్చి చిత్రకళలో శిక్షణ తీసుకొని 1933 లో మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి డిప్లమా అందు కున్నారు.

ఆ తర్వాత హైదరాబాద్ వచ్చి నారాయణ గూడలోని రాజ బహదూర్ వెంకట రాంరెడ్డి మహిళా కళా శాలలో గౌరవ వార్డెన్ గా బాధ్య తలు చేపట్టారు. స్వామి రామానంద తీర్థ ప్రోత్సాహంతో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ మహిళ కన్వీనర్ గా పనిచేశారు. మహిళాభ్యుదయం కోసం విశేష కృషి చేసిన స్త్రీ మూర్తి లక్ష్మీ బాయమ్మ. ఆమె హైదరాబాదులో స్త్రీ సేవా సదన్ నడిపారు. రాధికా ప్రశూతి చికిత్సా లయం, వాసు శిశు విహార్ మరియు మా శెట్టి హను మంత గుప్తా హై స్కూల్ స్థాపించ దంలో కీలక భూమిక పోషించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా మండలి కోశాధికారిగా పనిచేశారు. భారత స్వాతంత్ర సంగ్రామం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న సమయం అది 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో మహిళా శక్తిని నిరూపించిన స్త్రీ మూర్తి.ఆమెతో పాటు ఎందరో భారతీయులు ఉద్యమం వైపు వెళ్లారు.1947 నుంచి 1948 వరకు రాష్ట్ర స్థాయిలో జరిగిన నిజాం వ్యతిరేక పోరాటంలో కీలక భూమిక పోషించారు.

ఉద్యోగాన్ని వదిలిపెట్టి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. విముక్తి పోరాటంలో మహిళల్ని ముందుండి నడిపించారు.

సోయబుల్లాఖాన్ మరణించినప్పుడు ఎవరు కూడా ఆ కుటుంబాన్ని కనీసం పలకరించ డానికి కూడా వెళ్లలేదు. కానీ సంగెం లక్ష్మి బాయమ్మ గారు వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని ఓదార్చి, మనో ధైర్యాన్ని ఇచ్చి అండగా నిలిచారు. ఆమె ధైర్య సాహసాలకు ప్రతీక అని మరో మారు నిరూపించారు. 1950 ప్రాంతంలో ఆచార్య వినోబాభావే తెలంగాణ ప్రాంతంలో పర్యటించినప్పుడు వారి ఉపన్యాసాల్ని తెలుగులోకి అనువదించారు. 16 గ్రామాలు లక్ష్మీబాయమ్మ స్వయంగా పర్యటించి 314 ఎకరాల భూమిని సేకరించి వినోబా భావే గారికి అంద జేశారు.ఆతరువాత బాన్సువాడ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో 1954 నుండి 1956 వరకు విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేసే చేశారు. ఎన్నో సంస్కర ణలు తీసు కొచ్చారు. ఆమె కాలంలోనే బాలికలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. 1952లో అనాథ బాలికల సంక్షేమం కోసం ఇందిరా సేవా సదన్ ను స్థాపించారు. ఈ సదన్ నుండి అనేక సేవా కార్య క్రమాలు చేసారు. బాలికా సంక్షేమం కోసం విద్యా, స్వయం ఉపాధి, వంటి కార్య క్రమాలు చేపట్టారు. నెహ్రూ ఇందిర సదన్ ను స్వయంగా సంద ర్శించారు. ఆ తర్వాత 1957లో 1960లోను, 67లో మూడుసార్లు లోకసభకు మెదక్ నుంచి ఎన్నికై నారు. తెలంగాణ నుండి లోకసభకు ఎన్నికైన తొలి పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి సంగెం లక్ష్మీ బాయమ్మ.మహిళాభ్యుదయం కోసం విశేషంగా కృషి చేసిన మహిళా లోక శిరో మణి మన లక్ష్మీబాయమ్మ.

వ్యాసం

# గుల్ దస్తా



కొల్లాపురం విమల,
హైదరాబాద్.
vkatikaneni@gmail.com

**"వికసించాలని ఓ నాటికి పువ్వులా గుప్పెట్లో ఆత్మతో ప్రతి మొగ్గా నిరీక్షిస్తుంది
ఆశతో ముంచుకొస్తున్న శిశిరానికీ, వంచించే వడగాడ్పుకీ మధ్య బుల్ బుల్
జీవితం కొమ్మన ఊగుతుంది ఉరితాడులా" - మహలఖాబాయి చందా (1768)
స్వేచ్ఛానువాదం : విమల.కె**

మన హృదయాల్లో గుప్తంగా సలుపుతున్న గాయాలకు 'లేపనం అద్ది' చురుక్కుమనే చమత్కారాలతో బాధను రేపే సల్లాపం గజల్. గాయానికి గుర్తుగా మిగిలిన 'మచ్చ' నిజానికి మన వాస్తవికతలను గుర్తుచేసే 'కవిత' వంటిది. అలాంటి కవితలను గజల్ ప్రక్రియలో మనకందించిన తొలి ఉర్దూ గజల్ కవయిత్రి మహలఖాబాయి చందా. గాలిబ్ కంటే ముందే ఉర్దూలో తొలి దివాను ప్రకటించిన హైద్రాబాదు కవయిత్రి ఆమె. ఈమె కంటె ఒకింత ముందు అతి చిన్న వయసులోనే మస్నవీ, ఖసీదా ప్రక్రియల్లో 8,000లకు పైగా కవితా ఖండికలను రాసిన లత్ఫున్నిసా ఇ యాజ్; తొలి భారతీయ గజల్ కవి మహమ్మద్ కులీ కుతుబ్ షా. హిందీ/రేకా గజల్ కి దేశవ్యాప్త కీర్తి తెచ్చిన వలీ దక్కనీ. ఆధునిక కాలంలో గజల్ కవి సమయాలను మలుపు తిప్పిన మగ్దూం; తొలి

తెలుగు గజల్ కవులు సినారె, దాశరథి వంటి ప్రఖ్యాత కవులందరూ హైద్రాబాద్ లో బొడ్డు సంబంధం కల్గినవారే. అంతేకాదు, అద్భుత కవితా ప్రక్రియగా ప్రపంచంలోనే 'గజల్' నిల్చేట్టు చేసిన గాలిబ్ తో పాటు దాగ్ దహెల్వీ, జేబున్నీసా, ఫైజ్ అహమ్మద్ ఫైజ్, కైఫ్ ఆజ్మీ వంటి గొప్ప కవులందరూ ఈ దక్కను పీఠభూమిని ముద్దాడినవారే. వాళ్ల గజళ్లలోని గుండెల్ని కోసే నిరీక్షణా, దుఃఖపు జీరా సాయంత్రపు ఏకాంతంలో విన్పించే సుదూర 'అజాన్' పిలుపులో ఇప్పటికీ విన్పిస్తూనే వుంటవి. ఉద్యోగరీత్యా హైద్రాబాదు నుంచి కొంతకాలం దూరంగా బతకాల్సి వచ్చినప్పుడే నాకీ విషయం మరింత బాగా అనుభవానికొచ్చింది. నాలో తెలియని అశాంతికి ప్రతిస్పందనగా విన్పించే 'అజాన్' పిలుపు వినబడక మంచుఖండంలో 'ప్రవాసి'గా అట్లా ఆరాటపడుతున్న కాలంల అనుకోకుండా మహలఖాబాయి చందా గజళ్ల పుస్తకం నాకు దొరికింది. అర్థం గాకపోయినా అక్కున జేర్చుకునే అపరిచిత స్నేహం వలె నన్ను ఊరడించింది. గజల్ పై నా ప్రేమను మరింత పెంచింది.

నా మట్టుకు నాకు గజలంటే నా కళ్లలో ఎవరికీ అగుపించని విషాదాన్ని పసిగట్టగల్గిన అపురూపమైన స్నేహాన్నందించే కవితా ప్రక్రియ. అటువంటి గజళ్ల గురించి కాలేజీ రోజుల్లోనే నాతో సంవాదానికి దిగిన కవయిత్రి, పాలమూరు మట్టిబిడ్డ గద్వాల కిరణ్ కుమారి. అసలు గజలంటేనే సంవాద రూపంలోని సల్లాపమని ఆ తర్వాత్తర్వాత కిరణ్, జగన్, శ్రవణ్, బాణాల శ్రీనివాస్, కాంచనపల్లి, ఏనుగు నర్సింహారెడ్డిల స్నేహంలో పంచుకున్న సాహిత్య సమాలోచనలు చెప్పినై. అలాంటి రోజుల్లోనే వడగాడ్పు గొడుతున్న ఓ వొంటరి మధ్యాహ్నం జేబున్నీసా 'కన్నీటి పాట'లను ఉరుకులు పరుగులతో తెచ్చి అందిచ్చిన జగన్ ఋణం తీర్చుకోలేనిది. నాలోని అర్థంకాని అశాంతికి ప్రతిబింబాలా అన్నట్లున్న ప్రతిస్పందనలను నింపుకున్న జేబున్నీసా గీతాలు నన్ను గజల్ కి 'గులాము'ను చేసినై. పంజరంలోని పక్షి కళ్లలోని ఆర్తికీ, ఫ్రేములో ఇమిడిన మోనాలిసా చిత్రమైన నవ్వుకీ భాష్యాలను, మత్లా నుంచి మక్తా వరకు మలుపు మలుపున లయతో ప్రవహించే గజల్ కవిత్వాన్ని పసిగట్టే చూపును సదాశివగారు, శివరామకృష్ణ గార్ల ఏకలవ్య శిష్యత్వంలో నేర్చుకుంటూనే వున్న. ఈ పూర్వరంగమే

ఈ రోజు ఈ రెండు మాటలను రాసే అవకాశాన్ని కల్పించిందని చెబుతూ, 'గజల్ కిరణాలు' చదివినప్పుడు సాహిత్య ప్రేమికగా నాకు ఇందులో కన్పించిన ప్రత్యేకతలను పంచుకుంటా.

వచన సాహిత్యమే ప్రధాన ప్రక్రియగా మన్ననలందుకుంటున్న ప్రస్తుత కాలాన గజల్ ప్రక్రియను ఎంచుకోవడమే సాహసం. అదీ మనిషి మాయమై పోతున్న ప్రపంచ సందర్భంలో "కాలం మారిందని యేమార్చే" స్థానిక సందర్భాల్లో 'న్యాయం కోసం కంటి జ్వాలను రగిలిస్తూ, అనాదిగా శోధిస్తున్న ఆడజాతి' గొంతుకను విన్పించాలనుకోవడం మరింత సాహసం. అయినా 'వర్తమానమే కవితా వస్తువు కిరణా, మారే కాలంతో కలబడేవాడే కవి' అంటూ 'తన వెన్నును తానే తట్టుకుంటూ' గజల్ ప్రస్థానాన్ని సాగించడమే కిరణ్ ప్రత్యేకత అన్పించింది – 'గజల్ కిరణాలు' ఏకబిగిన చదివినప్పుడు. ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్ల స్నేహం గురించి కొంతైనా తెలుసేమో గానీ అంతకంటే సుదీర్ఘకాలంగా ఇరాన్, పర్షియా సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని హత్తుకొని ఇప్పటికీ సాహిత్య

ప్రేమికుల దాహాన్ని తీర్చే గజల్ ప్రక్రియ గురించి ఈ తరం తెలుగు పాఠకులకు తెలిసింది తక్కువే. ఇటువంటి సందర్భంలో గజల్ ప్రక్రియను తెలుగులో తన సాహిత్య వ్యక్తీకరణగా చేపట్టిన కిరణ్ అభినందనీయురాలు.

నిర్మాణపరంగా చూసినప్పుడు గజల్ 'చట్రాన్ని' ప్రతిపాదించే ప్రక్రియే కావచ్చు. కానీ "Great literature is simply language charged with meaning to the utmost possible degree" అన్న ఎజ్రా పౌండ్ మాటలకు అచ్చమైన నిదర్శనం గజల్. ఒక్కోసారి మన అనుభూతులను వ్యక్తీకరించడానికి భాషే ఒక చట్రమై అడ్డుపడే సందర్భాలు కన్పిస్తే. అట్లాంటి భాషను తిరిగి ఒక ఛందస్సు చట్రంలో ఇముడుస్తూనే అనుభూతిని అందించడం మరింత కష్టం. చట్రాల్లోనే వున్న ఇట్లాంటి పరిమిత స్వేచ్ఛలోంచి 'అపరిమిత స్వేచ్ఛను', విశ్వప్రేమను కల గని, దాన్ని సాకారం చేసేవరకు గొంతెత్తి పాడటం అనేది ఒక సాహస ప్రయాణం. కవిత్వాన్ని గాఢంగా ప్రేమించే కవులు మాత్రమే ఎంచుకునే దారి అది. 'గెలుపుకు దగ్గరి దారిలేదు, పదిలంగా నడవందే బాట ఎలా అవుతుంది" అన్న ఎరుక ఉన్న కవయిత్రి కాబట్టే కిరణ్ గజల్ ప్రక్రియను

ఎంచుకొని సాహిత్య సృజనకు పూనుకున్నదనిపిస్తుంది. ఈ సంపుటిలో నాక్కనిపించిన ప్రత్యేకతలను పాఠకులతో పంచుకోవాలంటే హైద్రాబాదు గజల్ నేపథ్యాన్ని, దానికి వన్నె తెచ్చిన ప్రముఖ తెలంగాణా ఉర్దూ కవయిత్రుల (కవుల) వారసత్వాన్ని కిరణ్ అందుకున్న వైనాన్ని రేఖామాత్రంగానైనా చర్చించడం సబబు అనుకుంటున్న.

ముందే ప్రస్తావించినట్లు ఇరాన్, పర్షియా సంస్కృతుల్లోంచి పుట్టిన కవుల సాహిత్యాన్వేషణల సారంగా నూతన ప్రక్రియగా మొదలై కొత్త సంస్కృతినే సృష్టించిన నేపథ్యం గజల్ ది. వస్తువు, భావనల రీత్యా సాంప్రదాయిక వ్యక్తీకరణల్లో ఒకింత స్వేచ్ఛావరణాన్ని అప్పటి కవులకు 'గజల్' అందించింది. ప్రేమ, కోరిక,

మోహం, నిరీక్షణా వంటి అనుభవాలను, అనుభూతులను పంచుకునే వాహికగా గజల్ అచిరకాలంలోనే పూర్వాధునిక 'జెండర్ సమాజాల్లో కొత్త సంస్కృతిని ప్రవేశపెట్టింది. అప్పటికే కులం, మతం, లింగం వంటి అంశాల చుట్టూ కమ్మిన అసహనాలకు ప్రతిస్పందనగా 12వ శతాబ్దం నాటికి దక్షిణ భారతంలో ఊపందుకున్న భక్తి ఉద్యమాల నేపథ్యంలోంచి తెలుగులో కావ్య గౌరవాన్నందుకున్న ద్విపద ప్రక్రియ, కన్నడ 'వచనాలు' గజల్ కై దక్కను నేలను పోతం జేసి వున్నె. దక్షిణ భారతదేశానికి అరబ్ దేశాలతో నౌకా నిర్మాణ వాణిజ్య సంబంధాలుండేవని 4వ శతాబ్దంలో దక్షిణ భారతదేశాన్ని సందర్శించిన ఇబ్నబతూల్ ప్రస్తావిచారంటారు చరిత్రకారులు. ఈ నేపథ్యంలో 1316ల నాటికి దక్కను ప్రాంతంలో వివిధ సూఫీ మతశాఖలు ఏర్పడటం, సూఫీ గురువులు దక్కనుకు రావడం గజల్ ఒక సాహిత్య ప్రక్రియగా ఇక్కడ కాలూనడానికి కలిసివచ్చింది.

మొత్తానికి 15వ శతాబ్దం నాటికి తొలి భారతీయ కవి కులీని, ఆపై దక్కను పర్షియన్ కవి సమయాలతో హిందీ గజల్ కు ప్రాణం పోసిన వలీ దక్కనీని అప్పటి హైద్రాబాదు రాజ్యం సాహిత్య ప్రేమికులకు అందిచ్చింది. అట్లా సూఫీ తాత్విక గీతంగా మొదలైన గజల్ ప్రేమ, మోహం, నిరీక్షణా, కోరిక వంటి అంతరంగిక అనుభూతులను పంచుకునే ప్రస్థానంలో 'స్త్రీ' గొంతుకకు

ఆవరణం ఏర్పర్చడం విశేషం. అంతేకాదు అక్కమహాదేవి, మీరాబాయి, ఆండాల్ వంటి భిన్న భారతీయ భాషల కవయిత్రులు తమ (భక్తి) కవిత్వం ద్వారా ఏర్పర్చిన సాహిత్యావరణం కూడా గజల్ ను ఒక ప్రక్రియగానే గాకుండా గజల్ ప్రక్రియలో స్త్రీలకు తమ గొంతును విన్పించే అవకాశాలను సమకూర్చిపెట్టింది. ఈ క్రమంలో దక్కనులో పాదుకున్న గజల్ 18వ శతాబ్దం నాటికి మహలఖాబాయి చందా, లత్ఫున్నిసా ఇమ్తెయాజ్ వంటి హైద్రాబాదు కవయిత్రుల సంవేదనలకు వ్యక్తీకరణ వాహికగా మారింది. మరీ ముఖ్యంగా పురుషులు కూడా 'స్త్రీ'గా మాట్లాడే అవకాశాన్ని (గజల్ సాహిత్య పరిభాషలో రేకీ అంటరు) ఉర్దూ సాహిత్యానికి గజల్ వారసత్వంగా అందించింది. 'రేకీ' శైలిలోని ఆయా కవుల, కవయిత్రుల రచనలను తరచి చూస్తే స్త్రీల కంటే పురుషులే ఎక్కువ మటుకు (క్షేత్రయ్య, త్యాగయ్యల వలె) స్త్రీ గొంతుతో రాసిన దాఖలాలు సాహిత్య చరిత్రలో నమోదైనై. అట్లాగే తొలినాళ్ల నుంచి ఈనాటివరకూ కూడా ఎక్కువ మంది కవయిత్రులు పురుష స్థానంలోంచి రాస్తున్న గజల్స్ కూడా కన్పిస్తే. అదేసమయంలో అరుదుగానైనా "దూరంగా వుండే బంధించావు – ఈ కస్తూరి మృగాన్ని – నా హృదయాన్ని" అంటూ స్త్రీలుగా తమలోని సంవేదనలను, గాఢమైన భావోద్వేగాలను రికార్డు చేసిన అలనాటి కవయిత్రులు కూడా కన్పిస్తరు. అదే సమయంలో "ఆమె మొఖం మెరిసే అద్దమై, విందు తర్వాత క్షణాలను వెలిగిస్తున్నది" అంటూ పానపాత్రతో మధుశాలలోకి జాబిలివంటి మోముతో అడుగిడిన ప్రేమికను వర్ణించే 'ప్రియుని'లా కవిత్వమై చెలరేగిన కవయిత్రులు కన్పించడం కూడా కద్దు.

ఇట్లా తొలినాళ్ల నుంచీ ఒకసారి ప్రేమికగా, మరోసారి రెండు గొంతుకల జుగల్‌బందీలా, చాలాసార్లు ప్రియునిలా జరిపే సల్లాప సంవాదాలు కవయిత్రుల గజళ్లలో కన్పిసై. కొందరు విమర్శకులు భావిస్తున్నట్లు గజల్ కవయిత్రులు 'ప్రియున్ని' సంబోధిస్తూ రాసే గజళ్లు ఆధునిక కాలానికి సంబంధించిన ధోరణి కాదని వీటివల్ల అర్థమౌతుంది. వర్తమాన గజల్ కవయిత్రి కిరణ్ కూడా సరిగ్గా ఈ వారసత్వాన్ని అందుకున్న దాఖలాలు ఈ సంకలనంలో కన్పిసై. అందుకే

"వరమో శాపమో – ప్రేమనెలా చూసేది

మనసును ఊరడించే చెలి తలపే గజల్" వంటి నిర్వచనాలు ఇస్తుంది. పురుష ప్రపంచంలో మన్ననలందుకుంటున్న గజల్ ప్రక్రియలో స్త్రీలు తమ ఉనికిని చాటుకోవాల్సిన సామాజిక సందర్భాలు కావొచ్చు లేదా సౌందర్యాన్ని ఆరాధించే భావుకులుగా స్త్రీ సౌందర్యాన్ని కొలవడం కావొచ్చు కవయిత్రులు 'చెలి'ని సంబోధిస్తూ గజల్స్ రాయడాన్ని అర్థం చేసుకోవచ్చు. విశేషమేమంటే దాదాపుగా గజల్ కవయిత్రులందరూ తమ సౌందర్యాన్ని వారు రాసుకున్న కవిత్వ పంక్తుల్లో అద్భుతంగా రూపుగట్టిచ్చిన కళాకారిణిలుగా కూడా కన్పించడం. ఉదాహరణకి "పేరులోనే నాట్యాన్ని విన్పించే తారను – రెండు లోకాల్లోను చందాకు దర్పమెందుకుండకూడదు" అంటూ తిరుగులేని ధీమాతో చందా అంటే... ఇప్పటి మన కవయిత్రి 'నేను' అనే గజల్ లో

"సమస్యల దారిలో నిరాశను గెలిచినప్పుడు

గర్వంగా నా వెన్నును తడుతుంటాను నేను" అంటూ అంతులేని ఆత్మవిశ్వాసంతో తమలోని అద్భుత సౌందర్యాన్ని పాఠకుల ముందు ఆవిష్కరిస్తరు. అట్లాగే "పలు వన్నెలీనుతున్న తన సొగసుని" ఇప్పటి కవయిత్రి వివరిస్తే తన "ఒక్క చూపుతో విందంతా నాట్యమై చెలరేగిపోవడాన్ని" ఒకప్పటి కవయిత్రి వివరిస్తుంది. అందుకే కాబోలు భారత కోకిల మన హైద్రాబాదు కవయిత్రి సరోజినీదేవి 'song of Jebunisa in praise of her own beauty' అన్న కవిత రాసి జేబున్నీసా అజేయ సౌందర్యాన్ని కీర్తిస్తుంది.

మొత్తానికి "నీవు వలచి మెచ్చిన చీమకూడా రుద్రుడు కాదే" అన్న అక్కమహాదేవి కంఠంలోని స్పష్టత ఆమె సౌందర్యాన్ని దివిటీలా ఎత్తిచూపినట్లు గజల్ కవయిత్రుల 'షేర్'లు వారి సౌందర్యాన్ని దేదీప్యమానంగా చూపిస్తవి.

కాలమేదైనా కావచ్చు ప్రేమా, దాన్ననుసరించే సంబంధాలు, అవి అందించే అంతరంగిక భావనల వ్యక్తీకరణలే గజళ్లకు వస్తువులుగా ప్రాధాన్యతను సంతరించుకోవడం మనం చూస్తం. అట్లా చూసినప్పుడు గజల్స్ ఆత్మకథల్లాంటివి అనొచ్చు. 'పబ్లిక్' జీవితంలో తమను తాము నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని

తిరస్కరిస్తూ, తమ అంతరంగిక స్వేచ్ఛను నిల్పుకోవాలనుకునే

స్వేచ్ఛాకాముకులుగా గజల్ కవులు కన్పించడం కద్దు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'పబ్లిక్' లైఫ్ గురించి గాక 'ప్రైవేట్' లైఫ్ గురించిన అనుభూతులే గజల్ కి ప్రధానమౌతై. ఈ లక్షణమే గజళ్లలోని విలక్షణ వస్తు, శైలీ విశేషాలకు కారణమై ఉండొచ్చునని నా భావన. ప్రాచ్య సాంస్కృతిక, సామాజిక వ్యవస్థల్లో 'లోపలి' ప్రపంచంలో జీవించే స్త్రీల వాస్తవిక జీవితాలకు దగ్గర తెచ్చే ఈ వస్తు, శైలీ విశేషాల వల్లే గజల్ అంటే 'స్త్రీ(తో) సల్లాపం'గా కన్పిస్తుందనిపిస్తుంది. మొత్తానికి స్వీయాత్మ భావన (selfhood)తో మొదలైన గజల్ ప్రస్థానం ఆధునిక కాలానికి చేరేసరికి స్వీయాస్తిత్వ స్పృహగా, సమిష్టి గొంతుకగా పరిణమించడం కన్పిస్తుంది. అంటే 'నేను' నుంచి మొదలైన అన్వేషణ 'సమాజంలో ఒకరు/ నేను'గా సాగి క్రమంగా 'మనం'గా మారే క్రమం ఆధునిక కాలానికి స్థిరపడటం చూడొచ్చు. మగ్దూం వంటి ప్రోగ్రెసివ్ ఉర్దూ కవుల కాలం 'సమాజంలో నేను' కాలపు మలుపును చూపితే, 80ల్లో తెలుగు గజళ్ల కాలానికి 'మనం' (విశ్వప్రేమ)గా సినారె కవిత్వంలో కుదురుకోవడం చూడొచ్చు . "Literature always anticipates life. It doesnot copy it, but moulds it to its purpose" అన్నట్లు సున్నితమైన హృదయ స్పందనలను రగిలిస్తూ స్త్రీ పురుషుల అంతరంగిక ప్రపంచపు అనుభూతులకు దగ్గరిగా 'గజల్' ఒక విశిష్ఠ సాంస్కృతిక అవగాహనను నిశ్శబ్దంగా రూపుదిద్దడం ఈనాటికి స్పష్టంగా కన్పిస్తుంది. సదాశివ గారు "గజల్ ఒక కవితా ప్రక్రియ కాదు, అదొక కల్చర్" అనడాన్ని ఈ సందర్భంలోంచే అర్థం చేసుకోవాల్సి వుంది.

ఇంత సుదీర్ఘమైన నేపథ్యాన్ని ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే 'గజల్ కిరణాలు' అనే ప్రస్తుత సంపుటి ప్రత్యేకతంతా ఈలాంటి సాంస్కృతిక సాహిత్య వారసత్వాన్ని కొనసాగించడంలోనే వుంది అని చెప్పడానికి. అంతేకాదు 'విశ్వగీతి'లో తనదైన 'స్థానిక' (భాషా) రాగాన్ని విన్పించాలనే అస్తిత్వ ప్రకటన దశకు గజల్ చేరుకున్నదనడానికి సంకేతంగా వెలువడుతున్న సంపుటిగా ఈ 'గజల్ కిరణాలు'ను చూడాల్సి వుంటుందని పాఠకుల దృష్టికి తేవడానికి కూడా

పై వివరణ అవసరమైంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే తెలంగాణ సమ్మిళిత సాంస్కృతిక వారసత్వంలోంచి రూపు దిద్దుకున్న సాహిత్య ప్రక్రియను కొనసాగించడం, ఈనాటికీ అజ్ఞాతంగా మిగిలిపోయిన/పోతున్న స్త్రీ గొంతుకను తిరిగి ఆ ప్రక్రియలో బలంగా విన్పించడం అనే ప్రత్యేకతలు సంతరించుకున్న సంపుటమిది. 'తిరిగి' అనడం ఎందుకంటే గజళ్ల రచనలో తెలంగాణ (ఉర్దూ) కవయిత్రులు గాలిబ్ కంటే ముందు నుంచే వున్నప్పటికీ దాశరథి, సినారె వంటి ప్రముఖ కవుల ద్వారా తెలుగు పాఠకులకు 80ల చివరి నాటికి ఈ కల్చరల్ ఎక్స్ ప్రెషన్ అందినప్పటికీ ఈ రోజు వరకు రుబాయిలు ప్రచురించిన కవయిత్రి గానీ, గజల్ కవయిత్రిగా ప్రముఖంగా కన్పించే తెలంగాణ కవయిత్రి గానీ

సాహిత్య చర్చల్లో కన్పించకపోవడం చూస్తనే వున్నం. ఈనాటికి కూడా సినిమా పాటలు రాసే కవయిత్రిగా ఒక్క స్త్రీకి కూడా గుర్తింపు రాకపోవడం వెనుక వున్న నేపథ్యం కూడా ఇదే (బాలీవుడ్, టాలీవుడ్ సినీగీత రచయితలుగా నిలదొక్కుకున్న వాళ్లందరూ ఒకప్పుడు గజల్ కవులే). ఈ కొరతను తీరుస్తూ 'గజల్ కిరణాలు' వెలువడటం ఒక మలుపుగా భావిస్తున్న. త్వరలోనే వేల మంది

సెన్సిటివిటీసను మలుస్తున్న సినిమా పాటల రూపకర్తలుగా కవయిత్రులు అడుగిడుతారనే నమ్మకాన్ని కిరణ్ గజళ్లు కల్గిస్తున్నవి.

"గొప్ప కవి నాలుక అర్థాలను వెలిగించే దివ్వె వంటిది" అంటడు వలీ. మరో షేర్ లో తన గజళ్ల గురించి చెబుతూ "ప్రతీ వాక్యానికి ఎన్నెన్నో పార్శ్వా లు - ఓ మీర్, దేని గురించి చెప్పను ఈ నా కలం నాలుకతో" అంటడు మీర్. ఈ కవుల మాటలు గజల్ అంటే వాక్కును హత్తుకున్న కలం అనే కాదు, వస్తువు విషయంలో గజల్ కున్న flexibility ని కూడా చెబుతై. అట్లా మౌఖిక సాహిత్యంలోని చలనశీలతను, ఛందోరూపం (లిఖిత)లోకి అంటే గజల్ అనే మధుపాత్రలోకి వొంపి మళ్లీ మళ్లీ రాగయుక్తంగా మననం చేయిస్తూ 'వహ్వా'లను బహుమానంగా అందుకునే కవితా ప్రక్రియగా గజల్ మౌఖిక, లిఖిత సంప్రదాయాల మధ్య స్నేహ వారధిని నిర్మించడం కన్పిస్తుంది. అట్ల చూసినప్పుడు భక్తి కవయిత్రులు / కవుల వలెనే గజల్ కవయిత్రులను | కవులను

వాగ్గేయకారులుగా గుర్తించాల్సి వుంటుంది. మొత్తానికి మౌఖిక, లిఖిత

ప్రపంచాలను తమదైన గొంతుతో విన్పించే వెసులుబాటును అందించిన గజల్ కున్న ఈ నేపథ్యం చమత్కార సంభాషణలతో సమాజ రుగ్మతలకు చురకలు వేసే వొడుపును కూడా కవులకు అందించింది. మచ్చుకి...

"మధువు తాగాలన్న కోరిక నాకు ఎందుకో రగులుతుంది మౌల్వీ గుండె నా కోరికకు ఎందుకో తన కాలేయపు కలేజానే పాడవుతున్నట్లు

ఆయనకు ఆ ఏడుపు ఎందుకో" "ఓ ఇస్తియాజ్, ఇక ఇప్పుడు నీవు నిశ్చయంగా మట్టిమనిషి ప్రేమికవు తెలుసుకో" అన్న అలనాటి కవయిత్రి (లత్ఫున్నీసా ఇమ్తియాజ్, 1761) రాసిన షేర్లు సున్నితమైన హాస్య సంభాషణలుగా కన్పిస్తూనే మతపెద్దల నైతిక విలువలపై వ్యంగ్యాన్నీ, ఆ ద్వంద్వాలను దాటిన వ్యక్తిగా కవయిత్రి తనను తాను చూపిన రీతినీ కళ్లకు కట్టిసై. శ్రోతల/ పఠితుల పెదవులపై నవ్వులు పూయిసై. చురకలు వేసే ఇటువంటి చమత్కారాన్నే ఈనాటి మన కవయిత్రి కిరణ్ ఎలా పండించిందో చూడండి.

"పల్లెల్లో బతుకు బరువు పట్నంలో నీరు కరువు

వోట్ల కోసం వచ్చే నేతలను కడగొద్దంటే ఎలా" అట్లాగే

"ప్రజాసేవ చేయాలని ఎందరికో కోరిక...

గెలుపు సులువుగా వచ్చిందంటే సుడి ఉండాలి" అంటూ రాజకీయాలు మాట్లాడకుండానే రాజకీయ నాయకుల దివాళాకోరు తనాన్ని పాఠకులకు తనదైన చమత్కార ధోరణితో ఎరుకపరుస్తుంది.

"కొత్త వస్తువులకై గజల్ (కవిత్వం) దారి మూసుకోదు ఎన్నటికి, కవిత్వం తలుపులు తెరిచే ఉంటై సదా" అని వలీ దక్కనీ (1666–1720) అన్నట్లు వ్యక్తిగత అనుభూతులనూ అనుభవాలనూ రికార్డు చేసే వాహికగా ఒకే

'కవితాఖండిక'లో భిన్న భిన్న అవగాహనలను పంచే షేర్లను పుష్పగుచ్ఛం వంటి అమరికతో అమర్చి సహృదయులకు అపురూపంగా అందిస్తుంది గజల్. ఈ విలక్షణతే కిరణ్ ఇష్టగురువు 'సినారె' గారిని గజళ్ల ప్రేమికునిగా మార్చిందేమో! కిరణ్ కూడా అదే తోవలో ఎన్నో విభిన్న భావనలను తన గజళ్లలో పలికించడం ఈ సంకలనంలో చూడొచ్చు. ఐతే 'జ్ఞాపకాలు' ఆమె రాసిన చాలా గజళ్లను నడిపించే వస్తువులుగా కన్పిస్తై. "మిత్రమా – నీ

జ్ఞాపకాల వెలుగులు నా వెంట వుండనీ – యే చీకటి సందులో జీవిత సంధ్య అలుముకుంటుందో తెలియదు కదా" అన్న ఓ గజల్ కవి మాటలను మనకు గుర్తు చేస్తే. ఈ (లాంటి) కవితల్లో కన్పించే 'నాస్టాల్జియా' సహజ మానవ ఉద్వేగ భావనగా చదువరులను చల్లగా తాకి కవయిత్రి జీవిత ఆవరణంలోకి వారిని అలవోకగా నడిపిస్తుంది. ఉ దాహరణకి,

"పలకపై మార్కులతో పరుగెత్తుకు వస్తే,

చెంపపై ముద్దునే బహుమతిచ్చే అమ్మ" లాంటి అందమైన జ్ఞాపకాల షేర్లు పాఠకులను తమ గతంతో ఆత్మిక సంబంధంలోకి వెళ్లేలా చేస్తే. వర్తమానంలో సౌందర్యాన్ని హత్తుకునే చూపునిసై. నిజానికి ఏ ప్రాంతంలోనైనా సాంస్కృతిక పునరుజ్జీవనానికి కావాల్సిన ఇలాంటి గత జీవిత జ్ఞాపకాలు గొప్పకళాకారుల చేతుల్లో కళాఖండాలుగా వెలుగొందుతై.

ప్రపంచంలోనే మహాకావ్యంగా పేరొందిన 'ఒడిస్సీ' రచించిన 'హెమరు'ను గానీ తెలంగాణలో '

పల్లె కన్నీరు పెడుతుందో' వంటి పాటలు రాసిన వెంకన్నను గానీ మహాకవులుగా నిలబెట్టింది ఈ మానవ భావనలే. ఈలాంటి జ్ఞాపకాలను

మీటే ప్రక్రియగా గజల్ చాలా అనుకూలమైందని కిరణ్ గజళ్లు మనకు చెబుతై. ఇక

"పిల్లగాలి పాటకు గడ్డిపూలు పులకరిస్తే తలపుల్లో దరిచేరి కురిసిన కన్నీరు నీవు"

"తీరలేని కలలెందుకు తీయనీ తపనెందుకు

ఓడిపోతు మరణిస్తా నిన్నే గెలిపిస్తూ" వంటి షేర్లలో, ప్రేమకు సంబంధించిన లలితమైన భావనలూ ఆయా పాదాల్లోని గాఢతా పాఠకులను వెంటాడుతై. సున్నితమైన హృదయ స్పందనలే జీవితాన్ని అర్థవంతంగా నడిపించే శక్తులు అన్నట్లు జీవించిన సాహసి మగ్దూం రాసిన "తెల్లవార్లూ నా అశ్రుపూరిత నయనాల్లో విహరిస్తూ వున్నావు – శ్వాసలాగ వస్తూ పోతూ వున్నావు" లాంటి షేర్లను మనకు గుర్తుచేసై. అన్నిటికి మించి భయాన్ని సృష్టిస్తున్న ప్రస్తుత అమానవీయ సందర్భంలోంచి ఆర్తితో, ఆరాటంతో, అభ్యర్థించే

టోతో కిరణ్ రాసిన 'చూడు' అన్న గజల్ లో కన్పించే విషాదానికి వందలయేళ్ల పరంపర కొనసాగుతూనే వుందని చెప్పే అలనాటి కవయిత్రి (చందాబాయి) పురుషున్ని సంబోధిస్తూ అన్న "ఓ నా వేటకాడా! – గగుర్పొడిచే ఉత్పాతంతో నీ అంతరంగ క్వారీ తన ఆత్మను పోగొట్టుకున్నది" వంటి కవితా పాదాలు నిదర్శనంగా కన్పిస్తే. ఇక స్వేచ్ఛగా ఎగిరే రెక్కలిచ్చిన నాన్ననీ; బతికే ఆసరా ఇచ్చిన అమ్మనీ; గజల్ ప్రేమికగా తనను మార్చిన సినారె, విఠల్ రావు సాహిబ్ లను, తను కలగంటున్న ప్రపంచాన్ని సృష్టించే (అ)దృశ్య 'విజేత'లను గురించి రాసి తెలుగులో స్మృతి గీతాల కొరవడినే గాక ఉర్దూ సాహిత్య సంప్రదాయంలో కన్పించే 'ఖసీదా' ప్రక్రియను కూడా కిరణ్ గుర్తుచేస్తుంది. గజల్ 'సంప్రదాయానికి' భిన్నంగా 'కవితా ఖండిక'లకు సంక్షిప్తమైన 'శీర్షిక'లను కూర్చి పాఠకులను తన అందమైన పూలతోటలాంటి భావనల్లోకి ఆత్మీయంగా నడిపిస్తుంది. అంతేకాదు, ఈ సంకలనానికి అదనపు ప్రత్యేకత కూర్చినవి రుబాయిలు.

"పాటలోన ప్రణయాన్ని పలికించావా ఎపుడైన మదిలోని మధువు ఒలికించావా ఎపుడైన దారివెంటన పూలు పలవరిస్తున్నవి నీకై తోటలో పరిమళమై విహరించావా ఎపుడైన"

అంటూ నాలుగు పాదాల్లో జీవిత సారాన్నీ, కవి ఒడుపునూ అందించే రసగుళికల్లాంటి రుబాయిలు రాసిన తొలి ఆధునిక తెలంగాణ తెలుగు కవయిత్రి బహుషా కిరణ్ కావొచ్చేమో విమర్శకులు చెప్పాలె. 'ఒక గజల్ లో కన్పించే

భిన్న షేర్లలోని భావధారని నాలుగు పాదాల్లోకి వొంపి మత్లా, మక్తాలను కలిపి కుట్టి అందించే ప్రేమ కావ్యం రుబాయి అన్పిస్తుంది' కిరణ్ రుబాయిలను చదివినప్పుడు. ఉమర్ ఖయ్యాం రుబాయిలు సంకలనంగా 1859లో తొలిసారి ఇంగ్లీషులోకి తర్జుమా అయినప్పట్నుంచి ఎన్నోసార్లు పునర్ముద్రణలు పొందిందట. తెలుగులో దువ్వూరి రామిరెడ్డి, పి.శ్రీదేవి చేసిన రుబాయి అనువాదాలతో పాటు ముకురాల రాంరెడ్డి గారి ముక్తకాలు మనకు దొరికిన ఆణిముత్యాలు. ఆ కోవలోకి చేరే రుబాయిలు కిరణ్ కలం నుంచి వస్తాయనే భరోసా ఈ సంకలనంలోని 21 ఖండికలను చదివినప్పుడు కల్గుతుంది. ఇక ఛందస్సు విషయానికొస్తే అన్ని పాదాల్లోను మాత్రా సంఖ్య సమత్వం పాటించడం వీలైనంత మటుకు కిరణ్ సాధించిందనిపిస్తుంది. "ప్రతిభ వున్న కవికి యతి ప్రాసలు సంకెళ్లు కావు, ఈదే చేతులకు అలలు ఏవైనా అడ్డురావు" అన్న సినారె గారి మాటల స్ఫూర్తిని అచ్చంగా అందుకొని సాహిత్య ప్రస్థానంలోకి అడుగిడుతున్న కిరణ్ ముందు ముందు మరిన్ని మంచి గజళ్లు తెలుగు పాఠకులకు అందిస్తుందనే భరోసా కల్గిస్తున్నది. మొత్తంగా సంకలనం పూర్తి చేసిన పాఠకులకు గుర్తుండిపోయే

షేర్లు రెండు మూడైన ఉన్నా చాలనుకునే నాలాంటి అల్ప సంతోషులకు సంభ్రమం కళ్లేలా గుప్పెడు గుప్పెడు షేర్లను అందించే సంపుటి ఇది. "సాహిత్య రసికులైన లోకులకెంత వరకు జ్ఞప్తిలో వున్నదో అదే నా అచ్చయిన కవితా సంకలనం" అని కవి నాతిఖ్ అన్నట్లు ఇవి చాలు కిరణ్ ని దివాను రచయిత్రిగా నిలబెట్టేందుకు.

కవిత

# చినుకు




మహెజబీన్

హైదరాబాద్, 9866587919


ఋతువులు కొంచెం confuse అయ్యాయి ఈసారి
కాస్త ఎండ కొంచెం వాన
ఎండా వాన కలిసి,
భూమిని అలంకరిస్తున్నఅందమైన దృశ్యం
వాకిలి దాటి ఇంటి లోపలి కొచ్చిన మట్టి వాసన
చినుకులు మోసుకొచ్చిన సుపరిచిత మట్టి పరిమళం
చినుకు వెంబడి చినుకు లయగ రాలుతూ
నా మీద కురిసిన తుంపర వాన
నన్నువలలా అల్లుకున్నవాన జల్లు

క్షణం తర్వాత చినుకులు అదృశ్యమై లేత ఎండ
మరునిమిషం ఎండ మాయమై చినుకుల చిరు సవ్వడి
ఎండా వాన, వాన ఎండా,
అలా ఆటలాడుకున్నాయి చాల సేపటిదాకా!
ఎండా వాన కలిసి,
భూమ్మీద friendship day జరుపుకుంటున్నట్లు ఉంది
చినుకుల సవ్వడి సంగీతమే!
చినుకెప్పుడూ ప్రియమైనదే!

చివరగా... 'ముక్త' ప్రచురణలుగా తెలంగాణ స్త్రీల రచనలూ – కవిత్వమూ – చిత్రాలతో తీసిన రెండు సంకలనాలు గాక స్వతంత్ర కవులుగా ఎదిగిన వనపట్ల, గుడిపల్లి నిరంజన్ స్వీయ వచన కవిత్వ సంపుటాల తర్వాత ఒక కవయిత్రి వెలువరిస్తున్న తొలి (గజల్) సంపుటిదే. మహలఖాబాయి చందా పురస్కారంతో గజల్ గజబ్ విఠల్ రావు గారిని గౌరవించి ఆయన పాడిన

చందాబాయి గజళ్లు విన్న అనుభవభాగ్యం నుంచి నేటి తెలంగాణ మేటి గజల్ కవయిత్రిగా గద్వాల కిరణ్ కుమారి ప్రస్తుతం వెలువరిస్తున్న గజల్ సంకలనం వరకు 'ముక్త' సాహిత్య రంగంలో వేస్తున్న చిన్న చిన్న అడుగులను అందరూ అభినందిస్తారని ఆశిస్తున్న. 1972లో 'ముక్త గీతికలు' ప్రచురించిన వల్లబురెడ్డి బుచ్చారెడ్డిగారి నుంచి నేటి కిరణ్ కుమారి 'గజల్ కిరణాలు' వరకు పాలమూరు గజల్ సౌరభం కొనసాగుతూనే వుండటం గర్వకారణం. అంతేకాదు తెలంగాణ రుబాయిలు రాస్తున్న ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి, కిరణ్ ఇద్దరూ నా మిత్రులే కావడం మరింత సంతోషమైన విషయం. గజల్ ప్రక్రియలో సాగుతున్న వీరి ఈ కృషిని సమ్మిళిత సంస్కృతులను హత్తుకున్న నా తెలంగాణ వారసత్వానికి చేస్తున్న సలాంగా భావిస్తున్న. గద్వాల కిరణ్ కుమారి అపురూపంగా అందిస్తున్న ఈ గజళ్ల 'గుల్ దస్తా'ను పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్న. చివరగా – జీవితానికి అల్విదా పల్కి మట్టిలో కలిసిపోయిన క్షణాల్లో, ఆరిన నా చితాభస్మం లోంచి –మొలిచే గడ్డిపువ్వుని ప్రేమగ నిమిరి 'షేర్'

రాసే మిత్రురాలిని సంపాదించుకున్న తృప్తితో, నాకీ అవకాశాన్నిచ్చిన సఖి కిరణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెల్పుకుంటున్న.

వ్యాసం

# స్త్రీత్వ వేదనలో అనుమాండ్ల కౌసల్య



డా॥ వంగరి త్రివేణి,
నిజామాబాద్, 9951444803

'ఆధునిక రచనల్లో ప్రాచీన సాహిత్యంలో కన్నా స్త్రీ ప్రాధాన్యం ఎక్కువగా కనిపిస్తుంది. స్త్రీ విముక్తిని కోరే మహిళా చైతన్య భావాల వ్యాప్తి, పరిధి ఇటీవలి దశాబ్దాల్లో ఇంకా విస్తరించింది. స్త్రీ వాదోద్యమ ప్రభావం పురుషుల మీద, పురుషుల రచనల మీద పడడం ఆహ్వానించదగింది. స్త్రీవాదులు కోరే సాంఘిక న్యాయాన్ని ఇప్పుడిప్పుడే పురుషులు అర్థం చేసుకుంటున్నారు. అంగీకరిస్తున్నారు. ఈ విషయంలో జరుగవలసిన అభివృద్ధి చాలా ఉన్నప్పటికీ, కనీసం ప్రథమ దశ ప్రారంభమయింది. భూమయ్య చిత్రించిన 'జ్వలితకౌసల్య' ను ఈ దృక్కోణం నుంచి అర్థం చేసుకోవాలి. కావ్యనామమే కావ్య వస్తు స్ఫోరకంగా ఉంది. అయితే భూమయ్య కావ్యం స్త్రీవాద కావ్యం అని నేను ముద్ర వెయ్యటం లేదు. ఈ కావ్యాన్ని అర్థం చేసుకోవడానికి స్త్రీవాద పరిచయం ఉపయోగిస్తుందనే నా సూచన' (పుట. 2)

'జ్వలిత కౌసల్య' మొదటి ముద్రణ సందర్భంలో 'లఘుటిప్పణి' రచిస్తూ ఆచార్య చేకూరి రామారావు ప్రస్తావించిన అంశం ఇది. ఆచార్య అనుమాండ్ల భూమయ్య 1999 నాటికే ఈ పుస్తకాన్ని రచించి ప్రచురించారు. స్త్రీవాద భావజాలం తెలుగు సాహిత్యంలో ప్రవేశించి విస్తృత ప్రయోజనాలు చేకూరుతున్న కాలమది. స్త్రీవాద పరివ్యాప్తిలోను, ఉద్యమ రూపంలో కార్యరూపం దాల్చడంలోను సాహిత్యం హితోధిక సాయం చేస్తున్న సమయమది. ఆ పరిమిత కాలంలోనే స్త్రీవాదం ప్రపంచ ప్రమాణాల మీద నిలబడుతూ వినూత్న భావజాలాన్ని ప్రకటించింది. స్త్రీలు వెలువరించిన సాహిత్యమే గాక, ఆచార్య చేకూరి రామారావు చెప్పినట్లు పురుషుల సాహిత్య మనోగతాలపై ప్రభావాన్ని చూపింది. సంప్రదాయక పౌరాణిక పాత్రల్లో గల స్త్రీల అభినివేశాన్ని సాహిత్యబద్ధం చేస్తూ నూతన ఒరవడిని సృష్టించారు. ఆధునిక సాహిత్య ధోరణులకు అనుగుణంగా సావిత్రి, పురూరవ, సీత, జాబాలి, వరూధిని, ఊర్మిళ, కౌసల్య, కైకేయి, కచదేవయాని, గాంధారి, పూర్ణమ్మ, కన్యక పాత్రల భావైక స్ఫూర్తిని చిత్రించారు. స్త్రీ పౌరుష కాంక్షను, శక్తి సామర్థ్యాలను, మనో అభిష్టాన్ని, చింతనాత్మక వ్యధను వెలువరించారు. తద్వారా ఆధునిక సమాజానికి ఒక ఉపదేశాత్మక సందేశం అందించారు.

'జ్వలిత కౌసల్య' కావ్యాన్ని స్త్రీవాద కోణం నుండి అవగాహన చేసుకోవడమే ఈ వ్యాసం ఉద్దేశం. సహృదయులు అవలోకిస్తారని ఆశిస్తున్నాను. ఆచార్య అనుమాండ్ల భూమయ్య దృక్పథం స్త్రీవాదం గాకపోయినా; వస్తు నిర్దేశం దృష్ట్యా ఈ అంశం నిర్ణయాత్మమైందని భావిస్తున్నాను. పూర్తి కథాంశం కౌసల్య గుండెలలో గూడు కట్టుకున్న అగ్నిజ్వాలను విచ్ఛేదం చేయడం. కౌసల్య మనోగతాన్ని ఆవిష్కరించడం. తద్వారా దీర్ఘకాలంగా ఉన్న మనోవ్యధ నుండి ఉపశమనం కోరుకోవడం. ఈ నేపథ్యంలోనే తన సంసారిక జీవితంలో తీరని కోరికలు, బహుభార్యత్వం వల్ల భర్త నుండి పొందిన ప్రేమానురాగాలు, తోటి సవతులతో పడిన అవమానాలు ఒకటేమి సగటు మహిళ పడే ఆవేదన కౌసల్యలో ఆవిష్కృతమవుతుంది. కౌసల్య మనోవేదన స్త్రీవాద లక్షణాలకు అన్వయింపదగినవే.

మరొక అంశం 'జ్వలిత కౌసల్య' ఒక విధంగా చేతనాత్మక కావ్యం. అంతర్గత మధనం, భావాల సంఘర్షణ, అనుభవాల సంచయం అన్ని కలిపి మనో విశ్లేషణ సూత్రాల్లోకి కౌసల్య ఇమిడిపోతుంది. మానసిక వ్యధను ప్రత్యక్షంగా ఈ కావ్యంలో చిత్రించారు కవి. ఎంతో కాలంగా మనస్సులో దాచుకున్న ఆవేశాన్ని, క్రోధాన్ని బయట పెట్టడం మనోవైజ్ఞానిక అంశాలకు అనువర్తించవచ్చు. అచేతనంలో దాగి ఉన్న మానసిక సంవేదనను చేతనత్వంలోకి తీసుకొని రావడం ఇందులోని ప్రధానాంశం. దుఃఖప్రోదిని ఛేధించడానికి కవి ఈ కావ్యాన్ని ఆలంబనగా చేసుకున్నారు. తనకు కలిగిన అన్యాయాన్ని మరొకరి విషయంలో కలుగకుండా ఉండడంలో కౌసల్య చేసిన ఉపదేశం సత్ప్రవర్తన దిశగా నడుస్తుంది. కథాగమనాన్ని, పాత్రల ప్రవర్తనా శైలిని కవి అత్యంత నేర్పుతో ప్రదర్శించారు.

ఉపదేశాత్మకంగా కావ్యాన్ని వెలువరిచడంలో కవి ప్రధాన శ్రద్ధ వహించారు. ఆధునిక సాహిత్యంలో ఇటువంటి ప్రయత్నాలు చాలా జరిగాయి. స్వతంత్ర కథలను తీసుకొని పాత్రలపరంగా ధర్మప్రభోదం విస్తృతం చేశారు రచయితలు. అంతేగాక సంప్రదాయిక పాత కథల ప్రయోగం నేటి సమాజాన్ని సంస్కరించాయి. సందేశాత్మకమైన గాథలు వ్యవస్థ పునరుద్ధరణకు కృషిచేశాయి. సామాజిక ప్రయోజనానికి ప్రాచీన సాహిత్యంలోని గుణాత్మకమైన వస్తు నేపథ్యం కవులకు తోడ్పాటునందించాయి.

'జ్వలిత కౌసల్య' కావ్య స్వభావంలో స్త్రీవాద భావవ్యక్తీకరణ మనోవైజ్ఞానికి విశ్లేషణ, ఉపదేశాత్మకం వంటి విభిన్నమైన మౌలికాంశాలను గుర్తించవచ్చు. కవి కావ్య నిర్మాణంలో ప్రకృష్టమైన వస్తువును సరళతరం చేశారు. పద్య రచనా సౌగంధంలో మేటి

ఆచార్య అనుమాండ్ల భూమయ్య రామాయణ గాథలోని కౌసల్య మనోవేదనను వాల్మీకి రచనాపరంగా నినదించారు కవి. వాల్మీకి రామాయణంలోని అయోధ్య కాండలో 20వ సర్గలో కౌసల్య శ్రీరాముని ఎదుట తన వేదనను వ్యక్తపరిచిన ఘట్టం ఉంది. మొత్తం ఆరు సలలో వ్యక్తపరిచిన ఆవేదన కవి కావ్యానికి ప్రధానాధారంగా నిలిచింది. ఆ ప్రేరణ వల్లనే ఈ కావ్యం రూపొందింది. శ్రీరాముడు ఈ జన్మకు ఏకపత్నీ వ్రతుడిగా ఉంటానని ప్రమాణం చేయడం ఇందులోని ముఖ్యాంశం. కథాంశాన్ని మొత్తం ఎనిమిది ఉప శీర్షికలలో విభజించారు. సంక్లిష్టమైన కథ ఉప శీర్షికలో ఒద్దికగా నిలిపారు భూమయ్య. కైకేయి వరం, జ్వలిత కౌసల్య, అనంత క్రోధం, మాతృ హృదయం, పితృ వాక్యం, పుత్ర వాత్సల్యం, ఏకపత్నీ వ్రతం, మంగళాశాసనం వంటివి ఈ కావ్యానికి ఒక క్రమణికను సూచించాయి. కథా గమనంలో కార్యోన్ముఖతను సాధించడం కవి కవితా ప్రక్రియలో ప్రదర్శించిన ప్రత్యేక నైపుణ్యం. 109 పద్యాలు కలిగిన ఈ కావ్యం నాలుగు ముద్రణలు సంతరించుకోవడం విశేషం. చేకూరి రామారావు, బేతవోలు రామబ్రహ్మం, పేర్వారం జగన్నాథం వంటి విమర్శకులు ఈ కావ్య ముద్రణలో ముందు మాటలు రాశారు. అబ్బూరి ఛాయాదేవి, మలయవాసిని, వాసా ప్రభావతి, వెంకమాంబ, గంగప్ప వంటి సాహితీవేత్తలు స్త్రీ సంవేదనా రూపంలో 'జ్వలిత కౌసల్య'ను పరామర్శించారు.

తండ్రి ఆజ్ఞ మేరకు పినతల్లి ఇంటికి వెళ్ళిన శ్రీరాముడికి ఘోర ఉపద్రవం మీద పడుతుంది. పట్టాభిషిక్తం పొందే వేళలో అరణ్యానికి వెళ్ళాలనే కైక అనుజ్ఞను శ్రీరాముడు శిరసావహిస్తాడు. తన తల్లితో నివేదించి అనుమతి పొందడానికి కౌసల్య భవనానికి వచ్చినప్పటి నుండి కథా ప్రస్థానం ప్రారంభమవుతుంది. ఆచార్య అనుమాండ్ల కౌసల్య మనో చింతనను ప్రత్యక్ష పెట్టడానికి ఆరంభ పద్యాన్ని ప్రయోగించారు. తల్లిదండ్రుల సాపేక్ష కైకేయి వరంలో ఉపేక్ష ప్రత్యక్ష కావ్య కథన ధారకు ఉత్కర్షగా నిలిచింది.

తల్లి కొడుకుల ఆప్యాయతా వాత్సల్యాలను అత్యంత మధురంగా భూమయ్య ప్రవేశపెట్టారు.

స్వాగతింప తన కెదురు వచ్చినట్టి తల్లి పాదమ్ముల మ్రొక్కె ధర్మమూర్తి రామచంద్రుండు, కౌసల్య రామునెత్తి శిరము మూర్కొనె కౌగిట జేర్చి (పుట. 15) వర్తమాన కాలంలో తెలుగువారింటి వ్యవహార రూపంలో ఉన్న ఆచార సంప్రదాయాలను ప్రవేశపెట్టారు కవి. కౌసల్య రామచంద్రుల అనుబంధాన్ని చూపించారు. శ్రీరాముడు శిరస్సు వంచి గౌరవ వందనం చేయడం, కౌసల్య శ్రీరాముడిపై పుత్ర వాత్సల్యాన్ని ప్రకటించడం హృదయ మనోహరంగా భూమయ్య రచించారు.

గతంలో తన తండ్రి కైకకు ఇచ్చిన రెండు వరాలను ప్రస్తుతం తీర్చుకుంటున్నట్లు... తల్లితో నివేదిస్తాడు శ్రీరాముడు. ఒకటి భరతుడికి యువరాజ పట్టాభిషేకం, రెండవది పద్నాలుగు సంవత్సరాలు రాముడు అరణ్యవాసం చేయడం. ఈ విషయాలు తెలిపి అడవులకు వెళ్ళడానికి తల్లి కౌసల్య అనుమతిని పొందడానికి వచ్చినట్లుగా తెలుపుతాడు. తండ్రి ఆజ్ఞను పాటించడం ఉత్తమ ధర్మంగా ప్రకటిస్తాడు. ఒక్కసారిగా రాముడి మాటలు విన్న కౌసల్య 'స్వర్గమున నుండి పడిన దేవత వోలె నేల పడిపోయె' అని కవి వర్ణిస్తాడు. శాపవశాన అప్పుడప్పుడు దేవ లోకం నుండి దేవ కన్యలు, కిన్నెరలు, గంధర్వులు, కింపురుషులు భూలోకం మీద ఉద్భవించడం చూస్తుంటాం. భూమయ్య ఈ ఉపమానం ప్రయోగించడంలో తన జన్మను కోల్పోయిన స్త్రీ దైన్యస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. కౌసల్య దు:ఖ వారధికి ఇది అనుసంధానింపబడింది.

స్త్రీలు తమకు కలిగిన శోకానికి, విషాదానికి ప్రకృతిని ప్రమేయం చేయడం గమనిస్తుంటాం. కౌసల్య తన కుమారునికి కలిగిన విపత్తుకు చింతిస్తుంది. 'ఇదేమి దినము కత్తులే కిరణములుగా కరకు గుండె దాల్చి సూర్యుడిదేలా ఉదయమునందె' అంటూ తన విధికి, వ్యధకు విలపిస్తుంది. ఒక్కో దినం గడియను బట్టి శుభాలు, అశుభాలుగా పరిగణింపబడుతాయి. కాలం మీద, సూర్య చంద్రుల కాలగమనం మీద జనులకు కొన్ని నమ్మకాలు, విశ్వాసాలు ఉన్నాయి. ప్రకోపాలు కూడా లేకపోలేదు. 'పుట్టినింట ఆనాడు నేపొందిన సుఖమేమో కాని, ఈ మీ తండ్రి ఇంట నేను కాలు మోపిన పిదప సుఖము నెరుంగ నిన్ను గన్నాను బ్రతుకు కన్నీరు తడిచె' అంటూ కౌసల్య తన జీవిత గాధను వినిపిస్తున్న సందర్భంలో ఒక విషయం స్పష్టమవుతుంది. పుట్టింట్లో తానెంత సుఖం పొందిందో తెలియని తనంలోనే కౌసల్య వివాహం జరిగింది. బాల్యంలోనే దశరథ మహారాజుతో పరిణయం జరగడం కూడా ఆమె దు:ఖానికి ఒక హేతువు. బాల్య వివాహాల మీది దుష్ప్రభావాలు రామాయణ కాలం నుండి భారంగా మారాయని 'జ్వలిత కౌసల్య' ద్వారా ప్రత్యక్షంగా తెలుస్తుంది. చివరకు అంతపుర స్త్రీలు అయినా వైవాహిక జీవితంలో దు:ఖ సాగరాన్ని ఈదారనడానికి ఈ దృష్టాంతం తార్కాణంగా నిలుస్తుంది. తాను పుట్టి పెరిగి, ఆడి పాడి, ఆనందంగా గడిపిన రోజులు అనుభవంలో లేని పరిస్థితి ఆమెది. ఇక వివాహం అయిన తర్వాత అత్తవారింటిలో ఏనాడు సుఖం పొందినట్లు ఏ ఆనవాలు వ్యక్తపరచలేకపోవడం ఆమె విధిరాతను తలపోస్తాయి. దీనికి రెండు కారణాలను కవి భూమయ్య ప్రస్ఫుటం చేశాడు. ఒకటి కౌసల్య వివాహానంతరం భర్త నుండి సుఖం పొందలేకపోవడం. దీనికి కారణం దశరథుడి బహుభార్యత్వ ప్రాధాన్యం. కైకేయిపై మోజును పెంచుకోవడం. ఆమెకు దాసుడు కావడం. రెండవది సపత్నుల వ్యవహార ధోరణి. కౌసల్య పట్ట మహిషి అయినా ఆమెకు గౌరవాదరణలు దక్కలేకపోవడం. సపత్నుల పరుష వాక్కులు ఆమె హృదయాన్ని గాయపరచడం. అవమానాల జలధి ఉధృతంగా మారి గుండెలో సుళ్ళు తిరగడం.

న దృష్ట పూర్వం కళ్యాణం సుఖం నా పతి పౌరుషే అపి ప్రత్యే2పి పశ్యేయ మితి రామాస్థితం మయా అయోధ్య : సర్గ : 20 :

శ్లో : 38 అత్యంత నిగృహీతాస్మి భర్తుర్నిత్య మతంత్రితా పరివారేణ కైకేయ్యా సమావాప్యధవా 2వరా

అయోధ్య : సర్గ : 20 : శ్లో : 42 వాల్మీకి రామాయణంలో శ్లోకాలను అనుమాండ్ల భూమయ్య తన ముందు మాటలో ప్రస్తావించారు. భర్త వల్ల సుఖం లేకపోయిన విషయాన్ని వాల్మీకి రామాయణంలో పై శ్లోకాల్లో తెలుపబడింది. ఈ కావ్యానికి రామాయణ శ్లోకాల్లో కౌసల్య హృదయ తప్త జ్వాలను కవి ప్రవేశపెట్టారు. ఈ శ్లోకాల ఆధారంగానే కరుణ రసాత్మక గాథగా ఈ కావ్యం రూపాంతరం చెందింది.

**1. వంధ్యత్వం :** కొడుకు మీద ఉన్న ప్రేమ, వాత్సల్యం కౌసల్య నోట అద్భుతంగా ప్రకటింపజేశారు భూమయ్య. శ్రీరామ చంద్రుడు రాజ్యానికి యువరాజు పట్టాభిషిక్తుడైనప్పుడే తాను సుఖపడే దశ వస్తుందని భావించింది. కౌసల్య తన కడుపు తీపి మేర రామచంద్రుని అల్లారు ముద్దుగా పెంచుతుంది. ఆ సమయంలో నిప్పులాంటి వార్త ఆమె అంతరంగాన్ని కల్లోలం చేసింది. పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో వనవాసం చేయటం అనే తండ్రి ఆజ్ఞను ఆమె జీర్ణించుకోలేకపోయింది. ఆ విషయం ముందుగా తెలిసి ఉంటే కొడుకుగా శ్రీరాముడిని కనకుండా ఉండేదానిని అని ఆమె బాధపడుతుంది. కన్నతీపిని కూడా వద్దనుకునే విషమ పరిస్థితి కౌసల్యకు ఎదురవడమనేది మాతృ హృదయం కలవరపడే విషయం.

నాడు నిన్నునే గనకున్న నష్టమేమి కలిగెడిది? వంధ్యయను పేరొకటి యే తప్ప సంతులేదన్న ఏకైక చింత తప్ప వంధ్యకు మరొక్క చింత రవ్వంత లేదు (పుట. 20)

ఏ ఇల్లాలు అయినా గొడ్రాలుగా ఉండడం అనే విషయాన్ని కలలోనైనా తలంచదు. కాని కౌసల్య తన నోటి ద్వారా ఆ పద్యాన్ని ఉచ్చరించడం అత్యంత వేదనాభరితమైంది. కొడుకును కని అడవుల పాలు చేయడం కంటే గొడ్రాలుగా మిగిలిపోవటమే ఉత్తమంగా భావించిన కౌసల్య కడుపుకోతను ఇక్కడ అర్థం చేసుకోవచ్చు. కవి అనుమాండ్ల భూమయ్య కౌసల్య పాత్రలో స్త్రీ దు:ఖ హేతువుకు పరాకాష్టగా వంధ్యత్వమనే శబ్దాన్ని ప్రయోగించడం గమనించవచ్చు.

**2. కడుపుకోత :** కౌసల్య పరి పరివిధాలుగా శ్రీరాముడి మీద ఉన్న తల్లి ప్రేమను వ్యక్తపరిచిన తీరు కవి తన నేర్పుతో ప్రదర్శించాడు. తన దు:ఖానికి అంతం లేదని వాపోతూ, తనకు ఇంత దు:ఖం అనుభవించే శక్తి లేదని తలపోస్తుంది కౌసల్య. తన మీద దయచూపే ఏ దైవం కనిపించడం లేదని దు:ఖిస్తుంది. ఏ దిక్కు చూసినా శూన్యమే కనిపిస్తుందని తన దురదృష్టానికి చింతిస్తుంది.

కౌసల్య బాల్యంలో తన రామచంద్రుడు ఆడిన ఆటలు, అల్లారు ముద్దుగా పెరిగిన జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను కౌసల్య గుర్తుకు తెచ్చుకోవడం కథా సందర్భాన్ని బట్టి ప్రధానమైనది. వెన్నను కొంత తిని అంతకన్నా మన్నును రుచిగా తిన గోరే రాముడిని చూసి కౌసల్య ఆవేదన చెందేదట. తల్లి చేత తిట్లు తింటూ దెబ్బ తగలకుండా తిరిగేవాడట. ఆటలు ఆడి అలిసిపోయి అమ్మ ఒడిలో చేరి పాలు తాగుతూ, తన కోరిక తీరలేదని ఏడ్చే వాడట. 'అమ్మ పిలిచె రారా! అన్నము తినిపోవవేగ' అని కౌసల్య ఎంత పిలిచినా ఆట పాటలలో మునిగి పోయేవాడట. ఇటువంటి శ్రీరాముడి అల్లారు ముద్దు చేష్టలను మరకముందే అడవుల పాలు కావడం కౌసల్యకు తీరని దు:ఖాన్ని మిగిలించింది.

– జాలి చూపగలుగు దైవ మొక్కరు గాని కానరారు / శూన్య గగనమే ఏ వైపు చూడనైన (పుట.21) – దెబ్బ తగలకుండ తిరిగెడు పని చేష్ట / కనగ నింత నోచుకొననె లేదొ? (పుట. 21) – తలపు తీరుకున్న ఏడ్పు తీయని పసి ఏడ్పు / వినగనింత నోచుకొనని నేను? (పుట. 21) – ఆడి పాడుచుండు అందాల రాశిని కనగ వినగ నోచుకొనగ లేదొ? (పుట. 21) విధి తనతో ఆడుతున్న ఆటకు కౌసల్య ఎంతగా వ్యథ చెందిందో ఈ పద్యపాదాల్లో స్పష్టంగా కవి వ్యక్తపరిచాడు.

**3. సంతాన పరితాపం :** సంతానం కోసం ఎన్నో నోములు, వ్రతాలు నోచింది కౌసల్య. ఎంతో కాలంగా అవన్ని 'ఎడారి నలికిన విత్తనములయ్యె' నని ఒక శిలగా మారిపోయింది. ఎప్పుడైతే శ్రీరాముడు జన్మించాడో, అప్పుడు కౌసల్య పునర్జన్మ ఎత్తినట్లుగా భావించింది. ఒక తల్లిగా సార్థకం కాని స్త్రీ జన్మ ఊహించలేనిది. కౌసల్య సంతాన ప్రాప్తి కోసం పరితపించిన సన్నివేశాలు కవి సహజంగానే వర్ణించాడు. తాను సంతానం కోరుకుంటే తన ఇంటిలో సాక్షాత్తు ఆ శ్రీ మహా విష్ణువే అవతరించినట్టుగా భావించింది.

పాల సంద్రమే మా ఇంట పరిమళించె కల్పవృక్షమే నట్టింట కదలి యాడె సత్య ధర్మమ్ములమృతమై జాలువారె చలువ పందిళ్ళు వేసెను చందమామ (పుట. 22) శ్రీరాముని పుట్టుక సందర్భాన్ని ఆనంద పరవశాన్ని కౌసల్య వదనంలో కవి అద్భుతంగా వర్ణించాడు. బాల్యం నుండి రామచంద్రుని చూచుకోవడమే తపంగా, అలంకరించడమే పూజగా కౌసల్యకు కాలం సాగింది.

అంతలోనే యువరాజు పదవికి రాముడు చేరుకోవడం తల్లికి ఆశ్చర్యమే. ఇంతలోనే వనవాస ఆజ్ఞను తట్టుకోలేకపోయింది. 'నా ఉరమ్ము పగుల ఏడ్చి ఏడ్చి శిలనైతినెపుడొ, ఇప్పుడేడ్చి ఏడ్చి నేనేమౌదు నింక తండ్రి!" అంటూ రోదిస్తున్న తీరు కవి నైపుణ్యంలో కరుణను చిందించింది.

**4. భర్త ప్రేమ లేమి :** భర్తవల్ల సుఖం పొందలేకపోవడమనేవి దీర్ఘకాలంగా కౌసల్య తీరని దు:ఖానికి కారణంగా నిలిచింది. పేగు తెంచుకు పుట్టిన బిడ్డను వనవాసం పంపడం ధర్మమూర్తి అయిన మహారాజుకు తగునా అని నిలదీస్తుంది. శ్రీరామచంద్రుడు

అడవులకు పయనమై వెళ్తుండగా 'జీవముండునే? కూలీన చెట్టునైతి' అని కౌసల్య రోదిస్తుంది. తన పెండ్లి అయినప్పటి నుండి శుభంగానీ, సుఖంగానీ అంతవరకు తాను చూడలేదంటూ శ్రీరాముడితో మొరపెట్టుకుంటుంది. తన భర్త ఒక రాజు అయి ఉండగా తాను మాత్రం కళ తప్పి ఉన్నానని బాధపడుతుంది. ఈ సందర్భంలో కవి అద్భుత పోలిక వర్ణించారు 'సూర్యుని ముఖమెక్కింతైన చూడలేని కమలవనమట్లు' భర్త ప్రేమనే కనలేని బ్రతుకిదేమి!' అని తలరాతను నిందిస్తుంది. నాణ్యమౌ ఏడువారాల నగలు కలవు నను గొలువ దాస దాసీజనమ్ము కలదు ఎన్ని ఉండి వీనిననుభవింపలేని భాగ్యహీనను పతిప్రేమబడయలేక , (పుట. 24)

సగటు స్త్రీ భర్తనుండి ఆశించేవి ప్రేమానురాగాలు మాత్రమే. కౌసల్యకు ఏడువారాల నగలు, చుట్టూ దాసదాసీ జనము ఉండి కూడా భాగ్యవిహీనురాలైన స్థితిని కవి తన కవితా ప్రతిభలో ప్రదర్శించారు.

**5. సవత్నుల హేళన :** ఏ ఇల్లాలు అయిన ఎంత కష్టమొచ్చినా భరిస్తుంది కాని సవితి పోరును భరింపగరాదు. కాని కౌసల్యకు అనునిత్యం సవతుల నుండి పరుష వాక్యాలు, దూషణలు ఎదురవుతూనే ఉంటాయి. సపత్నులతో సమానమైన గౌరవాన్ని పొందలేని తన చిన్నతనాన్ని శ్రీరాముడి ముందు విన్నవించుకుంటుంది. రాజుకు పెద్ద భార్య అయి ఉ ండి, ప్రజల దృష్టిలో మహారాణి అయి ఉండి కూడా సపత్నులతో పడుతున్న హింసను కౌసల్య విడమరిచి చెప్పింది.

సా బహూన్య మనోజ్ఞాని వాక్యాని హృదయచ్ఛిదాం అహంత్రోస్యే సపత్నీ నామ వరాణాం వరా సతీ (అయోధ్య : సర్గ : 20, శ్లో : 39) సవతులిందరిలో నాకు సాటివచ్చు వారెవరు లేరు, నా కంటె వయసులోన చిన్న వారయు వారు నన్నెన్ని మాట లాడి కష్టపెట్టెదరొనే ననగరాదు –(పుట. 24) వాల్మీకి రామాయణంలో కౌసల్య శ్రీరాముడితో తన సపత్నుల వల్ల పడిన పరుష వాక్కుల తీరు స్పష్టంగా చెప్పబడింది. అనుమాండ్ల భూమయ్య ఈ విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు. తల్లి అనుభవించిన సపత్నుల వల్ల బాధ, తన సీతకు ఎదురు కాకూడదనే ఉద్దేశంతో ఏకపత్నీ వ్రతుడిగా ప్రతిజ్ఞ చేశాడు. సపత్నుల హేవగింపు వల్ల పొందిన బాధ ఈ కావ్యానికి మూలాధారంగా నిలిచింది. తల్లి హితబోధ ద్వారా శ్రీరాముడిలో సంస్కరణ భావాన్ని పెంపొందింపజేసింది.

కౌసల్య తన దు:ఖం రెట్టింపు కావడానికి రెండు కారణాలు గాక మూడింటిని తెలుపుతుంది. ఒకటి పతి ప్రేమ లేకపోవడం, రెండు సపత్నుల పరుషవచనాలు, మూడవది శ్రీరాముడి వనగమనం.

**6. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల లేమి :** యువరాజు పదవిని అలంకరించే కొడుకు ఉండగానే దూషణలకు గురవుతున్నానని కౌసల్య వ్యధ చెందుతుంది. ఇక శ్రీరాముడు అడవులకు వెళ్ళిపోయిన తర్వాత తన పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అని బాధపడుతుంది. తన భర్త తనకు ఏ మాత్రం స్వేచ్ఛ ఇవ్వలేదని రాముడితో మొరపెట్టుకుంటుంది కౌసల్య.

నేను రాణినే అయి కూడా కాను, మీ జ నకుడు నను నిగ్రహించి ఇంతయును స్వేచ్ఛనీయలేదు, ఆ తల్లి కైకేయి దాస జనముతో సాటిగానైన సరకుగొనదు (పుట. 25) అంటూ దశరథుడు ఎంతగా ఆమెను కట్టుదిట్టం చేసేవాడో తెలుపుతుంది. భార్యలకు స్వేచ్ఛ ఇవ్వకపోవడమనేది పితృస్వామ్య వ్యవస్థలో మొదటిది. స్త్రీలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అవసరం లేదనే పురుషాధిపత్య సమాజం

అనాదిగా కొనసాగుతూ వస్తున్న విషయం వాల్మీకి రామాయణంలోనే తెలుస్తుంది. తాను ఒక పట్టమహిషి కూడా. రాజు స్వేచ్ఛ ఇవ్వకపోవడాన్ని ధిక్కరిస్తుంది కౌసల్య. తన భర్త చులకన భావంతో చూడడం వల్ల దాసి జనంలో తన రాణితనం చెలామణి కావడం లేదని బాధ పడుతుంది. ఇప్పటికీ దాసీజనం ఈ రీతికి నడుచుకొంటున్న సందర్భంలో కైక కొడుకు రాజయిన తర్వాత భయంతో తనను చూడడానికి రారేమోనని కౌసల్య సందేహిస్తుంది. ఏకాంతాన్ని ఎలా భరించగలనని శ్రీరాముడితో నివేదిస్తుంది. 'కాలమింక నా గళమున బడిన కాలనాగొ ఏమొ!' అని కౌసల్య చిందిస్తుంది.

**7. కైకేయి పోరు :** కౌసల్య తన సవతులన్నింటిలో కైక సాధింపును తట్టుకోలేకపోతుంది. ఎల్లప్పుడు పరుష వాక్యాలతో దూషించే కైకేయి తన మీద ఎంతటి క్రోధాగ్నిని చల్లుతుందోననే కౌసల్య వాపోతుంది. కైక వ్యక్తిత్వాన్ని కౌసల్య ఆవేదనలో కవి అత్యంత సహజంగా చిత్రించారు. శ్రీరాముడు అడవులకు వెళ్ళిన తర్వాత కౌసల్యను కైకేయి బ్రతుకనివ్వదనే మాటను కవి ప్రస్తావించడంలో ఆమె ఎంతటి నియంత స్వభావాన్ని కలిగిందో తెలుస్తుంది. కాల సర్పమట్లు కదు వంకరగ నడుచు నడత గల కైక కుబుసమ్ము విడిచె ; ఇపుడు విషము చిమ్ముచు నను కాటు వేయునేమో? కన్నతండ్రి! నాయన! నిన్నె కాటువేసి. (పుట. 26) అంటూ కైకేయిని కాలసర్పంతో పోల్చుతూ కౌసల్య ఆక్రోశిస్తుంది. కాని తన కష్టాలను, బాధలను కౌసల్య తన ఇష్ట సఖులకు కూడా చెప్పుకోలేదట. కవి అనుమాండ్ల భూమయ్య కౌసల్య స్వభావాన్ని చిత్రిస్తూ 'నా ముఖాన మట్టి విసిరినదని నేను / నట్లె కోపించి మట్టిని ఆమె మీద / విసరలేను. దానిని తీసివేయమేలు' అని తెలుపుతారు. కౌసల్య వ్యక్తిత్వంలో నీతి, ధర్మం, మంచితనం ప్రదర్శింపజేశారు కవి.

**8. సవతుల కలత :** కైకేయి మొదలైన సవతులలో ఎదురయ్యే కలతను ఎదలోనే దాచుకొని ఇంతకాలం సగమైపోయిన కౌసల్య

ఈ ముసలితనంలో ఇంకా భరింపలేకపోయింది. పట్టమహిషి అయినందు వల్ల సవతులందరూ తనను అధికంగా బాధిస్తున్నట్లుగా కౌసల్య తెలుపుతుంది. మొదటి భార్యను అయిన నేరం వల్ల నేమో తనను మరింత సవతులు అవమానిస్తున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

**9. మాతృ ప్రేమ :** లక్ష్మణుడు ఆవేశంగా మాట్లాడిన మాటలు న్యాయమనిపించి భావించిన కౌసల్య శ్రీరాముడి వనవాసానికి అనుమతించదు. తండ్రి లాగా తల్లి కూడా పూజ్యురాలని చెబుతూ అడవులకు వెళ్ళకూడదని శ్రీరాముడిని ఆజ్ఞాపిస్తుంది. ఈ సందర్భంలోనే కవి భూమయ్య కౌసల్యలో పుత్రుడిపై ఉన్న ప్రేమను అనేక విధాలుగా వర్ణిస్తారు. చిన్నప్పటి నుండి కౌసల్యకు కలిగిన బాధనెల్లా రాముడు తన చిట్టి వ్రేళ్ళతో తుడిచిన సన్నివేశాలను గుర్తు చేసారు. ఆ వేదనతోనే రాముడు పసితనంలో ఆడిన ఆట వస్తువులే ఆయన అడవులకు వెళ్ళిన తర్వాత ఆమెకు బ్రతుకు వస్తువులవుతాయని సూచించారు. క్రూర మృగముల నిలయమ్ము,

కోయటన్న పలుకు దిక్కులేని అడవి పదియునాలు గేండ్లు పగలు గడచిన రేయియె గడవదు ఇట్లివియె నాకిరువదెన్మిదేండ్లు తండ్రి! (పుట. 41)

అడవులలో ఎటువంటి పరిస్థితి ఉంటుందో కౌసల్య తలచుకొని బాధపడుతుంది. ఆ రాముడి పసితనం నుండి అల్లారు ముద్దుగా పెంచిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంది.

రాముడికి మెత్తని గుడ్డ ఒత్తుకొని పోయినా బాధపడే తల్లి మనస్సు అడవుల్లో కఱకురాళ్ళ మీద నిద్రించడం దుర్భరమైందని ఆవేదన చెందుతుంది.

కడుపులో ఉండగా రాముడు తన పాదాలతో తన్నుతుండగా కౌసల్య ఆ పాదాలు ఎంత కందిపోయెనో అని కలత చెందిందట. భూమయ్య వర్ణనలో తల్లి ప్రేమకు తార్కాణంగా కౌసల్యనే నిలుస్తుందని చెప్పవచ్చు. కాని అటువంటి పాదాలు రాయిరప్పలు తాకి రక్తం చిందిస్తాయని తలచుకొని బాధపడుతుంది. 'తండ్రీ! నీ ముద్దు పాదమందారములకు నా యెదను తొడుగుదునయ్య!' అంటూ కౌసల్య పేర్కొంటుంది. తల్లి ప్రేమకు అపూర్వ నిర్వచనం ఈ పద్య పాదం. కవి మాతృ స్పర్శకు గొప్ప చమత్కృతి. తనను కూడా అడవులకు తోలుకొని పొమ్మని కౌసల్య ప్రాధేయపడుతుంది. అడవుల్లోని భయానక పరిస్థితులను రాముడికి తెలియజేస్తుంది.

**10. లక్ష్మణుడి సేవ :** ఈ కావ్యంలో లక్ష్మణుడి మాటలు కౌసల్య దు:ఖానికి కొంత ఉపశమనాన్ని కలిగిస్తాయి. పుత్ర శోకంతో కుమిలిపోతున్న కౌసల్యను చూసి తన తండ్రిపై ఉగ్రరూపమెత్తుతాడు.

రాముడు అడవులకు వెళ్ళకూడదని వారిస్తాడు. తన అన్నకోసం ఏమైనా చేస్తానంటాడు లక్ష్మణుడు. చివరికి తండ్రిని, కైకను, భరతుడిని బంధిస్తానని శపథం చేస్తాడు. రాముడి పై అచంచల భక్తిని ప్రదర్శిస్తాడు. లక్ష్మణుడి ఆక్రోశం కౌసల్య ఆవేదనను కొంత శాంతింపజేసింది. 'అన్నకు ఆపద సంభవింపనే నగ్నిని దూకెద ముందుగనే' అన్న లక్ష్మణుడి మాటల్లో అగ్రజుడి పై గల సోదరప్రేమ, సేవాతత్పరత కనిపిస్తుంది. కవి ఈ పాత్ర కల్పనలో ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

**11. రాముడి ఏకపత్నీ వ్రతం :** 'జ్వలిత కౌసల్య'గా రగిలిపోతున్న తల్లి దు:ఖాన్ని నివారింపజేస్తూ శ్రీరామచంద్రుడు చల్లగా స్వచ్ఛంగా ఏకపత్నీవ్రతం ప్రతిజ్ఞ చేస్తాడు. తల్లి నిరంతర శోకానికి కారణం తండ్రి ప్రేమ లేకపోవడం, తండ్రి బహుభార్యత్వాన్ని స్వీకరించడం అని గ్రహిస్తాడు. తన తల్లి లాగా సీత దు:ఖించకూడదని నిర్ణయించుకొని మాట ఇస్తాడు.

గడిచినట్టి కాలమ్మేదో గడిచిపోయె తండ్రి తప్పొప్పులివియని తలపలేను ఏ పరిస్థితులెట్లు రానిమ్ము నాకు ఒక్క సీతయే ఈ జన్మకున్న భార్య. (పుట. 57)

అన్న శ్రీరాముడి ప్రతిజ్ఞకు కౌసల్య దు:ఖం తొలిగిపోయినట్లుగా కవి కల్పించారు. 'ఏదో పరిమళామృత పుష్పమింత సాగివచ్చి కౌసల్య శిరస్సుపై విచ్చుకొనియె' అని వర్ణిస్తారు.

కౌసల్య తనకు జరిగిన పరాభవం తిరిగి తీసుకొని రాలేనిది. తన కాలం చెల్లిపోయింది. తన సీతకు ఇటువంటి దుర్గతి పట్టకూడదని కౌసల్య మనోభావం. ఈ ప్రతిజ్ఞతో కవి తన కావ్యానికి సద్గతిని ఏర్పరిచారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య స్త్రీత్వంలో కౌసల్యను చిత్రించి రాముడిని ధర్మ నిరతివైపు పయనింపజేశారు. మూర్తిమత్వ నిర్మాణంలో 'జ్వలిత కౌసల్య'ను అపూర్వ సృష్టిగా నిలువరింపజేశారు. సంప్రదాయ స్త్రీవాద ధోరణికి ప్రతినిధిగా ఈ కావ్యాన్ని చిత్రించారు. సమకాలీన సామాజిక వీక్షణంలో అంతర్భాగంగా పౌరాణిక ఐతిహాసిక పాత్రల మనోగతాన్ని ఆవిష్కరించారు.

ఆధారగ్రంథాలు 1. కృష్ణకుమారి, నాయని, ఆచార్య, 2013, విమర్శ విద్యా సార్వభౌమం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్. 2. ప్రియదర్శిని, కె.,డా॥, (సం) 2015, ప్రతిభాత్రయి, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్. 3. భూమయ్య, అనుమాండ్ల,

డాII, 2004, అంతర్వీక్షణం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్. 4. భూమయ్య, అనుమాండ్ల, డా॥, 2011, (నాల్గవ ముద్రణ), జ్వలిత కౌసల్య, మనస్వినీ దేవి ప్రచురణలు,

హైదరాబాద్. 5. రామారావు, చేకూరి, ఆచార్య (సం) 2003, అంతర్వీక్షణ సార్వభౌమం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.

వ్యాసం

# స్త్రీ నవలా సమీక్ష

## జీవించగలిగే చోటుకు!



- శృంగవరపు రచన

హైదరాబాద్

రంగనాయకమ్మ గారి నవలల్లో నాటి 'జానకి విముక్తి' నుండి నేటి 'కళ్యాణి కథ' వరకు స్త్రీల జీవితాల్లో సాధారణంగా జరిగిపోతున్న సందర్భాల్లో ఆ సాధారణత నుండి బయటి పడి తనకంటూ ఓ విశిష్ట వ్యక్తిత్వం ఏర్పరచుకోవాలంటే ఎలా వివిధ పరిస్థితుల్లో ప్రవర్తించాలో,ఆ పరిస్థితులను ఆధారంగా చేసుకుని కథను నడిపించడం గమనించవచ్చు. కులాంతర ప్రేమలు సంభవించినప్పుడు,బాధ్యత పేరుతో స్త్రీ సతమవుతున్నప్పుడు ఎలా ప్రవర్తించాలో అన్న అంశాలను ఆధారంగా చేసుకుని రంగనాయకమ్మగారు రాసిన నవల 'స్త్రీ.'

ఈ నవలలో ప్రధాన పాత్రలు పద్మజ,పార్వతి. పద్మజ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. పద్మజ కన్నా ముందు శాస్త్రి. తర్వాత సుజాత. ఈ ముగ్గురు సంతానంలో పద్మజ బాల్యం నుండో ఎంతో చురుగ్గా,తెలివిగా ఉండేది. పద్మజకు బాల్య స్నేహితురాలు పార్వతి. పార్వతి తల్లి సావిత్రి. తండ్రి పాఠశాలలో మామూలు ఉపాధ్యాయుడు. పార్వతి ఆ ఇంటికి పెద్ద కూతురు.ఆమె తర్వాత రుక్మిణి,సూర్యం. పద్మజ,పార్వతి పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో పార్వతి ఇంటి ఎదురుగా రఘుబాబు కుటుంబం దిగుతుంది. రఘుబాబు వీరిద్దరి కన్నా వయసులో పెద్దవాడు. అంతకు ముందు సంవత్సరం రఘుబాబు చెల్లెలు మరణించింది. రఘుబాబుకు అంతకు ముందు తలకు దెబ్బ తగలడం వల్ల నరాలు బలహీనపడటం వల్ల అతను పాఠశాలకు వెళ్ళడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల అతనికి ఇంట్లోనే పాఠాలు ట్యూషన్ ద్వారా చెప్పిస్తున్నారు.

రఘుబాబు పిరికివాడు. ఏ నిర్ణయం తీసుకోలేనివాడు. దేన్నైనా సూటిగా ప్రశ్నించే పద్మజ రఘుబాబుకి నచ్చలేదు.సౌమ్యంగా ఉండే పార్వతి నచ్చింది. రఘుబాబు,పార్వతీల ఇల్లులు పక్క పక్కనే ఉండటం, రఘుబాబుకి పాఠాలు చెప్పడానికి పార్వతి తండ్రినే కుదుర్చుకోవడం వల్ల ఆ రెండు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అప్పటి నుండే రఘుబాబు తల్లి అన్నపూర్ణ మరియు తండ్రి చలపతిరావు పార్వతినే తమ కోడలిని చేసుకుంటామని అనడం, ఆ రెండు కుటుంబాల మధ్య ఉన్న ఆ మాట అటు రఘు బాబు, ఇటు పార్వతి మనసుల్లో తాము భవిష్యత్తులో కాబోయే భార్యాభర్తలమనే భావనను బలపడేలా చేస్తుంది.

పార్వతి పాఠశాల విద్య పూర్తయ్యేసరికి ఆమె తల్లి ఇంకో బిడ్డకు జన్మనిచ్చినా ఆ బిడ్డ మరణించడం,ఆ తర్వాత కొన్నాళ్ళకు తల్లి కూడా అనారోగ్యంతో మరణించడం జరుగుతుంది. పార్వతి తండ్రి ఆరోగ్యం కూడా క్రమేపీ క్షీణిస్తూ ఉంటుంది. ఇక చదువుకునే అవకాశం లేక కుటుంబం కోసం ఓ గుమాస్తా ఉద్యోగంలో చేరుతుంది పార్వతి. అదే సమయంలో ఓ ధనవంతుడి కూతురితో రఘుబాబుకు పెళ్లి తల్లిదండ్రులు నిర్ణయిస్తారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న పొలం అమ్మేసి కొంత కట్నం ఇచ్చి రఘుబాబుకి కూతురిని ఇచ్చి వివాహం చేయాలని తండ్రి అనుకున్నా పార్వతి దానిని వ్యతిరేకిస్తుంది. రఘుబాబు పార్వతి దగ్గరకు వచ్చి కొంత కట్నం ఇచ్చి ఈ పెళ్లి జరిగేలా చూడమని చెప్తాడు. పార్వతి పట్ల ఇష్టమున్నా తన సొంత ఇష్టాన్ని ధైర్యంగా చెప్పలేని పిరికివాడు రఘుబాబు. అటువంటి వ్యక్తిత్వం లేని వ్యక్తిని భర్తగా వద్దనుకుని,పెళ్లి అనే ఆలోచనను పక్కన పెట్టి తన తమ్ముడు సూర్యాన్ని చదివించడం మీద దృష్టి పెడుతుంది. పార్వతి తండ్రి కూడా అనారోగ్యంతో మరణించడంతో పూర్తిగా కుటుంబ భారాన్ని తన మీద వేసుకుంటుంది పార్వతి.

పద్మజ తండ్రిని ఒప్పించి మెడిసిన్ చదివి డాక్టర్ అవుతుంది. పద్మజ తండ్రికి పద్మజ అభిప్రాయాలూ,స్వంతంగా ఆలోచించే తెలివితేటలు అంటే ఎంతో గర్వపడేవాడు.అలానే కూతురిలా తాను ఎప్పటికీ అలా ఆలోచించలేనని దానికి కారణం తాము పుట్టి,పెరిగిన వాతావరణం,నేపథ్యం అని ఆయన అనుకునేవాడు.కాలంతో పాటు మారుతున్న కూతురు ఆయనకి ప్రగతిభావాలు ఉన్న వ్యక్తిగా అనిపించినా,ఆయన మారలేనితనం వల్ల ఆ రెండు తరాలకు మధ్య వ్యత్యాసం అలానే ఉండిపోయింది. హౌస్ సర్జన్ గా ఉన్న సమయంలో పద్మజ ఆంగ్లో ఇండియన్ జార్జ్ విలియమ్స్ ను ప్రేమిస్తుంది. అతన్నే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. అప్పటికే ఇంట్లో ఆమెకు ఓ సంబంధం ఖాయం చేసే ప్రయత్నంలో ఆమె తల్లిదండ్రులు ఉన్నారు. తన ప్రేమ విషయం తండ్రి అర్థం చేసుకుంటాడని,ఆయన ద్వారా కుటుంబాన్ని ఒప్పించవచ్చునన్న ఆశతో పద్మజ ఇంటికి వస్తుంది.

పద్మజ తండ్రితో తన ప్రేమ విషయం గురించి చెప్తుంది. ఆయన పద్మజ నిర్ణయ శక్తి మీద తనకు నమ్మకం ఉందని,కానీ తను తన ఆచారాల నుండి,వాటిని అనుసరించి ఉన్న జీవన పరిధిని దాటలేనని,కానీ ఆమెను తమతో సమాజ సాక్షిగా ఆమోదించలేకపోయినా ఆమె సుఖంగా ఉండటం కోసం ఆమె వివాహం తనకేమి అభ్యంతరం కాదని,ఆ విషయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపొమ్మని చెప్తాడు.అలా వెళ్ళిన ఆమె వివాహం అయ్యాక పేపర్లో ఆ వివాహ ఫోటో పడ్డాక అందరితో పాటు కుటుంబానికి కూడా తెలుస్తుంది. అందరూ ఆ వివాహాన్ని వ్యతిరేకించడమే కాకుండా,ఆమె చేసింది క్షమించలేని తప్పుగా భావిస్తారు. ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించి పద్మజా తండ్రి మరణిస్తాడు.

ఇక పార్వతి ఉద్యోగం చేస్తూనే సూర్యాన్ని డిగ్రీ దాకా చదివించింది. చెల్లెలోలో మేనరికంలో వివాహం చేసింది. అత్తవారింట్లో ఉన్న రుక్మిణి తనకు కావాల్సినవి అక్క నుండి ఎలా తీసుకోవాలో బాగా  తెలుసు. ఉద్యోగం చేస్తున్న అక్క నుండి  అన్నీ బాగానే రాబట్టుకునేది. సూర్యం డిగ్రీ అయ్యాక పార్వతి పెట్టించిన ఉద్యోగంలో చేరాడు. సూర్యానికి ఆ ఉద్యోగం ఏ మాత్రం సంతృప్తికరంగా లేదు. సూర్యం ధనవంతుల అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకుని ఇల్లరికం వెళ్ళిపోతాడు. సూర్యం,రుక్మిణిల కోసం పెళ్లి చేసుకోకుండా ఉండిపోయిన పార్వతిని కేవలం ఆమె తోడబుట్టిన వారు తమ జీవితాలు స్థిరపరచుకోవడానికి మాత్రమే వినియోగించుకున్నారు. రఘుబాబు భార్య సుశీల. వివాహం అయ్యాక భార్యను పట్టించుకోకుండా తాను కూడా దిగులు లోనే ఉండిపోయాడు రఘుబాబు. అతని భార్య సుశీల మానసికమైన ఈ వైవాహిక ఇబ్బందుల వల్ల చివరకు మరణిస్తుంది.

పద్మజ జీవితంలో ఎదుగుతుంది. ఆమెకు ఆడపిల్ల పుడుతుంది. వరల్డ్ టూర్ కి ఆ భార్యాభర్తలు వెళ్తున్న వార్త పేపర్ లో వస్తుంది. పద్మజ తల్లి తన కూతురిని బహిరంగంగా అసహ్యించుకున్నా మనసులో ఆమె మీద  ప్రేమ ఉంటుంది. పద్మజ చెల్లెలు సుజాత పద్మజను బాల్యం నుండే అభిమానించినా,ఆమె తెలివితేటల పట్ల ఎంతో నమ్మకం ఉన్నా,ఆమె చేసుకున్న వివాహంతో ఆమె మీద పూర్తి ద్వేషాన్ని పెంచుకుంటుంది. అక్క చేసింది తప్పని ఆమె వల్ల కుటుంబ పరువు పోయిందని,తాను ఎప్పటికీ అలా చేయనని అనుకుంటూ ఉంటుంది సుజాత. కానీ ఆమె వదిన జానకి స్నేహితురాలు వసుంధర పెళ్ళికి వెళ్లినప్పుడు అక్కడ వసుంధర అన్నయ్యతో ప్రేమలో పడుతుంది. అతను లేకపోతే బ్రతకలేని దశకు వస్తుంది. కానీ తల్లిని,కుటుంబాన్ని బాధ పెట్టడం ఇష్టం లేకపోవడం వల్ల,తాను అక్క కన్నా విభిన్నమైన వ్యక్తినని భావించడం వల్ల ఆమె మొదట ఆ ప్రేమను ఒప్పుకోకపోయినా ఆ తర్వాత ఆ ప్రేమలో పడ్డాక ఆమెకు అక్క చేసింది సరైనదే అనిపిస్తుంది.కానీ సుజాత బాధను అర్థం చేసుకున్న ఆమె తల్లి సుజాత వివాహానికి ఒప్పుకుంటుంది. ఓ కూతురిని దూరం చేసుకున్న ఆమెకు సమాజం పట్టింపులు కన్నా కూడా వ్యక్తి జీవితంలో అతని నిర్ణయాలకే ప్రాధాన్యత ఉందని అర్థం చేసుకుంటుంది.

సుశీల మరణించిన తర్వాత రఘుబాబు పార్వతిని వెతుక్కుంటూ వచ్చినా అతన్ని తిరస్కరిస్తుంది పార్వతి.ఓ పాపను పెంచుకోవాలని నిర్ణయించుకుంటుంది. దీనితో నవల ముగుస్తుంది.

ఈ నవలలో  ఓ వ్యక్తిత్వం ఏర్పడని పాత్ర రఘుబాబుది.బాల్యం నుండే తనదైన ఆలోచనలతో తన వ్యక్తిత్వం ప్రత్యేకంగా ఏర్పరచుకున్న పాత్ర పద్మజది. పరిస్థితులకు తగ్గట్టు తన వ్యక్తిత్వాన్ని మార్చుకుని, తన వ్యక్తిత్వ విలువలను ఆ మార్చుకున్న పరిస్థితుల పర్యావసానాన్ని బట్టి ఆ వ్యక్తిత్వ విలువను తెలుసుకున్న పాత్ర పార్వతిది. తన చుట్టూ ఉన్న సమాజాన్ని అనుసరించి తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుని,తనకు నచ్చిన జీవితాన్ని స్వీకరించే నిర్ణయ శక్తిని సంపాదించుకోలేని పాత్ర సుజాతది.

ఈ నవలలో జీవితాలను గమనిస్తే నిజానికి సంతోషంగా ఉన్న పాత్ర పద్మజ. ఆమె ప్రేమించి వివాహం చేసుకున్నప్పుడు,కుటుంబ వ్యతిరేకత ఏర్పడినప్పుడు కూడా ఆమె తాను చేస్తుంది సరైనదే అని నమ్మింది. వృత్తి పరంగా ఆమె జీవితంలో ఎదిగింది. ఆమె జీవితంలోని ఏ దశలోనూ కూడా తనకు నచ్చిన వాటిని వదిలివేయలేదు. సమాజం ఆమెను తల్లిదండ్రులను బాధ పెట్టిన కూతురిగా భావించినా,తప్పు చేసిన వ్యక్తిగా పరిగణించినా అవేమీ ఆమె వ్యక్తిత్వాన్ని మార్చలేకపోయాయి. నిజానికి పిల్లల సుఖాన్ని గురించి ఆలోచించవలసిన తల్లిదండ్రులు తమ సంతృప్తిని పిల్లల జీవితాలను ప్రభావితం చేయడంతో పొందవచ్చు. ఆ సంతృప్తిని తల్లిదండ్రులు సమాజంలో తమ పిల్లలకు ఏర్పడే వైవాహిక విలువను బట్టి పొందుతారు.తమ పిల్లల వివాహాల వల్ల ఆ విలువ వారికి దక్కనప్పుడు ఆ పిల్లలు తమకు ద్రోహం చేసినట్టుగా భావిస్తారు.

ఈ నవలలో పద్మజకు విరుద్ధంగా ప్రవర్తించిన పాత్ర పార్వతి. ఆమె కుటుంబం కోసం జీవించడం మానేసింది. కానీ అదే కుటుంబం తమ స్థిరత్వాన్ని చూసుకుని ఆమెను ఒంటరిదానిని చేశారు. పద్మజ చేసింది తప్పని భావించిన పార్వతి ఆమెకు వ్యతిరేకమైన దిశలో కేవలం కుటుంబాన్ని చూసుకోవడమే ఉత్తమమైన జీవనం అని ఆమె అనుకుంది. కానీ  మనిషి జీవితంలో తన జీవిత పరిమితి వరకు మాత్రమే ఆలోచిస్తాడు.  మనిషిలో కృతజ్ఞత అన్నది అవసరంకు సంబంధించిందిగా ఉంటుంది.కేవలం కుటుంబంలోని వారు తనకు చూపించే ప్రేమ,తన పట్ల వారికి ఉండే కృతజ్ఞత వల్ల తన జీవితంలో ప్రేమ–పెళ్లికి ప్రత్యామ్నాయం అవుతుందనే భ్రమలో తమ వ్యక్తిగత జీవితానికి,వ్యక్తిత్వానికి సమాధి కట్టేసి,బాధల్లో –బాధ్యతల్లో తమ జీవన సార్ధకతను వెతుక్కునే ఎక్కువ శాతం పాత్రలకు ప్రతీక పార్వతి.

ప్రగతికి అర్థం సామాజికమైనమైనదా లేక వ్యక్తికి కూడా వర్తిస్తుందా అన్నది నేటికి ఓ ప్రశ్నే. సామాజికంగా ఇంకొకరి కోసం తన గురించి ఆలోచించుకోకపోవడమే మంచి వ్యక్తికి ఉండాల్సిన లక్షణంగా ఇంకా భావించబడుతున్న సంస్కృతి నుండి మనిషి ఈ

సామాజిక వలయంలో వివిధ రకాల మనుషులతో మెలిగేటప్పుడు తన జీవితాన్ని వ్యర్థం చేసుకుని ఇంకొకరిని బాగు చేయడం కూడా ఓ రకమైన వ్యక్తిగత తిరోగతి అని గుర్తించి,ఆహ్వానించేలా ఆలోచించడం కూడా మనుషులు నేర్చుకోవాలి.అప్పుడే ఈ సమాజంలో బాధలు–బాధ్యతలు–అవకాశవాదాల మధ్య మనిషి తన జీవితాన్ని కోల్పోకుండా బ్రతకగలడు. ఇది స్త్రీ కేంద్రీత నవల అయినప్పటికి,ఈ నవలలో ఉన్న పరిస్థితుల ప్రభావం పురుషులను కూడా అదే స్థాయిలో ప్రభావితం చేస్తుంది. ఈ సమస్యను మారిన కాలం దృష్ట్యా గమనిస్తే స్త్రీ–పురుషులు ఇద్దరి కోణం నుండి ఆలోచించడం వల్ల పాఠకులకు ఓ విస్తృత పఠన పరిధి ఏర్పడుతుంది.

★ ★ ★

కవిత

# తూరుపు శిశువు



**శైలజామిత్ర**
**హైదరాబాద్ 9290900879**

తన తనువులోంచి తూర్పును చూసి
తానెవరో చెప్పమంటుంటే
ఎవరు మాత్రం ఏమని మాట్లాడతారు
నవమాసాలన్నీ నర్మగర్భంగా నవ్వుతుంటే
ఎన్నిసార్లని ఎవరైనా ఓర్చుకుంటారు?.

వాస్తవాన్ని రెండుగా చీల్చే హృదయం ఉంటే
మానవీయత వైపు సగం దేహం నిలిచేది

పురిటి వాసన వదలని ఆ వొడి కోసం
తారాట్లాడే పసికందు చేతులు సాచినప్పుడు
అందుకోకుండా ఉండలేను
అందుకుని ఆదరించలేను..
ఆరడుగులకోసం అరడుగును త్యాగం చేయలేని
అనేక చందమామల కోసం
ఎన్ని దేహాలను కుప్పబోసినా
తల్లి దేహం మాత్రం చితుకుల పోగే..

నాదయిన కన్నపేగు కోసం
మనసు అనేక ముక్కలయింది..

ఒక దేశం ఎవరికీ అక్కర్లేని ముక్కలుగా మిగిలాక
ఒక దేహం కూడా అనేక రూపాల్ని సంతరించుకుంది
అత్యాశల అడియాసలలో
దేశానికి, దేహానికి కనబడని పొర ఏదో అడ్డుపడిరది..

అంతా అయ్యాక ఇప్పుడు అంటాడు
నా తల్లి నాకు కావాలి అని..

చితి చూపుల్ని చూస్తున్న ఆ దిక్కుల్ని అడిగాను
ఏం మిగిలిందని నీకివ్వాలంటూ నవ్వింది
అనేకానేక వింతలు, విడ్డూరాల మధ్య
ఏకాకిగా మిగిలింది ఒక్క దేహమే..

పేగు తెంచుకుని నీటిబొట్టులా
దేహం నేలపై రాలినప్పుడు
తనదైన ఆ నేలకోసం తారాట్లాడేదే ఆ ఏడుపు..
దేహమా? దేశమా? సంశయంలో ఉన్నప్పుడు
శిలనుండి కన్నీరు కారడమే ఆ కానుపు
అయినా
ఆకర్షణ నుండి ఆకాశానికి ఒక ఊహను పంపాను
ప్రశ్నే సమాధానమై వచ్చింది..


ఇపుడు నా దేహాన్ని దాచడానికి
ఒక దేశాన్ని వెతుకుతున్నాను
నా దేశానికి నాలుగు దిక్కులుంటే
నా దేహానికి నాలుగు ఆయుధాలున్నాయి..
నాలుగు G నాలుగు కలిపి మొత్తం
ఎనిమిదింటినీ కలిపే స్వప్నం కోసం నిద్రలో ఉన్నాను..

అంతా
భవిష్యత్ తరాల కోసం పోరాటమే అంటారు
భారమైన ఎడారులలో నిలుచుంటారు..
జీవితం ఏ ఒక్కరికీ చెందింది కాదు
ఒక మరణం.. ఒక జననం.. దేహానిదే కాదు
ఒక దేశానిది కూడా..

అనువాద సాహిత్యం

# నేను ఫణియమ్మను.....!






## మూలం: ఎం.ఎస్.ఆశాదేవి

**అనువాదం: ఆచార్య కె.ఆశాజ్యోతి**
**బెంగళూరు 9440967239‌4**

నేను ఫణియమ్మను. (నన్నందరూ ఫణియమ్మ అనే పిలుస్తారు) మీలో చాలా మంది నా గురించి నవలలో చదివారు. సినిమాలో చూసారు. నా గురించి చాలా మంది మాట్లాడడం విన్నాను. ఏవేవో కారణాలతో నన్ను మీరు చర్చల్లోకి లాగడం చూసాను. స్వాతంత్ర్యానికి పూర్వం భారతీయ బ్రాహ్మణ సమాజంలో స్త్రీల స్థితిగతులకు ప్రతినిధిగానో, వస్తువుగానో చూడొచ్చనని కొందరూ, బతుకులో ఎదురైన అనేక సమస్యలకు ఏడవకుండా, అందుకు కారణమైన వారిని శపించకుండా, స్త్రీ కి మాత్రమే సాధ్యమైన సహనంతో వాటినన్నిటినీ నేను ఎదిరించిన తీరు ముఖ్యమని కొందరూ భావించారు. శాపగ్రస్త బతుకును సార్థకం చేసుకున్నానని కొందరు అనడం విన్నాను కూడా.

ఐతే మరి కొందరి ప్రకారం మూలత: నేను పితృ సంస్కృతి బలి పశువును. మొత్తానికి నేను విరుద్ధంగా భావించే రెండు కారణాలకు ప్రతీకను కావడంతో నాకు ఆశ్చర్యం కలిగించింది. ఒకటి నన్ను నేను పోగొట్టుకున్న కాలం. ఒకప్పటి విధవల జీవితంలోని కష్టాలు మాత్రమే కాదు, ఆ కాలపు సామాజిక, కౌటుంబిక సమస్యలు, స్త్రీల పట్ల హద్దే లేని క్రౌర్యం వంటివాటిని నాలో చూడవచ్చు అనే విషయం. అంతే కాదు స్త్రీకున్న ఆలోచనా శక్తికి, జీవ చైతన్య శక్తికి నన్ను సంకేతంగా భావించడ రెండవది. ప్రేమ, ఆత్మీయత, వాత్సల్యాల ప్రతిరూపంగా నన్ను భావించే దృష్టి కోణం ఇది. మన నరసింహస్వామి " బాధ ఉపశమించాలి అని కోరుకో" అని రాసింది నన్ను చూసే కాబోలు.

నిజంగా గమనిస్తే ఇది ఒక రకంగా విరోధాభాసం అనిపిస్తోంది కదా ! నేను బలమైన స్త్రీ నే !! వ్యవస్థ దౌర్జన్యానికి బలైన స్త్రీని కూడా అని పదే పదే అంటూ నన్నొక స్మారక చిహ్నంగా చేస్తున్నారేమో అనిపిస్తోంది నాకు. అలా చూస్తే ఈ రెంటి మధ్య నేను నలిగిపోవడంతో పాటు వెనుకకూ, ముందుకూ ఊగిసలాడటమే నిరంతర అవస్థ అయ్యింది. నేనే దానికి ప్రత్యక్ష ప్రతినిధిని అని అనిపిస్తుంటుంది నాకు.

ఈ అన్ని అంశాలతో పాటు నా విషయాలు కొన్ని మీతో పంచుకోవాలనుకుంటున్నాను. ఎందుకంటే స్త్రీగా ఆలోచిస్తే మాట్లాడింది ఎంత ఉందో, మాట్లాడకుండా ఉన్నది అంతే ఉంటుంది.

మౌనం కూడా ముఖ్యమైన భాషే. ఈ భాషను పురుషులు అర్థమైనా అర్థం కానట్టు, కొన్ని సార్లు అర్థమైనదాన్ని మరేదో అన్నట్టు వ్యాఖ్యానించడమే చాలా సార్లు జరుగుతుంది. లేదా నచ్చినట్టుగా స్త్రీల భాషను అర్థం చేసుకోవడం వాళ్ళ జన్మ హక్కుగా భావిస్తారు. లేదా స్త్రీలకు ఒక భాష ఉండడమేంటన్నది వాళ్ళ ప్రశ్న కావొచ్చు. నా బతుకంతటిలో కనబడుతూ , నేను కాపాడుకుంటూ వచ్చిన లేదా ఇంకా స్పష్టంగా చెప్పాలంటే నేను నేర్చుకుని కాపాడుకున్న మౌన భాషను ఇప్పుడు మాటల్లో చెప్పాలంటే ఏమౌతోందో అర్థం కావడం లేదు.

పెళ్ళంటే ఒక ఆట. పెళ్ళిలో ఆ హోమం, పొగ ఇవన్నీ కష్టం కలిగించినా 'పెళ్ళికూతురు' అని అంతా అంటుంటే లోపలి నుండి ఏదో ఆనందం కలగడం నిజం. తీర్థహళ్ళి అమవాస్య రోజు దొంగ నా జడతో పాటు జడ బిళ్ళను దొంగతనం చేసిన రోజు మొదటిసారిగా భయమన్నది నా అనుభవంలోకి వచ్చింది. ఆ తరువాత ఉన్నట్టుండి ఒక రోజు ' అయ్యో ! ఫణీ ! నీ బతుకు ముగిసి పోయింది కదే!" అంటూ మా అమ్మతో సహా అందరూ భోరుమంటుంటే ఎందుకో నాకు అర్థం కాలేదు. ఏదో భయంకరమైనదే జరిగిందని నాకు గుండు కొట్టిస్తున్నప్పుడు అర్థమైంది. పెళ్ళికొడుకు జాతకం చూసిన మా తాత 'నేను బాగానే జాతకం చూశాను. అబ్బాయి జాతకం మార్చారేమో ఎవరికి తెలుసు ?' అంటూ దిగులు పడ్డాడు.

ఇక్కడి నుండి ప్రారంభమైంది చూడండి, ద్వైదీ భావం, సమాధానాల్లేని ప్రశ్నలు ! కనబడుతూ కనబడని నా బతుకు పర్వం. ఒక స్థితి వరకూ నా అజ్ఞానమే నన్ను కపాడిందేమో ! ఐతే దేహ సహజ లక్షణం ఎవరైనా నేర్పాలా? పూవులా విచ్చుకున్న దేహం అనాఘ్రాత కుసుమంలా ఉండిపోవాలని ఈ మగవాళ్ళు ఎందుకు ఆలోచిస్తారు ? ఆమెను అలాగే ఉంచడం కష్టసాధ్యమైన పని అని వాళ్ళకు తెలీదా ? తలలను బోడి చేసి, తెల్ల చీర కట్టించి 'దొంగ కృష్ణుని కథకు అమంగళం కలుగుతుంది' అనడం ఎందుకు మళ్ళీ ?

‘శరీరమనే గోరీలో దాక్కుని జీవితాన్ని ఆస్వాదించడం తపస్సా ?’ ఘోరశిక్షనా? ‘ఆహా ! పడక సుఖానికి వందల దారులు’ అని నేను చెప్పగలనా? నేను ఎంతో ఇష్టపడే అక్కమహాదేవి “ శయనానికి శిథిలమైన దేవాలయాన్నాయి” అన్నది కదా ! ఎందుకంటే ‘ఆత్మగత సంబంధానికి నువ్వే నాకున్నావు’ అనగలిగే సఖ్య భక్తి ఆమెకు ఉంది.

అంత వరకైనా ఆమె అదృష్టవంతురాలు. నాకేముంది చెప్పండి ? ఈ కత్తుల దారిలో నడిచి ఎలా బతికానో ...... అన్న విషయం ఈ సమాజం – పరిసరాలు విధవనైన నేను ఎలా ఉండాలో నిర్ణయిస్తే , అలా ఉండడానికి నేను పడ్డ కష్టం చెప్పడానికి ఇందిరకు ‘ కూడా కష్టమవుతుందేమో ! అందుకే ఆమె ఈ అగ్ని పునీత వివరాలకు వెళ్ళకుండా నన్ను త్వరగా నలభై ఏళ్ళ వయస్సుకు తెచ్చి పెట్టారేమో ! లేదా నన్ను ఒక

జ్ఞాపకంగానో, స్మారకంగానో నిరూపించాలనుకున్న వాళ్ళకు ఏం చెప్పడం ఎందుకు అనిపించిందేమో ? నా మీదున్న అపారమైన గౌరవం కూడా కావొచ్చు.

ఒక్కొక్క సారి నాకు సుబ్బి’ ద్వారా నా ఆవేదనను చెప్పి ఉండవచ్చు అనిపిస్తుంది. ఇప్పుడు ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తే నా మనస్సు, దేహం విలవిలలాడిన క్షణాలు లేవా అంటే ఏం చెప్పగలను ? నన్ను ఆపేసింది ఎవరు ? భయమా ? స్త్రీకి భయాలకేం తక్కువ ? చూసి చూడనట్టు, ఉన్నా లేనట్టు ఉండే వేనవేల భయాలకు ఎన్నో సార్లు చచ్చి బతుకుతుంటాము. ఈ కాలం పిల్లల్ని చూస్తుంటే భయమనేది మా జీన్స్ లో ఒదిగి పోయిందెమో అన్న భావం మెరుపులా వచ్చి మాయమవడం నిజం. ఐతే ఆ భయాన్ని దాటడానికి వాళ్ళు చేసే ప్రయత్నం మాత్రం అభినందించదగినది.

ఇలా నా శరీరం, మనస్సు ఏమనిపిస్తుంది అనడిగితే చెప్పడం కష్టమే. అది ఒక ఘనత అని సుతరామూ చెప్పలేను. అటువంటి సంయమనం సాధించడం ప్రశంసార్హమే కావొచ్చు. ఐతే జీవితానికి మూలభూతమైన, సకల జీవవ రాశులకూ అనివార్యమూ, అగత్యమూ ఐన శారీరక సుఖం నన్ను వంచించిన తీరును ఎలా అర్థం చేసుకోవాలి ? దానికి వాళ్ళు సమర్థించే తీరును మనిషన్నవాడు ఒప్పుకునే అవకాశం ఉందా? దీనిని ప్రతిఘటించగల అవకాశం నాకు కలిగిందా ? ఒకవేళ కష్టమే ఐనా అసాధ్యమేమీ కాదు అని అనిపించేది కాదు. ఐతే నైతికత అని వాళ్ళు ఏదైతే చెప్పారో దాన్ని దాటడం నాకు కష్టమనిపించింది. వంశ మర్యాద, గౌరవం వీటన్నిటినీ వదిలి రాలేని సంకెళ్ళు ఉన్నాయి. అందువల్ల నన్ను నేను విడిపించుకోవడం సాధ్యం కాలేదు. లేదా అటువంటి సన్నివేశం వచ్చినా బహుశా నేను గుర్తించలేక పోయానేమో !

నేను ఎదిరించిన సందర్భం “ అటుకులు మాత్రమే తినడానికి పుట్టింది’ అని అన్నం తగ్గించిన వాళ్ళ దుర్మార్గాన్ని నిరాకరించానేమో ! నేను మామూలుగా తినే ఒక పూట అన్నం కూడా మాన్పించి పళ్ళు, మజ్జిగకు మాత్రమే నన్ను పరిమితం చేసి, అవి త్యాగం, తపస్సు అనంటుంటే నాకు నవ్వొచ్చేది. ఏది అవసరమో దాన్నే తొలగించి, పైగా ఉపకారం చేసే వాళ్ళలా ఒక పూట అన్నం మాత్రమే పెట్టే దయా దాక్షిణ్యాలు నాకొద్దనిపించేది. ఇలా నా ఇంట్లో నా పట్ల అమర్యాదగా ప్రవర్తించారని కాదు. నాన్న, అమ్మ, చిన్నాన్న, ఇంకా మిగిలిన వాళ్ళంతా నన్ను ప్రేమగానే చూశారు. ‘ నాలో కదలికలు, కోర్కెలు నావి కావు’ అన్న వాస్తవాన్ని నా బతుకంతటిలో నేను అనుభవించింది మాత్రం ఎంతో నిజం !

జీవితం ఎంత విలక్షణమైనదో చూడండి. తల్లి కాగలిగిన అవకాశం లేకపోయినా నేను ఎందరో తల్లులకు కాన్పులు చేశాను. అటువంటి పరిస్థితిలో నా మానసిక స్థితిని వివరించడం కష్టం. నా బతుకులో ఇటువంటి కష్టమో లేదా వికారమో నా అనుభవంలోకి రాలేదనే భావన ఒక ఓదార్పుగా అనిపించినా, సృష్టిలో అమూల్యమైన కాన్పులోని బాధను చూశాక, ఆ బాధ మనుషులను అర్థం చేసుకోవడానికి ఆధారమైంది. స్త్రీ జన్మ పట్ల నాకు గర్వం, గౌరవం అధికమైంది ఈ కారణం వల్లే !

అందుకే కులం, మతం అనే హద్దులు దాటి కాన్పులు చేయించాను. ప్రపంచంలోని ఆడపిల్లలందరూ కులం, మతం అనే చట్టం దాటి సమానత్వాన్ని పాటించగల స్థితికి చేరడం కష్టమేమీ కాదు ఆలోచిస్తే ! ఐనప్పటికీ ఈ మగవాళ్ళు ఎంత మాయ చేస్తారు చూడండి. రెండు కొప్పులు ఒక చోట ఇమడవు అంటూ మనలోనే వ్యతిరేకతను చొప్పించారు. మనం కూడా ఇటువంటి వాటిని ఒక్కటై ఎదిరించాలి. ఆ ముస్లిం అమ్మాయికి సహాయం చెయ్యడాన్ని నేను ఇంట్లో చెప్పలేదని ఏ మూలో దిగులు ఉంది. ఒక జీవితాన్ని కాపాడి, మరో కొత్త జన్మకు అవకాశం కల్పించడాన్ని మన ధర్మాలు, సమాజం అంగీకరించవనుకుంటే వాటన్నిటినీ ధిక్కరించాలి.

నేను ఈ రోజు చెప్పాలనుకుంటున్న విషయం మరొకటి ఉంది. అది చెప్పడానికే ఇంత ఉపోద్ఘాతం అనుకున్నా సంతోషమే! చెప్పలనుకున్నది మా దాక్షాయణి గురించి. ఆ అమ్మాయి ఎంత ధైర్యంగా తన బతుకును సాగించిందో చూడండి. నాకు భలేగా అనిపిస్తుంది. కళ్ళ ముందే ఇది జరిగింది కదా అన్న సంతోషం. ఆనందంతో పాటు విషాదమూ ఉంది. ఎందుకంటే, తన బతుకు కోసం మాత్రమే కాదు, సమాజం కోసం మాత్రమే కాదు, తన హక్కులకై ఈ అమ్మాయి చేసిన పోరాటం చూస్తే, మన హక్కులను కాపాడుకోవాలంటే పోరాటం ద్వారానే సాధ్యం అని అనిపించినా, ఏ కాలానికైనా మన స్థితిగతులను నిలుపుకోవాలంటే పోరాడడమే మార్గం అనుకున్నప్పుడు మాత్రం విషాదమనిపిస్తుంది.

గుండు కొట్టించడాన్ని వ్యతిరేకించడంతో ఈమె పోరాటం ప్రారంభమైంది. చివరికి ఆ అమ్మాయి “రాత్రి భోజనం లేకపోతే తట్టుకోలేను, ఆకలవుతుంది” అని చెప్పినా ఆ దుర్మార్గులకు అయ్యో అనైనా అనిపించలేదు కదా ! ఇలాంటి నరరూప రాక్షసుల మధ్య

ఎలా బతకడం ? చివరకు తన మరిది ద్వారా గర్భం దాల్చినప్పుడు అత్తింటి వారు ఇంటి నుండి తరమాలని ప్రయత్నించినప్పుడు అత్తింటి వాళ్ళకు దాక్షాయణి ఇచ్చిన సమాధానం ఈ రోజుకూ నాకు జ్ఞాపకముంది. " మీ కొడుకు వల్ల నాకు కడుపొచ్చింది. నేనెందుకు పుట్టినింటికి పోవాలి ? మీరే కాన్పు చేయాలి. ఆ కొడుకు బదులుగా ఈ కొడుకు అంతే కదా?" అన్నప్పుడు స్త్రీ లోకానికంతటికీ వకాల్తా పుచ్చుకున్న వకీలులాగా కనబడింది. స్త్రీల పై సాగే అంతం లేని దౌర్జన్యానికి సమాధానం ఇలానే కదా ఇవ్వాలి ?

నా స్థితి మరో రకం. ఈ దాక్షాయణి మారుతున్న కాలానికి ప్రతీక అనుకున్నా, మేమిద్దరం సమాజ చట్రంలో భాగాలమే ! నాలో కలిగిన ఎన్నో వినిపించని ప్రశ్నలకు ఈమెలో

సమాధానాలు దొరికాయని అన్నా సరే ! కాలం మారుతోంది. స్త్రీలమైన మనందరి పోరాటాల దారి, స్వరూపం, పరిణామం అన్నీ కాలానికి తగినట్లు మారతాయన్నది నిజమే. ఐతే వాటన్నిటినీ అనుభవించే మూలత: లక్షణం మనల్నందరినీ సన్నిహితులుగా చేస్తుంది. దాక్షాయణి లోకాన్ని ఎదురించిన తీరు ఎంత మొండితనంతో కూడి ఉన్నా, వ్యవస్థ ఆమె చేసింది తప్పని ఎంత బొబ్బరించినా, దాక్షాయణిని నేను సమర్థిస్తాను. ఒక కొత్త పరిస్థితిలోకి వెళ్ళాలంటే తానున్న సంకెళ్ళను వదిలించుకోవలసిందే !

ఈ పోరాటం ఎప్పటికైనా ముగుస్తుందా ? నాకు తెలీదు. పోరాటం ఆగలేదు అంటే తప్పకుండా ఎప్పుడో ఆగుతుందని అర్థం. ఇదంతా మీతో పంచుకున్నాక మనసు కొంచెం తెరిపిన పడింది. ఐతే చెప్పవలసింది ఎంతో ఉంది..... మరో సారి కలుద్దాం !

( కన్నడలో రచయిత్రి ఎం.కె. ఇందిర (1917 – 1994) రాసిన నవల 'ఫణియమ్మ'. కన్నడ సాహిత్యంలో ప్రముఖమైన నవలల్లో ఫణియమ్మ ఒకటి. కర్నాటకలో మలెనాడు ప్రాంతంలో (పశ్చిమ కనుమలకు ఆనుకుని ఉన్న నూరు మైళ్ళు విస్తరించిన ప్రాంతం) స్త్రీల జీవన శైలిని, స్థితిగతులను చిత్రించిన నవల. ఫణియమ్మ నవల (1976) ఒక విధవ జీవితాన్ని , సమాజం ఆమెను చూసే తీరును ప్రతిబింబిస్తుంది. కథానాయకి ఫణియమ్మ మలెనాడులో ఒక పల్లెటూరి పిల్ల. ఎనిమిదేళ్ళకే పెళ్ళి. తొమ్మిదేళ్ళకు భర్త పాము కరవడంతో మరణిస్తాడు. విధవ అన్న బిరుదు. పదమూడేళ్ళకు పెద్ద మనిషి అవుతుంది. ఆ కారణంతో గుండు కొట్టించి మూలన కూచోబెడతారు. జీవితాంతం తెల్ల చీర. ఫణియమ్మ 108 సంవత్సరాలు జీవిస్తుంది. అన్న, అక్క, చెల్లి బిడ్డలను పెంచడంలో కాలం గడిచిపోతుంది. పండగలకు, పబ్బాలకు, నామకరణాలకు అన్నిటికీ ఫణియమ్మ ఆధారం. ఇన్ని సంభమాల మధ్య తాను వంచించబడింది అని ఆమెకు అనిపించలేదా ? తన తప్పు లేకుండా ఇలాంటి బ్రతుకును ఎందుకు సాగించాలి అన్న ఆక్రోశం కలగలేదా ? ఇలాంటి ప్రశ్నలు, నిరాశలు ఆమెను వేధించలేదా ? వ్యవస్థ విరుద్ధంగా అరవాలనిపించలేదా ? సహనం – సంయమనం కల ఆమె వ్యక్తిత్వం ఎలాంటిది ? మనో వైజానిక కోణంలో ఆలోచించవలసిన ఈ నవల కావలసినంత వస్తువును అందిస్తుంది. ఈ నవలను ప్రేమ కారంత్ సినిమాగా తీసారు. ఆ సినిమాకు అవార్డు లభించింది. ఈ నవల పై వ్యాసాన్ని ఎం.ఎస్. ఆశాదేవి కన్నడలో రాసిన వ్యాసాన్ని తెలుగులోకి అనువదించాను)

**గజల్**

# గజల్




**నిర్మలారాణి తోట**
**కరీంనగర్ 9381659523**


చీకట్లను తొలగించే ఉదయమొకటి కావాలీ !
కన్నీళ్ళను వెలిగించే హృదయమొకటి కావాలీ!

ఎదలోయల కొండలాగ నిండుకున్న శూన్యాలు
మౌనాలను శృతిచేసే ప్రణవమొకటి కావాలీ!

అడుగడుగున స్వార్థాలను చిమ్ముతున్న విషనాగులు
దుర్మార్గుల ముంచేసే ప్రళయమొకటి కావాలీ!

నైరాశ్యపు కారడవుల కానరాని కాగడాలు
గమ్యాలను మొలిపించే గమనమొకటి కావాలీ!

ఆశలకే రెక్కలొచ్చి ఆనింగిని చీల్చేస్తే
ఆశయాలు విహరించే గగనమొకటి కావాలీ!

అహాలనే దాటేస్తే అమృతాల దీవికదా
విశ్వప్రేమ పల్లవించె చరణమొకటి కావాలీ!

వికసించని పదాలలో పరిమళాల పుష్పాదేది
మనసులనే విరచించే కవనమొకటి కావాలీ!

చెట్టులాగ బ్రతకడమే జీవితమే "నిర్మలా !
జన్మలనే ప్రశ్నించే మరణమొకటి కావాలీ

కవిత

# ఎరుపెక్కాల్సిన పసి పిడికిలి

రమాదేవి బాలబోయిన
వరంగల్ 7893261262



జీవకణాన్నిచ్చిన తండ్రికీ
ప్రాణమిచ్చిన తల్లికి
ఊపిరులూదిన గాలికి
తెగిన బొడ్డుతాడుకీ
పగిలిన మాయకూ
పారిన నెత్తురికే కాదు
ఆ నవ వికసిత “నిష్కళంక”
తొలి ఏడుపు విన్న డాక్టరుకైనా
పసికూనలననుభవించే
బాహ్య ప్రపంచంలోని
కర్కశ చీకటి అపస్వరాలను ఎదుర్కొనేందుకు
“ఆ పసి పిడికిలి” ఎరుపెక్కాలని తెలియదు!

ఆకలికి ఏడుస్తోందో
ఆపదకు ఏడుస్తోందో
అలసి ఏడుస్తుందో
ఆ గండమెలా గడుస్తుందోననుకోగానే
అలుముకున్న అశాంతితోవలలో
అరక్షణంలో బోసి నవ్వుల తోరణాలను
ఆమనిలా విరబూయించి
ఆనంద లోగిలిలా మార్చే వెన్నెలకూనకు
కరుకు పశుత్వాలను పసిగట్టేందుకు
ఎరుపెక్కాలని”ఆ పసి పిడికిలికి” తెలియదు!

కాలం గుప్పిళ్ళలోని
చేదు స్మృతులను మార్చి
శిశిరగీతాలలోని
పల్లవులను సవరించి
దిగులు మేఘ మథనంలో
నవ్వుల జడివానలు కురిపించి
తుంచేయబడ్డ బతుకు ఆశలను
స్థైర్యపు సూదితో కుట్లేసి
చిదమబడ్డ స్వప్నాలను
మధురస్మృతులుగా ఎగురవేసి
గాయపడి మోడైన హృదిముంగిట
కాంతివనాల వెలుగులు గుమ్మరించే
“ఆ పసి పిడికిలికి” ఎరుపెక్కాలని తెలియదు!

అనాదికాలం నుంచీ
పాతుకుపోయిన లింగబేధాలను తుంచి
నిస్సహాయ  వేదనాతుప్పలను నరికి
అత్యాచార పీడకలలను దునుమాడి
మనిషితనపు అంచుల్లోకి చేరిన
సమాజానికి
ధీరత్వపు హరిత స్పర్శతో చికిత్స చేసి
అణిచివేతల ఆగడాలకు
జ్ఞానపు చురకత్తుల మెలికలేసి
ఆర్థిక స్వావలంబనలకు
వెలుగుకాగడాల పొత్తమవుతూ
హెచ్చుతగ్గుల తరాజులో
సమానత్వపు సూచీని నిలబెట్టి
ప్రగతి వెండిపున్నమవ్వాలని
కొత్త చట్టాలకోసం కాక
చట్టమే,తానై శాసిస్తూ
ఈలోకానికి ప్రాణదాతే కాక
మానదాత కూడా  కావాలంటే
“ఆ పసి పిడికిలి” ఎరుపెక్కాలని
ఇప్పుడా ఆడకూనలకు
పుట్టకముందే తెలియజేయాల్సిందే.

# Till it happens to you
# నీకు జరిగే దాకా...లేడీ గాగా.. డేన్ వారెన్ తో కలిసి రాసిన కవిత.



స్వేచ్ఛానువాదం - గీతాంజలి
హైదరాబాద్ 8897791964

లేడీ గాగా– 'టిల్ ఇట్ హేపెన్స్ టు యు ' కవిత రచయిత్రి..2015లో దయానే వారెన్ తో కలిసి రాసింది .ఆ తరువాత ఇది పాటగా మార్చి' ది హంటింగ్ గ్రౌండ్' డాక్యుమెంటరీ సినిమా కోసం లేడీ గాగా పాడారు. ఈ స్థితి అంటే రేప్ సంస్కృతి అమెరికన్ యూనివర్సిటీ లో బాగా ఎక్కువగా ఉన్న సందర్భంలో ఈ పాటని రాసి పాడారు లేడీ గాగా.

లేడీ గాగా 19 ఏళ్ల వయసప్పుడు లైంగిక అత్యాచారానికి లోనై డిప్రెషన్ లోకి వెళ్ళిపోయింది. ఆ గాయం ఆమెని జీవితాంతం సలుపుతూనే ఉండింది.ఆమె పాప్ గాయని గా సుప్రసిద్ద మైన తరువాత కూడా ఈ విషయాన్ని పాట రూపంలో రేప్ జరిగిన తరువాతి బాధిత స్త్రీల మానసిక స్థితి.. జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో..ఆ స్థితిని గట్టెక్కడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో..చుట్టూ ఉన్న సమాజం రేప్ చేసిన వాడిని వదిలేసి, బాధితురాలి నే నెరస్థురాలిగా ఎలా చూస్తుందో .. కోలు కోవడానికి కొన్నంటే కొన్ని ధైర్యం పెంచే మాటలు బాధితురాలికి ఎంత అవసరమో ఈ చుట్టూ ఉన్న సమాజం నుంచీ, కుటుంబం నుంచి.. ప్రపంచానికి చెప్పడానికి సంసయించలేదు.

లేడీ గాగా మార్చ్28, 1986 లో న్యూయార్క్ సిటీ లో జన్మించింది.

అసలు పేరు స్టెఫాని జోయాన్నే యాంజెలీనా జెర్మనోట్టా.

గాయని, సాంగ్ కంపోసర్, రైటర్,నటి.

అనేక పాప్ మ్యూజిక్ ఆల్బమ్స్ విడుదల చేసారు. 3 సార్లు గ్రామీ అవార్డ్స్ వచ్చాయి.గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ 2 సార్లు వచ్చాయి. బెఫా,బ్రిట్ అవార్డ్స్ తో పాటు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ సాధించారు.. ఆమె మ్యూజిక్ వీడియోస్ వేల కోట్లు సంపాదించాయి.★లేడీ గాగా ఆల్బమ్స్ కొన్ని

ది ఫేమ్, బోర్న్ థిస్ వే, చీక్ టు చీక్, లవ్ ఫర్ సేల్ ,ఆర్ట్ పాప్, జోయాన్నే ,క్రామాటికా.


బోర్న్ దిస్ వే సంస్థ ద్వారా LGBT హక్కుల కోసం పోరాడుతున్నారు.

★ ★ ★

Till it happens to you–నీకు జరిగే దాకా...లేడీ గాగా.. డేన్ వారెన్ తో కలిసి రాసిన కవిత.

స్వేచ్ఛానువాదం – గీతాంజలి.

---



నువ్వు చెప్పు...అంతా బాగవుతుందని..
కాలంతో పాటు అంతా సర్దుకుంటుందని
ఒక్కసారి చెప్పు..
నన్ను నేను కూడగట్టుకుంటాను..లేచి నిలబడుతాను.
నాతో మళ్లీ చెప్పు..
నువ్వు బాగుంటావని ..
నీకు తెలిసిందంతా చెప్పు
నేను బాగవడానికి.,మళ్లీ మాములు అయిపోవడానికి..
అసలేమీ జరగనట్లే ఉండడానికి.,
నీకేం తెలుసో అంతా చెప్పు.
సరేలే.. నాకు జరిగిన ఆ రేప్.,
నీకు జరిగేదాకా తెలీదు ఎలా ఉంటుందో...

నా అనుభవం నీకెలా వాస్తవంలోకి వస్తుంది..నీదెలా అవుతుంది?
అస్సలు కాదు గాక రాదు..
నా నొప్పి నీ అనుభూతి కాలేదు..ఎప్పటికీ..
అది నీకు జరిగితే కానీ.
అయినా..తలెత్తు కుని..ధైర్యంగా ..
బలంగా నిలబడమని
పడిపోయాక..లేచి నిలబడి
ముందుకు సాగిపోవాలని
ఒక్కసారి నాకు చెప్పు చాలు
చెప్తావా మరి?
అయినా నేను నడచిన దారుల్లో నువ్వు నడిస్తే కానీ...
అప్పటిదాకా ..
అవును అప్పటిదాకా
నీవన్నీ ఒట్టి మాటలుగానే ఉంటాయి.
నాకు జరిగింది నీకూ జరిగితేనే ..
బహుశా నీ మాటలు కూడా వేరుగా వస్తాయి.
నీ ప్రపంచం కాలి పోయినప్పుడో.,
బద్దలు అయినప్పుడో..
నీవు నిలబడ్డ తాడు అంచుకు
నువ్వు చేరుకుని జారిపోబోయినప్పుడో ..
అదిగో అలాంటప్పుడు కానీ నీ మాటలు
నేను కోరుకున్నట్లుగా ఉండవు మరి.
అసలు నా చెప్పుల్లో నీ కాళ్ళు పెట్టి నిలబడేదాకా..
నువ్వు .,నేనయ్యేదాకా
అసలు నీ నుంచి నేనేమీ వినదల్చుకోలేదులే..
ఎందుకంటే నాకు జరిగింది నీకు జరగలేదు కాబట్టి..
ఆ బాధ నీకర్థమే కాదు కాబట్టి.
నీ కది వాస్తవం కాదు కాబట్టి
నువ్వు .,నేను కాదు ,కాలేవు కాబట్టి.
నాలా నీకది జరిగేదాకా..
నిజంగా జరిగేదాకా
నాకెలా అనిపిస్తుందో..నాకెంత బాధ ..కలిగిందో
నీకు తెలిసే అవకాశమే లేదు..
అయినా..
నువ్వో మాట చెప్పు..
ఇంత జరిగినా అంతా బాగవుతుందని...
శిరస్సు వంచకుండా
ముందుకే పోవాలని
ఆగిపోకూడదని...చెప్తావా
ఈ నాలుగు మాటలు?
అయినా ఎలా చెప్తావులే..
నీకు జరిగితే కానీ...!!

**కవిత**

# మూలకు తోసిన మూలకారణాలు



**చంద్రకళ దీకొండ,**
**మేడ్చల్ - 9381361384**

ఆడది గీత దాటింది కనుకే
జరిగింది వినాశనం...
ఆడదాని నవ్వే యుద్ధకారకం...
ఆడది కవ్వించింది కనుకే
మనుసంభవం...
ఆడది కయ్యానికి
కాలుదువ్వింది...
కనుకే బీభత్సయుద్ధం అంటూ!

మగవాడి రాజ్యకాంక్ష,
ఆధిపత్య ఆకాంక్ష...
అహపు సహజాత లక్షణం...
దుందుడుకుతనం...
కయ్యానికి కాలు దువ్వే తత్వం...
కామంతో కన్ను మిన్ను కానని అంధత్వం...
బంధాలను కానని కరడుగట్టిన స్వార్థం...
మరెన్నో మూలకారణాలను మూలకు తోసి!

శీలపరీక్షలకు గురిచేసి సీతలను...
పాపపుణ్యాలెరుగని పాంచాలులను...
అమాయక అహల్యలను...
వేలెత్తి చూపుతూ...
వేధింపులకు బలి చేస్తూ!

అరకొర వస్త్రధారణ వల్లే
అఘాయిత్యాలంటూ...
బరితెగించటం వల్లే
బలి అవుతున్నారంటూ...
హద్దులు దాటడం వల్లే
హత్యాచారాలంటూ
అసమర్థ ప్రకటనలతో...
స్వజాతి సమర్థనలతో!

నాటి నుండి నేటివరకు
అభాసుపాలౌతూనే ఉంది ఆడతనం...
అపనిందల పాలౌతూనే ఉంది
స్త్రీల మానధనం!!!

వ్యాసం

# పురాణ ప్రక్షిప్తాలలో జనపదులు



నందిగామ నిర్మల కుమారి

ఖమ్మం 9490369252

పురాణం వేదాల తరవాత అతి ప్రాచీనమైన సాహిత్య ప్రక్రియ. పురాణం స్వతహాగా ధార్మిక సాహిత్య వ్యాప్తి కోసం నిర్దేశించబడిన ప్రక్రియ. కొన్ని వందల ఏళ్ళుగా ఆ పురాణాలు మౌఖికంగా ఒక తరం నుండి మరొక తరానికి వ్యాప్తి చెందుతూ ఉన్నాయి. ఆ వ్యాప్తి క్రమంలో ఆయా పురాణాలు ఉప పురాణాలుగా, స్థల, కుల పురాణాలుగా పరివ్యాప్తం చెందాయి. సాహిత్యంలో అత్యధిక భాగం పురాణ ప్రబంధ ప్రక్షిప్తాల సమాహారం. అవి కొన్ని తరాలుగా అవతారికలుగా వ్యాప్తి చెందుతూ వచ్చాయి. అలా వ్యాప్తి చెందే క్రమంలో మూల రచనకు తమ సృజనను, అనేక చేర్పులు, కూర్పులు జతచేసి అవి ప్రక్షిప్తాలుగా జన బాహుళ్యంలో ఈ నాటికీ ప్రచారంలో ఉంచారు. లాక్షణికులు ఈ ప్రక్రియను పుక్కిట పురాణాలుగా వాటికి ఎటువంటి హేతుబద్ధత, శాస్త్రబద్ధత, తార్కిక, తాత్వికబద్ధత లేదు అని కొట్టి పడేసిన ఉదంతాలు కూడా మనం చూడగలము. వందల ఏళ్ళ ప్రబంధ సాహిత్యం ఆయా ప్రాంతీయ భాషలలోకి అనువాదం జరిగే క్రమంలో ఆయా కాలాల ధార్మిక రాజకీయ, రాజరిక ప్రభావం పడ్డది. ఆ క్రమంలోనే అనువాదాలలో అనువాదకుల అదనపు అన్వయింపులు కూడా బయలు దేరాయి. ఆ అన్వయింపులే ప్రక్షిప్తాలుగా పరిగణించబడినవి. ఈ నేపథ్యంలో పదకొండు పన్నెండో శతాబ్దంలో జరిగిన అనువాదాలు దేశి, మార్గ చర్చల నేపథ్యంలో సాహిత్యంలో వర్తమాన సాహిత్య చర్చల్లో పురాణ ప్రతీకలను, పాత్రలను, పూర్వపక్షం చేసే ఆలోచన ఒకటి బయలు దేరింది. అది నిజంగా వర్తమాన తెలుగు సాహిత్యంలో అస్తిత్వ రాజకీయాలకు ఒక మేధోకూర్పు చేసినది అనుకోవచ్చు. ఈ నేపథ్యంలో పురాణ ప్రబంధ సాహిత్య వ్యాప్తి, అన్వయింపులు ప్రక్షిప్తాలు ఆయా కాలాన ఎలా సాహిత్య చర్చల్లోకి వచ్చాయో చర్చించాలి అనిపించింది. ఆ ఆలోచన లోనే నేను పురాణ ప్రక్షిప్తాలలో జనపదులు అంశాన్ని ఎన్ను కున్నాను. సదరు చర్యల పూర్వపరాలను ఈ పత్రంలో చర్చిస్తాను.

సాహిత్య చరిత్రలో నన్నయ, తిక్కన మధ్య కాలాన్ని శివకవి యుగంగా విభజించారు. అంటే క్రీ.శ. పదకొండు చివర పదమూడు శతాబ్దాల మధ్య కాలాన్ని శివకవి యుగంగా లాక్షణికులు విభజించారు. ఏ యుగం అయినా ఆయా యుగాలలో ఆయా రాజ వంశాలు అనుసరించిన ధార్మిక ఆలోచనల ప్రచారమే లక్ష్యంగా ఆయా కావ్యకర్తలు తమ కావ్య సృజన చేసారు. కవిత్రయం ప్రధానంగా వైదిక భావజాల ప్రచారం లక్ష్యంగా పురాణ సాహిత్య అనువాదాలు చేస్తే శివకవులు శైవ, వీరశైవ ఆలోచనల ప్రచార లక్ష్యంగా తమ సాహిత్య సృజన చేసారు. శివకవులలో ప్రధానంగా నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాధులను శివకవిత్రయంగా భావిస్తారు. వారే కాకుండా శ్రీపతి పండితుడు, శివలెంక మంచన,

యధావాక్కుల అన్నమయ్య, మొదలైన వారు కూడా శైవ వాఙ్మయాన్ని ప్రజలలోకి తమ రచనల ద్వారా వ్యాప్తి చేసారు. ఈ క్రమంలోనే శివ కవులు దేశి మార్గ అనే రెండు భావనలను ముందుకు తెచ్చారు.

"మును మార్గ కవిత లోకంబున వెలయగ దేశి కవిత పుట్టించి తెనుంగును నిలిపిరంధ్ర విషయంబున చాళుక్య రాజు మొదలుగా బవులుర్" అనే ఒక స్పష్టమైన భాష, భావ విభజన చేసాడు. ఈ విభజన అనేక చర్చలకు మార్గం సుగమం చేసింది. దేశి అంటే అల్పుల ఆలోచన, అవైదిక ఆలోచన, మార్గ అంటే ఆధిపత్య సమూహాల ప్రామాణిక రచన అనే విభజన మేలు కన్నా కీడే చేసింది. తెలుగు సాహిత్యంలో కొన్ని తరగతుల సాహిత్యం సారస్వతం అంటరానిదిగా మలినమైన ఆలోచనలుగా త్రుణీకరించబడినాయి. ఇలా చర్చించుకుంటే మొదట పన్నెండో శతాబ్దంలో ప్రజా బాహుళ్యంలోకి దూసుకొని వచ్చిన వీరశైవ మతం కేంద్రంగా బయలు దేరిన ధార్మిక చర్చలు పురాణ ప్రబంధ కావ్య చర్చలు ఒక ప్రాసంగికతను సంతరించుకున్నాయి. అలా సంస్కృత ప్రబంధ కావ్యాలు అనువాదం అవుతున్న క్రమంలోనే ఆటవెలది, ద్విపద, రగడ లాంటి ప్రయోగాలు సాహిత్యాన్ని ప్రజల వద్దకు చేర్చాయి. ఆ పునాదిగా బయలుదేరిందే బసవపురాణం. సాధారణ ప్రజలు మాట్లాడుకునే వ్యావహారిక ఆటవెలది సాహిత్యంలో పెనుమార్పులు తెచ్చింది. ఇందులో అతిసాధారణ శైవభక్తుల చరిత్రనే బసవపురాణంగా సోమనాథుడు ఒక నూతన పరంపరను ప్రోది చేసాడు.

ఒక రకంగా పురాణ రచనా ప్రక్రియకు వివిధ అనువాదాలు, అనుసరణలు, ప్రక్షిప్తాలు ఈ కాలంలోనే బయటకు వచ్చాయి.

సాధారణ ప్రజల ఆట పాటలలోకి నాటి ప్రబంధ రచనలు మారు మొగ్గ వేసాయి. కాల క్రమాన కటువైన ప్రాచీన కావ్య భాష రాను రానూ సరళం అవుతూ శుద్ధవచన దిశగా మార్పు చెందాయి. అనేక ఆట పాటలకు అనుసరణగా సాధారణ శ్రమ జీవనంలోకి ఈ భావనలు తర్జుమా కావడం మొదలుపెట్టాయి. అయితే దేశి మార్గ భావన మూలంగా ప్రక్షిప్తాలుగా బయటకు వచ్చిన అనేక స్వతంత్ర అనుసరణ ప్రయత్నాలు మరింతగా ప్రజల జీవితాలలోకి బలంగా పోయినప్పటికీ ఆ రచనలకు ప్రజాదరణ తప్ప పండిత ఆదరణ లభించలేదు. అది ఒక రంగా ప్రక్షిప్తాలకు మేలు కన్నా కీడే కలిగించింది అనుకోవచ్చు.

పురాణ ప్రబంధ కావ్యాల ఇతి వృత్తాలు అనేక దశాబ్దాలు నాటకాలుగా ప్రజలలోకి వెళ్ళాయి. సురభి, ధార్వాడ లాంటి నాటక సమాజాలతో బాటు కర్ణాటక, మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్ లో పురాణ ఇతి వృత్తాలు నాటకాలుగా రాజ్యం ఏలాయి.

జాతీయోద్యమకాలంలో అనేక నాటకాలలో పురాణ పాత్రలనే ప్రతీకలుగా తీసుకున్నారు. భీష్మ, కర్ణ, అర్జున, సావిత్రి, భీమ లాంటి పాత్రలు జాతీయోద్యమ కాలంలోనూ, తర్వాత సాహిత్య లోకంలోనూ ప్రక్షిప్తాలుగా వివిధ రచనా మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందాయి. వర్తమాన సాహిత్య లోకం లోనూ, ఈ చర్చలు మరింత ఊపందుకున్నాయి. అదే క్రమంలో సివిగా ప్రసిద్ధి చెందిన రచయిత, మేధావి చిత్తజల్లు వరహాల రావు, స్వాభిమాన ఉద్యమానికి, స్వయంపాలనా రాజకీయాలకు పునాది వేసిన త్రిపురనేని రామస్వామి, 'రాముడికి సీత ఏమవుద్ది' లాంటి చర్చనీయమైన రచన చేసిన ఆరుద్ర 'దేవాలయాల మీద బూతు బొమ్మలు' లాంటి వివాదాస్పద రచనలు చేసిన తాపీ ధర్మారావు లాంటి వాళ్ళు పురాణ పాత్రల చిత్రణలో రాగద్వేషాల గురించి హేతువు గురించి రాయడం మొదలు పెట్టారు. 'నరబలి' 'సత్యకామ జాబాలి' లాంటి రచనలు రాసే పురాణ పాత్రలను పూర్వపక్షం చేసిన ఉదంతాలు చిత్త జల్లు వరహాల రావు, త్రిపురనేని రామస్వామి, పెరియార్, పూలే, అంబేద్కర్ మొదలు అనేకమంది నాటి, నేటి వర్ధమాన రచయితల దాకా అనేక ప్రయోగాత్మకమైన సాహిత్య సృజనలో మనం చూడగలం. కేవలం కథలు, నవలలు, నాటకాలు మాత్రమే కాకుండా కావ్యాలలోనూ, పద్యాలలోనూ, వచన కావ్యాలలోనూ ఇటువంటి ప్రక్షిప్తాల ఆధారిత చర్చలు తెలుగునాట ఆయా కాలాన ప్రబలంగా సాహిత్యంలో చోటు చేసుకున్నవి.

సాహిత్యం దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా రూప సారాలలో అనేక ఉత్పరివర్తనాలకు అనేక కదుపులకు గురి అయినది. ఆయా కాలాన ఆయా సమాజాలలో ఉపరితల సమాజంలో పెల్లుబికిన అలజడులు సాహిత్యంలో కూడా పరావర్తనం చెందాయి. ఆ ఆలజడులకు అక్షరరూపం ఇచ్చాయి. కొన్ని సక్రమంగా మరికొన్ని వక్రీకరించి సాహిత్యం ప్రజాబాహుళ్యంలో ఒక మార్పుకు సంకేతంగా ఉండాలి. అనే ఆలోచనలు కూడా బయలుదేరాయి. ప్రాచీన సాహిత్యానికి అన్వయింపులు మార్పులు, చేర్పులు, కూర్పులు చోటు చేసుకున్నాయి. పందొమ్మిది వందల నలభై దశకం చివరి దశలో తెలంగాణలో జరిగిన మహత్తర తెలంగాణ రైతాంగ పోరాటం కాలంలో కథ, కవిత్వం, నవల ఆ నాటి రైతాంగ పోరాట నేపథ్యం రంగరించుకున్నది. అరవై చివరి దశకంలో డెబ్బై, ఎనభయ్యో దశకం మొదటి పాదంలో తెలుగు నాట విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. నక్సల్బరీలో జరిగిన రైతాంగ పోరాటం దాని కొనసాగింపుగా శ్రీకాకుళంలో జరిగిన గిరిజన రైతాంగ పోరాటం సాహిత్యంలో నిబద్ధత, నిమగ్నత లాంటి చర్చలు చోటు చేసుకున్నాయి. ఆ క్రమంలో అనేక కళారూపాలు విముక్తి చోదక శక్తులుగా పనిచేశాయి.

ప్రపంచ వ్యాప్తంగా పెల్లుబికిన సామాజిక ఉద్యమాలు వర్ణ, లింగ, ప్రాంతీయ అస్తిత్వ పాయలుగా విస్తరించడం మొదలు పెట్టాయి. ఆ క్రమంలో బయలు దేరిన స్త్రీవాద, దళిత, మైనారిటీ పాయలు, సాహిత్యంలో నూతన ప్రతీకలతో బాటు సరికొత్త అభివ్యక్తితో సాహిత్యంలో ప్రాచీన, ప్రబంధ కావ్యాలలోని ప్రతీకలకు నవీన అర్థాలను అన్వయింపులను జత చేసారు.

దళిత విప్లవ కవి శివసాగర్ రాసిన 'నడుస్తున్న చరిత్ర' కవిత దళిత విప్లవ అస్తిత్వ రాజకీయాలలో ఒక సంచలనం.

"శంభూకుడు పెదాల మీద చిరునవ్వుతో రాముణ్ణి వధిస్తున్నాడు ఏకలవ్యుడు ద్రోణుని బొటన వేలును గొడ్డలితో తో నరుకుతున్నాడు బలి తన చిరు పాదాలతో వామనున్ని పాతాళానికి తొక్కేస్తున్నాడు. మనువు కళ్ళలో సూదులు గుచ్చుకొని నాలిక తెగోసుకుని చెవిలో సీసం పోసుకుని స్మశానంలో దొర్లుతున్నాడు". సుదీర్ఘకాలం విప్లవ రాజకీయాలలో విప్లవ రచనలతో ప్రసిద్ధిగాంచి శివసాగర్ రాసిన 'నడుస్తున్న చరిత్ర' దళిత రాజకీయాలలో నిజంగా ఒక షిఫ్ట్ అనుకోవచ్చు. ఆధిపత్య పురాణ పాత్రలను, ప్రతీకలను అస్తిత్వ లేదా స్వాభిమాన ఉద్యమాలకు చేసిన అన్వయింపు ఒక ట్రెండ్ గా దళిత అస్తిత్వ రాజకీయాలలో పరిగణిస్తారు. అలా దళిత సాహిత్యం వీరబాహుడు, శూర్పనక, శంభూకుడు, మహిషాసుర, రావణాశూర లాంటి పాత్రలను వర్తమాన రాజకీయాలకు అన్వయిస్తూ కథ, కవిత్వం, నవలలో అనేక ప్రయోగాలు దళిత బహుజన స్వాభిమాన రాజకీయాలలో మనం చూడగలము.

తమిళనాడులో ప్రళయన్ అనే రచయిత నాటి ప్రాచీన పురాణ పాత్రలను నవీన అవసరాలకు అస్తిత్వ సంవేదనలకు అన్వయించారు. అలా తెలుగు సమాజంలో ఈ పనిని అత్యంత ప్రభావవంతంగా రాసిన రచయిత సౌదా. తెలుగు కవితాలోకంలో సౌదా పేరు పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఒక నాటి విప్లవ విద్యార్థి నాయకుడుగా విప్లవ రచయితల భావసారూప్యతతో 'గోదావరీ ప్రవహించు' తో బాటు ఇంకా అనేక కవితా సంకలనాలు రాసిన సౌదా కవి, కథా రచయిత, నాటక ప్రయోక్త, ప్రచురణ కర్త, ఎన్నో ప్రజారంజకమైన పుస్తకాలను ప్రచురించిన ఆయన అనేక ప్రయోగాత్మక నాటక ప్రక్రియలకు ఆద్యుడు అయ్యాడు. సౌదా రాసిన 'బర్బరీకుడు' అత్యంత ప్రభావవంతమైన నాటకం.

బర్బరీకుడు పాండవులు అరణ్య వాసంలో దండకారణ్యంలో తలదాచుకుంటున్న సమయంలో పాండవులలో ఒకడైన భీముడు

అరణ్య కన్య అయిన హిడింబితో సహజీవనం చేసిన ఫలితంగా వారికి బర్బరీకుడు అనే బలశాలి అయిన కొడుకు పుడతాడు. అతను అరణ్యంలోనే ఉంటూ సకల కళా, శస్త్ర, శాస్త్ర విద్యలను నేర్చుకుంటాడు. పాండవ కౌరవుల మధ్య జరిగిన మహాభారత సంగ్రామంలో పాండువుల తరపున యుద్ధం చేయాలి అనే ప్రతిపాదన వస్తుంది. ఆ క్రమంలో పాండవుల ఆత్మీయ బంధువు శ్రీకృష్ణుడు మధ్యవర్తిగా పాండవుల తరపున యుద్ధం చేయడానికి తల్లి హిడింబి అనుమతితో యుద్ధ రంగంలోకి వస్తాడు. యుద్ధం కన్నా ముందే ఒక మహావీరుడిని బలి ఇవ్వాలి అనే సూచనతో బర్బరీకున్ని బలి ఇస్తారు. యుద్ధం కన్నా ముందే అమరత్వం పొందిన బర్బరీకుడు అన్యాయంగా పాండవుల కుట్రలో బలి అవడం అనే నేపథ్యంలో రాసిన ఈ నాటకం అత్యంత ప్రజాధరణ పొందింది. మొత్తంగా బర్బరీకుడు తనది కాని యుద్ధంలో బలి అయ్యాడు అనే కుట్రను ఈ నాటకం ద్వారా చెబుతాడు. అలా బర్బరీకుడి పాత్రని నాటకీకరించి అనేక నాటక ప్రదర్శనలు చేసిన సౌదా కుల నిర్మూలన గ్రంధాన్ని వర్ణ నిర్మూలనగా తిరగ రాసాడు. నేటికి ఇరవై ఏళ్ళ కింద న్యూ సిలబస్ పేరుతో ఒక ప్రచురణ సంస్థను స్థాపించి అపూర్వ పురాణ కథలు పేరుతో ఒక పుస్తకాన్ని రాసి స్వయంగా ప్రచురించాడు. ఈ గ్రంథ ప్రచురణ వెనక మహారాష్ట్ర కేంద్రంగా బయలుదేరిన బ్లాక్ పాంథర్ ఉద్యమం మొదలు తెలుగు నాట బలంగా మొదలైన నాటి అస్తిత్వ ఉద్యమాల స్ఫూర్తి ఉంది.

కవిత

# మనం మనమేనా..




శీలా సుభద్రాదేవి

హైదరాబాద్ 8106883099


ఇది కొత్తగా విన్నదేమీ కాదు
నిజమే
మనం మనం లోంచి జారిపోయి
చాలా కాలమే అయ్యింది
అమ్మవడిలో విచ్చుకున్న నవ్వులు
నవ్వు నాలుగు విధాల చేటు
అనేమాట వినివిని
ఒక్కొక్క ఏడాదే ఒక్కోరేకూ
వడలి రాలిపోయినప్పుడే
మనం మనంగా కాకుండా పోయాం
మన చిటికెన వేలు పట్టి
కలిసి నడిచిన ఏడడుగులు
ఏళ్ళు గడుస్తున్న కొద్దీ
నడక తడబడుతున్నప్పుడే
మనలోంచి మనం జారి
మనఅడుగులక్రింద మనల్ని
మనమే తొక్కేసుకుంటున్నాం
తర్వాత్తర్వాత
కుటుంబం కోసమో సమాజం కోసమో
సంప్రదాయబంధనాల నడుమ
మనకు నచ్చినా నచ్చక పోయినా
ఒద్దికగా బతికే ప్రయత్నంలో
ఎప్పుడైతే మనలోని మనల్ని
కుబుసంలా విడిచిపెట్టేసి
భద్రముసుగు లోకి ప్రవహించామో
అప్పుడే
మనం మనం కాకుండా పోయాం
మిత్రమా
నువ్వు మాత్రం నువ్వు లాగే
ఉన్నాననుకుంటున్నావా
నీకళ్ళలోంచి జారిన కన్నీరే సుమా
నా కళ్ళని కూడా చెలమలు చేసాయ్

ఈ క్రమంలో అనేక ప్రయోగాత్మక నాటకాలు, కథలు, కవిత్వం దళిత సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. సౌదా రాసిన అపూర్వ పురాణ కథలలో బర్బరీకుడు మహాధన్వుడు అంచల, మాతంగ, జాబాల, చండాలిక, తారక, శూర్పనక, వాలి, భిక్షు, తాడిత, తిత్తిరి, ఊర్మిళ, సీత, కొసరు లాంటి పురాణ పాత్రలను నూతన సామాజిక ఉద్యమాల వెలుగులో పూర్వ పక్షంచేసాడు. వాస్తవానికి పైన పేర్కొన్న ప్రతిపాత్ర చిత్రణకూ దేశి మార్గ రూపాలు ఉన్నట్టే వర్తమాన సాహిత్య సంవాదంలో కూడా దేశవాళీ సామాజిక మార్పులను సంవాదాలను ఆయా పాత్రలకు జోడిస్తూ తిరగ రాసిన ఉదంతాలు తెలుగు సాహిత్యలోకంలో మనం ఎన్నో చూడగలము. పైన పేర్కొన్న అనేక పాత్రలు వంచితులుగా, పరాజితులుగా, రాక్షసులుగా, మనం సాహిత్యంలో చదువుకున్నాము. కానీ రావణున్ని కొలిచే శంభూకున్ని పూజించే ద్రోణుని వ్యతిరేకించే భావాలు వర్తమాన సాహిత్యంలో పురాణ ప్రక్షిప్తాలలో జనపదులు నేటికీ పాడుకుంటూ ఉన్నారు. చరిత్రను విజేతలకోణం నుంచే రాసిన చోట పరాజితుల కోణం నుండి చరిత్రను పరికించడం పూర్వపక్షం చేయడం కేవలం పూర్వకాలం లోనే కాదు నేటికీ కొనసాగుతూ ఉంది. అదే సాహిత్యం యొక్క చలనశీలత చూసే కన్ను ఉండాలే కానీ, ఆ చలన శీలతను భిన్న అస్తిత్వాల రూపాలలో నేటికీ మనం వీక్షించగలము.


ఉపయుక్త గ్రంథసూచీ : సౌదా. అపూర్వ పురాణ కథలు, న్యూ సిలబస్ ప్రచురణలు, హైదరాబాద్, 2001 గుర్రం సీతారాములు (సం) శివసాగర్ కవిత్వం, అన్వీక్షికి ప్రచురణలు, హైదరాబాద్, 2019 ప్రళయన్ ఉప కథలు దళిత నాటకం, హైదరాబాద్ బుక్ ట్రస్టు, హైదరాబాద్, 2000 పి. సత్యవతి (అను) అనేక రామాయణాలు, పునర్నిర్మాణాలు, ప్రతి నిర్మాణాలు–శూర్పణఖ ఉదంతం: హైదరాబాద్ బుక్ ట్రస్ట్ హైదరాబాద్, 2018 ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర. ప్రతిభ పబ్లికేషన్స్ హైదరాబాద్, 2004.

వ్యాసం

# సమాచారాన్వేషణా.. ఓ నైపుణ్యమే..!!



నాంపల్లి సుజాత
కరీంనగర్ 9848059893

భూత భవిష్యత్ వర్తమానాలను విశ్లేషించి విషదీకరించాలంటే మొదట కావలసింది  వాటి పూర్వపరాలే..!

తగిన సమాచారమే లేకుంటే ఏ ముచ్చటని అన్వేషించలేము, ఆవిష్కరించలేము, అడుగు ముందుకు వేయలేము కూడా.

మనకు కావలసిన సమాచారాన్ని రాబట్టుకోవడం కాస్త కష్టతరమైన పనే కానీ,

అసాధ్యమైంది మాత్రం కాదు. మనసుపెట్టి అన్వేషించలే కానీ, ఆకాశపు వైశాల్యాన్ని శిఖరాల ఉన్నతిని అఖాతాల లోతులనూ ఖచ్చితంగా తేల్చి చెప్పొచ్చు.

సమాచారం ఆధారంగానే సకల శాస్త్రాల లోతుల్లోకి సాగిపోవచ్చు, వాటిని మనలోకి ఒంపుకోవచ్చు.

గదిలోని గవాక్షాన్ని  తెరచి,తరచి చూడందే వెలుగు రేఖలు వాటంతటవే నీ దరి చేరవు సేకరించాలనే కుతూహలం, అన్వేషించాలనే తపన, తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండలే గానీ వెయ్యి విధాలుగా విషయసేకరణ చేయొచ్చు.

ప్రశ్నించడం,పరిశీలించడం,ప్రవహించడం, ప్రవేశించడం, మమేకవ్వడం,మనసు పెట్టడం ద్వారా మనకు కావలసిన సమాచారాన్ని అన్వేషించవచ్చు.

చతుష్ షష్టి కళల్లో ఇదీ ఒకటే కాక మనం తప్పక అలవరచుకోవలసిన జీవన నైపుణ్యం కూడా.

అనవసరపు విషయాల్లో తల దూర్చడం తగదు గాని, అవసరమైన సందర్భాల్లో స్పందించకపోవడం, చలించకపోవడం, నీరుగారిపోవడం అస్సలు మంచిది కాదు.

ఈమధ్య జనాల్లో యాంత్రికత పెరిగి తెలుసుకోవాలనే కుతూహలం తగ్గి పోతుంది. మనిషి లోపల సున్నితత్వం కరువై మొండి పారిపోవడం పెరిగిపోతుంది

ఎంతటి భీతావహదృశ్యాలు, గగుర్పాటు చెందే విషాద వార్తలు, కళ్ళముందే గిలగిలా కొట్టుకొని ప్రాణాలు విడిచే సందర్భాలను చూసినప్పటికీ మరు నిమిషానికే మరచిపోతున్నామ్,ఇప్పుడవన్నీ సామాన్యమే అన్నట్టుగా మారిపోయిందీ,దిగజారిపోయింది కాలం.

అన్నట్టు సంపూర్ణ సమాచార పరిజ్ఞానం కొరవడిన అలనాటి యోధుడు అభిమన్యుడు వైరి వర్గాన్ని తిప్పి కొట్టే సత్తా, సామర్థ్యం ఉన్నప్పటికీ యుద్ధభూమి పద్మవ్యూహంలోంచి ఎలా బయటపడాలో తెలియక తికమక పడి తనువు చాలించాడు.

ఎప్పుడు, ఎక్కడ,ఎందుకు,ఎట్లా,ఏమిటి  అనే ప్రాథమిక విషయ సమాచారాన్ని సమకూర్చుకుంటే ఎంతటి కఠిన భావనలైన, కఠోర వాస్తవాలయినా  మెదడులో నిక్షిప్తమవుతాయి. జీవిత పాఠాలైనా, పోటీ పరీక్షలైన ఇట్టే వాటిని దాటి పోతాం!

ఈ మధ్యకాలంలో అన్నీ తెలిసిన వనుకునే మేధావులు సైతం కొన్నింటిని  పట్టించుకోవడం లేదు. డాక్టర్ రాసిచ్చిన మందు బిళ్ళలను తెచ్చుకొని యధాలాపంగా మింగుతున్నారే తప్ప ఆ బిళ్ళలో ఏమేమి కాంపోజిషన్స్ ఉన్నాయి, ఎప్పుడు తయారయ్యింది,ఎక్స్పైరీ డేట్ ఉందా లేదా అనే కనీస విషయాలని పట్టించుకోవడమే కరువైపోయింది.

ఇక కిరాణా షాప్ కెళ్ళినా, కూరగాయల దుకాణం కెళ్ళినా సరుకుల చిట్టి ఇచ్చి బిల్లు కట్టేసి తీసుకెళుతున్నారే తప్ప అవి ఎప్పుడు ప్యాకింగ్ అయ్యాయి దేనికి ఎంత ధర పడుతుంది, వేటి వేటి మిళితంతో ఈ వస్తూత్పత్తి తయారయ్యింది, అదనపు పన్ను ఎంత కడుతున్నాం, సరుకుల మొత్తం ధర సరిగ్గా చేసారా..!?లాంటివి పరిశీలించే ఓపిక తీరిక నశించిపోయింది. దుకాణాదారుపై, అతని క్యాలిక్యులేటర్ పై పూర్తిగా ఆధారపడి మెదడును  స్విచ్చాఫ్ చేస్తున్నారు.

లోకం ఎటు పయనిస్తుంది, మనం మారెటు వెళ్తున్నామనే స్పృహ లేకుండా గడిపేస్తున్నారు కొందరు ఆధారిత జీవులు.

కొత్తవి కనిపెట్టడం సరే, ఉన్న వాటినన్నా కనీస విషయ సమాచారాన్ని తెలుసుకోవాలనే ఉచ్చుకత సన్నగిల్లుతోంది. నలుగురితో నారాయణా అన్నట్లు మసులుకుంటున్నారు. ఓ సృజనాత్మక ఆలోచన, మరో వైవిధ్యం, ఓ వినూత్న ప్రయోగం, ఓ కొత్త ఒరొకడికి నాందీ పలకాలనే ఆలోచన కనిపించడమే లేదు.

రోడ్డు పక్కన ప్రమాదానికి గురై విలవిల్లాడుతున్న ఘటనలను గమనించి కూడా అయ్యో ఏమైంది, సహాయం ఏమైనా చేయాలని ముచ్చట మరిచి వాళ్ళ దారిన వాళ్ళు వెళ్ళిపోతున్నారు.

సూర్యచంద్రులను రాహుకేతువులు మింగాయంటూ.. ఆదిమానవుడు పుట్టించిన అభూత కల్పనలని ఆపై ఆచరించే మూఢ ముచ్చటలనే తు.చ తప్పక పాటిస్తున్నారు తప్ప, అసలు గ్రహణాలు ఎలా, ఎందుకు సంభవిస్తున్నాయనే విషయాలని పరిగనన లోకి తీసుకోకుండా ఆ నీడల క్రీడలపై అంధ విశ్వాసాలని విస్తరింప చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు.

సమాచారం సంగ్రహించే తత్వం కొరబడిన సమాజం క్రమంగా శాస్త్రీయ పరిజ్ఞానం,అవగాహన కొరవడి తిరోగమన దిశగా పయనిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.!

**కవిత**

# అమ్మనడత- మనకుఆత్మబోధ...!



**జి. శాంతారెడ్డి,**
**మహబూబ్ నగర్ - 8008177325.**

గోరు ముద్దపెట్టి కొండంత ప్రేమతో
ఉగ్గుపాలు తాపి ఉయ్యాలూపి
సకల సుఖములందు సఫలత చూపించు
అమ్మనడత మనకు ఆత్మబోధ!

ఇంటివేలుపంటె నిమ్మహి తల్లియే
ఆమెనడతలోనె నలరు గృహము
సకలసంపదలకు సర్వాధికారామె
అమ్మనడత మనకు ఆత్మబోధ!

వాణి లక్ష్మి గిరిజ వాక్సుధారసమును
మేధ కలిగియున్న మేటి తరుణి
అబలకాదు అమ్మ ఆదిపరాశక్తి
అమ్మ నడత మనకు ఆత్మబోధ!

అమ్మ ప్రేమ నిధులు అజరామరమ్ములే
మాత యాది నెపుడు మరువ మెపుడు
తల్లిదండ్రులంటె పుల్లకుసుమములే
అమ్మ నడత మనకు ఆత్మబోధ!

దీవెనలను యిచ్చి దివ్యపథము చూపు
భవ్యగుణములిచ్చి బాట నడుపు
జగతి యశము నిల్పు శక్తినిచ్చునుతల్లి
అమ్మనడత మనకు ఆత్మబోధ!

పూర్వ జన్మపుణ్య పూజాఫలంబేమొ
అమ్మ కడుపు నుండి అవనిలోకి
అడుగిడితిమి నాన్న యంశగా ధరలోన
అమ్మనడత మనకు ఆత్మబోధ!

జననమరణమందు చైతన్యరూపమై
తనదు బిడ్డలకును దైవమయ్యి
లేమి నెరుగకుండ లీలగా పెంచును
అమ్మ నడత మనకు ఆత్మబోధ!

మనదు కళ్ళముందు మనయమ్మ నడయాడు
మనసు గదిని సతము మసలు చుండు
అమ్మ ప్రేమ మరువ అవనికసాధ్యము
అమ్మ నడత మనకు ఆత్మబోధ!

అమ్మ తీపి తెలుపు అక్షరాలే లేవు
ఆది శక్తి కన్న అమ్మే మిన్న
ఆమె త్యాగజగతి కవధులే ఉండవు
అమ్మ నడత మనకు ఆత్మ బోధ!

అమ్మతనము మనకు నాత్మీయ బంధము
నాన్న ప్రేమ యన్న నాక సమము
కాపురంబులోన కనిపించు ప్రేమలు
అమ్మనడత మనకు ఆత్మబోధ!

అమ్మ నాన్న లిచ్చు ఆశీస్సులే ధనం
సకల శుభము లిచ్చు స్వర్గసీమ
ఎల్లవేళలందు యెదను పలకరించు
అమ్మనడత మనకు ఆత్మబోధ!

పుడమిలోన నమ్మ పూజనీయంబౌను
తోడునీడగుండి నడుపునాన్న
కన్నపిల్లలమ్మ కంటిలో పాపలే
అమ్మనడత మనకు ఆత్మబోధ!

అమ్మఋణము దీర్చుట వనిసాధ్యము కాదు
గుండెలోన నిలుపుకొంటె తప్ప
అమ్మ ఋణము తీర్చ అమ్మలై పుట్టాలి
అమ్మనడత మనకు ఆత్మబోధ!!

వ్యాసం

# స్మృత్యంజలి

- అనంచిన్ని వెంకటేశ్వరరావు

హైదరాబాద్ 9440000009




**కామ్రేడ్ అమ్మ వస్తోంది.. కన్నీళ్లు తుడవరా.! ఎదురుచూపులే జీవితం కాళ్ళు మొక్కిన కలెక్టరమ్మ పోరుబాటలో కొడుకులు పూరి గుడెసెలో జీవనం అన్నీ 'చావు' దెబ్బలే.! లక్ష మెదళ్ళను కదిలించిన లేఖ**

తెలంగాణలో తల్లుల దర్పణ ముఖచిత్రం అదృశ్యమైయింది. ఓ తెలంగాణ తల్లి కానరాని లోకాలకు తరలిపోయింది. భర్త పోరాటానికి సన్మానం. కొడుకుల పోరాటానికి 'ఎన్ కౌంటర్స్' బహుమానం. ఎవరీ పెద్దపల్లి పెద్దవ్వ.. మల్లోజుల మధురవ్వ.. వాళ్లింటి పేరు పోరాటం..!

**ఎవరీమె..**

మధురమ్మ చనిపోయిందట.. ఎవరామె..? ఎందుకింతగా చెప్పుకుంటున్నారు..? పెద్దపల్లి పెద్దవ్వగా ఆ ప్రాంతం వాళ్లందరికీ పరిచయమే.! అసలు ఆమె కథే ఓ సంక్లిష్ట ముఖచిత్రం. నక్సలైట్ల ఉద్యమంలో 'తెగిన పేగులు బోలెడు.. పుస్తె పోగులు బోలెడు..' కన్నీళ్లు, అడవుల బాట పట్టిన కొడుకో, పెనిమిటో ఒక్కసారి 'వచ్చిపోతే' బాగుండననే ఎదురుచూపులు..! ఇవన్నీ ఎంత చెప్పుకున్నా ఒడవవు, తెగవు.! ఎందుకంటే తెలంగాణలో ప్రతి అమ్మది కనిపించని పోరాటమే.! కానీ మధురమ్మది కాస్త భిన్నమైన విచిత్ర అనుభవం.!

**ఎదురుచూపులే జీవితం**

నూరేళ్ల జీవితమంతా ఆమెకు కూడా ఎదురుచూపులే..! ఎప్పుడో పేగు కదిలినట్టు అనిపిస్తే 'ఏడుపులు..' ఇక'ఎవరూ రారు' అని మళ్లీ మనసు నిమ్మలం చేసుకుని ముసుగు తన్ని పడుకోవడం.! ఈమె ఎవరంటే మావోయిస్ట్ పార్టీ అగ్రనేతలైన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ, మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ భూపతిల తల్లి. ఆమె మంగళవారం కన్నుమూసింది. ఇదీ వార్త. ఆమె గురించి తెలిసినవాళ్లకు ఓ విషాదం.!

**భర్త వెంకటయ్య పోరాటం**

అప్పట్లో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం. భర్త వెంకటయ్య రజాకార్లతో పోరాడుతున్న సందర్భంలో భర్త కోసం రజాకార్లు వచ్చి వేధించేవాళ్లు. ఓరకమైన నిర్బంధం, ఆమె మీద నిఘా.! రాజ్యానికి వ్యతిరేకంగా సాగిన రెండురకాల పోరాటాల్లో ఆమె వేదన ఉంది. ఆవేదన ఉంది. భిన్నమైన అనుభవముంది. ఆమె పడిన కష్టముంది... అవమానాలున్నయ్.!

**కాళ్ళు మొక్కిన కలెక్టరమ్మ**

ఆనాడు అవస్థలపాలైనా స్వాతంత్ర్య సమరయోధుడి భార్యగా ప్రభుత్వం నుంచి సన్మానం అందుకుంది.! ప్రతి గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాన గౌరవాన్ని పొందుతూనే ఉంది. ఆమధ్య నాలుగేళ్ల క్రితం కావచ్చు పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన మధురమ్మకు 'పాదాభివందనం' కూడా చేసింది. ఇంతా చేస్తే ఆమె భర్త రాజ్యానికి, అనగా అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినవాడే.

**పోరుబాటలో కొడుకులు**

కట్ చేస్తే... తొలి ముగ్గురు తనకు దక్కకుండా కన్నుమూశారు. ఆ తరువాత పుట్టిన కొడుకులు అడవి బాట పట్టారు. నక్సలైట్లయ్యారు.! ఉద్యమానికి నేతలయ్యారు.! కేంద్ర కమిటీ సభ్యులుగా ఎదిగారు. వాళ్లు కూడా రాజ్యానికి వ్యతిరేకంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నవాళ్లే.! తండ్రి నెత్తురే.! వాళ్ల ఆచూకీ కోసం మధురమ్మను పోలీసులు అనేకసార్లు వేధించారు.! సేమ్,

అప్పట్లో రజాకార్లు వేధించినట్టుగానే.! ఆమె జీవితంలో వ్యక్తులు మారారు..కాని సమస్యలు మాత్రం మారలేదనేది నడుస్తున్న చరిత్రకు నిదర్శనం.

**పూరి గుడిసెలో..**

ఆ ఇద్దరి ఆచూకీ కోసం తల్లి, తండ్రి, సోదరుడైనా ఆంజనేయ శర్మకు వేధింపులు తప్పలేదు. వాళ్ల సోదరుడు అక్కడే పౌరోహిత్యం చేసుకుంటాడు. 1987లో డీఎస్పీ బుచ్చిరెడ్డి హత్య జరిగింది. ప్రతీకారంగా పోలీసులు వందల ఇళ్లను కూల్చేశారు. అందులో మధురమ్మ ఇల్లు కూడా కూలిపోయింది. దాంతో నాలుగైదేళ్లు ఓ పూరి గుడిసే దిక్కయింది ఆమెకు.!

**అన్నీ 'చావు' దెబ్బలే.!**

అగ్రస్థానాల్లో ఉన్న నక్సలైట్లు ఎవరినైనా చూడటానికి రావాలంటే ఎంత కష్టమో ఆమెకు తెలుసు. ఎక్కడున్నా సరే క్షేమంగా ఉంటే చాలు అనుకుంది. కానీ పెద్ద కొడుకు కోటేశ్వరరావు 2011లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. ఆమె కుంగిపోయింది. చిన్న కొడుకైనా బాగుంటే చాలు అనుకుంది. సహజం కదా..! అదే తెలంగాణ తల్లుల అనుభవం కదా.!

**లక్ష మెదళ్ళను కదిలించిన లేఖ**

ఆ సోదరులు ఓసారి అమ్మకు బహిరంగ లేఖ రాశారు. ''అమ్మా, మమ్ముల కన్నందుకు నీకు విప్లవ వందనాలు.. కోట్లాది మంది తల్లుల కన్నీళ్లు తుడవడానికి మేం ఈ విప్లవబాట ఎంచుకున్నాం, తిరుగుబాటు నాన్న రక్తం నుంచే వచ్చింది..''_ ఇలా సాగిపోయింది ఆ లేఖ..! అప్పట్లో ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాల్లో ఆ లేఖ లక్షలమందిని చదివించింది.! కదిలించింది. దాదాపు నూరేళ్లు బతికిన ఆమె ఇక జీవనాన్ని చాలించింది. మంగళవారం కన్నుమూసింది.

**చివరిగా...**

కిషన్‌జీ, స్వర్గానికి అమ్మ వస్తోంది, ఇప్పుడైనా కళ్లారా చూసి, ఆమె కన్నీటిని తుడువు కామ్రేడ్..!

(అనంచిన్ని వెంకటేశ్వరరావు, పరిశోధన పాత్రికేయులు సౌజన్యంతో మధురమ్మ స్మృత్యంజలి)

**కవిత**

# ఓరి ధూర్తులార...!



**చింతోజు పద్మావతి,**
**మహబూబ్ నగర్, 9014796138**

మనిషిలోన యిపుడు మనిషిలేనేలేడు
కామబుద్ధి తోడ కదలుచుండు
శిశువులనె నెనరు శిరమున లేదుగా
చూపులన్ని కామ కోర్కెలేను!

వావి వరుసలన్ని వాంఛతో చెడెనుగ
ఆడవారి పట్ల అలుసు నెపుడు
పురుష పుంగవుండు పూర్తిగా  చెడెనుగ
భయపడక పాడు పనులు చేయు!

ప్రేమకొరకు కామి ఫేర్మిని మార్చియు
దారిగాచి చూస్తు దారుణముగ
కత్తితోడ తాను కంఠాన్ని బట్టియు
వ్రేటు వేసి చంపు వేటగాడు!

మాయమాటలన్ని మచ్చిక తోచెప్పి
నమ్మకంబు తోడ నమ్మ బలికి
పిల్లగడ్డి కిలను పిలుపు రమ్మంచుచూ
మానప్రాణములను మరిగిచంపు!

బాలయువతిప్రౌఢ పడతులని గనక
మదము మీర మనిషి మారి పోయి
కఠిన కామమొంది కాటువేసిచెరచి
కడకు చంపివేసె కర్కశుండు!

నీకు జన్మనిచ్చు నిజముగ స్త్రీమూర్తి
అక్క చెల్లెలిలను ఆడవారె
అట్టివారి పైన అవమాన భంగమ్ము
చేయబూను చేష్ట చెడ్డ తనము!

ఓరిధూర్తులార! ఓపికగ వినండి
మీకులేర సుతలు మేది నందు
చేతులెట్లు వచ్చె చెరచి బాలలనిల
పాపభీతి లేని పాపులార!

కఠిన చట్టములను కదులెస్సగాదెచ్చి
మానభంగములకు మరిగినట్టి
రాక్షసగుణముగల రాబందు మనుషుల
కరుణ జాలి లేక ఖనన మివ్వు!!

వ్యాసం

# బొట్టు భోజనాలు కథలో దళిత స్త్రీ మానసిక స్థితి



- డా. పసుపులేటి నాగమల్లిక
రామచంద్రపురం 7981364632

మన దేశంలో అనాదిగా బొట్టు అనేది సంస్కృతీ సంప్రదాయాలకు మతానికి సంకేతంగా నిలుస్తుంది. నిలువు బొట్టు, అడ్డబొట్టులు హిందూ మతంలో రెండు పార్శ్వాలైతే, సింధూరం, విభూతి, కుంకుమలు రంగుల మూలంగా వేరు వేరు రకాల దేవుళ్ళకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఆడైనా, మగైనా, పిల్లలైనా, పెద్దలైన హిందువులైతే మాత్రం ఏదో ఒక సందర్భం మరిచిపోతారేమో కానీ బొట్టులేకుండా బయట తిరగరు. ఆ బొట్టును బట్టి వాళ్ళు ఏ మతం వారో ఇట్టే తెలిసిపోతుంది. బొట్టును అన్ని కులాలవాళ్ళు పెట్టుకున్నా, హిందూ మంతం దళితుల్ని దూరంగా పెట్టడం, ఆ కాలనుక్రమంలో ఆంగ్లేయులు ఇండియా వచ్చినప్పుడు దళితుల్ని చేరదీయడం, చదువు సంధ్యలు చెప్పించడం, దళితుల్ని, మనుషులుగా అక్కున చేర్చు కోవడం వల్ల వారు ఆంగ్లేయుల క్రైస్తవమతం పట్ల ఆకర్షితులై, ఆ మతాచారం ప్రకారం బొట్టు లేకుండా ఖాళీ నుదురుతో ఉండడం అలవాటు చేసుకోవడం జరిగింది.

సాధారణంగా దళితులు పేదవారు కాబట్టి చెవులకు గానీ ముక్కులకు గానీ ఆభరణాలు లేక బోసిగా ఉండడంతో బొట్టు లేకుండా ఖాళీ నుదురుతో ఎవరైన స్త్రీలు కనిపిస్తే వారు దళితులేమోననే అనుమానంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వివక్షకు గురి అవుతున్నారు. దీనిని ఎదుర్కొనే వారికి మాత్రమే తప్ప వివక్ష చూపేవారికి,ఎరగని వారికి ఆ బాధ, ఆ ఆవేదన, ఎన్నటికీ అర్థం కాదు. బొట్టులేని మొహాలతో దళిత క్రైస్తవులు పడే అవమానాలనూ, పోగొట్టుకునే అవకాశాలను అక్షరబద్ధం చేసారు ప్రముఖ వర్ధమాన రచయిత్రి మానస ఎండ్లూరి.

ఈమె ప్రసిద్ధ కవి, రచయిత, ఆచార్య ఎండ్లూరి సుధాకర్, పుట్ల హేమలత దంపతులకు జన్మించారు. మానస నిబద్ధత కలిగిన రచయిత్రి, కథలు తక్కువే అయినా విషయంలో మంచి సామాజిక స్పృహ ఉంది, నేటి డిజిటల్ ఆధునిక యుగంలో 22 కథలని రాసిన మేటి కథా రచయిత్రి. అవి వివిధ పత్రికల్లో ప్రచురించబడి 'మిళింద' అనే కథా సంపుటంగా 2018 ఏప్రిల్లో పాఠక సమాజానికి అందించారు. వాటిలో బొట్టు ప్రాధాన్యత గల బొట్టు, దొంగబొట్టు, బొట్టుగుర్తు, బొట్టుకుక్క మొదలగు బొట్టు కథల్లో బొట్టు భోజనాలు కథలో దళిత స్త్రీ పడిన మానసిక సంఘర్షణని మానస గారు కళ్లకు కట్టినట్లు చూపించారు.

ఈ కథలో కథకురాలు విద్యావంతురాలైన, స్థితిమంతురాలైనా, కలుపుకోలు మనిషైనా దళితురాలుగానే పరిగణిస్తారు. ఈమె ఓ కళాశాలలో లెక్చరర్. వాళ్ళ డిపార్టుమెంట్లో స్టాఫ్ కలివిడిగానే మాట్లాడుకుంటారు. కానీ వాళ్ళంతా హిందువులు, కథకురాలు వచ్చాక వారు కొంత కలవరపాటుకు గురౌతారు. కథకురాలు క్రైస్తవ కుటుంబం నుండి రావడంతో బొట్టు పెట్టుకోకపోతే ఓ టీచర్ అడుగుతుంది. మీరు క్రైస్తవులు కదా అంటే ఏం ముస్లింలు అవ్వచ్చు కదా అని తిరిగి ప్రశ్నిస్తుంది కథకురాలు. దానికి ఆ టీచర్ ఆ మాత్రం తెలియదా అని అనడంతో కథకురాలు మనస్సు చివుక్కుమంటుంది. స్టాఫ్ వాళ్ళందరి ఇళ్ళలోని తినుబండారాలు గానీ, కూరలుగానీ ప్రసాదాలు గానీ అందరూ పంచుకుని తింటారు.

కథకురాలు తాను దళితురాలిననే భావన ఎప్పుడు కలుగుతుందంటే కథకురాల్ని పిలవకుండా మిగతా స్టాఫ్ వాళ్ళంతా కార్తీకమాస వన భోజనాలకు వెళ్తారు. ఆ విషయం తెలియక కథకురాలు ఒక్కతే కళాశాలకు వచ్చి స్టాఫ్ లో ఏ ఒక్కరూ కనిపించక, ఎప్పుడూ కనిపించని ఆయా కనబడడంతో వెళ్ళి విషయం కనుక్కుంటుంది. అందుకు ఆమె ఇలా అంటుంది 'మిమ్మల్ని ఎలా పిలుస్తారమ్మా

వాళ్ళంతా అగ్రవర్ణాలు, మీరు మాదిగ కదా అందుకే పిలవరని అనడంతో కథకురాలు మనసులో వేదన చెందుతుంటుంది. ఆ వన భోజనాల నుంచి ఆయా మార్తమ్మ మాటలను మరలాలని తన మానాభిమానాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఇలా అంటుంది'. వన భోజనం అంటుంటే చిన్నప్పుడు దానవాయిపేట అన్నపూర్ణ మెస్ 'బుట్ట భోజనం' దొరికేది, అది గుర్తొస్తుంది మారమ్మా? అని కథకురాలు అంటే మార్తమ్మా ఇలా చమత్కరిస్తుంది "అయ్యి బుట్ట భోజనాలైతే ఇయ్యి బొట్టు భోజనాలమ్మా" అని తన అసహాయతను, చేతకానితనాన్ని అదొక రకమైన నవ్వుతో అంటుంది. కథకురాలు బయటపడలేక మనస్సులో ఆ విషయం పట్ల బాధపడుతూ ఒక స్త్రీ పురుష సమాజంలోనే కాదు దళిత స్త్రీగా జన్మించడం వల్ల సాటి స్త్రీల చేత కూడా ఇలా అవమానం పొందవలసిన స్థితిని భరించలేక పోతుంది.

మరుసటి రోజు స్టాప్ వారందరూ యథాలాపంగా నవ్వుతూనే కనిపిస్తారు కానీ ఎక్కడా తోటి సహోపాధ్యాయిని పిలవలేదనే బాధగానీ, భావంగానీ కనిపించదు వాళ్ళ కళ్ళల్లో కానీ వివక్షగాయం తగిలిన కథకురాలు మాత్రం మౌనంగా ఉంటూ తన స్థానాన్ని గుర్తు చేసినందుకు మనస్సులో బాధను అనుభవిస్తూ ఉంటుంది. కాలం గాయాన్ని, మనుషుల మధ్య దూరాన్ని మాన్పుతుంది. ఈలోగా క్రిస్మస్ పండుగ నెల ప్రారంభం కావడంతో కథకురాలు ఇంట్లో ఆ పండగ వాతావరణంతో నిండిపోతుంది. దాంతో ఇంట్లో చేసిన తినుబండారాల్ని తన స్టాప్ వాళ్ళందరికి తీసుకెళ్ళి సంతోషంతో  ఇవ్వబోయే సరికి 'కార్తీకమాసం ఉపవాస'మని సున్నితంగా తిరస్కరిస్తారు. కానీ కార్తీక మాసం ఎప్పుడో ముగిసిపోయిందని, కేవలం తాను దళితురాలైనందునే తాను తెచ్చిన పదార్థాలను తీసుకోవడం లేదన్న సంగతి గ్రహించి కుమిలిపోతుంది. క్రిస్మస్ పండుగ రోజు మాత్రం స్టాఫ్ వారందరూ క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్తారు. విషెష్ చెప్పిన స్టాప్ వాళ్ళందర్నీ ఆ రాత్రి పండుగ విందుకు ఆహ్వానిస్తుంది. వాళ్ళు వస్తామంటారు దాంతో తన స్టాఫ్ వాళ్ళంతా వస్తారనే ఆనందంతో చికెన్, మటన్ బిర్యానీ, గోంగూరా మాంసం, గాయత్రిమేడం బ్రాహ్మణురాలైనందున ఆమెకు ప్రత్యేకంగా కందాబచ్చలి, పనసపొట్టుకూర వంటి వంటకాలన్నీ తయారు చేయించి డైనింగ్ టేబుల్ మీద పెట్టి స్టాఫ్ కోసం వేచిచూస్తూ ఫోన్లు చేస్తూ వుంటుంది. కానీ ఏ ఒక్కరూ రాత్రి పది అవుతున్నా రాకపోయే సరికి ఓ నిశ్చయానికి వచ్చేస్తుంది ఆ కథకురాలు. వారి దృష్టిలో తాను ఎప్పటికీ దళితురాలినే అని తన మనసుకి చెప్పుకుంటుంది. సహ ఉపాధ్యాయులని అరులుచాచక, తన అవసరం ఎవరికుందో వాళ్ళే నావారని దృఢ నిశ్చయానికి వచ్చేసి తను తయారుచేయించిన వంటలన్నీ మూడు బుట్టల్లో సర్దించి ఆయా మార్తమ్మ ఇంటికి ప్రయాణం అవుతుంది.

మార్తమ్మ ఇల్లు వెదుకుతూ వెళ్ళి చూసేసరికి మార్తమ్మకి తింటానికి తిండిలేక ఖాళీ కడుపుతో నేలమీద పడుకోవడం గమనించి, లేపి తను పట్టుకెళ్ళిన మూడు బుట్టల్లో ఒక బుట్టను అందిస్తుంది కథకురాలు. దానికి మార్తమ్మ మహదానంద పడిపోతూ ఇలా అంటుంది. "పొద్దుట్నుంచీ ఏమీ తినలేదమ్మా! చర్చిలో రెండు కేకు ముక్కలు, ఒక చాక్లెట్లు, అరటిపండు ఇచ్చారు. అయ్యి కూడా చర్చి బయట అడుక్కునే వోళ్ళకిచ్చేశాను. నీరసంగా ఉండి పడుకునేసరికి నిద్రపట్టేసింది. నా మొర ఆలకించి ఆ ప్రభువే మిమ్మల్ని పంపారమ్మా'' అనడం బట్టి కలిగి వున్నవారు రాలేదనే బాధ కన్నా పేద వారికి, అందులోనూ ఆకలితో వున్నవారికి పెట్టి వాళ్ళ ఆనందంలో,మన ఆనందాన్ని వెదుక్కోవాలన్న రచయిత్రి అభిప్రాయం వ్యక్తమవుతుంది.ఈ కథలో విద్యావంతురాలైన దళిత స్త్రీ తోటి వారితోనే వివక్షను ఎదుర్కొంటే ఒక  సాధారణ దళిత స్త్రీ ఈ సమాజంలో ఇంకేంత వివక్షను ఎదుర్కొంటూ మానసిక వేదన అనుభవిస్తున్నదో మనమే ఆలోచించాలి.

దళితులంటే విలువ లేకుండా చూసే ఈ భారతదేశంలో బొట్టు పెట్టుకోకపోతే మేమే దళితులమని, స్పష్టంగా తెలుస్తుంది. బొట్టు ఒక సింబల్గా మారిపోయినందువల్ల  ఈ కథ లోని పాత్రలు సందర్భానుసారంగా వెల్లడిచేయడం జరిగింది. బొట్టు భౌతికపరమైందని, మనసు ఆంతరంగికమైనది. బొట్టు కంటే మనస్సే ప్రధానమని, కులంకంటే గుణమే చూడదగ్గదని, దళిత స్త్రీ పడే మానసిక స్థితిని, కడుపు నిండిన వాడికి పెట్టేకన్న ఆకలితో ఉండే వాని ఆకలి తీర్చాలని వంటి సామాజికపరమైన అంశాలు తెలియజేస్తూ సామాజిక స్పృహ కలిగించే విధంగా కథని మానస ఎండ్లూరి రాశారని చెప్పవచ్చు. మానవత్వపు విలువలతో సాటి మనిషికి గౌరవ మర్యాదలు ఇవ్వాలని విబేధాల్ని మరిచి మనుగడ సాగించాలని కోరుకుందాము.

వ్యాసం

# ఆడపిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలకు చరమగీతం ఎప్పుడు?



**జయంతి వాసరచెట్ల రచయిత్రి**

**హైదరాబాద్ 9985525355**

స్త్రీ మరియు బాలికా శిశువుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలను తెచ్చింది. ఎన్ని చట్టాలు తెచ్చినా వాటి వల్ల పీడితులకు రక్షణ లేకుండా పోతుంది. మారుమూల పరిసర ప్రాంతాల్లోనూ స్త్రీలు, బాలికలు వేధింపులకు గురవుతూనే ఉన్నారు.

"స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం" అనే వాక్యం గోడలపై రాతల వరకే పరిమితం అయ్యింది. గత రెండు సంవత్సరాలుగా లాక్డౌన్ కారణంగా మహిళలపై బాలికలపై అత్యాచారాలు వేధింపులు జరిగాయనే వార్తలు తగ్గాయనే చెప్పాలి.

కానీ లాక్డౌన్ ఎత్తివేసిన తర్వాత పాఠశాలలు యధావిధిగా నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాల పాటుగా మూసివున్న ఆయా పాఠశాలలు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరుగకుండానే తెరిచారు. లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు కనీస వసతులు కూడా కల్పించడం లేదని తెలుస్తుంది. పాఠశాలలు పునఃప్రారంభం జరిగిన తర్వాత విద్యాశాఖాధికారి ఆయా పాఠశాలల పనితీరును పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అలాగే పాఠశాల యాజమాన్యం పాఠశాల పనితీరు వసతుల కల్పన తదితర అంశాలను శ్రద్ధగా పర్యవేక్షణ చేయాలి. పెద్దపేరుప్రఖ్యాతులు ఉన్న పాఠశాల అయినా ఈ విషయం వారి ముందస్తు బాధ్యతగా చేయాల్సి ఉంటుంది.

అక్టోబర్ 17న బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 లోని ఒక పబ్లిక్ స్కూల్ లో జరిగిన సంఘటన పేరుకు మాత్రమే పెద్ద స్కూల్ కానీ నిఘా విషయంలో శూన్యం అని మనకు తెలియజేస్తుంది.

★తల్లిదండ్రులు చెప్పిన విషయాలన్నీ విన్న తర్వాత వారి మాటలు లాయర్ కు నమ్మసక్యంగా అనిపించక పాప తో మాట్లాడాలి అని పాపను తీసుకుని రమ్మన్నాడు. పాపను దగ్గర కూర్చోబెట్టుకుని మెల్లిగా అడుగుతే ఒక్కొక్క విషయం వివరంగా వచ్చి రాని భాషలో చెప్పసాగింది.పాప చెప్పిన విషయాలను వీడియో తీసుకున్నాడు లాయర్.

వెంటనే 100 కి డయల్ చేసి పోలీస్ రిపోర్ట్ ఇచ్చారు. పోలీసులు పాపను భరోసా కేంద్రానికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించి పాపపై దాడి నిజమేనని నిర్ధారణ చేసుకున్నాక రజినీ కుమార్ ను పోక్సో యాక్ట్ మరియుipc సెక్షన్ ల కింద అరెస్టు చేసారు. తర్వాత ప్రిన్సిపాల్ ఎస్ .మాధవి ని ఆమె నిర్లక్ష్యం కారణంగా ఇదంతా జరిగిందని ఆమెను కూడా అరెస్టు చేశారు.

ఇక్కడ లాయర్ ప్రదర్శించిన చాకచక్యం మెచ్చుకుని తీరాలి. స్కూల్ లో 18 సిసి కెమేరా లు ఉండగా ప్రిన్సిపాల్ రూం ఎదురుగా ఉండే 3 కెమేరాలు పనిచేయడం లేదు. అందువల్ల అతడే చేసాడని నిర్దారణ కొరకు ఆధారాలు లేకపోవడం తో పాప ఆ వ్యక్తిని గుర్తించడం వల్ల ఆధారం కీలకంగా మారి బలపడింది. అదే విషయాన్ని రికార్డు చేసి పెట్టుకున్నాడు లాయర్.

ఈ సమయంలో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం

వారికి పెళ్లి జరిగిన తొమ్మిది సంవత్సరాలు అయినా పిల్లలు కాకపోతే ఎన్నో ఆసుపత్రులు తిరిగిన తర్వాత జన్మించిన ఆ బిడ్డల్ని మంచి స్కూల్ లో జాయిన్ చేయాలని ఎన్నో కలలతో ఈ స్కూల్లో జాయిన్ చేసినందుకా నాకు ఈ శిక్ష అంటూ గుండెలవిసేలా ఏడుస్తుంటే చూసేవాళ్ళ హృదయం కన్నీరైపోతుంది.

నిందితుడిని పోలీసులు అరెస్టు చేసే సమయంలో ప్రిన్సిపల్ మాధవి డ్రైవర్ను ఉద్దేశించి నిన్ను రెండు గంటల్లో విడిపించి తీసుకుని వస్తాను ఏమీ భయపడకు అని అతడికి హామీ ఇవ్వడం ప్రిన్సిపల్ మాటతీరు లో డొల్లతనం కనిపిస్తుంది. డి ఏవి స్కూల్ రీజనల్ హెడ్ పార్థివన్ ను ప్రశ్నిస్తే అతనూ వాళ్లని మరో బ్రాంచ్ కు ట్రాన్స్ఫర్ చేస్తామని సమాధానం చెబుతున్నాడు. వారి పాఠశాలల యొక్క రెప్యుటేషన్ ను కాపాడుకునే ప్రయత్నమే చేస్తున్నట్లుగా అతని మాటలను బట్టి తెలుస్తోంది. ఇక్కడ పాప తల్లిదండ్రులకు మొదటి నుండి అండగా నిలబడిన సుమన్ టీవీ యాంకర్ నిరుపను మెచ్చుకోవాలి. మొదటనే స్పందించి అండగా నిలబడి వారి వెంటే నడుస్తూ ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నారు. పాప తల్లిదండ్రులను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలిసి జరిగిన విషయం ఆమె దృష్టి కి తెచ్చారు.వెంటనే స్పందించిన ఇంద్రారెడ్డి గారు పాఠశాల గుర్తింపును రద్దు చేసి పాఠశాలలోని పిల్లలందరినీ వేరే స్కూల్లో

అడ్జస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అలాగే విద్యాశాఖ కార్యదర్శి నేతృత్వంలో విద్యా శాఖ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ,తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగంలో పనిచేస్తున్న డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ర్యాంకు పోలీసు అధికారి తో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసి నిబంధనలతో కూడిన ఒక జీ.వో జారీ చేశారు.

ఇలాంటి కౄరమైన నేరాలను నిరాకరించడానికి మరియు భద్రతకు భరోసా ఇవ్వడానికి తప్పనిసరిగా చర్యలను సూచిస్తూ కమిటీ వారంరోజులుగా తన నివేదికను సమర్పించాలని కోరింది.

★స్కూల్ గుర్తింపు రద్దు చేయడం ఎంతవరకు సమంజసం...?

పాఠశాల గుర్తింపు ను రద్దు చేసి పిల్లలను మరో పాఠశాలకు తరలించడం వల్ల విద్యా సంవత్సరం నష్టపోవడమే కాక కొత్త పరిస్థితులకు అలవాటు పడడానికి చాలా సమయం పడుతుంది. అదీకాక వీరిది సి.బి.ఎస్ .సి సబ్జెక్టులు కాబట్టి మిగతా పాఠశాల ల సిలబస్ కు వీరి సిలబస్ చాలా వ్యత్యాసం ఉంటుంది. అలాంటి పాఠశాలలు తక్కువ గా ఉన్నాయి. కాబట్టి పాఠశాల ను మూసివేసే బదులుగా యాజమాన్యాన్ని మార్చి ఇప్పుడున్న టీచర్లతో పాఠశాలను నడిపిస్తే బాగుంటుంది.

★ఈ ఒక్క సంఘటన నే నా ఇంకా ఎవరిపైనైనా ఇలాంటిది జరిగిందా? ఆ పాఠశాలలోని మరో 25 మంది పిల్లలపై నా అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని తల్లిదండ్రులు గోప్యంగా ఉంచుతున్నారని సమాచారం.

★ఈ సంఘటన పై ఇంకా ఎవరైనా స్పందించారా?

ఈ విషయం పై మొదటి సారి సినిమా డైరెక్టర్ శేఖర్ కమ్ముల స్పందించి పాపతల్లిదండ్రులకు మద్దతు తెలిపాడు. తమ్మారెడ్డి భరద్వాజ పాప తల్లిదండ్రులను పరామర్శించారు. చిరంజీవి స్పందిస్తూ.. "ఆటవిక సంస్కృతి నుంచి ఆనవాళ్ళు మోసుకొస్తున్న కొందరు మృగాళ్ళ వికృత చేష్టలకు కఠిన శిక్షలు విధించడమే సరైన చర్య" అని అన్నారు.

అలాగే మొదటినుంచీ పాప తల్లిదండ్రులకు అన్నివిధాలా ధైర్యం ఇస్తూ కేసు ముందుకు వెళ్ళే విధంగా అన్నివేళలా తన మద్దతు ఇస్తున్న లాయర్ విజయకాంత్ మరియు సుమన్ టీవి యాంకర్ నిరుపమ పాప తల్లిదండ్రులకు అండగా ఉంటున్నారు.

ముగింపు:-

శిశువు పుట్టిన తర్వాత పెరుగుతున్న క్రమంలో పరిసరాల విజ్ఞానం తో పాటు సామాజిక పరిజ్ఞానం కూడా చాలా అవసరం.

తల్లి పొత్తిళ్ళ నుండి మరో ప్రపంచంలోకి పెట్టే మొదటి అడుగు పాఠశాల.

తల్లిదండ్రుల దగ్గర ఎంత సురక్షితంగా ఉంటారో అంతే సురక్షితముగా ఉండగలిగే స్థలం పాఠశాల. ఇక్కడే శిశువు వారిదైన ఒక స్వేచ్ఛాయుత ప్రపంచాన్ని ఏర్పర్చుకొని విద్యను అభ్యసిస్తూ వ్యక్తిత్వ రూప కల్పన చేసుకుంటాడు. ఈ దశనే మనో విజ్ఞాన శాస్త్రంలో పూర్వ బాల్య దశ అంటారు.

ఈ పూర్వ బాల్య దశలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు ఎదురైనా ఆ సంఘటన తాలూకు విషయాన్ని జీవితాంతం వాళ్ల మానసిక ఎదుగుదలకు ఆటంకంగా నిలుస్తుంది.

అలాంటిదే ఈ సంఘటన కాబట్టి ఆ పాప తల్లిదండ్రులకు త్వరితగతిన న్యాయం చేకూరాలని ఎక్కువ సంఖ్యలో ప్రజలు మద్దతు తెల్పి దోషికి కఠిన శిక్ష పడేలా చూడాలి.

★ఎలాంటిది చెడు స్పర్శ ...!

ఆడపిల్ల లకు మంచి స్పర్శ చెడు స్పర్శ గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బోధించాలి.

తలపై కానీ భుజాలపై గానీ,తొడల భాగంలో కానీ ఎవరైనా ముట్టుకున్నట్లైతే వద్దని చెప్పేవిధం గా పిల్లలకు నేర్పించాలి.

★పాఠశాలలో పిల్లలను జాయిన్ చేసేముందు కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుని వెళ్ళాలి. ఒక క్లాస్ రూం లో ఎంత మంది పిల్లలను కూర్చోబెడతారు? ఎంత మంది పిల్లలకు ఎంతమంది టీచర్స్ ఉంటారు. పాఠశాలలో సి.సి కెమెరాలు ఉన్నాయా? ఎంతవరకు అవి బాగా పనిచేస్తున్నాయి. స్కూల్ బస్ ల కండీషన్ ఎలా ఉంది? డ్రైవర్ ల ప్రవర్తన ఎలా ఉంటుంది. పిల్లల విషయంలో ఎలాంటి యాక్టివిటీస్ ఉంటాయి? ఆయాలు ఎంతమంది ఉన్నారు? పాఠశాలలో ని ఉపాధ్యాయులు మరియు ప్రిన్సిపాల్ తో సహా అందరూ టీచర్ ట్రైనింగ్ చేసారా?

మనదగ్గర వసూలు చేస్తున్న ఫీజులకు తగినట్లుగా వసతులు కల్పిస్తున్నారా?

పై విషయాలు దృష్టిలో ఉంచుకుని పాఠశాల కు వెళ్తే తల్లిదండ్రులకు కొంతలో కొంత అవగాహనతో పరిసరాలు గమనించడం జరుగుతుంది.

D.A.V స్కూల్ లో జరిగిన సంఘటన విషయం లో దోషులకు త్వరితగతిన కఠిన శిక్ష పడి పాప తల్లిదండ్రులకు న్యాయం జరగాలని మరో సారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

వ్యాసం

# ముసలమ్మ మరణం – స్త్రీ దృక్పథం



డా. కందేపి రాణీప్రసాద్
హైదరాబాద్ 9866160378

ఆంధ్ర విశ్వ విద్యాలయానికి మొట్టమొదటి ఉపాధ్యక్షులు ఊరు పేరునే ఇంటి పేరుగా చేసుకున్న కట్ట మంచి రామలింగారెడ్డి మంచి ఉపాధ్యాయుడు, వక్త, పరిపాలనాదక్షుడు, సాహితివేత్త, విమర్శకుడు, రెడ్డి గారు విశ్వవిద్యాలయాన్ని మహోన్నత స్థితికి తీసుకొని వెళ్ళిన విషయాన్నీ దృష్టిలో పెట్టుకొని ' He was the university and the university is nothing, but Dr. Reddy's brain power ' అని SBP పట్టాభి రామారావు గారు రెడ్డి గారిని ప్రశంసించారు. వీరు విద్యావేత్తగా, సాహితివేత్తగానే గాకుండా రాజకియవేత్తగా కూడా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. రాజకియపరమైన విమర్శ, నిర్భయత్వం, మానవతావాదం, ప్రజాస్వామ్య దృక్పధం కనిపిస్తాయి.

మైసూరు యువరాజు నరసింహ ఒడయార్ తో కలసి అనేక దేశాలు పర్యటించి అక్కడి విద్యావ్యవస్థల తీరు తెన్నులను పరిశీలించి వచ్చి మన విశ్వ విద్యాలయాల్లో ప్రవేశ పెట్టటం వలన అవి ఎంతో విశిష్టతను సంపాదించుకున్నాయి. రెడ్డి గారు హరిజనులకు పాఠశాలల్లో ప్రవేశం కల్పించి విప్లవాత్మకమైన మార్పు తెచ్చారు. అక్కడొకటి ఇక్కడొకటిగా పడిపోయిన తాళపత్ర గ్రంధాలను సేకరించి పెట్టారు. అముద్రిత గ్రంధాలకు ప్రతులను వ్రాయించి విశ్వవిద్యాలయాల్లో భద్రపరిచారు. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ వంటి పండిత పరిశోధకుల చేత వేమన మీద ఉపన్యాసాలిప్పించారు. వేదం వెంకటరాయశాస్త్రి గారి వంటి ఉద్దండ పండితులకు ' కళప్రపూర్ణ ' బిరుదముల నిచ్చి సత్కరించారు. విశ్వవిద్యాలయానికి ఇలా ఎన్నో సేవలు అందించటం వలననే ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి బహుముఖ ప్రజ్ఞాశాలియైన రెడ్డి గరిని రెండుసార్లు వరించింది.

కట్ట మంచి తన పందొమ్మిదో ఏట వ్రాసిన ముసలమ్మ మరణం ఆధునిక కవిత్వానికి వెలుగు రేఖగా ప్రశంసించబడింది. రెడ్డిగారు వ్రాసిన గ్రంధాలు, కావ్యాలు, పిటికలు, వ్యాసాలు తెలుగు సాహిత్యానికి అయన చేసిన సేవను తెలుపుతున్నాయి. ' ముసలమ్మ మరణం ' 107 గద్య పద్యాలున్న చంపూ కావ్యం. దీనికి మూల కథను బ్రౌన్ దొరచే ప్రకటింపబడిన ' అనంతపుర చరిత్రము ' అను గ్రంధం నుండి స్వికరించినారు. ఇది పోటీ కోసం వ్రాసి బహుమతిని గెలుచుకున్నట్లుగా ఈ కావ్యానికి రెడ్డి గారు వ్రాసిన ముఖ పత్రమును బట్టి తెలుయుచున్నది. ఇందులో ముసలమ్మ అను పేరు గల యువతీ తన గ్రామ క్షేమం కోరి ఊరి చెరువుకు బలిగా మారిన విషయం వర్ణింపబడింది. ఈ కథను ఈయన స్త్రీ దృక్పధంతో వ్రాసినట్లుగా అందులో అయన వ్రాసిన మాటల వలన తెలుస్తుంది – " ఈ చిన్న పొత్తము ముఖ్యముగా స్త్రీల కొరకు జేయబడినది. వారి కుపయుక్తముగా నొప్పిన యెడల నా ప్రయాస సఫలత నొందినట్లే " 1930 లో చిలుకూరి నారాయణరావు గారు ముసలమ్మ పేరుతో ఒక చిన్న గేయకృతిని రచించారు. ఇందులోని కథ మూలకధకు దగ్గర గానే ఉన్నది. ఇంకా జి. చెన్నయ్య గారు ఈ కథను తీసుకొని కన్నడ భాషలో ' ఆత్మార్పణే ' అనే పేరుతో వ్రాశారు. రెడ్డి గారు మాత్రం కథను మూలం నుంచి తీసుకున్నప్పటికీ రసాధిక్యానికై అనేక నవీన కల్పనలు చేశారు.

మూలకథ మూడు భాగాలుగా విభజింపబడింది. ' బుక్కరాయ సముద్రము ' అనే ఊరు, అ వూరి చెరువు నిర్మాణం గురించి తెలిపే అంశాలు మొదటి భాగం. ముసలమ్మ అనే ఆమె తన ఊరి వారి బాగుకోసం బలవడం రెండవ భాగం. బలైపోయిన ముసలమ్మ స్త్రీల మీదికి పూనకం వచ్చి మొక్కలు చెల్లింపజేసుకోవడం మూడవ భాగం. దీనిలో రెడ్డి గారు కేవలం రెండవ భాగాన్నే తీసుకొని ఈ కథను మలిచారు. ఎందుకంటే ఈ కావ్యాన్ని నాయికా ప్రాధాన్యంగా చిత్రించదలచుకున్నారు. ఇందులో ఒక స్త్రీ చేసిన త్యాగానికి


మాత్రమే ప్రాముఖ్యతను ఇవ్వదలుచుకున్నారు. మొదటి భాగంలో కేవలం చారిత్రాత్మక అంశాలు మాత్రమే ఉన్నాయి. దానిలో మార్పులు చేయటానికి అవకాశం లేదు కాబట్టి దాన్ని వదిలేశారు. అలాగే మూడవ భాగంలో స్త్రీల మీదకు ఆవేశం రావటం దేవతగా మొక్కులు అందుకోవటం అన్నది విషాదాంతనికి విఘాతం కలుగుతుందని దానిని కూడా తొలగించారు. కొంత కృత్రిమ కల్పనల తోనైనా సరే కావ్యాన్ని సుఖాంతం చేయాలని ప్రసిద్ధ కవులు హెచ్చరించినా రెడ్డిగారు కావ్యాన్ని విషాదాంతంగానే ముగించటన్ని బట్టి అయన ఈ విషయంలో దృఢ నిశ్చయంలో ఉన్నట్లు తెలుస్తున్నది. ముసలమ్మ మరణంతోనే కావ్యాన్ని ముగించి నట్లైతే కావ్యం కరుణ రస ప్రధానమౌతుందని భావించారు. అప్పుడే ఆమె పుర ప్రజల కోసం చేసిన త్యాగాన్ని పాఠకులు మనసులో నిలుపుకుంటారు. ఈ విధంగా ఆ పాత్ర పట్ల సానుభూతి ఏర్పడుతుంది.

నాయికా ప్రాధాన్యం కలిగి ఉండడం, కావ్యాన్ని విషాదాంతం చేయటం – ఈ రెండు అంశాలను ప్రధానంగా తీసుకున్నారిందులో.కావ్యాన్ని విషాదాంతం చేస్తేనే నాయికా ప్రాధాన్యం పెరుగుతుంది. మూలకథలో ముసలమ్మ ఈ దేరని చిన్న బాలిక అయితే, ఈ కథలో పెళ్ళయి కొడుకు ఉన్న ఓ మాతృమూర్తి. ఓ బిడ్డ తల్లి అంటే ఏది మంచి ఏది చెడు అని ఆలోచించగల పరిణతి ఉంటుందనేది కవి భావన. దేవత కోరిక మేరకు ప్రజలు మేలుకోరి ముసలమ్మ తనంత తాను బాలి కావలనే విషయాన్నీ అలోచించి నిర్ణయించు కోవటానికి తగినంత వయసు ఉండాలి కాబట్టి మూలకథలో ఉన్న చిన్న బాలిక స్థానంలో బిడ్డ తల్లిని ప్రవేశ పెట్టారు రెడ్డి గారు. అంతేకాక ముసలమ్మ బలి అయ్యేందుకు వెళ్ళేముందు కొడుకు నెత్తుకొని ముద్దాడి బుజ్జగించి వదల్లేక వదల్లేక వెళ్ళే సన్నివేశం ద్వారా ఆమె వాత్సల్యం ప్రకటితమవుతుంది. ‘ ఏం కావాలన్నా నన్నడుగుమని ఇప్పటిదాకా అని తీరా ఇప్పుడు నోరు తెరిచి అడిగేసరికి కాదంటున్నారే ‘ అంటూ ‘ నేను కూడా నీతో వస్తానంటూ ‘ బాధ పడుతున్న భర్తను ఓదార్చి ఒప్పించి అంగీకరింప చేసుకోవటంలో సహజ సుందరంగా స్త్రీ సామర్థ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన అత్త మామలకు తగిన మాటలు చెప్పి ఒప్పించే చాతుర్యం చక్కగా వివరింపబడింది. మూలంలో మామ పాత్ర తప్ప ఏమి లేవు. అత్త, భర్త, కొడుకు పాత్రలు కల్పించటం ద్వారా ఆనాడు సమిష్టి కుటుంబంలో ఒక స్త్రీ చుట్టూ ఉండే చక్కనైన వాతావరణాన్ని సృష్టించాలని కవి ఉద్దేశ్యంగా కనిపిస్తున్నది. ఈ కావ్యంలో ప్రతి పాత్ర హృదయ ముద్రిత మయ్యేలా చిత్రీకరించబడ్డాయి. ఇందులో ప్రధాన పాత్రయైన ముసలమ్మ పాత్ర మరింత విశేషంగా తీర్చి దిద్దబడింది. సన్నివేశ కల్పనలోనే గాకుండా పాత్ర పోషణలోనూ అయన కవిత కౌశలం ప్రస్ఫుటమవుతుంది. గ్రామ ప్రజలను చూచి ‘ మీరు చూపిన ప్రేమకు ఋణపడి ఉన్నాను. ఆ రుణాన్ని ఈ విధంగా తీర్చుకుంటాను’ అని ముసలమ్మ తాను బలి కావటానికి అనుమతినిమ్మని కోరుతుంది. ఈ మనోహరమైన సన్నివేశ చిత్రణలో కవి భావనా శక్తి. నాటక రచనాశక్తి వెల్లడి అవుతాయి. ఒక స్త్రీకి కుటుంబ సభ్యులతోనూ, ఇరుగుపొరుగు తోనూ, గ్రామ ప్రజల తోనూ ఉండే సంబంధ భందావ్యాలను ఈ సన్నివేశం చక్కగా తెలియ చేస్తుంది. ఇది కావ్యంలో ప్రాణ భూతమైన సన్నివేశం.

కవిగారు ఇందులో ముసలమ్మ పాత్రనే కాకుండా దేవత పాత్రను కూడా ఉదాత్తంగా చిత్రించారు. మూలంలో ప్రజలు వర్షాలకు నిండిన చెరువును చూడటానికి వెళ్ళినపుడు గంగాభవాని ఒక స్త్రీని ఆవేశించినకు నరబలి కావాలని కోరింది. మరల ముసలమ్మను ఆవేశించి ఆమెనే బలి ఇవ్వాలని కోరింది. మొదటిసారి కేవలం నరబలి కావాలన్నది అంటే కానీ ఎవరు కావాలన్న విషయం చెప్పలేదు గంగాదేవి. రెండవసారి ముసలమ్మనే బలి కావాలని కోరటం, ఒక స్పష్టమైన అభిప్రాయం లేకపోవటం మరియు ఆమె తొందరపాటునూ సూచిస్తుంది. ఏ విషయాన్నైనా ఒక్కసారే నిర్ణయించుకోలేక పోవటం, అది నిశ్చితాభిప్రయాన్ని కలిగి ఉండక పోవడం అనేది మానవుల లక్షణం. దేవతలకు ఈ విధమైన మానవ లక్షణాలు ఆపాదించకూడదని రెడ్డిగారు తన కావ్యంలో ఆకాశవాణిని ప్రవేశపెట్టారు. అది కూడా ముసలమ్మనే తనకు బలి కావాలని రెండుసార్లు కాకుండా ఒక్కసారే చెప్పించారు. దానితో దేవతకు గౌరవం, దివ్యత్వం లభించాయి. అంతే కాక మూలకథలో స్త్రీలకు పూనకం వచ్చినట్లుగా చెప్పబడింది. పూనకం రావటమనేది అజ్ఞానం, అనాగరికం. ఇది స్త్రీల మానసిక దౌర్బల్య స్థితిని తెలుపుతుంది. అందుకే స్త్రీ జనాన్ని ఆవేశించటం వలన స్త్రీలకు ఉన్నతమైన భావస్థాయిని ఆపాదించారు. కవి చేసిన మార్పులు ఔచిత్యవంతముగా, కావ్య శోభను పెంచేవిగా ఉన్నాయి. కావ్యం నాయికా ప్రధానమైనది కావటం, కథ ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందినది కావటం, కావ్యం విషాదాంతం కావటం – వీటన్నింటి వాళ్ల ముసలమ్మ మరణం వస్తు, భావ రచనల్లో నవ్యతను సాధించిన మొట్ట మొదటి ఆధునిక కావ్యంగా పేరు పొందింది.

వ్యాసం

# సృష్టిలో స్త్రీ ఒక బహుమతి



నిరుపమ - 7208153263

ఈ సృష్టిలో ఒక స్త్రీ ఆప్యాయతగల తల్లి, స్నేహపూర్వక భార్య, శ్రద్ధగల కుమార్తె, నమ్మదగిన సోదరి మరియు నమ్మకమైన స్నేహితురాలు. నిజానికి స్త్రీ అంటే ప్రకృతి యొక్క ఉనికి. ఆమె ఒక శక్తి, అత్యున్నత శక్తి యొక్క స్వరూపం. స్త్రీ అంటే అందం, నిస్వార్థ ప్రేమ, స్వచ్ఛత, దయ మరియు గౌరవం యొక్క ప్రతిరూపం. స్త్రీగా ఉండటం గర్వకారణం. బిడ్డకు మూలం తల్లి. పంచుకోవడం, శ్రద్ధ వహించడం మరియు ప్రేమించడం అంటే ఏమిటో ఆమె ప్రపంచానికి నేర్పుతుంది.

ఒక స్త్రీ యొక్క విశ్వరూపాన్ని కంటితో కంటే మనసుతో ఎక్కువగా చూడవచ్చు. ప్రతి స్త్రీ తన అద్భుతమైన శక్తులతో లక్షణాలతో పొరలు పొరలుగా సంక్లిష్టంగా ఆవరించబడి ఉంటుంది. సంక్లిష్టత ఆమె ప్రాథమిక స్వభావం. స్త్రీగా ఉండటం అంటే బలంగా ఉండటం. ఎందుకంటే మనకు ఆ బలం అవసరం. ఆ బలం మనకు రక్షణగా ఉపయోగపడుతుంది. మనతో తప్పుగా ప్రవర్తిస్తే మనం దండించగలమని నిరూపించడానికి మనకు కండరపుష్టి అవసరం. అందుకు సమతులాహారం పొందే హక్కును ఉపయోగించుకోవాలి. మనం ఎప్పుడూ అవసరం కంటే ఎక్కువగానే ఉన్నాము. అందుకే అణిచివేత ప్రయత్నం జరుగుతుంది. పుట్టుకతో మానవి అయిన వారిని, ఈ ప్రపంచం మంచితనం పేరుతో స్వార్థంతో లోపాలను, బలహీనతలను అపాదించింది. మన జీవితంలో, మన నిజమైన స్వభావానికి మనను అనుసంధానించుకనే జ్ఞానం మనకు ఉన్నది.

స్త్రీ శక్తి ఆంట్రప్రెన్యూర్‌షిప్ యొక్క భవిష్యత్తు అని చెప్పడంలో ఆశ్చర్యం లేదు, ఎందుకంటే ఇది అనుభవాన్ని అందిస్తుంది. నేడు వ్యాపారాలపై ఆధిపత్యం చెలాయించే తీవ్రమైన పోటీలో మానవత్వాన్ని తిరిగి తీసుకువస్తుంది. స్త్రీత్వం యొక్క నిజమైన సారాంశం శాస్త్రీయంగా నిరూపించబడిన మల్టీ టాస్కింగ్ సామర్థ్యంలో ఉంది. కిచెన్ టేబుల్ నుండి బోర్డ్‌రూమ్‌ల వరకు మరియు మనకు అవసరమైన ప్రతిచోటా, ఖచ్చితంగా అవసరమైన నైపుణ్యం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అపోహలను పగులగొట్టాలి. కొన్నిసార్లు ఇది చాలా అగమ్యగోచరంగా ఉంటుంది, అయినప్పటికీ, ఇది తనకు తానుగా ఉత్తమమైన సంస్కరణను చేరుకోవడానికి ఒక ప్రయాణం కావచ్చని నేను నిజంగా నమ్ముతున్నాను.

స్త్రీ అంటే ఆమె ముఖం మరియు శరీర సౌందర్యం కంటే చాలా ఎక్కువ. ప్రతి స్త్రీ తనదైన రీతిలో ప్రత్యేకంగా ఉంటుంది. చాలా మంది స్త్రీలు మీ జీవితంలో గొప్పదనం ఏమిటని అడిగితే, చాలా మంది స్త్రీలు తల్లిగా ఉండటమే అని చెబుతారు, కానీ నా ప్రకారం అందరూ మహిళలు పిల్లలను కనే సామర్థ్యాన్ని కలిగి ఉండరు, అది వారిని స్త్రీగా తక్కువ చేయదు. ప్రతి ఒక్కరికి ఒక్కో అందం, ప్రత్యేక వ్యక్తిత్వం, శైలి, గుర్తింపు, కలలు మరియు తమను తాము మోసుకెళ్లే విధానం ఉంటాయి. కానీ తేడాలు ఉన్నప్పటికీ, వాటిలో ప్రతి ఒక్కటి అవసరం. నిజమైన స్త్రీ తన స్వంత నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం కలిగి ఉంటుంది. ఆమె విలువైన మేధస్సు కలిగి ఉన్నందున ఆమె ఎవరినీ అనుసరించదు.

స్త్రీ అంటే విశ్వాసం. ఆత్మవిశ్వాసంతో మరియు స్వీయ ప్రేమతో ఉండాలి. మనల్ని మనం తెలుసుకొని మనల్ని మనం ప్రేమించుకోవాలి. అవసరమైనపుడు మౌనంగా ఉండాలా లేదా మన కోసం మనం నిలబడాలా ఎంచుకోగలగాలి. మన భయాలు మనకు సరైన ఆలోచన చేయకుండా నిరోధించవద్దు. ఆత్మవిశ్వాసం ఉన్న స్త్రీ కంటే మరేదీ అందంగా ఉండదు. కాబట్టి మనం అందంగానే ఉందాము.

ఇంటర్వ్యూ



**తొలితరం మలితరం తెలంగాణ ఉద్యమకారిణి.. ప్రముఖ సాహితీవేత్త.. తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం వంటి అనేక గౌరవాలతోపాటు, పరిశోధనా రంగంలో స్వర్ణ పథకం అందుకున్న విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి తిరునగరి దేవకీ దేవిగారితో బహుళ సంపాదకురాలు జ్వలిత నిర్వహించిన ముఖాముఖి.**



జ్వలిత
హైదరాబాద్ 9989198943

బహుళ : మీ సాహిత్య నేపథ్యం చెప్పండి మేడం?

డా. తిరునగరి దేవకీ దేవి : హితేన సహితం సాహిత్యం, సాహిత్యం సమాజ దర్పణమన్నారు లాక్షణికులు .అంటే రచయితలు ఒకవైపు సమాజాన్ని తమ రచనలలో ప్రతిబింబిస్తూనే తద్వారా పాఠకులకు శ్రోతలకు ప్రేక్షకులకు మంచి మార్గ దర్శనం చేస్తారు. అంతేకాదు రచయిత కాలం, ప్రాంతం, వర్గాలననుసరించి ఆయాకాలాల ప్రాంతాల వర్గాల పరిస్థితులు ఆచార వ్యవహారాలు సంస్కృతీ సంప్రదాయాలు, వ్యవహారాలు చారిత్రక నేపథ్యం భవిష్యత్తరాలకు అందచేసే అవకాశముంటది . అన్నిటినీ మించి రచయిత తనలో కలుగుతున్న భావోద్వేగాలను పాఠకులతో పంచుకునే అవకాశముంటుంది. ఈ నేపథ్యాలన్ని నేను రచనకు పూనుకోవడానికి దోహదం చేసినవి.

బహుళ : మీ సాహిత్యంలో ప్రధానాంశాలు వివరిస్తారా?

డా. తిరునగరి దేవకీ దేవి : అస్తిత్వవాద, స్త్రీవాద ప్రాంతీయ వాదాలతో పాటు సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమం దౌర్జన్యం, దుర్మార్గం మొదలైనవి రూపు మాపగలుగాలనే భావన ఉంటుంది.

బహుళ : మీరు ఏ ఏ ప్రక్రియల్లో రాశారు?

డా. తిరునగరి దేవకీ దేవి : పరిశోధన, విమర్శ, కథ, కవిత్వం, అనుభవాలు

బహుళ : మీకు ఇష్టమైన ప్రక్రియ ఏదండీ?

డా. తిరునగరి దేవకీ దేవి : విమర్శ, కథ.

బహుళ : మీకు ఇష్టమైన రచనలేమిటి మేడం?

డా. తిరునగరి దేవకీ దేవి : మహా ప్రస్థానం, ముత్యాల సరాలు, చదువు, ఇల్లు, జానకి విముక్తి . దాశరథి వట్టికోట ల నవలలు అమృతం కురిసిన రాత్రి, కన్యాశుల్కం మొదలైనవి

బహుళ : మీకు స్ఫూర్తిదాయకమైన రచనలు?

డా. తిరునగరి దేవకీ దేవి : ఇష్టమైనవన్నీ స్ఫూర్తిదాయకాలే.



బహుళ : మీ రచనలకు ప్రేరణ?

డా. తిరునగరి దేవకీ దేవి : రచనలు చేయాలనే ఆకాంక్షలతోపాటు ఆ రచనలు పాఠకులకు ఆలోచనలను రేకెత్తించి వారిని సత్యాన్వేషణ మార్గంలో పెట్టాలని.

బహుళ : మీ కుటుంబ నేపథ్యం చెప్తారా?

డా. తిరునగరి దేవకీ దేవి : మాబాపుది ఉమ్మడి కరీంనగరు జిల్లాకు చెందిన హుజురాబాద్ . నేను పుట్టింది హుజురాబద్ లోనే. మాబాపుకు సరియైన జరుగుబాటులేనందున మేము హనుమకొండలోని అమ్మమ్మ ఇంటికి చేరుకున్నం.

బాపు ఖాన్గి బడి నడుపుతుండె. అమ్మ ఉద్యోగ ప్రయత్నాలు ఎండమావుల్లో నీళ్ళు వెతుకడంగా ఉండేది. బాపు ఆదాయం అత్తెసరు తో పోల్చడానికి కూడా కుదురక పోయేది. అందువల్ల బాల్యమంతా ఏ రోజు తిండిగింజలు ఆ రోజు సమకూర్చడంగా సాగింది. మాకు నిలువనీడనిచ్చిన ఇల్లు నాలుగు గోడలు, రెండు తడుకలతో కూడుకున్న గుడిసె. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న మేన మామల రాకపోకల వల్ల ఆ ఇల్లు ఒక కూడలిగా ఉండేది. డాక్టర్ల నిర్లక్ష్యం వలన కళ్ళుపోగొట్టుకున్న అమ్మమ్మనే మాకు పెద్దదిక్కు. ప్రభుత్వ పాఠశాలకు చెల్లించవలసిన ఫీజు కూడా అందుబాటులో లేకపోవడంతో రెండుమూడుసార్లు పై అధికారుల వద్దకు తిరగి మాఫీ చేయించుకున్న.చదువు పట్ల నేను చూపిస్తున్న శ్రద్ధను గమనించి హైస్కూల్ చదువుకు మా మేనమామ రామానుజం తను పని చేస్తున్న జనగామ తీసుకొని పోయి ఆ వూళ్ళో జిల్లా పరిషత్తు హై స్కూల్ లో చేర్చిన్రు. మామయ్య నాకిచ్చిన సందేశాలు మాట్లాడిన మాటలు నా జీవితానికి మంచి మలుపుగా ఐనవి. పి.యు.సి , డిగ్రీ, పి.జి చదువంతా హనుమకొండలోనే. కుటుంబ ఆర్థిక అవసరాల కోసం చదువును కొనసాగిస్తూనే ఉదయం, సాయంకాలవేళల్లో హోం ట్యూషన్స్ చెప్పేదాన్ని..

బహుళ : మీ వృత్తి నేపథ్యం?

డా. తిరునగరి దేవకీ దేవి : నేను యం. ఏ తెలుగు లో పి.జి చేసిన . ఫలితాలు వచ్చిన రెండు నెలలలోనే వికారాబాద్ లోని అనంత పద్మనాభస్వామి ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ కాంపోజిట్ కళాశాలలో ఉద్యోగం వచ్చింది. విద్యా ప్రస్థానకాలం నన్ను ఉద్యమ కారిణిగా అభ్యుదయ వాదిగా తీర్చి దిద్దడం వల్ల అదే కళాశాలలో నాకన్నా మరింత రేష్నలిస్టుగా ఆలోచించే మాథమెటిక్స్ అధ్యాపకుడు శంకరయ్యతో స్నేహం ఏర్పడింది. రెండు సంవత్సరాల కాలం అతణ్ణి నాకు జీవితకాలానికి సహచరుణ్ణి చేసింది. ఏ హంగులు ఆర్భాటాలు లేకుండా కేవలం రెండు పూల దండలు మమ్మల్ని భార్యాభర్తలుగా సమాజం ముందు నిలబెట్టినవి. ఏ అవినీతిని అక్రమాన్ని సహించని , అన్యాయాన్ని ప్రశ్నించే, బడుగు బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా నిలబడాలనే అతని మనస్తత్వం కళాశాలలో ఆ ఊర్లో మాకు చాలా సమస్యలనే తెచ్చింది. మేము ఏటికి ఎదురీదక తప్పలేదు. అన్యాయాలకు ప్రతిఘటిస్తూనే ఒక అధ్యాపకురాలిగా నిలదొక్కుకున్నాను. కళాశాలలో పరీక్ష సమయాలలో చీఫ్ సూపరింటెండెంట్ గా, యన్ యస్. యస్ మహిళా విభాగానికి ప్రోగ్రాం ఆఫీసర్ గా,ఓపెన్ యునివర్సిటీ కో– ఆర్డినేటర్ గా , విమెన్స్ ఎంపవర్మెంట్ కన్వీనర్ గా , ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ గా , ప్రిన్సిపాల్ గా అనేక బాధ్యతలను ఏ రిమార్కు లేకుండా నిర్వర్తించిన.

బహుళ : కుటుంబము – ఉద్యోగము – సాహిత్యము : వీటిని ఏవిధంగా బ్యాలెన్స్ చేసుకో గలిగారు?

డా. తిరునగరి దేవకీ దేవి : సహజంగానే ఉద్యోగం చేసే స్త్రీకి కుటుంబ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడమంటేనే కత్తి మీద సాము . మా పెళ్ళైన మొదట్లో కొంతమంది మిత్రులతో కలిసి చైతన్య కళాసాహితి (సాహితీ సంస్థ)లో కార్యక్రమాలలో మునిగి తేలిన శంకరయ్య తర్వాత కాలంలో పశ్చిమ రంగారెడ్డి జిల్లా పౌరహక్కుల సంఘం బాధ్యుడిగా ఉండటం వలన కుటుంబ భారం నాకు మరింత ఎక్కువైంది. అతనికి సహకరించే క్రమంలో సామాజిక బాధ్యత కూడా నా మీద పడిందనే చెప్పాలి. అణగారిన వర్గానికి న్యాయం చేయాలనే క్రమంలో సమాజంలో మా వ్యక్తిత్వం కొందరికి మింగుడు పడక పోవడమే కాదు వాళ్ళంతా మమ్మల్ని శతృవులుగా చూసేవాళ్ళు. కష్టమైనా సహనంతో కుటుంబ బాధ్యతలను నిర్వర్తించిన. ఇక సాహిత్యం విషయమంటారా? కర్ణుడి చావుకు కారణాలనేకమన్నట్లు నేను సాహితీ ప్రాంగణంలో చాలా ఆలస్యంగా అడుగు పెట్టిన. మాకు నాలుగేళ్ళ తేడాతో ఒక బిడ్డ ఒక కొడుకు. బిడ్డ బి.టెక్, కొడుకు ఇంటర్ పూర్తి అయ్యే వరకు నేను రచనా వ్యాసాంగం జోలికి పోలేదు. అప్పుడు మాత్రమే పరిశోధనకు పూనుకో కలిగాను. ఉద్యోగం చేస్తూనే పరిశోధన చేసిన. 2005 లో పరిశోధన పూర్తి ఐంది. 2007 లో యుజిసి ప్రాజెక్ట్ మొదలు పెట్టినా వయసు మీద పడిన అమ్మ, శంకరయ్య అనారోగ్యం , అసంపూర్ణంగా ఉన్న కుటుంబ బాధ్యతలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నన్ను రచనావ్యాసాంగం వైపు తొంగి చూడనీయలేదు.

బహుళ : మీరు ఎటువంటి వివక్షనైనా ఎదుర్కొన్నారా?

డా. తిరునగరి దేవకీ దేవి : న్యాయం పక్షంగా నిలబడినందుకు , పురుష స్వామ్యంలో స్త్రీగా, ప్రాంతీయ అస్తిత్వ వాదిగా, మానవతా దృక్పథంతో సహకరించే బోళా మనస్తత్వం వలన వివక్షలకు చాలానే ఈ నాటికీ గురౌతూనే ఉన్నాను..

బహుళ : మీరచనల గురించి చెప్పండి?

డా. తిరునగరి దేవకీ దేవి : నా రచనలలో మొదటిది తెలంగాణా విమోచనోద్యమ నవలలో స్త్రీ చైతన్యం. ఇది నా పరిశోధన. దొంతరలవారి భూస్వామ్య వ్యవస్థను ఎదుర్కోవడానికి జరిగిన పోరాటక్రమాన్ని చిత్రిస్తూ ఎంతో సాహిత్యం వెలువడింది. సుమారు ఇరవై రెండు నవలలు వచ్చినై.అందులో పద్నాలుగు నవలలో మాత్రమే స్త్రీ చైతన్యాన్ని గుర్తించి నా పరిశోధనకు ఎంచుకున్న. పేరుకు నవలల పరిశోధన ఐనా

1. ముఖ్యంగా పోరాటం ఏర్పడటానికి గల చారిత్రికాంశాలతో పాటు రాజకీయ సామాజికాంశాలు ప్రాథమికాంశాలుగా పరిచయం చేసిన.

2.పోరాట సాహిత్యంలోని కథలు, పాటలు, నాటకాలు, బుర్రకథలు, యక్షగానాలు మొదలైన ప్రక్రియలలో కూడా సాహిత్యం వచ్చింది. ఈ ప్రక్రియలలో స్త్రీ చైతన్యాన్ని నవలాస్త్రీ చైతన్యంతో తులనాత్మకంగా చూసిన.

3.తెలంగాణాలో ప్రజలు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతుంటే దేశం యావత్తు బ్రిటిషు పాలన నుండి విముక్తి కై పోరాడింది. ఈ రెండు ఉద్యమాలు సమాంతరంగానూ సాగడం వలన ఈ రెండు ఉద్యమాలలోని స్త్రీ చైతన్యాన్ని తులనాత్మకంగా చూసిన.

4.విదేశాలలో జరిగిన ఉద్యమాలను వాటిలో స్త్రీల ప్రమేయాన్ని కొంత స్థూలంగా పరిచయం చేసి వారి చైతన్యంతోను తులనాత్మకంగా చూపించిన.

5.మనకు తెలియని మనచరిత్రను ఆధారం చేసుకొని పోరాట స్త్రీలు పోరాడిన తీరును త్యాగాల పరంపరను అనుభవించిన అవమానాలను, క్షోభను పరిచయం చేసి నవలలోని స్త్రీలతో సరిపోల్చి చూపించిన.

6. చివరగా ఈ ఉద్యమంలో స్త్రీ చైతన్యం ఎంత ఉన్నతమైందో చూపిస్తూ నే స్త్రీలు భూమికగా లేకుంటే ఉద్యమే లేదు అన్న పరిస్తితిని వివరించి ఉద్యమం తరువాత వారికి జరిగిన అన్యాయాన్ని మనోవేదనను చూపించిన.

నా పరిశోధన సాంతం స్త్రీల కోణంగా సాగింది. ఈ పరిశోధనకు తెలుగు విశ్వవిద్యాలయం స్వరణ పథకాన్ని ఇచ్చింది.

బతుకమ్మ పాటలలో స్త్రీలమనోభావాలు పాటల పరిణామ క్రమం పోస్ట్ డాక్టరేట్ ప్రాజెక్ట్.

బతుకమ్మ పండుగ చెట్టు చేను చెలుక చెరువు మట్టి పంట వంటలకాలవాలమైన ప్రకృతి పండుగ. జానపదుల పండుగ. కుటుంబ బాంధవ్యాలలకు సమాజ సంబంధాలకు ఆదరువు. సహజ సౌంద ర్యానికి ప్రతీక. అటువంటి పండుగను కేవలం సంస్కృతిలో భాగంగా చూడటం సరికాదనిపించింది. ఆపాటల ఆధారంగా పితృస్వామ్యం పరిధిలోని స్త్రీల మనోభావాలను వెలికి తీసుక రాదలచి ఈ ప్రాజెక్ట్ కు పూనుకున్న. పరిణామక్రమంలో కాలానుగుణంగా ఆ పాటలు సామాజిక పరిస్థితులను తమలో ఇముడ్చుకున్న విధానాన్ని చూపించిన. జానపదులకు సంబంధించిన పాటలు శిష్టులపాటలుగా మారడం కూడా ఇందులో చూస్తాం.

పిడికిటి ఇసుక కథా సంపుటి

ఈ సంపుటిలో పురుషస్వామ్యంలో గృహిణిలుగా, ఉద్యోగినులుగా స్త్రీలుగా ఆడవాళ్ళు ఎదుర్కుంటున్న సమస్యలు, కరోనాకాలంలో కరోనా వైరస్ కన్నా మనుషుల మనస్తత్వాలు , టెక్నాలజీ ఏకు మేకుగకాగ మారి కొత్తసమస్యలను తెచ్చిపెట్టి ఇబ్బందుల పాలు



చేయడం వంటి వస్తువుతో సాగినవి. అంతేకాకుం డా రైతుల సమస్యలు, మైనారిటీలు గిరిజనుల అడుగంటిపోతున్న మానవ సంబంధాలు, మూఢనమ్మ కాలను ఆధారం చేసుకొని ఎదుటివాడిని దెబ్బతీయడం అనుబంధాలు ఆత్మీయతల సమాధిలో హంగులు ఆర్భాటాలు, మేడిపండు నాగరికతలో స్త్రీలపై ఇప్పటికీ సంప్రదాయాల పేరిట స్త్రీలను బాధ్యులుగా చేస్తూ కొనసాగుతున్న పురుష స్వామ్య వివక్ష, మొదలుకొని అనేక సామాజికాంశాలు నా కథలలో చేసినవి.

విమర్శ వ్యాసాలు

ఈ వ్యాసాలు వివిధ పత్రికలలో సంకలనాలలో వచ్చినై. సుమారు అరవై వ్యాసాలపైనే ఉన్నై. అచ్చులో 400 పేజీలు కావచ్చు. ముద్రణకు సిద్ధంగా ఉన్నై.

కవితలు

మలిదశ ఉద్యమ కాలంలో భావోద్వేగానికి గురై ఎన్నో కవితలు రాసిన .ముద్రణకు సమయం అనుకూలించలేదు. కొన్ని మాత్రమే సంకలనాలలో చేరినవి. ఇవికాకుండా విభిన్న సందర్భాలలో రాసిన కవితలూ ముద్రణామార్గంలో ఉన్నై.

సంపాదకత్వం

ప్రరవే తీసుకున్న కథా విమర్శ సంపుటి సంపాదకులలో నేను ఉన్నాను.

రుద్రమ ప్రచురణలు తీసుకొచ్చిన కరోనాకాలం కథలకు గౌరవ సంపాదకురాలిగా బాధ్యతను నిర్వర్తించిన.

నా సహచరుడి మొదటి వర్ధంతి సందర్భంగా విశ్వనాథీయము సంకలనాన్ని తెచ్చిన.

13.మీకు నచ్చిన మీ రచనలు?

ముద్రణలో ఉన్న నా పరిశోధన, ప్రాజెక్ట్ వర్క్ తోపాటు స్త్రీ కోణంలో రాసిన గోడదెబ్బ చెంపదెబ్బ, అక్కసు,కరోనాకు సంబంధించిన బాధ్యులెవరు , బహుముఖాల కరోనా, మైనారిటీలకు సంబంధించిన పొరలు,రోజురోజుకు దిగజారుతున్న కుటుంబ సంబంధాలను అద్దంపట్టిన పిడికిటి ఇసుక, వ్యవసాయ సంబంధమైన ఎవుసం వంటి కథలు

నోట్లరజద్దు కాలంలో మోడీ నీ మోదం మాకు ప్రమాదమాయె, మలిదశ ఉద్యమ కాలంలో రాసిన

తెగించి కొట్లాడుడే తెలంగాణ వచ్చేదాక, భగ్నం కాక తప్పని సరిహద్దుప్రేమ, వితంతువు మనో వేదనను వెలిబుచ్చే నేనెట్లా అపవిత్రురాలనయ్యా దెబ్బతింటున్న పర్యావరణాన్ని ఒడిసిపట్టుకున్న

వసంతమూ లేకపాయె వసంత కోకిలా రాకపాయె, వ్యవసాయానికి సంబంధించి అరుదైన ఛాయాచిత్రం, మొదలైన కవితలు.

బహుళ : రచన వ్యాసాంగంలో ఎదుర్కొన్న సమస్యలు ?

డా. తిరునగరి దేవకీ దేవి : గృహిణిగా ఉద్యోగినిగా ఉద్యమకారిణిగా సమయం లభించకపోవడం.

బహుళ : మీరు అందుకున్న గౌరవాలు (పురస్కారాలు)?

డా. తిరునగరి దేవకీ దేవి: 1.పరిశోధనకుగాను తెలుగు విశ్వ విద్యాలయం స్వర్ణ పతకం(2007)., 2.పరిశోధనకు గాను హృదయభారతి పురస్కారము., 3. టి.ఆర్.యస్ మహిళా విభాగం స్త్రీ శక్తి పురస్కారం 2015., 4.వంశీ విజ్ఞాన పీఠం జీవన సాఫల్య పురస్కారము 2015., 5. రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారము 2017., 6. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారము2017., 7. అమృత లత అపురూప అవార్డు. 2018., 8. బతుకమ్మ పండుగ సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం వారి సత్కారము 2018. 9. మొల్ల పురస్కారము 2018., 10. స్వరాజ్యలక్ష్మి స్మారక పురస్కారం2018., 11. అంబేద్కర్ సేవా పురస్కారం 2020., 12. వనిత టి.వి పురస్కారము 2021., 13. మాతృవందనం గౌరవం 2021., 14.ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం తెలుగు పాఠ్య పుస్తకంలో పరిశోధన నుండి జాతీయోద్యమంలో స్త్రీలు అంశాన్ని పెట్టడం.

బహుళ: ప్రస్తుత సాహిత్యంలో రాజకీయాలు ?

డా. తిరునగరి దేవకీ దేవి : మంచి రచనలు చేయాలనే భావన కన్నా తొందరగా కీర్తి రావాలనే దుందుడుకుతనం ఎక్కువైంది.

బహుళ : బహుళ పాఠకులకు, రచయితలకు మీ సలహాలు సూచనలు?

డా. తిరునగరి దేవకీ దేవి : రచయితలు నిరంతరంగా సమాజాన్ని చదువుతూ ఉండాలి. సమాజంలోని రాజకీయ అవగాహనను పెంచుకోవాలె. రచనల సంఖ్యకన్నా పాఠకులను చదివించగల రచనలు చేయడంపై దృష్టి పెట్టాలె.

పాఠకులు మీడియా కన్నా రచనలు చదువడంపై దృష్టి పెట్టాలె.

బహుళ : రేపటి రచయితలకు, వర్ధమాన రచయితలకు మీరిచ్చే సలహాలు ఏమిటి?

డా. తిరునగరి దేవకీ దేవి : పాఠకులను చదివించగల రచనలు శైలిని అలవరచుకోవాలి. రాసే సాహిత్యం సంచలనాత్మకంగా కాకుండా సందేశాత్మకంగా ఉండాలె.

ఇంటర్వ్యూ



# ప్రముఖ సాహిత్య విమర్శకురాలు, రచయిత్రి, బహుగ్రంథకర్త ప్రొఫెసర్ సుశీలమ్మగారితో జ్వలిత నిర్వహించిన ముఖాముఖి:




జ్వలిత

హైదరాబాద్ 9989198943


ప్రొఫెసర్ సుశీలమ్మ గారితో ముఖాముఖి

జ్వలిత: నమస్తే సుశీలమ్మ గారూ! మన మొదటి పరిచయం 2016 లో అనుకొంటాను!

సుశీలమ్మ: అవునండి. అప్పుడు నేను " సురక్ష" పోలీసు పత్రిక లో 36 నెలల పాటు ప్రతి నెలా ఒక " మంచి కవిత" ను పరిచయం చేసాను. మీరు రాసిన " కురుసభ నాటి గొంగళి" కవిత గురించి రాయబోతూ మీ పరిచయ వాక్యాల కోసం మీకు ఫోన్ చేసాను. "బహుళ" అంతర్జాతీయ అంతర్జాల పత్రిక మొదలు పెట్టి ఇప్పటికి నాలుగు సంచికలు తెచ్చిన మీకు అభినందనలు.

1.జ్వలిత: మీ సాహిత్య నేపథ్యం గురించి చెప్పండి.

సుశీలమ్మ: నేను జూనియర్ ఇంటర్ లోనే స్పెషల్ తెలుగు గ్రూప్ తీసుకొన్నానండి. బి.ఏ.లో కూడా. తర్వాత ఎం.ఏ. తెలుగు. కాబట్టి చిన్నతనం నుండి తెలుగు సాహిత్యం పట్ల ఆసక్తి. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి కిన్నెరసాని పాటలు మీద ఎం.ఫిల్., ముళ్ళపూడి వెంకటరమణ గారి రచనలపై పిహెచ్. డి చేసానండి.

2.జ్వలిత : మీ సాహిత్యం లో ప్రధానాంశాలు?

సుశీలమ్మ: ప్రాచీన సాహిత్యం గానీ, ఆధునిక సాహిత్యం గానీ " చదవడమే" నాకు చాలా ఇష్టమైన అంశం. అయితే విమర్శనాత్మకం గా " లో నారసి" చదువుతాను. రోజూ గంటల తరబడి చదువుతానండి. ఆధునిక సాహిత్యంలో వస్తున్న పరిణామాలు, వాదాలు ఎప్పటికప్పుడు ఫాలో అవుతూనే ఉంటాను. ప్రతి నెలా, ప్రతి వారం వస్తున్న సాహిత్య పత్రికలను చాలా వరకూ చదువుతూనే ఉంటాను. అందుకే యు.జి.సి వారి ఆర్థిక సౌజన్యం తో "ప్రపంచీకరణ – తెలుగు సాహిత్యం" అన్న అంశంపై మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ చేసాను. "స్త్రీ వాదం – పురుష రచయితలు" అన్న అంశంపై మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ చేసాను.

తెలుగు సాహిత్యానికి సంబంధించిన సెమినార్లు, వర్క్ షాప్ లలో పత్ర సమర్పణ చేయడమే కాక, నేను కొన్నిటిని నిర్వహించాను.

రేడియో, దూరదర్శన్ లలో ప్రసంగాలు, చర్చలు కూడా చాలా ఉన్నాయి.

విద్యార్థినులలో రచనాసక్తి పెంపొందించడానికి "కళాప్రియ" అనే చిన్న పత్రిక తీసుకొని వచ్చాను.

నా ఆధ్వర్యంలో నలుగురు ఎం. ఫిల్. చేసారు.

జ్వలిత: మీరు ఏఏ ప్రక్రియల్లో రాసారు?

సుశీలమ్మ: చిన్నప్పుడు ఓ కథ, ఓ నాటిక రాసాను. కానీ మొదట ప్రచురింప బడింది ఎం.ఏ. లో ఉండగా రాసినది 'వనిత' మాస



2021 లో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి పురస్కారం అందిస్తూ



తండ్రి పేరు మీద ఏర్పరచిన సాహిత్య పురస్కారం మొదట 2020 లో గురువు గారు కడియాల రామ్మోహన్ రాయ్ గారికి అందిస్తూ– వేదిక పై అడిషనల్ డి.జి.పి. లు సిహెచ్. ద్వారకా తిరుమల రావు, పి.వి. సునీల్ కుమార్.

పత్రిక లో శ్రీ శ్రీ గారి 'దేశచరిత్రలు' కి పేరడీ " ఏ మగువ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం? నారీ జాతి చరిత్ర సమస్తం పురుష సేవా పరాయణత్వం" కవిత. తర్వాత విజయచిత్ర మాస పత్రిక లో "నేటి సినిమాల్లో కథ" వ్యాస పోటీలో నాకు ద్వితీయ బహుమతి వచ్చింది. న్యాయనిర్ణేత డి.వి. నరసరాజు గారని చూసి ఆశ్చర్యానందాలకు లోనయ్యాను.

జరుక్ శాస్త్రీ, ముళ్ళపూడి, శ్రీరమణ గారి పేరడీలు ప్రభావం తో నేను రాసిన పేరడీలు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వంటి ప్రముఖ పత్రికలలో వచ్చాయి.

3.జ్వలిత: మీరు ఏఏ ప్రక్రియల్లో రాసారు? మీకు ఇష్టమైన ప్రక్రియ ఏది?

సుశీలమ్మ: కవితలు రాసానండి. కవితా సంపుటి " పడమటి వీధి" తీసుకొనివచ్చాను. కథలు కొన్ని రాసాను. ఎక్కువగా నాకు ఇష్టమైన ప్రక్రియ " సాహిత్య విమర్శ". అభ్యాసనం లో, అధ్యాపనం లోనూ విమర్శ పేపర్ నాకు ఇష్టం. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా విధానంలో బి.ఏ. స్పెషల్ తెలుగు మొదటి సంవత్సరం కి కొన్ని పాఠ్యాంశాలు రాసాను. రెండవ సంవత్సరం కి పాఠ్యాంశాలతో పాటు ఉప సంపాదక బాధ్యతలు నిర్వహించాను. మూడవ సంవత్సరం కి " సాహిత్య విమర్శ" లో పాఠ్యాంశాలు మరియు సంపాదక బాధ్యతలు నిర్వహించాను. ప్రింట్ మరియు ఆన్లైన్ మాగజైన్ లలో విరివిగా వ్యాసాలు రాస్తున్నానని మీకు తెలుసు. కరోనా టైంలో బాగా రాసాను, పుస్తకాలు ప్రచురించాను. మీరూ " కరోనా డైరీ" రాయించారుగా మా లాంటి వారితో!




4. జ్వలిత: మీకు ఇష్టమైన రచనలేవి? స్ఫూర్తిదాయక మైన రచనలేవి?

సుశీలమ్మ: ప్రాచీన సాహిత్యం లో కవిత్రయ మహాభారతం ఇష్టమండి. ఆధునిక సాహిత్యంలో చాలా చాలా ఇష్టాలున్నాయి. ప్రక్రియ ఏదైనా కానీ ఆసక్తి కలిగేలా, చదివించేటట్లు ఉండాలి. ఆలోచనాత్మకంగా ఉండాలి. సామాజిక స్పృహ ఉండాలి. మనసుని, మెదడుని కదిలించి తన వైపు లాక్కునేలా ఉండాలి. అలాంటి అద్భుతమైన రచనలు చాలా ఉన్నాయి. ఒక్కటే చెప్పాలి... అని అంటే నిర్ద్వంద్వంగా శ్రీశ్రీ "మహాప్రస్థానం". వచన రచనా శైలి లో ముళ్ళపూడి వెంకటరమణ.

జ్వలిత: మీ కుటుంబ నేపథ్యం? మీ రచనలకు ప్రేరణ ?

సుశీలమ్మ: మా నాన్నగారు ప్రభుత్వం లో పెద్ద ఉద్యోగి. రిటైర్ అయ్యాక ఆయన పోతన మహాభాగవతం చాలా ఇష్టం గా చదువుకొనే వారు. మా అమ్మగారు ఆ రోజుల్లోనే ఎమెస్కో వారి ఇంటింటా గ్రంధాలయం నెలకి ఐదు రూపాయలు కడితే చాలా పుస్తకాలు ఇంటికి వచ్చేవి. అలాంటి సాహిత్య వాతావరణం లో చిన్న వయసు నుండే పుస్తకాలు చదవడం అలవాటైంది.

తనకిష్టమైన, నాకిష్టమైన తెలుగు సాహిత్యం చదివించిన మా నాన్నగారి పేరిట " శ్రీ లక్ష్మీ నారాయణ స్మారక సాహిత్య పురస్కారం" 2020 లో నెలకొల్పి, నా కిష్టమైన సాహిత్య విమర్శలో కృషి చేస్తున్న వారికి ఇస్తున్నానండి.

జ్వలిత: మీ వృత్తి నేపథ్యం?

సుశీలమ్మ: ఎం.ఫిల్. పూర్తయిన తర్వాత ఎ.పి.పి.యస్. పరీక్ష రాసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలి గా చేరాను. జాషువా గారి ఊరి వినుకొండ లో మొదటి నియామకం. తర్వాత ఎక్కువ కాలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గుంటూరు లో పని చేసాను. ఆడపిల్లలు ఈవ్ టీజింగ్, గృహ హింస పట్ల జాగరూకతతో ఉండాలని, వారి హక్కులను తెలుసుకోవాలని ఉద్దేశం తో యూనివర్సిటీ వారి అనుమతితో "విమెన్ డెవలప్ మెంట్ సెల్" ఏర్పాటు చేసాను. పోలీస్ ఆఫీసర్స్, సామాజిక వేత్తలతో సమావేశాలు, సెమినార్లు ఏర్పాటు చేసాను. వ్యక్తిగతంగా ఆంధ్రప్రదేశ్ కమీషన్ ఫర్ విమెన్ వారి సమావేశాలకు రిసోర్స్ పర్సన్ గా వెళ్ళాను. నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ ( న్యూ ఢిల్లీ) వారి నేషనల్ సెమినార్ లో పాల్గొన్నాను. ఆడపిల్లల కళాశాలల్లో పని చేయడం వల్ల కాబోలు సమాజంలో స్త్రీలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు ఎక్కువగా స్పందిస్తాను.

తర్వాత ఒంగోలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేసాను. గుంటూరు, ఒంగోలు మహిళా కళాశాలల్లో చాలా

కృషి చేసి విశ్వవిద్యాలయం ఎఫిలియేషన్ తో ఎం.ఏ. తెలుగు ఏర్పాటు చేసాను. అది నాకు సంతోషకరమైన విషయం.
జ్వలిత: కుటుంబం – ఉద్యోగము – సాహిత్యము వీటిని ఏ విధంగా బ్యాలెన్స్ చేసుకోగలిగారు?
సుశీలమ్మ: దీనికి సమాధానం మీకూ తెలుసు జ్వలిత గారు. ఈ మూడింటి సమన్వయం లో స్త్రీలందరం సర్కస్ ఫీట్లు లాగానో , ఉరుకులు పరుగులు తీస్తూనో ఉంటాం. కానీ మన ఆసక్తులు, బాధ్యతలు మనకు ధైర్యాన్నీ, సహనాన్ని ఇస్తాయనుకొంటా. నా వరకు నేనింకొంచెం శక్తి ని వెచ్చించాల్సి వచ్చింది. పిల్లలు చిన్నప్పుడే మా వారు చనిపోవడంతో వాళ్ళ సంరక్షణ, చదువులు, నా ఉద్యోగం, కళాశాల లో, బైటా సాహిత్య కార్యక్రమాలు....! కానీ ఇష్టం తో చేసాను కాబట్టి కష్టం అనిపించలేదు. పాప ఫుడ్ & న్యూట్రీషన్ లో పి.జీ. చేసి బెంగళూరు లో డైటీషియన్ గా చేస్తోంది. కూచిపూడి నృత్యం లో నేషనల్స్ వరకు వెళ్లింది. బాబు కరాటే లో బ్లాక్ బెల్ట్. పి.జీ.చేసి, ప్రస్తుతం ఇండియన్ ఆర్మీ లో కెప్టెన్ గా చేస్తున్నాడు. నేను ప్రిన్సిపాల్ గా రిటైర్ అయ్యాక, కొన్నాళ్ళు ( 5 నెలలు) ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ లో డిప్యూటీ డైరెక్టర్ గా చేసాను. ప్రస్తుతం పూర్తిగా సాహిత్యం చదవడం, రాయడం లోనే సమయం వినియోగిస్తున్నాను ఆనందంగా.
జ్వలిత: మీ రచనల గురించి చెప్పండి.
సుశీలమ్మ: ఇప్పటికి 9 పుస్తకాలు ప్రచురించాను. ఇంకో రెండు సిద్ధంగా ఉన్నాయి. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో మొదటి బ్యాచ్ ఎం.ఫిల్. "విశ్వనాథ సత్యనారాయణ గారి కిన్నెరసాని పాటలు",
తెలుగు విశ్వవిద్యాలయం లో పిహెచ్. డి. " ముళ్ళపూడి వెంకటరమణ రచనలు– సమగ్ర పరిశీలన ",
సురక్ష పత్రిక లో రాసిన వ్యాసా లతో " కవిత్వ పరామర్శ ", యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ " స్త్రీవాదం – పురుష రచయితలు"
విమర్శ వ్యాసాలతో "విమర్శా లోకనం",
పేరడీ రచనలతో "పేరడీ పెరేడ్"
కవితలతో " పడమటి వీధి " వచ్చాయి.
ఇక్కడ మరో విషయం చెప్పాలండీ. తెలుగు లో వెయ్యిన్నొక్క నవలలు రాసిన మహానుభావుడు ఒకరున్నారని చాలామంది కి తెలియదు. అది మనకు గర్వకారణం కదా! ఆయనే కొవ్వలి లక్ష్మీ నరసింహరావు గారు. కానీ అందులో 600 పుస్తకాలే లభ్యమౌతున్నాయని వారి కుమారుడు ( కొవ్వలి లక్ష్మీ నారాయణ) చెప్పారు. లేకుంటే ప్రపంచ రికార్డు మన తెలుగు రచయిత కు దక్కేది. ఆయనకు చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారండీ. (ఆ రోజుల్లో విపరీతంగా చదివిన వారు, ఇప్పుడు అందరూ 60 ఏళ్ళు దాటిన వారే). కానీ తెలుగు సాహిత్యం లో ఆయన పేరే లేదు. కనీసం ఆయన గురించి రాబోయే తరానికి తెలియజేయాలని కొవ్వలి వారి జీవిత చరిత్ర రాసాను. సంచిక వెబ్ మాగజైన్ లో సీరియల్ గా వస్తున్నప్పుడే సంచలనం అయింది. చాలా ఫోన్స్ వచ్చాయి. పత్రికలలో రివ్యూలు వచ్చినప్పుడు చాలామంది ఫోన్స్ చేసి పుస్తకం కావాలని అడిగారు.
జ్వలిత: మీరు అందుకొన్న గౌరవాలు?
సుశీలమ్మ: 1.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చే " ఉత్తమ అధ్యాపక పురస్కారం. 2. మద్రాసు తెలుగు అకాడమీ అవార్డు. 3. తెలుగు అధికార భాషా పురస్కారం. 4. ఎన్టీఆర్ తెలుగు మహిళా పురస్కారం 5. ఇందిరాగాంధీ సేవా పురస్కారం 6.మదర్ థెరిస్సా సేవా పురస్కారం 7. విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య పురస్కారం 8. గిడుగు రామ్మూర్తి సాహిత్య పురస్కారం 9.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2021లో ఏ.పీ., సి.ఐ.డి.వారి " సాహితీ పురస్కారం". 10. స్వాతంత్ర్య సమర యోధుడు ఎం. నాగయ్య స్మారక పురస్కారం, తిరువూరు ( జీవిత చరిత్రలు విభాగం లో కొవ్వలి వారి పుస్తకానికి) 11. కవి సంధ్య ప్రతిభా పురస్కారం. శిఖామణి, యానాం.(పరిశోధన రంగంలో)
జ్వలిత: ప్రస్తుత సాహిత్యం లో రాజకీయాలు?
సుశీలమ్మ: సాహిత్యం లో రాజకీయాలు చొరబడి, రాజకీయాలకు అనుబంధం గా ఆయా సాహిత్య వేదికలు ఏర్పడడం ఎప్పుడో చూసాం. అయితే వాటికి నిర్దిష్టమైన సిద్ధాంత నేపథ్యం బలంగా ఉంది. అందరూ కమిట్మెంట్ ఉన్నవారు. కానీ ఇప్పుడు సాహిత్యం లో "రాజకీయాలు" మంచి అర్థం లో వాడలేక పోతున్నాం. ఈ "రాజకీయాలు" అన్న మాట ని చెడు అర్థం లోనే అనుకొంటున్నాను. గ్రూపులు, ముఠాలు గా ఏర్పడి, అవాంఛనీయ వాదోపవాదాలు, పంతాలు, నిరర్థక కక్షలు, ద్వేషాలు పెరిగిపోతున్నాయి. ఏ వైపుకూ వొగ్గని వారు ఏం మాట్లాడాలన్నా భయపడుతున్నారు. పోనీ వాళ్ళైనా తమ అభిప్రాయం మీద గట్టిగా నిలబడతారా అంటే, రోజుల్లోనే... అభిప్రాయాలు, గ్రూపులు స్వలాభం కోసం మారిపోతుంటారు. "సాహిత్యాన్ని సాహిత్యం గానే" చూడాలని, దానిలో పాలిట్రిక్స్ రానీయకూడదని నా అభిప్రాయం.
జ్వలిత:" బహుళ " పాఠకులకు, రచయితలకు మీ సలహాలు, సూచనలు?
సుశీలమ్మ: జ్వలిత గారు! మీరు ప్రారంభించిన " బహుళ" అంతర్జాతీయ అంతర్జాల పత్రిక చాలా బాగుందండి. మీకు అభినందనలు. సంచిక ప్రారంభం లో కథల పోటీ పెట్టి నన్ను న్యాయనిర్ణేతగా ఉండమని, నన్నూ భాగస్వామి గా చేసినందుకు మీకు కృతజ్ఞతలు.
పత్రికలో కవితలు, కథలు, వ్యాసాలు, (ఒక నాటకం, ఒక సీరియల్) అన్నీ స్త్రీ లకు, స్త్రీల సమస్యలకు సంబంధించినవే ఉండడం ప్రశంసనీయం. రెండు ప్రింట్ లోనూ, రెండు ఆన్లైన్ లోనూ వచ్చాయి కదా. ఇంకొన్ని అంతర్జాల పత్రికలు కూడా కేవలం స్త్రీల కొరకే

వస్తున్నాయి. అయినా మరో పత్రిక రావడం అవసరం, ఆనందం.
మీకు తెలుసా, "బహుళ" పత్రికలు గురించి ఒక వ్యాసం రాసి ఒక పత్రిక కు పంపాను. త్వరలో ప్రచురణ కాబోతున్నది.
జ్వలిత: అవునా! ధన్యవాదాలండీ.
జ్వలిత: రేపటి రచయితలకు, వర్ధమాన రచయితలకు మీరిచ్చే సలహాలు ఏమిటి?
సుశీలమ్మ: రాయడానికంటే ముందు బాగా చదవాలి. మంచి రైటర్ కావాలంటే మొదట మంచి రీడర్ కావాలి. ప్రాచీన సాహిత్యం కాకపోయినా, ఆధునిక సాహిత్యమే సముద్రమంత ఉంది. ఆనందంగా మునకలు వేయాలి. ఏ పుస్తకం తెలీదు, ఏ రచయితా తెలీదు. రాసేస్తారు. ఆ అపరిపక్వత తెలిసిపోతూనే ఉంటుంది. ఇంకో బాధాకరమైన విషయం ఏమిటంటే – పాత భారతి, ఆంధ్ర పత్రిక ల వంటి వాటిల్లో ఆరోజుల్లో పడిన కథల్ని కొంచెం అటూ ఇటూ మార్చి రాసేస్తున్నారు కొందరు. మరీ ఘోరం ఏమిటంటే – మార్చే కష్టం కూడా పడకుండా రచయిత/త్రి పేరు మార్చేసి తమ పేరు పెట్టేసుకొంటున్నారు. మా లాగా ఆనాటి నుండి చదివే వాళ్ళం ఆ కథ ఆ రోజుల్లో దేనిలో వచ్చిందో కూడా చెప్పేస్తున్నాం. పేరు కోసమో, బహుమతి కోసమో ఇలాంటి పనులు చేయడం గర్హనీయం. బాగా చదవాలి, తమ మనసులో కలిగిన సహజమైన స్వచ్ఛమైన భావోద్వేగాలతో రాయాలి అని నా అభిప్రాయం. రాయడం ఏమిటి... అసలు రీడింగ్ అన్నదే నేటి యువతరానికి లేకుండా పోయిందే అన్నది మరో విషాదం అనుకోండి.
జ్వలిత: చాలా విషయాలు ముచ్చడించుకొన్నాం. ధన్యవాదాలండీ.
సుశీలమ్మ: ధన్యవాదాలు జ్వలిత గారు!

★★ ★★ ★★

**ప్రొఫెసర్ సిహెచ్. సుశీలమ్మ** రిటైర్డ్ ప్రిన్సిపాల్,
పూర్వ ఉప సంచాలకులు, తెలుగు అకాడమీ, ఆంధ్రప్రదేశ్.

కవిత

# దగ్ధగీతం

- చొక్కరతాతారావు
విశాఖపట్నం, 6301192215

బిడ్డ కేక పెట్టింది
లేబర్ రూం తలుపు తెరుచుకుంది
తల్లి మొహంలో ఆనందం
భర్త పెదవి విరిచాడు
ఆడ శిశువు నవ్వింది
తండ్రి మొహం చాటేశాడు
తల్లి మనసులో ప్రశ్నార్థకం?
భర్త ఈసడింపు మాటలు
శూలాల్లా గుచ్చుకున్నాయి
బారసాల లేదు
పుట్టినరోజు లేదు
ఆడపిల్లకి అవసరమా అన్నాడు
సంతోషం– చదువు అడ్డుకోలేదు
కాలేజీలో అడుగు పెట్టింది
పడగ నీడ వెంటాడింది
ఒళ్ళంతా తడిమే చూపుల బాణాలు
గుండెల్లో గుచ్చుకున్నాయి
పెళ్ళయ్యాక భర్త ఆగడాలు
మొదటి రాత్రే తాగొచ్చాడు
జీవితం అలా మొదలయింది
రాజీ పడడం అలవాటయింది
కట్నం తెమ్మన్నాడు
ఇంట్లో పేదరికం
డబ్బులేదు పొమ్మన్నాడు తండ్రి
తిట్టాడు కొట్టాడు
భర్త కద భరించింది
సేవలు చేసి శుష్కించింది
తిరుగుబోతు భర్త
తాగి తాగి చచ్చాడు
జీవితం ఎప్పుడో బద్దలయింది
ఇప్పుడు గాజులు పగిలాయి
తిండిలేక శరీరం నీరసించింది
రెక్కలొచ్చి బిడ్డలు ఎగిరిపోయారు
గాజు కళ్ళు
లోయల్లా ఉన్నాయి
తోలుసంచి
గంగడోలులా వేలాడు
తోంది
కాళ్ళు కీళ్ళు సడలిపోయాయి
తిండి లేక చావు రాక
కాటికి కాలు చాపుకుని
మృత్యువు కోసం చూస్తోంది
ఆమె ఓ దుఃఖ వర్షితురాలు
కొవ్వొత్తిలా కరిగిపోయింది
వెలుగు నోచుకోలేదు
అందరికీ సేవలు చేసి
అనాథలా మిగిలిపోయింది
ఆమె ఓ దగ్ధగీతం

కథ

# ధర్మపన్నము



- తమ్మెర రాధిక

హనుమకొండ 6304581576

సాయంకాలం ఆకాశంలో మబ్బులు క్రమంగా రంగులు మారుతున్నాయి. చెట్టు క్రింద నిలబడ్డ అలివేలు పిల్లలిద్దరినీ చెరోవైపు పొదుపుకుని, వాళ్ళ తలల మీద తుండు కప్పింది చినుకులు రాల్తాయేమోనని, ''అమ్మా ఆకలైతుందే...'' ''నిద్రొస్తున్నదే...'' పిల్లలు చలికి ముడుచుకుంటున్నారు. కొంగున కట్టుకున్న మూట విప్పి అటుకులు చెరో గుప్పెడు పెట్టింది. వాళ్ళను మరింత దగ్గరికి తీసుకుంటూ, భర్త ఇంతలో ఎటు వెళ్ళాడా అని తలతిప్పి చూసింది అటూ ఇటూ. దూరాన బస్సు వస్తూ వుండటం... నెత్తి మీద టప టపాని చినుకులు రాలడం ఒకేసారి జరిగింది.

భాస్కరం తుప్పల చాటు నుంచి పరిగెత్తుకొచ్చాడు పదండి పదండంటూ.... వాళ్ళు బస్సెక్కుతుండగానే వర్షం జోరందుకుంది. ఊరి నించి దూరమైతున్నా కొద్ది ఆ కుటుంబం ముసురులో చిక్కుకున్నట్టుగా అల్లాడి పోయారు. బొడ్లో దోపుకున్న నాలుగు వందల రూపాయల భరవసానే ఊపిరి తీసుకోనిస్తోంది వాళ్ళని.

గారూ... మాగల్లు వెళ్తున్నారంట గదా! మకాం పూర్తిగా ఎత్తేసారా ఏంటి ? పెంకుటిల్లు వుందిగా కండక్టరు టిక్కెట్టు తీసిస్తూ అడిగాడు.

''ఆc... ఇల్లు అమ్మానయ్యా... మన కంసాలి బత్తుడు నారాచారి కొన్నాడు. కొన్ని అప్పులు కట్టేసాను... మాగల్లులో పురోహితుడు గానీ పూజారిగానీ ఎవ్వరూ లేరుట, ఆ వూరి మునసబు గారు అక్కడికి రమ్మన్నారు నన్ను... అందుకని వెళ్తున్నాను.'' చెప్తున్న అతని గొంతు వణికింది.

''మంచిదే లెండి... ఎక్కడ సాపాటు జరుగుతే అక్కడికే వెళ్ళాల... రెడ్డిపల్లెలో మీరు చానా అగచాట్లు పడ్డారు.... మరి పెందరాడే బయలు దేరక పోయారా మరీ చీకటి పడేట్టు వుంది మీరు మాగల్లు చేరేసరికి, వానొకటి పైనించి'' అన్నాడు టిక్కెట్టు చించుతూ. చీకటి తెరలు తెరలుగా ముంచుకొచ్చి కన్ను పొడుచుకున్నా కనపడనంత గాఢత అలుముకుంది మాగల్లులో బస్సు ఆగే సరికి, పెట్రోమాక్స్ లైట్లు పట్టుకొని గొడుగులు వేసుకొని బస్సు దగ్గరికి నలుగురైదుగురు మనుషులు వచ్చారు. పిల్లలు నిద్రమొహాలతో తల్లిదండ్రుల భుజాల మీద వాలిపోయి వున్నారు. వచ్చిన మనుషులైతే నాలుగైదు సామాన్ల మూటలు బస్సులోంచి దింపి గుడి మెట్ల మీదకు చేర్చారు. ''పంతులు గారూ... ఈ రాత్రికి పిల్లా జెల్లాతో ఈ గుళ్ళో వున్న గదిలో వుండండి. పొద్దున్నే మునసబు గారూ, ఊరి పెద్దలూ అంతా వస్తారు... తెల్లారి స్నానాలు గట్రా చేసి వుంటే కొత్తింటికి పోదురు'' అన్నారు వాళ్ళు. కడుపులో ఆకలి దంచేస్తోంది. సామాను గదిలోకి మారుస్తూ

''ఆ మేజా మీద అరటి పళ్ళు, ఆ కుండలో మజ్జిగా వున్నాయి...'' వాళ్ళు బైటికి వచ్చారు గదిలోంచి, బిక్కు బిక్కుమంటూ జంపకానాల మీన కూర్చున్న పిల్లలు ఆవురావురు మంటూ తిండి మీద పడ్డారు. భాస్కరం కూడా వాళ్ళతో పాటు బైటికి అరుగు మీదకు వచ్చాడు. కాసేపు మాట్లాడాక ''మాగల్లు పూర్వ మా మేనమామల ముత్తాతల ఊరు... వృత్తి చేతగాక ఉపాదానం చేసుకునేవార ! దాదాపు వంద ఏళ్ళ తరువాత వారి రక్తసంబంధీకుణ్ణి జీవన భృతి కోసం ఇక్కడికి వచ్చాను.'' భాస్కరం గొంతులో ఉద్విగ్నం తొంగి చూసింది. వాళ్ళు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. తమ ఊరు చాలా మంచిదనీ, చిన్నా పెద్ద గొప్పా బీదా తేడా లేకుండా అంతా కలిసి మెలిసి వుంటామనీ, మా దగ్గర వున్నందుకు మీ పిల్లలు కూడా మంచి వృద్ధిలోకి వస్తారు. అని కాసిన్ని మంచి మాటలు చెప్పి వెళ్ళిపోయారు.

భాస్కరం గదిలోకి వచ్చేసరికి పిల్లలు తినేసి పడుకున్నారు. వాళ్ళు కూడా కాస్త ఎంగిలి పడి, తల క్రింద గుడ్డ మూటలు మెత్తగా చేసుకు పడుకున్నారు. భాస్కరం ఊరు రెడ్డిపల్లెలో జనాభా ఎక్కువైనకొద్దీ పూజార్ల అవసరం ఎక్కువై ఎక్కడెక్కడినుండో అయగార్లు వచ్చి స్థిరపడటం మొదలైంది. తండ్రి పెద్దతనం వల్ల మునపటలాగా బైటికి వెళ్ళలేక పోతున్నాడు. ఆయన వుంటున్న యింటిలోనే పంచలో తడక అడ్డం కట్టి స్కూలు పిల్లాడికి కిరాయికి ఇచ్చాడు. భాస్కరానికి రెండు గదుల రేకుల షెడ్డు వుంది. ఇద్దరు పిల్లలతో పౌరోహిత్యంమ్మీద సంసారం వెళ్ళదీయలేక నానా అవస్థలు పడుతున్నాడు. వెనకటి నించీ వున్న పూజార్లు ఆర్థికంగా కుదేలు అయ్యారు. తండ్రి మూలబడ్డాక భాస్కరం పని మరీ తీసికట్టుగా అయ్యింది. రేకుల షెడ్డు అద్దెకిచ్చీ, తండ్రి వాటాలో గుట్టుగా బ్రతుకుదామని ఎంత ప్రయత్నించినా అతని జీవితం అతని చేతుల్లోంచి జారిపోయింది.

పదోపరకో ఎవరైనా రాలుస్తే అది తక్షణం అన్నం కుండలోకి మారిపోయేది. ఇలా బ్రతికినన్నాళ్ళూ తనకు పరగడుపే

అని తలపోసాడు. ఎంతకని ఎవరైనా అరుస్తారు? ఎంతకని తీరుస్తారు? తినేందుకు ఆయవన్న తిండిలేక... ఊళ్ళో సరైన ఉనికి లేక, భాస్కరం కనపడితే పరిచయస్తులు మొహం చేటు చేసుకుంటున్నారు. ఎవరైనా ఆత్మీయులు చేబదులు ఇస్తే ఆ కాస్తూ, వీసం కరగదీసుకుని ఇంటి ముందు అరుగుల మీద కూర్చునేవాడు. విద్వత్తు వున్నా ఉపయోగించుకునే వారేరీ? ఉన్న ఊళ్ళో బేడ డబ్బుల కోసం పగలు రెండు గళ్ళు, సాయంకాలం రెండు గంటలు కా ఇచ్చిన వాడు చిరాగ్గా మొహం పెట్టుకుంటే, ఇవ్వనివాడు పరిహాసంగా మాట్లాడేవాడు. అలివేలు పు 2/6 దుర్భరంగా తోచి మాగల్లులో పురోహితుడు కావల్సి వుందిట వెంటనే బైలుదేరండి అన్నారు. అలా కొత్త జీవితం బారసాల జరగబోతోంది... మొండి ధైర్యంతో ఇల్లమ్మేసాడు రెండో కంటికి తెలియకుండా... చిన్నా చితకా సామాను మూటలు కట్టించుకొని మాగల్లు వచ్చేసాడు. రేపటి భవిష్యత్తు ఏంటో... జరుగుబాటు ఎలా వుంటుందో అని దిగులుతో అతని కనురెప్పలు మూతపడటం లేదు. అలివేలు జంపకానా మీద వాలిన పళాన నిద్దరోయింది.

తెల్లార్తూనే స్నానం కానిచ్చిన భాస్కరం ఉన్నంతలో మంచి పంచె కట్టుకుని వీభూది పట్టెలు రాసుకుని, కండువా సరిచూసుకుంటూ అందర్నీ త్వరగా కానీయమన్నాడు. గుడి ముందు ఎడ్లబండి వుంది.. సన్నాయి మేళం వాళ్ళు అరుగు మీద కూర్చుని వున్నారు... మునసబు, రెడ్డి, చిట్టినాయుడు, కరణంలాంటోళ్ళంతా గుళ్ళోకొచ్చి వాస్గరాన్ని చూసారు. వాళ్ళందర్నీ అని లోలోపల కాస్త ఒళ్ళు గగుర్పాటు తోచింది. అందరూ 'దండాలండీ వంతులు గారు' అన్నారు. తడబడిపోయాడు భాస్కరం. ''రాత్రి వచ్చి కలుద్దామనుకున్నాం గానీ వర్షం మూలకంగా రాలేక మీ బస గుళ్ళో ఏర్పాటు చేయించాం... కరణం గారు అతని స్థితిని అంచనా వేస్తూ అడిగాడు. లేదు... తమ దయ... మరి సెలవయితే'' పోదామా అన్నట్టుగా గొణిగాడు. అంత మందీ ముందర నిజంగానే ఇబ్బందిగా వుంది.

'' తాహతుక లోకాన్నంతా మరమ్మత్తు చెయ్యలేం గానీ, ఒక సంసారిని దేవుళ్ళాట లేకుండా కష్టం గట్టెక్కేదాకా కనిపెట్టలేమా అన్న ధీమాతో మిమ్మల్ని రప్పించాం... మా ఊరినీ, ఊరి ప్రజలకూ మంచీ చెడ్డా చెబుతూ వుంటారని.'' అంటూ ముందుకు సాగారు.

ఆడవాళ్ళు ఎడ్లబండీలో ఎక్కితే, సన్నాయి మేళంతో పాటు అందరూ ఊళ్ళోకి బైలుదేరారు. రోడ్డుపైనున్న జనం విషయం తెలుసుకుంటూ వారూ అందర్లో పాటు ఊళ్ళోకి నడక సాగించారు. రెడ్డిపల్లెలాగా ఊరు అంత పెద్దది కాకపోయినా మోస్తరుగా బాగానే వుంది. సిన పచ్చటి వాళ్లు... ఇంటి ముందు కణీలు పాతిన వేసిన కొబ్బరాకుల పందిళ్ళు.... గడ్డి వాముల మీ పాల తీగలూ, పాడి పశువులతో దిట్టంగానే వుంది ఊరని ఊహించింది అలివేలు. రణం కట్టి వాకిట్లో పిండి ముగ్గేసిన ఇంటి ముందాగింది బండి. తెల్లారుజామున గంటలు మోగుతుంటే చెరువుమీద పకక్షులన్నీ ఘల్లున లేచాయి. ఊరి జనవంతా చెవులు బెట్టుకుని విన్నారు. రెండ్రోజులు కొత్తయినా మూడోనాటికి భాస్కరం గొంతుకు, మంత్రానికి ఊరి జనం అలవాటు డిపోయారు. అలివేలు చీకటితోనే దొడ్లో బావిదగ్గరి పొయిలో నిప్పేసి కొప్పెర పడేసి అలుకు వెయ్యడాకిని వచ్చిన వెంకమ్మతో ఊరి విషయాలు భోగట్టా చేసింది. మరచెంబు ఇచ్చి ఆమెని కాశయ్యగారింటికి పాలకు పంపి, అది వచ్చేలోగా స్నానం చేసి కుంపటి అంటించేది. పొలాలకు పోతూనో, ఏదైనా సమస్యకు ప్రశ్న చెప్పించుకోవాలనో, పిల్లలకు జాతక చక్రం వెయ్యమనో, ముహూర్తాలు పెట్టమనో వచ్చేవారు, ప్రత్యేకం అయ్యగార్ని కల్సిపోదాం అనో వచ్చేవారు ఉత్త చేతులతో రాకుండా కాయో, కందో తెచ్చి చాపమీద పెట్టేవారు.

వాళ్ళు అడిగే ప్రశ్నలకు, వాళ్ళకు నచ్చే విధంగా పిట్ట కథలతో సహా సమాధానాలు చెప్పేవాడు భాస్కరం. ప్రత్యేకం ఎవరైనా పురిటికి వుంటే ముందుగానే వాళ్ళకు చెప్పి వుంచేవాడు. సమయం గమనించుకుని వచ్చి తనకు చెప్పమనే వాడు. ఎందుకంటే సమయం తెలుస్తే పిల్లల జాతకం చక్కగా వస్తుందనీ, ఖచ్చితంగా వుంటుందనీ, భవిష్యత్తులో జరగబోయే విపత్తులో, అవరోధాలూ ముందుగానే ఊహించి నివారించుకోవచ్చని చెప్పేవాడు. కరణంగారు మనసులోనే మెచుకున్నాడు. నలుగురిలో మెలగనేర్చిన మనిషని, పెద్దలెవరైనా ఆ వీధిగుండా పోతుంటే కాళ్ళు బారచాపుకు కుర్చీలో పడుకున్న వాడల్లా లేచి, వీధి అరుగు దగ్గరసా వచ్చి కుశల ప్రశ్నలు వేసేవాడు. లోపలికి దయచేయమనే వాడు.

వేడి సోకినా వెన్నెల కురిసినా పర్వతానికి చలనం లేనట్టే భాస్కరం కూడా అంతే, వా' వచ్చినా, మరలా వస్తామని వెళ్ళిపోయినా వున్నవాళ్ళకే సుద్దులు చెప్పడంలో నోరు క్షణం ఊరుక 3/6 అడగని వాళ్ళది పాపం ఉత్పాతాలు తవ్వి తలకెత్తేవాడు. వచ్చినవాడి జేబు సహం ఖాళీ అయ్యేది... పైగా అంశాలనంతగా సంభరాలు గంపలో ఇంటికొచ్చి పడేవి పరిహారం క్రింద... దానాల క్రిందనూ...

దొడ్డి వాకిట్లో అలివేలు పెసళ్ళు, కందులూ, మినుములూ లాంటివన్నీ శుభ్రంగా చెరిగి వుచ్చూ గిచ్చూ ఏరి బూడిద కలిపి గారిగా బస్తాలకు గుడ్డ సంచులకు ఎత్తి పెట్టి వుంచేది,

ఓ చెంప భాస్కరం దానాలు పడుతూ ఇంటి ముందు వుంటే మరో చెంపను అలివేలు ఆ సరుకు సంబరాలూ మూటలు కట్టి దాచి ఏరువాక నాటికి విత్తనాలుగా సన్నకారు రైతులకు పదికో పరకకో అమ్మి సొమ్ము చేసుకునేది. ఖర్జూర పళ్ళు, పీటీ వక్కలు లాంటి వన్నీ పొన్నలూరు సంతలో అమ్ముకు రమ్మనమని భర్తకు మూటకట్టి ఇచ్చేది.

అట్లా కూడిన సొత్తుతో కంసాలి బత్తుడితో బేసర్లు, చెవుల దుద్దులూ, పాపిట బిళ్ళా లాంటివి చేయించింది. ఊరి పిల్లలతో పాటు తమ పిల్లల్ని కూర్చుండబెట్టి అరుగు మీద బడి భాస్కరం చెబితే, ముందు గదిలో పలకల మీద దిద్దిస్తూ రాతపని అలివేలు కానిచ్చేది. కంఠాలు అర్చుకు పోయేట్టు పద్యాలూ, ఎక్కాలూ వల్లెవేస్తూ నానా కంగాళీగా వుండేది ఆవరణంతాను, ఊరి పెద్దల్లు గ్రామం ఒక గాటున పడినందుకు సంతోషించారు. మాగల్లు చుట్టుప్రక్కల గ్రామాలలో ఏ అగ్రహారీకుల ఇళ్ళల్లో తద్దినాలైనా ముతెదువుగా

చనిపోయిన స్త్రీల తద్దినాలకు అలివేలు బండి కట్టించుకోవలసిందే! చీరే సారే గారెలతో తిరిగి ఇంటికి రావలసిందే భుక్తాయాసంతో, ఓ రోజు భార్యతో చెప్పాడు భాస్కరం ''నాన్న ఉత్తరం రాసాడు మన సుబ్బాయికి నాలుగు జందెం పోగులు మెళ్ళో వేసేదుందా లేదా, అక్కడా ఇంకా యాయవారమే వెలగబెడుతున్నావా ? ఈ నాలుగేళ్ళల్లో ఏపాటి వెనకేసావు ?'' అని. పన్నెండు గంటల పోస్టులో వచ్చిన ఉత్తరం చదివి బల్లమీద గిరాటు వేసాడు. ''మీ తాతగారు సంపాయించింది మావయ్య గారేం పెంచి పెద్ద చేసారేం ? మీ నలుగురప్ప చెల్లెళ్ళు పెళ్ళిళ్ళు.

పేరంటాలూ కార్యకరామత్తులు అయ్యేలోగా మీరూ అప్పుడప్పుడేగా జందెం పోగు వేసుకుని ఊరి మీద పడింది సంపాదనకు. అడ రొస్టంతా ఇంటిమీద పడి తినేవారేనయ్యే ! ఊళ్ళో యాయవారానికి తప్ప దేనికి పనికొచ్చారు మీరు ? వసతులన్ని తుడిచిపెట్టుకు పోయాక కాదు ఆయన కళ్ళు తెరిపిన పడి మనల్ని ఊరు దాటనిచ్చారు ? అందుక్కాదు నా కాపరానికి అగచాట్లు వచ్చిందీ ?'' అలివేలు గొంతు దుఃఖపు జీరతో ఖంగుమంది. ''ఇదిగో ఒకటి ఆలోచించాలి నువ్వు... అక్కడ కష్టాలు వస్తేనే కదూ ఇక్కడికొచ్చి పద్దాం ! మనమేం పుట్టు: భోగులం కాదు. నువ్వు కాస్త వెనకేసావు. నేనూ కాస్తో కూస్తో పరవతీ, ఊరి పెద్దల కటాక్షం సంపాయించాను. ఉన్నపళంగా ఇప్పుడు ఉపనయనం అంటే మనం సంపాయించిన అరాకొరా సొత్తు తీర్థ ప్రజలలాగా వచ్చిపడే బంధువులు ఊది పారేస్తారు... ఇహ మళ్ళీ మనం.......భాస్కరం ఆర్ద్రోక్తిలో ఆగిపోయాడు.

''ఇలా బ్రతికే కన్నా విషం పుచ్చుకుని...''''చాలించవే పిచ్చిదానా, ఎదుటనున్న సిద్ధాన్నం చెడగొట్టుకుంటామా ! ఉపనయనం ఊరివాళ్ళ దాతృత్వంతో దాటెయ్యాలి. నిలవ పైకం దాచెయ్యాలి.'' ఆలోచిస్తూ అన్నాడు. ''బ్రతికినన్నాళ్ళు పరగడుపే... ఎవరు ఆరుస్తారు... ఎవరు తీరుస్తారు ? ''నిజమే రెడ్డిపల్లెలో ఆగమ్మ కాకిలాగా తిరుగుతూ ఎన్నాళ్ళు అగచాట్లు భుక్తి జరగడం కోసం ?'' ''ఊరివాళ్ళ కడుపులు చల్లగా... మనం కాస్త నిలదొక్కుకునే దాకానైనా ఈ వార్షికాలు ఇలానే వుంటే... పిల్లాడి కడుపులో నాలుగక్షరం ముక్కలు పడినాయంటే ఏ గవుర్మెంటు నౌకరీవో చేసుకుంటే వాడి నీడను బ్రతుకు వెళ్ళిపోతుంది.'' అంది అలివేలు తడి, ఆశ నిండిన కళ్ళతో. బంధు జనమంతా ఈ తాకిడిని ఉత్తగా ఏం చూడరు. మాగల్లులో వీడికింత జరుగుబాటా, ఇంత గౌరవమా అని తల్లక్రిందులైపోరూ... వచ్చే ఆదాయానికి ఎక్కడో తూట పొడిచే పోతారు...

ఏకంగా మావగారి కుటుంబాన్ని ఇక్కడే తిష్ట వేసేలా చేసి అక్కడి స్థానాన్ని ఎవరో ఒకరు స్వాధీనం చేసుకుంటారు. అంతటి లాచారీతనానికి జారీ నీచత్వం ప్రదర్శిస్తారు.... ఇహ అక్కడి నుండి అయిందానికీ, కాందానికీ వేళా పాళా లేని రాకపోకలు సాగిస్తారు. ఆలోచిస్తున్న భాస్కరం మనసులో లేదు. ఎవరో నాన్నకు మనసులో పుట్ర లేపి మరీ ఉత్తరం రాయించారు. ఇక్కడి నుంచి జవాబు ఏం వెళ్ళుతుందో దాన్ని బట్టి అవతలివారి ప్రణాళిక వుంటుంది. భార్య వైపు చూసాడు.

''నీ కలలు బానే వున్నాయి... అవి పండేనాటికి ఎన్ని తిప్పలు నెత్తినెత్తుకోవాలో ! భర్త మాటలకు – ''మనం పడ్డ తిప్పలన్నీ రెడ్డిపల్లెలోనే పడ్డాం. ఎప్పుడూ దొడ్లో తోటకూర తెంపి దాంట్లోకి నాలుగు కంది బద్దలు అడ్డంవేసి పొడికూరా, చింతపండు చారూ ఇవేగా పంచభక్ష పరమాన్నాలు... ఎంతసేపూ దోస వరుగులూ, వంకాయ వరుగులూ, మాగాయ పచ్చడీ... ఇవేగా మన ఇలవేల్పులూ... ఇక్కడి కొచ్చిపడ్డాక మంచి గుమ్మడి ధప్పళం, కలగలుపు ముక్కల పప్పుచారూ, సొరకాయ పప్పు, కొబ్బరి పచ్చడీ ఇలా ఏ రోజూ నాలుగు రకాలు లేకుండా ముద్ద ఎత్తడం లేదుకదా పిల్లలు చూడండీ ఎంత ఆరోగ్యంగా పనసపళ్ళల్లా తేలారో ?'' అంది కళ్ళనిండుగా వాళ్ళను చూస్తూ. ''నాకు తెలీదుటే... నువ్వు పడ్డ కష్టం అంతా కళ్ళల్లో కనపడుతుంటేనూ.. ఒకటే మాట చెప్పాలి నాయన గారికి ఎలాగూ అంతా మాగల్లు వస్తారు కనుక, ఇక్కడి సౌభాగ్యం చూస్తారు గనుకా, అమ్మ అడిగిందల్లా అక్కలకు ఇచ్చి పంపాలి...

వారి ముందు నువ్వెన్ని బులిబుచ్చికాలు పోయినా జాలీ దయా చూపరు. అందుకని నాకొకటే తోస్తోంది.'' అలివేలు మనసులో ఏంటో తెలియని ఆక్రోశం. నాలుగేళ్ళుగా నానా అగచాట్లు పడి కాస్త సొమ్ము వెనకేసి కంసాలి చేత చంద్రహారం, గాజులూ చేయించుకుంది... రేపు ఆడపిల్ల వుంది... పరికిణీ వోణీలు వేసే రోజు వస్తే పెట్టుపోతల క్రింద ఆ నగలు పెట్టి గొప్ప చాటుకోవాలన్న ఉబలాటం ఆమెది. ఇప్పుడు ఒడుగుల పేరుతో పోగేసిన నాలుగు పరకలు ఆడపడుచులు ఊది పారేస్తే తన గతేం కాను ! చివరికి బంధుజనంతో సిగపట్లదాకా వస్తుంది. ఉపనయనం చెయ్యకపోతే, ఎటూ తోచక ఉత్తరం పట్టుకుని కాసేపు గిజాటు పడ్డారు. ఆఖరికి భర్త అభిప్రాయం విని నిశ్చింత పడింది.

''గోరు ఎంత పెరిగినా గొడ్డలైతుందిటే శాంతం!!''.. కోడలు పెట్టిన పెద్దంచు రుద్రాక్ష రంగు చీర ఎదమీద వేసుకుంటూ మురిపెంగా అంది కూతురితో యశోద. తనకు పెట్టిన చీరా, పట్టంచు ధోవతులూ సంచీలో సర్దుకుంటూ ''ఏం మాటో అది ?'' అంది శాంతం. ''మాగల్లులో వెలక్కాయంత బంగారం సంపాయించారని వాడి మీద పుకారు లేవదీసారు పాపం... అక్కడ చెయ్యలేకనే కదూ ఉపనయనం మళ్ళా వెనక్కొచ్చి చేసాడు బిడ్డ.... చూడు అక్కడ ఎంత సంపాయించినా గొప్పలు పోవడం లేదు కోడలు... వాళ్ళ ఇల్లమ్మి పట్టుకుపోయిన డబ్బులతో మల్లూరులోనే భూవీ బుట్టా ఏర్పాటు చేసుకుంటారు!!'' తల్లి పరవశం చూసి మిగతా కూతుళ్ళు మూతి ముప్పయ్యారు వంకలు తిప్పారు.

''గోడకు నామం పెడితే గోవిందుడవుతాట్టే నీ పిచ్చిగానీ... సంపాయించిన నిక్షేపం అక్కడే దాచబెట్టి వచ్చిందో.... తాలూ తప్పుకూ గోతాంలో వేసుకొచ్చి ఇక్కడ వండి వారుస్తే ఎవరు చూడొచ్చారూ !'' అంది శాంతం. ఆమెకు మనసులో మరుగుతోంది. నాలుగు పట్టు పీతాంబరాలూ, పట్టు పంచెలూ ఆడబిడ్డలకు పెట్టి లౌక్యం చూపిస్తోంది వదినగారని. అలివేలు గదిలో సామాను

సర్దుతోందల్లా అడపడుచు మాట విని కనుబొమ్మలు పైకెత్తి భర్తను చూసింది. ఛర్రున గదిలోంచి బైటికొచ్చాడు భాస్కరం. ''చెల్లాయ్ వినూ...

మాగల్లులో మేం సుఖపడి చచ్చిందేం లేదు. పాండిత్యం అమ్ముకుంటూ కూరానారాకు సంపాయించుకున్నాను... దాన్ని గుట్టుగా సవరించుకుంటూ మీ వదిన పెంపు చేసుకుంటూ చాకిరీతో అలుగుడ్డగా తయ్యారైంది. ఎవరైనా ఎప్పుడైనా అడిగారా దాని ఆరోగ్యం ఎలాగుందో! మీ అందరికీ మీ ఇళ్ళల్లో సిద్ధాన్నాలు తయ్యారుగా వుంటాయి. కానీ మాకలా కాదు... కాలు కదిలిస్తే ఖర్చు.... మా సంపాదనంతా గాలివాటం. ఒకరోజు రావచ్చు... మరోనాడు రాకపోవచ్చు... నా సంపాదనంతా నేనే నూరుకు తాగుతానా ! వడుగు చేసుకొస్తాను అని చెప్పగానే వడుగు పేరున మునసబుగారు పట్టు పీతాంబరాలు ముట్టజెప్పారు... కరణం గారు కొంత సరుకు సంబారాలు ఇప్పించారు. అవన్నీ క్రమంగా తీర్చుకోవలసినవే! పైగా అమ్మా నాన్నల్ని కూడా నా దగ్గరికి తీసుకుపోతున్నాను. ఆయనకు అక్కడే ఏదైనా సదుపాయం చూస్తాను ఆయన ఇల్లమ్మి. ఎల్లకాలం రోజులిలాగే వుండవుగా... కాస్త ఎగుడూ...

దిగుడూనూ నాయినా వాళ్ళ మంచీ చెడ్డా నేను గాపోతే ఎవరు చూస్తారూ !

అక్కడైతే ఎలాంటి పోరూ పొచ్చెమూ లేదు... ఇల్లమ్మగా వచ్చిన డబ్బుల్తో రవ్వంత భూమి కొంటాను...''. భాస్కరం మాటలు అనంత ప్రవాహాలయినాయి... వడుగు చేసిన ధయిర్యమో అయిన వాళ్ళ అఘాయిత్యపు పనులో.... మాట వచ్చినప్పుడే మీద పడెయ్యాలన్న తపనో.... సంజదీపం. పెట్టే వేళలో! అలివేలు చిరునవ్వుతో.... దీపపు వెలుగులాగే రెప... రెపా... అంటోంది. వచ్చిన పనయ్యింది... ఖర్చు సాకుతో తండ్రి కళ్ళెదురుగా వడుగు చేసాడు... అక్కడి సంపాదన ఎవ్వరి కళ్ళపడకుండా దాయగలిగాడు... పెద్దాళ్ళను సాదే నెపంతో వూరికి దూరంగా వాళ్ళను తీసుకెళ్ళిపోతున్నాడు.... సంజాయిషీ చెప్పనవసరం లేదన్నట్టుగా వాకిట్లోకి వెళుతోన్న భాస్కరాన్ని నిర్ఘాంతపోయి చూస్తుండిపోయారు అప్ప చెళ్ళెల్లు.

**కవిత**

# రెక్కల లెక్క




**డా. సముద్రాల శ్రీదేవి**
**9949837743**


కొక్కరకో... అని కూతపెట్టిన కవిత కేక పెట్టి
ఉదయరేఖ తోజీవన రేఖమీద
కర్మరేఖాగణితం లిఖిస్తుంది,

తొలి పొద్దు రెక్కల లెక్క
ఏదిక్కుల కెగిరిందో
మొద్దుబారిన నిద్దురను తట్టి లేపుతుంది.
తట్టబుట్ట సర్దుకొమ్మని గుట్టకు రాళ్లుమోసే
కర్మజీవాల ఘర్మజలాన్ని
పొద్దద్దం ముఖమ్మీద నింగి రుమాలుతో
కడుగుతునే ఉంది.

చాకిరి చేసిన చీకటి
పొగమంచు చీపురును
దూరంగా విసిరేసి
కిరణాల దుప్పటిలో దాచుకుంది

దావాలనంలా పొంగిన చెమట చుక్క,
చుక్కల పక్కన పక్క వేసుకోకముందే
ఫక్కుమని నవ్వింది.
చెక్కిలి పై నీటి చుక్క.
కష్టాల కడగండ్ల
సుడిగుండాల, గండాలను
శిఖరం వీపు వైపుకు మోస్తున్న
కెరటాల
బ్రతుకు ఆరాటం
అలుపెరుగని పోరాటం.
తగిలిన గాయాలకు వెన్నెల లేపనం
పూస్తున్న జాబిల్లి
చల్లని ఓదార్పే కదా అలసిపోని
రెక్కల ఓర్పుకు చేయూత

లెక్కకు రాని ఓటములైనా
ఉదయం కోసం ఓరిమిగా పయనించే
కోడి కూత, మోతనే కదా
రెప్పల దుప్పటిని విదిలించే సైన్యపు ఊత

కథ

# ఆకలిరాజ్యం



- కోటమర్తి రాధాహిమబిందు
హైదరాబాద్ 9440764378

కాలింగ్ బెల్ కొట్టి లోపలికి వచ్చింది రాజ్యం.. రోజు అలవాటు ప్రకారం సింకులో పాత్రలను బయట వేసుకొని వాషింగ్ మిషన్లో బట్టలు వేసి స్విచ్ ఆన్ చేసింది. ఆ తర్వాత చకచక పాత్రలు తోమేసింది. ఇల్లు శుభ్రం చేసి బట్టలు ఆరవేసి యజమానురాలు యమున పెట్టిన వేడి వేడి ఉప్మా తిని టీ తాగింది. ఏడాది నుండి యమున ఇంట్లో పని చేస్తుంది రాజ్యం.

"రాజ్యం..నిన్న ఏదో అవసరం వుందని డబ్బు అడిగావు కదా.. ఇస్తాను.. మరి.. ఇంకోమాట.. ఎల్లుండి మనింట్లో వ్రతం వుంది.. బంధువులు స్నేహితులు వస్తారు నువ్వు పెందలాడే రావాలి".

"అలాగే అమ్మా" అంటూ పిల్లలకోసం అని యమున ఇచ్చిన ఉప్మా బాక్స్ తీసుకుని గబగబా వెళ్ళి పోయింది రాజ్యం.

రాజ్యం భర్త మల్లేశం చాలా మంచివాడు.. అతను బండి మీద కూరగాయలు అమ్ముతుంటాడు.. వాళ్లకు ఇద్దరు పిల్లలు వాణి.. సూరి.. అక్కా తమ్ముడు. యమున భర్త వరప్రసాద్ ప్రైవేట్ స్కూల్ హెడ్ మాస్టర్.. ఆ స్కూల్లోనే చదువుతున్నారు రాజ్యం పిల్లలు.. వాణి సూరి తెలివికలపిల్లలు కావటంతో వరప్రసాద్ వాళ్లకు అవసరంపడే పుస్తకాలు కొనివ్వటం ఇంకా ఏవన్నా అవసరాలు తీర్చడం చేస్తుంటే..యమున తమకోసం చేసుకునే వంటకాలు మరి కాస్త ఎక్కువ చేసి పిల్లల కోసం ఇవ్వటం అలవాటుగా చేసుకుంది. మంచి పనిమనిషి దొరికింది అని యమున అనుకుంటే..మంచి మనుషులున్న ఇల్లు దొరికింది అని రాజ్యం అనుకుంది.

★ ★ ★

వ్రతంరోజున రాజ్యం రెండుగంటల ముందే యమున ఇంటికి వచ్చి రోజువారీ పనులన్నీ ముగించింది. ఆడవాళ్లు చేసుకునే వ్రతం కాబట్టి అంతా ఆడవాళ్లే వచ్చారు. ఇల్లంతా సందడిగా అయింది.. మధ్యలో ఒకసారి లోపలికి వచ్చిన యమున రాజ్యాన్ని పలుకరించి టిఫిన్ తిని పిల్లలకు టిఫిన్ పట్టుకెళ్ళమని చెప్పింది.. యమున ఆడపడుచు పార్వతి చెప్పే పనులు ఎంతకూ తెమలక పోవటంతో రాజ్యానికి గుబులు ఎక్కువైంది. పిల్లలు స్కూల్ కు వెళ్లే లోపు టిఫిన్ బాక్స్ ఇచ్చి మళ్ళీ వచ్చి పనులు చూసుకోవచ్చు అని రాజ్యం ఆరాటం.. మరో అరగంట తర్వాత పార్వతి రాత్రి మిగిలిపోయిన పదార్థాలు తెచ్చి నువ్వు తిని ఇంటికి పట్టుకెళ్ళు అని చెప్పింది. పనులు ముగించి ఇంటికి వెళ్ళేముందు పదార్థాలని పార్వతి చూస్తుండగానే చెత్తలో వేసి వెళ్ళింది రాజ్యం.

★ ★ ★

స్కూల్లో రెండో బెల్ కొట్టి ప్రార్థన జరుగుతుంది. పిల్లలు అంతా వరుసలో నిలబడ్డారు. వాణి కూడా వాళ్ల తరగతి వరుసలో నిలబడింది.. ప్రార్థన జరుగుతుండగానే కళ్ళు తిరిగి కింద పడిపోయింది వాణి. అందరూ వచ్చి లేపి లోపల పడుకోబెట్టారు. వరప్రసాద్ వచ్చి "ఏమైంది వాణీ ఒంట్లో బాగోలేదా ఏం తిని రాలేదా"? అంటూ అడిగాడు.

"తినలేదు సార్.. రాత్రి కొద్దిగా కడుపులో నొప్పి వచ్చింది..రాత్రి కూడా ఏమీ తినలేదు..అమ్మ పనికిపోయింది కదా? ఏమన్నా తేస్తదేమో అని చూసాం..అమ్మ రాలేదు.. వస్తే ఏమన్నా వండేది..స్కూల్ కు టైం అవుతుందని రాత్రి మిగిలిన కొంచెం అన్నం వుంటే తమ్ముడికి పెట్టి నేను నీళ్లు తాగి వచ్చాను..అందుకే ఆకలికి తట్టుకోలేక కళ్ళు తిరిగి పడిపోయినా" నీరసంగా అంది వాణి

వరప్రసాద్ ప్రక్కన ఉన్న హోటల్ నుంచి ఇడ్లీ తెప్పించి వాణికి తినిపించాడు.

★ ★ ★

తెల్లవారి ఎప్పటిలా రాజ్యం వచ్చింది. పనులన్నీ ముగించుకుని యమున పెట్టిన టిఫిన్ తిని టీ తాగింది.. పిల్లల కోసం టిఫిన్ డబ్బా ఇచ్చింది యమున.. అప్పుడే వచ్చిన పార్వతి రాజ్యం మీద విరుచుకుపడింది.

"పనివాళ్ళకు అంత పొగరు ఉండకూడదు.. అన్నం పరబ్రహ్మ స్వరూపం తినే పదార్థాలను అలా చెత్తలో వేస్తారా ఎవరైనా"

"అమ్మగారూ.. అన్నం పప్పు చెడిపోయాయి.. వాసన కూడా వస్తున్నాయి అందుకే చెత్తలో వేశాను"

"మరి మీకు రోజూ వేడి వేడి పదార్థాలు వండి వడ్డిస్తారా? మా ఇంట్లో మేం కూడా ఇలాగే ఇస్తాం. అయినా ఈ మధ్య పనివాళ్ళని పలుకరించేటట్టే లేదు. మేము మీతో సమానం అంటున్నారు ఇదిగో ఇలా పెడసరం సమాధానాలు చెబుతున్నారు" కళ్ళెర్రచేస్తూ కఠినంగా అంది పార్వతి.

"మేము మీతో సమానంగా బ్రతకగలిగితే మీఇంట్లో పని చేసుకుంటూ ఇలా ఎందుకు బ్రతుకుతాం మాకూ నెలనెలా జీతాలు వచ్చేవి హాయిగా ఉండేవాళ్ళం. ఆకలి.. అమ్మా.. ఆకలి.. మీరైనా మేమైనా ఈ పొట్ట నింపుకోవడానికే ఇన్ని అవస్థలు పడేది"

"ఏంటి ఎదిరించి మాట్లాడుతున్నావ్"

"నేను ఎదిరించటం ఏంటమ్మా పరిస్థితి చెప్పాను అంతే.. మేము ఇలా బ్రతుకులు వెళ్ళదీస్తున్నాం.. మా పిల్లలు మాలాగా బ్రతకవద్దు అని చదివించు కుంటున్నాం.. మంచి స్కూల్లో వేశాం మంచి ఆహారం పెట్టాలని అనుకున్నాం.. నిన్న నా బిడ్డ స్కూల్లో కళ్ళు తిరిగి పడిపోయిందట. నేను ఇలా అంటున్నానని మీరు కోప్పడకండి.. నిన్న నాకు ఇచ్చిన ఆహారం మీరు తినగలరా"? అడగవద్దు అనుకుంటూనే అడిగింది రాజ్యం. పార్వతికి ఏం మాట్లాడాలో తోచినట్లయి రాజ్యాన్ని అలాగే చూస్తూ ఉండిపోయింది.

"అమ్మగారూ.. వెళ్ళొస్తాను" యమునను చూస్తూ రాజ్యం అలా అనేసరికి విసురుగా లోపలికి వెళ్ళిపోయింది పార్వతి.

"రేపు పనిలోకి వస్తావుగా రాజ్యం"? ఇబ్బందిగా అడిగింది యమున.

"వస్తా అమ్మా..ఎందుకు రాను? నేను ఉన్నంతకాలం మీఇంట్లో పని చేస్తాను. మా పిల్లల్ని సారు సలహాలు తీసుకుంటూ బాగా చదివించుకోవాలని వుంది.. మీరు నవ్వుకోకండి అమ్మగారూ.. మీ పిల్లలు పోయినట్లుగా మా పిల్లల్ని కూడా అమెరికా పంపాలనేది మాఆశ" అంది రాజ్యం. యమున ఆప్యాయంగా రాజ్యం భుజం మీద తట్టింది.

"ఏ పని అయినా మనం తలుచుకుని శ్రద్ధ పెడితే తప్పక అవుతుంది రాజ్యం.. మా పిల్లలు కూడా మీ పిల్లలకు అండగా ఉంటారులే.. ఇప్పుడే వస్తాను వుండు" అంటూ లోపలికి వెళ్లి నిమిషంలో తిరిగి వచ్చింది యమున.

"ఇదిగో నా పాత సెల్ ఫోన్.. బాగానే పనిచేస్తుంది. డబ్బులు కూడా వేశాను" చిరునవ్వుతో సెల్ ఫోన్ అందిస్తున్న యమునకు ఎలా కృతజ్ఞతలు తెలియ చేసుకోవాలో తెలియక అత్యంత ఆరాధనాభావంతో పాదనమస్కారం చేసింది రాజ్యం.

**కవిత**

# ఎంపిక




**మందరపు హైమావతి,**
**విజయవాడ. 9441062732**


నేనేమీ
సుడిగాలుల పిడిగుద్దులకు
తుఫానుల రౌడీ తనానికీ
చెలించిపోయే గోడను కాను
భూమి లోలోపలి పొరల్లో
పాతుకుపోయిన రాయినీ కాను
గుచ్చుకొన్న దుఃఖపు సూదుల చురుక్కుమనే పోట్లకూ
పట్టించుకోని తనపు నిర్లక్ష్యపు కత్తిగాట్లకు
విలవిలలాడే సున్నితత్వాన్ని
గుడ్డల్లోంచి అప్పుడే
రెక్కలు విప్పుకుంటున్న సౌకుమార్యాన్ని
ప్రతి చిన్నదానికీ కరిగి కురిసే చినుకును
రంగుల కలల్లాటి వన్నెవన్నెల బట్టలు ధరించి
నాకు నచ్చిన పుస్తకం చదువుకొంటూ
నేను మెచ్చిన పాటలు వింటూ
జీవనోత్సవ నౌకలో
హాయిగా స్వేచ్ఛగా విహరించాలనుకుంటాను

★ ★ ★ ★

అమ్మ ఉమ్మనీటి తటాకం నుంచి
బాహ్య ప్రపంచంలోకి రాగానే
అలా ఉండు ఇలా ఉండకు
నిర్దేశిత తాళ్లతో కట్టిపడేస్తుంటే
నా దేహపు పుష్పానికి గాలి సోకకుండా
సూర్యకిరణాల వర్షంలో తడవకుండా
కళ్ళకిటికీలకు మాత్రం ఖాళీ వుంచి
ఒక్కొక్క ఇటుక పేర్చుతూ
ఈ దేహాన్ని సిమెంటు తాపడం చేస్తూ
ఊపిరాడకుండా సజీవ సమాధిలో కూర్చేస్తుంటే
మతాధిక్యత పురుషాధిక్యత
రెండు చేతులతో గొంతు నొక్కేస్తుంటే
ఎన్నాళ్లు భరించాలి ఈ హింసను
నేనెలా ఉండాలో ఉండకూడదో
ఒకరు నిర్ణయించేదేమిటి ?
మీరు చెప్పినట్లు ధరించాలా వద్దా అనేది
ఇకపై నా ఇష్టం

★ ★ ★ ★

( కర్ణాటకలో న్యాయమూర్తులు హిజాబ్ గురించి ఏ నిర్ణయం తీసుకోలేదని వార్త చదివి)

కథ

# రంగుటద్దాలు



స్వాతి శ్రీపాద

హైదరాబాద్ 8297248988

కళ్ళు తుడుచుకుంది కౌసల్య. ఎంత మాట అనేసింది కూతురు, తల్లి అన్న గౌరవం , ప్రేమ కూడా లేవు.

“ ఇదిగో ఈ రాజసం వల్లే నాకు జీవితంలో నా అని చెప్పుకునే వాళ్ళు లేకుండా చేసావు. ఈ రోజున నా తండ్రి వైపున నాకంటూ ఒక్కళ్ళన్నా ఉన్నారా? నీ ఇష్టం, నువ్వు రాకు, నేను మాత్రం ఒకసారి వెళ్ళి అందరినీ చూసి వస్తాను”

చటుక్కున లేచి తనగదిలోకి వెళ్లిపోయింది.

హాల్లో ఒంటరిగా మిగిలిపోయిన కౌసల్యకు ఏం జరుగుతోందో అర్థం కాలేదు.

అయిదారేళ్ల తరువాత విదేశాలనుండి కూతురు వచ్చిందని పొంగి పొరలిన ఆనందం తుడిచిపెట్టుకు పోయింది.

“ రేపు సాయంత్రం కర్నూలు వెళ్దాం. ఒకసారి అందరినీ చూసి మర్నాడు బయలు దేరి రావచ్చును”

కర్నూలు మాట వింటూనే ఉలికి పడింది కౌసల్య.

ఎప్పటి మాట.

ముప్పై అయిదేళ్లు గడచిపోయాయి.

మధ్యలో ఒకటి రెండు సార్లు వాళ్ళు కలుపుకోవాలని చూసినా దూరంగా ఉండిపోయింది.

రెండు జడలు వేసుకుని మామూలు కాటన్ పరికిణీ ఓణీ లతో కౌసల్య అప్సరసలా కనిపించింది నరేంద్ర కళ్లకు. మాట కలిపాడు.

అయిదుగురాడపిల్లలు ముగ్గురు మగపిల్లలలో కడగొట్టు సంతానం కౌసల్య.

తండ్రి బడి పంతులు. ఒక్కడి సంపాదనలో పది మంది బ్రతుకులు తెల్లవారాలి.

అప్పటికే ఇద్దరు కూతుళ్లకు నానా కష్టాలూ పడి పెళ్ళిళ్ళు కానిచ్చాడు. పెద్ద కొడుకు పెళ్లైనా ఉన్న చిన్న ఇంట్లోనే భార్యతో వేరు కాపురం పెట్టుకున్నాడు. మిగిలిన మూడు గదుల్లో ముగ్గురు కూతుళ్ళు ఇద్దరు కొడుకులు, పెళ్ళిళ్ళు, పురుళ్ళూ, పుణ్యాలూ ఒహటేమిటి సర్వం జరిగిపోతూనే ఉన్నాయి. క్లాస్ పుస్తకాలకన్నా ఎక్కువ నవలలు చదివి చదివి కలల్లో తేలిపోయే కౌసల్యకు కళ్ళు తెరిచినా , కళ్ళు మూసినా స్వప్నాలే.

ఆ స్వప్నాల్లో ఒకదానిలో మునిగి తేలుతున్నప్పుడు ప్రైవేట్ కంపెనీలోనే అయినా మానేజర్ నని చెప్పుకునే నరేంద్ర లాంబీ స్కూటర్ మీద తిప్పడం నచ్చింది. నేల టికెట్ కొనుక్కుని ఏడాదికో సినిమా చూడటమే గగనం అనుకునే సమయం లో అయిదారు సార్లు కుర్చీ టికెట్లు కొని సినిమాలు చూపించడం రాజ భోగం లానే అనిపించింది. నరేంద్ర పెట్టుకునే రంగు కళ్లద్దాలు, అతని మెడలో గొలుసు వేలి ఉంగరాలు రాజకుమారుడనే అనుకుంది. పరిచయం పెళ్ళి వరకూ వెళ్ళడానికి పెద్ద సమయం పట్టలేదు.

చెబితే రెండు వైపులా ఒప్పుకోరన్న సాకుతో గుళ్ళో దండలు మార్చుకున్నారు. పసుపు తాడుకే అయినా మంగళ సూత్రాలు బంగారం వే అవడం కౌసల్యకు గొప్ప లగ్జరీ. అవును మరి మొదటి సారి వేసుకున్న బంగారం .

ఇంటి లోపలికైనా రానివ్వకుండా తరిమేసాడు తండ్రి. మరో మాటకు అవకాశం కూడా ఇవ్వలేదు.

మొదటి సారి కర్నూల్ బస్ ఎక్కించాడు నరేంద్ర. గరుడ వేగా. జీవితం ఆ బస్ లో మెత్తని కుషన్ సీట్లలా ఏసీ చల్లదనంలో గడచిపోతుందని అనుకుంది.

ఇంటి ముందు రిక్షా దిగాక గాని నేలకు దిగి రాలేదు. పెంకుటిల్లు. దండెం మీద ఆరేబట్టలు కట్టుకున్నవి తప్ప ఇంకేమీ లేని ఇంట్లో జనం ఒకటిన్నర గదిలో ఆరుగురు పిల్లలతో .....

మూడు రోజుల్లోనే చేసినతప్పు తెలిసివచ్చింది కౌసల్యకు.

గిల్ట్ నగలూ గిల్ట్ జీవితాలూ.

ఆ ఊళ్ళోనే నరేంద్రకు మరో సెటప్. ఇది కాదు తను కోరుకున్న జీవితం. ఇవి కావు తను కన్న కలలు.

జీవితమంతా ఇలా బతకదు. ఏం కోరి పెళ్ళి చెసుకుందో అది దొరక్కపోయాక ఆ పెళ్ళిని గౌరవించాల్సిన అవసరం కనబడలేదు. అవును అవసరం లేదు. పనికి రాని చెత్త భరించాల్సిన అవసరం లేదు.

ఆ రొంపి నుండి బయటపడి తండ్రి కాళ్ళావేళ్ళాపడి ఇల్లు చేరేసరికి మూడోనెల.

నానా కష్టాలూ పడి చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాక కొంచం తెలివి మీరి ఎవరెంత ఉపయోగిస్తారనేది బేరీజు వేసుకుని పరిచయాలు ఏర్పరచుకునే ఒక నిర్ణయానికి వచ్చింది. పుట్టిన ఆడపిల్ల పెంపకానికే సతమయే తను మరో సారి తల్లి అయే తెలివితక్కువ పని చెయ్యకూడదనుకుంది.

గొప్పగా బతకాలి , గొప్పగా కనిపించాలి. అంతే.

కూతురు ఇంజనీరింగ్ చదివి అమెరికా వెళ్ళే సరికి మేఘాల మీద ఎగురుతున్నట్టే అనుకుంది.

చదువు పూర్తై ఉద్యోగం లో చేరాక కొంచం స్థిరపడ్డాక వచ్చింది కూతురు.

వస్తూనే తను ఎంచుకున్న అబ్బాయి గురించి చెప్పింది.

పెద్దకుటుంబం. ఇద్దరు అక్కలు , ఒక చెల్లి ఒక తమ్ముడూ, పెళ్ళి వాళ్ల ఇష్టప్రకారం శాస్త్రోక్తంగా జరగాలి.

"ఎవరు కాళ్ళు కడగాలి?

ఈ లంపటం అంతా అవసరమా? " చటుక్కున అనేసింది కౌసల్య.

"అవసరమే అమ్మా, నాకు నా చుట్టూ నా వాళ్ళు కావాలి. కొన్ని పొందాలనుకుంటే కొన్ని వదులు కోవాలి. నీకు మనుషులను అవసరానికి వాడుకోడమే తెలుసు.

నిజానికి నువ్వలా వచ్చెయ్యకుండా నాన్నను నీ ప్రేమతో మార్చుకోవలసింది కదా. నీ వ్యక్తిఇత్వం వదులు కోమనను కాని మనుషులు యూజ్‌అండ్ త్రో వస్తువులు కాదు గదా? నువ్వూ ఉద్యోగమో మరోటో చూసుకుని ఆ కుటుంబానికి అండగా ఉండాల్సింది కదా?

నీ వల్లే నాన్న మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకోలేదా? నీ వల్లే ఆ తలిదండ్రులు కొడుకును పోగొట్టుకోలేదా?

నేను నీలా నా చుట్టూ నేనే అనే గోడ కట్టుకోదలచుకోలేదు.

నిన్ను చూసి ఏం కూడదో నేర్చుకున్నాను.

బాలాజీ నాకు నచ్చినది ఆ కుటుంబం లో వారికున్న అనుబంధాల వల్లే. ఇద్దరక్కలూ సాయం చెయ్యడం వల్లే బాలాజీ అమెరికా వచ్చి చదువుకోగలిగాడు. చెల్లెలి బాధ్యతా తమ్ముడి బాధ్యతా బాలాజీదే. ఒక్క పూట పలకరించుకోక పోయినా వారికి తోచదు. వాళ్లమ్మ గారితో నేను మాట్లాడిన తరువాతే వారి ఆంగీకారం తరువాతే బాలాజీ నా తో పెళ్ళికి అంగీకరించాడు.

బాలాజీ నా నుండి ఆశించేదేమిటో తెలుసా – అతని కుటుంబం నా కుటుంబం కావాలన్నది. కుటుంబమే లేని నాకు ఒక కుటుంబాన్ని ఇవ్వడం వరమే కదా.

మనుషుల నుండి మరేదో ఆశించి భంగపడి జీవితం నరకం చేసుకునే కన్నా ప్రేమలు ఆశించటం ఎంత గొప్ప లక్షణం "

కౌసల్య కోపంతో ఊగిపోయింది. ముక్కు పుటాలు అదురుతున్నాయి.

" నీ కోసం జీవితాన్నే త్యాగం చేసిన ..."

"ఆగమ్మా అక్కడ ఆగిపో. ఏం త్యాగం చేసావు? నీ ఆటలు సాగవని వేరేఇల్లు తీసుకున్నది రామ్ భరద్వాజ్ తో నీ సహజీవనం కోసం కాదూ. అయిదేళ్ళ నన్ను హాస్టల్ లో వేసి రామ్ భరద్వజ్ తో పదేళ్ళపాటు కలిసి బ్రతక లేదా? అతని కజిన్ విశ్వజిత్ పాండా తో రాసుకు పూసుకు తిరిగితే కదా నీకు ఉద్యోగమూ దానితో పాటు క్వార్టర్స్ దొరికినది నువ్వు ఎవరికోసమూ ఎప్పుడు ఏమీ త్యాగం చెయ్యలేదు. నిన్ను కన్నవారికీ, నువ్వు కన్నదానికీ నీ చుట్టు తిప్పుకున్న వారిలో ఏ ఒక్కరికీ ... "

" రేపు సాయంత్రం కర్నూలు వెళ్దాం. ఒకసారి అందరినీ చూసి మర్నాడు బయలు దేరి రావచ్చును"

కర్నూలు మాట వింటూనే ఉలికి పడింది కౌసల్య.

" మనకు వాళ్ళు అవసరం లేదు"

నీకు లేదు. నాకు నా తండ్రి వైపు వాళ్ళు కావాలి. నీకు నువ్వు తప్ప ఎవరూ ముఖ్యంకాదు"

" అవును అవునే నాకు నేనే ముఖ్యం. నాకు పనికి వచ్చే వారే నాతో ఉంటారు. "

" ఇదిగో ఈ రాజసం వల్లే నాకు జీవితంలో నా అని చెప్పుకునే వాళ్ళు లేకుండా చేసావు. ఈ రోజున నా తండ్రి వైపున నాకంటూ ఒక్కళ్ళన్నా ఉన్నారా? నీ ఇష్టం, నువ్వు రాకు, నేను మాత్రం ఒకసారి వెళ్ళి అందరినీ చూసి వస్తాను. కాదు నా పెళ్ళికి రమ్మని పిలిచి వస్తాను"

చటుక్కున లేచి తనగదిలోకి వెళ్లిపోయింది.

దీనికి ప్రేమ మైకం కమ్మింది– అనుకుంది కౌసల్య. కాని తను తగిలించుకున్న అహం అద్దాల రంగు తెలుసుకోలేకపోయింది.

అంతే రంగుటద్దాలు మరి.

కథ

# ఒక విజేత కథ



సరోజన బోయిని.
మంచిర్యాల

జీవితం అంటే అనుభవాల గుణపాటాలతో మనమేంటో మనం తెలుసుకొని మనల్ని మనం నిరూపించుకునే పాఠశాల. ముఖ్యంగా  మహిళలు తమ చుట్టూ గీత గీసుకొని అందులోనే తమ ప్రపంచం అనుకుంటారు. కొంత మంది  తమకు ఎన్ని సమస్యలు ఉన్న వాటిని ఎదిరించి ప్రశ్నించె ధైర్యం చెయ్యలేరు. గడప దాటి బయటకు వచ్చి తమ సమస్యల గురుంచి చర్చించలేరు. కారణం గడప దాటిన మహిళను చులకనగా చూసే ఈ సమాజ నైజం. కానీ కొన్ని సంఘటనలు మాత్రం సమాజం గురించి పట్టించుకోకుండా నిలబడి  తన సమస్య కోసం పోరాటం చేసే ధైర్యాన్ని ఇస్తాయి. అలాంటి సంఘటనల వల్ల ఎలాగైనా పోరాడాలే అనే తెగువే కనబడుతుంది. ఇక అక్కడ వయస్సు, అనుభవంతో పని లేదు. తనలోని ధైర్యమే తనకు తోడుగా నిలుస్తుంది. అలాంటి ఒక మహిళ అనుభవాల కథ ఇది.

మా అంగన్వాడీ టీచర్ల అందరికి ఏడాదికి  ఓసారి రిఫ్రెషర్ ట్రైనింగ్ ఉంటుంది. మహిళ ప్రాంగణంలో వారం రోజుల పాటు ఈ ట్రైనింగ్ ఉంటుంది. స్కూల్లో ఆట, పాటలతో కూడిన విద్య మీద ట్రైనింగ్ తో పాటు ఫీల్డ్ వర్క్ మీద ఒక మోడల్ అంగన్వాడీని దర్శించి, ఒక రోజంతా వారి పని తీరును చూసి నేర్చుకోవడం. అలాగే మా మండల్ మా సెక్టార్లో కొంత మందికి రిఫ్రెషర్ ట్రైనింగ్ పడింది అందులో నా పేరు కూడ ఉంది. తెల్లవారితే ప్రయాణం మా మండల్ నుండి మేము ట్రైనింగ్ తీసుకునే ఆ ఊరి ప్రాంగణానికి దాదాపు 5 నుండి 6 గంటల ప్రయాణం. అందరం పడుకునే ముందే ఫోన్ చేసుకున్నాం పొద్దున తొమ్మిదింటి వరకు బస్టాండ్లో ఉండాలని. అనుకున్న ప్రకారమే అందరం తొమ్మిదింటికి బస్టాండ్ లో ఉన్నాం. ఇంతలో బస్ వచ్చింది అందరం తలా ఒక వాటర్ బాటిల్ కొనుక్కొని బస్ ఎక్కినం.శవెళ్లే దారిలో మొత్తం కబుర్లతో టైమ్ కూడ తెలియలేదు. ఈవినింగ్ వరకు అందరం ప్రాంగణం దగ్గరకి చేరుకున్నాం. మేము వెళ్లే సరికే టీ,వస్నాక్స్ పెడుతున్నారు అందరం వెళ్ళి ఫ్రెష్ అయ్యి వెళ్లి టీ తీసుకున్నాం.

కొద్ది పాటి విరామం తరువాత మళ్ళీ నైట్ డిన్నర్ అయిపోంది. ప్రయాణం లో అలిసినందుకేమో అందరం త్వరగా పడుకున్నాము. తెల్లవారి ఐదింటికే వార్డెన్ మేడం 'త్వరగా మీ పనులు పూర్తి చేసుకుంటే బ్రేక్ ఫాస్ట్ చేసి మీరు క్లాస్ కి వెల్లచ్చు' అని చెప్పుకుంటూ అందరిని లేపుతుంది. మేము కూడ లేచి ఒకరి తరువాత ఒకరం మెల్లగా తయారు అయి, బ్రేక్ ఫాస్ట్ చేసి క్లాస్ కి వెళ్లే సరికి 9 అయ్యింది. మొదటి రోజు మా మేడం ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ మీద ఒక్కపూట ట్రైనింగ్ ఇచ్చారు. మళ్ళీ లంచ్ తరువాత పిల్లల ఆడించే విధానం ,పాటల (రైమ్స్) పైన ట్రైనింగ్ ఇలా నాలుగు రోజులు గడిచాయి. 5th డే క్లాస్ అయిపోయిన తరువాత వెళ్లే ముందు మా మేడం 'రేపు ఫిల్డ్ వర్క్ కోసం మనం అడవికి దగ్గర  ఉన్న ఓ అంగన్వాడీ సెంటర్ కి వెళ్తున్నాం' అన్నారు. మా మేడం కొంచెం సరదా మనిషి ఊరికే అంటుంది అనుకున్నాం. ఇంత లో మా ఫ్రెండ్ స్వప్న లేచి 'అమ్మో అడవికా, నాకు భయం నేను రాను మేడం' అంది. మా మేడం నవ్వుకుంటూ "నేను సరదాగా అనలేదు నిజంగానే మనం రేపు అడవి దగ్గరలో ఉన్న అంగన్వాడీకే వెళ్తున్నాం.మన ఫిల్డ్ వర్క్ కోసం"అన్నది. నాకో సందేహం వచ్చింది. మేడం దగ్గరలో ఇన్ని అంగన్వాడీ కేంద్రాలు ఉండగా. రిస్క్ చేసి అడవి దగ్గరికి పోవడం ఎదుకు అని అడిగా..

"రిస్క్ కానీ అక్కడ మీరు నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఈ ట్రైనింగ్ మీకు కొన్ని జీవిత పాఠాలు కూడ నేర్పుతుంది. రేపు మార్నింగ్ మీట్ అవుదాం.ఇక మీరు వెళ్ళండి" అంది. క్లాస్ రూమ్ నుండి వచ్చాక ఈవినింగ్ టీ,స్నాక్స్ ఇచ్చారు. కొంచం సేపు వామ్ అప్ చేసాము. కొద్ది సేపు మాకు ఇచ్చిన వర్క్ కంప్లీట్ చేసుకున్నాం. నైట్ 8.30 కి డిన్నర్ చేసి.అందరం ఒక చోట కూర్చున్నాం. కొద్ది సేపు ఏవో కబుర్లు. మనసులో ఏదో దిగులు నా పిల్లలకు దూరంగా వారం రోజులు ఉంటున్న అని. నా పిల్లలు చిన్నవాళ్ళు వాళ్ళు ఎలా ఉన్నారో అని. ఇంతలో వార్డెన్ మేడం "అమ్మా మీరంతా రేపు ఇంకా కొంచం పొద్దున లేవాల్సి ఉంటుంది. మార్నింగ్ 7గంటలకే ప్రయాణం. అన్ని సర్దుకొని త్వరగా పడుకోండి" అన్నది.

మార్నింగ్ అందరం రెడీ అయ్యాం. మా మేడం టైమ్ అంటే టైమే ఆ విషయంలో చాలా స్ట్రిక్ట్.. ఒకరు ఇద్దరు తప్ప అందరూ రెడీ అయ్యారు. వేరే వేరే సెక్టార్ల నుండి వచ్చిన వాళ్ళు అందరం 30 మంది దాక అవుతాం. ఇంతలో చిన్న వ్యాన్ వచ్చింది అందరం వెళ్లి అందులో కూర్చున్నాం. మా మేడం కూడ మాతో ప్రయాణం అయ్యారు. కానీ మా అందరి మనసులో ఏదో తెలియని ఆనందం అడవి అందాలను చూడాలని ఆత్రుత ఉంది. వెళ్లే దారిలో ఎన్ని అందాలో చూడడానికి రెండు కళ్ళు  సరిపోతలేవు. అడవి మధ్యలో అటు, ఇటు ఉరికే దుప్పి ఒకటి మా మనసులను సందడి చేస్తుంది. దానిని ఫొటోస్ తీయడానికి మేము ఎన్ని పాట్లు పడుతున్నమో అది కుదురుగా ఉంటేనా..

"మా మేడం ను చిన్న రిక్వెస్ట్ చేసామ్ మేడం ఒక 10 నిమిషాలు అందరం ఒక సారి వ్యాన్ దిగి కొన్ని ఫొటోస్ తీసుకుంటాం" అని. మేడం పర్మిషన్ ఇచ్చారు. ఒక్కసారిగా రెక్కలు వచ్చిన పక్షిలా అందరం కెమెరాలం పట్టుకొని దిగినం. ఎంత చక్కటి వాతావరణం చల్లటి స్వచ్ఛమైన గాలి. కొద్ది దూరాన ఓ! సెలయేటి గలగల జలపాతాల హోరు. ఇంతలో పురివిప్పు ఆడుతున్న నెమలి మా కంట

పడింది. ఆ దృశ్యం మా కన్నులకు ఓ! పండుగే. ఇంతలో ఓ! పెద్ద కొండ చిలువ కనబడింది. భయంతో అందరం వెళ్లి వ్యాన్ ఎక్కాం. మమ్మల చూసి ఒకటే నవ్వుడు. అందులోనే కూర్చున్న మా ఫ్రెండ్ స్వప్న.

మా మేడం కూడ కొంచెం ముసి ,ముసి నవ్వుకుంటా "అయిపోయిందా వెల్దామా" అన్నారు. ఒకే మేడం అని అందరం గట్టిగా అరిచాం. మళ్ళీ మా ప్రయాణం మొదలు అయ్యింది. చివరకు ఊరిలో అంగన్వాడీ సెంటర్ చేరాము. ఆ స్కూల్ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది. లోపల టీచర్ పిల్లలకు చక్కటి రైమ్స్ పసి పిల్లలా అభినయం చేస్తూ చెప్తుంది. దాదాపు ఓ ఇరవై మంది పిల్లలు అల్లరి చేయకుండ శ్రద్ధగా రైమ్స్ నేర్చుకుంటున్నారు. మమ్మల చూసిన ఆ అంగన్వాడీ టీచర్

"రండి అక్కలు, నమస్తే మేడం అని వినమ్రంగా అందరికి నమస్కారం చేస్తూ. పైలంగా ఆచ్చింద్ర మేడం, నడుమ ఏదైనా తక్లీబ్ అయ్యిందా? జంగల్ రస్తానాయే.. మల్ల మీరు గింత సేపటికి రాక రాకపోయే సరికి జెరంత గుబులు అయ్యింది మేడం. ఎప్పుడో పొద్దుగాలనే బయలెల్లినం అన్నరు. గందుకే" అంది. మా మేడం "అయ్యో ! అదేం లేదమ్మా పొద్దున్నే బయలు దేరాం కానీ దారి మధ్యలో మన వాళ్ళు అడవి అందాలు చూస్తూ కొన్ని పిక్స్ తీసుకుంటాం అంటే కొద్ది సేపు ఆగాము అంతే"అన్నది. ఇంతలో ఆయమ్మ వచ్చి చాపలు పరిసి పోయింది. మా మేడం అందరిని పిలిచి రౌండ్ గా కూర్చో మన్నారు. అక్కడి అంగన్వాడీ టీచర్ కూడ మాలో ఒకరిగా కూర్చుంది. మా మేడం కూడ మాతో పాటే మా మధ్యలో కింద కూర్చున్నారు. మా మేడం అమ్మా ! ముందు నువ్వు వీళ్ళకు పరిచయం చేసుకో, నీ పేరు చెప్పు" అన్నది ఇంతలో ఆ అమ్మాయి "అందరికి దండాలు నా పేరు కీర్తి" అంది. మేముకూడ ఒక్కొక్కరిగా మా పేర్లు చెప్పుకుంటూ పరిచయం చేసుకున్నాం. దాదాపు లంచ్ టైమ్ దాక తన బోధన పద్ధతుల గురించి మాకు వివరించింది అందరం నోట్ చేసుకున్నాం.

మీకు లంచ్ అరెంజ్ చేపిచ్చాను .ఈ ఊరి పెద్ద మీకు బోజన వసతి కల్పించారు అని. చెప్పింది. అందరం ఆ స్కూల్ దగ్గరి నుండి ఆ ఊరి పెద్ద మనిషి ఇంటి దాక నడుచుకుంటూ వెళ్తున్నాం. కానీ మా అందరిలో ఆశ్చర్యం ఆ ఊరి ఎలా ఉంది అంటే సిటీకి ఏమాత్రం తీసిపోకుండా అన్ని వసతులు ఉన్నాయి. ఆ ఊరిలో ఉన్నవి అన్ని పెంకుటిండ్లే కానీ చక్కగా ఎర్ర మట్టిపూతతోని అందమైన ముగ్గులతోని చక్కగా ఉన్నాయి. ప్రతీ ఇంటి చుట్టు చెట్లు, ప్రతీ ఇంటికి మరుగు దొడ్డి .ప్రతీ ఇంటికి మంచి నీళ్ళ కొళాయి, వాడ వాడకు సిమెంట్ రోడ్డు ఊరిలో ఒక స్టాప్ దగ్గర రెండు మూడు ఆటోలు ప్రయాణికుల కోసం. ప్రతీ ఇంటిలో మహిళలు ఏదో ఒక పనిలో నిమగ్నమమై శ్రద్ధగా చేసుకుంటున్నారు.

మేము ఇవన్నీ చూసుకుంటూ నోటా మాట రాక ఒకరి మొఖం ఒకరు చూసుకుంటూ మౌనంగానే మాట్లాడుకుంటున్నాం. ఇంత అభివృద్ధి ఇక్కడ ఎలా జరిగింది అని. మా మొఖాలు చూసిన మా మేడం చిన్నగా చిరునవ్వు నవ్వుకుంది. తనకు మా డౌట్స్ అన్ని అర్థం అయ్యాయని మాకు తెలిసింది. ఇంతలో ఆ ఊరి పెద్ద ఇల్లు వచ్చింది. మమ్మల చాలా గౌరవంగా లోపలికి ఆహ్వానించి చాల మర్యాదలు చేశారు. చక్కటి భోజనం మోదుగాకు ఇస్తారుల్లో పెట్టారు. అందరం కడుపు నిండ తిని అక్కడ నుండి బయలు దేరంగా..

ఆ ఇంటి పెద్ద "పైలంగా ఇంటికి సేరుండ్రి బిడ్డ" అని చెప్పిండు. మేము కూడ అందరం అంత మంచి ఫుడ్ పెట్టినందుకు తనకు థాంక్స్ చెప్పుకుంటూ అక్కడి నుండి బయలు దేరాం. కానీ నా మనసులో సందేహం ఈ ఊరి అభివృద్ధి ఎలా జరిగింది దానికి కారణం ఎవరో తెలుసుకోవాలి అని. నేను ఒక్కదాన్ని అక్కడ ఆగి ఆ పెద్దాయనను అడిగాను "ఈ ఊరు ఇంతలా అభివృద్ధి చెందడానికి కారణం ఎవరు అని."

"ఆ పెద్ద మనిషి బదులుగా ఇంకెవ్వరు మా కొండవ్వే అన్నడు." నాకు అర్థం కాలే తనూ ఈ ఊరికి ఇంకా ఎవరన్న పెద్ద మనిషి ఏమో అనుకున్న అవునా! అని అక్కడి నుండి బయలు దేరా. మల్లి సెంటర్ కాడికి వచ్చినం అందరం. అందరికి ఒకటే ఆలోచన ఆ ఊరి గురించి పూర్తిగా తెలుసుకోవాలి అని. ఇంతలో నేనే అడిగా కీర్తిని "మీ ఊరిలో కొండక్క ఎవరూ?" అని. ఆ మాట విని మా మేడం మళ్ళీ ముసి ముసిగా నవ్వుతూ "ఆ కొండక్క ఎవరో కాదు మన కీర్తి నే" అని చెప్పింది.

మాకు ఆ ఊరికి పోయినప్పడి నుండి అన్ని ట్విస్టులే. బిత్తిరి మొఖాలు వేసుకొని కీర్తి మొఖం చూసాం కొద్ది సేపు. ఇంతలో మా మేడం ఒక మహిళ ఏదన్న సాధించాలి అనుకుంటే దానికి చదువుతో గాని, అనుభవంతో గాని వయస్సుతో గాని సంబంధం లేదు అని నిరూపించింది కీర్తి. కీర్తీ నువ్వు చెప్పమ్మా. నీ గురించి వీళ్ళు తెలుసుకోవాలనే ఇక్కడికి తీసుకు వచ్చా" అన్నది.

కీర్తి చెప్ప సాగింది. "కొండక్క ఎవరో కాదు నేనే. అది మా అవ్వ ముద్దుగా పిలిసే పేరు. ఇప్పుడు మీరు చూస్తున్న గూడెం వేరు, ఒకప్పిడి గూడెం వేరు. మా బతుకులు ఎట్లా ఉండేవో చెప్పవీలుకాదు. అంత దుర్భరంగా ఉండేవి. ఇగ అడోళ్ళ పడ్డ గోస ఆళ్లు పడ్డ కట్టాలు మాటల చెప్తే ఒడిసెటియ్ కాదు. మా ఊళ్లే మొగోళ్ళు అంత తాగుడుకు బానిసలై ఏ పని సేయక ఇంట్ల ఆడోళ్లను కొట్టుకుంట తిప్పలు పెట్టేది. మా బాపు గూడ గంతే పొద్దంత కల్లు దుకాణం కాడనే, నాతిరి ఇంటికి అచ్చేది. కూడు సక్కగ తినేది లేదు. మీదికెల్లి మా అవ్వనే తాగటానికి పైసలు ఇమ్మని ఇర్గ కొట్టేది. ఏదుంటే అది అమ్ముకుంటనని ఇంట్లకెల్లి కొంటవోయేది మా అవ్వ తాగుడు బంద్ సెయ్యి అని ఎంత సెప్పిన ఇనక పోయేది. మేము ముగ్గురం అక్క సెల్లెడ్లం. అప్పుడు ఇంక మా సిన్న సెల్లె పుట్టలే. మా బాపు మా అవ్వను కొడుతాంటే అడ్డం పోయిన నాక్కూడ దెబ్బలు తాకేటియి.

దాని తోడు మంచాన పడ్డ మా ముసలిది. మా బాపవ్వ. మా బాపును బాగ ఎనుకేసుకచ్చేది. సాతకాకున్న మొగ పోరన్ని కనలేదు అని మా అవ్వను ఉర్పట వెట్టేది. మా అవ్వ సాన తెలివికల్లది. మమ్మల సాదటానికి గొడ్డు కట్టం సేసేది. జంగల్ కి పొయ్యి మొగోని తీరు కట్టెలు కొట్టుకచ్చి అమ్మి మమ్మల సాదేది. మా ఊళ్ళో ఏడో తరగతి దాకనే బడి. అంటెంక పట్నం పోవుడే. మా ఊరికి సరిగ రత్త (తొవ్వ) కూడ లేదు. ఆగు దాటి నడుసుకుంట పోవాలి. మా ఊరికి బస్ లేదు బండ్లు అచ్చేటియ్ కాదు. ఆనకాలం అయితే మోకాలి మంటి బురుదల నడుసుకుంటా పోవాలే.

గందుకే ఏడో తరగతి అయ్యింది అంటే ఆడిపోరాగండ్లను ఇంటికాడనే సదువు మాన్పించి వుండమనేది. మొగపోరగాండ్లు సుత కొందరు ఇంటి కాడనే ఉండేది. మా ఊరి బల్లె సారు మత్తు మంచోడు. నన్ను బిడ్డ లెక్క సూసుకునేది. మా అవ్వ కూడ బడి మాన్పిత్త అంటే మా అవ్వకు నచ్చ సెప్పి మల్ల నన్ను సదువుకు తోలమన్నడు. గా సారు దయవల్లే మల్ల నేను పట్నంకి సదువుకోవడానికి పోయిన. కానీ పోవుడు అచ్చుడు సాన తిప్పలు అయితుండే. అయిన గూడ పోయిన. నేను పదో తరగతిలో ఉండంగ మల్ల మా అవ్వకు కాన్పు అయ్యింది. మా ముసలది మొగ పోరడు ఉండాలే.. అని పోరు వెట్టి మా అవ్వను మేము ఇద్దరం ఆయునంక ఆపరేషన్ సేసుకోనియ్య కుండ ఉంచింది. ఓ నాడు నాతిరి మా అవ్వకు నొప్పులు సురువ్ అయినయ్. మా బాపు తాగు కుంట కల్లు దుకాణం కాడనే ఉన్నడు. అయిన మా అవ్వను ఎప్పుడు సక్కగ పట్టిచ్చుకోక పోయేది.

మా అవ్వ నొప్పుల తోని గిల,గిల కొట్టుకుంటుంది. నాకేం సెయ్యలో పాలు పోతలేదు. మంచాల ముసలిది "ఎవరినన్న పిలుసుక రాపోయే కొండక్క! పొల్ల కాన్పుకు తిప్పల వడుతంది జెల్ది పోయే" అని మొత్తుకుంటంది. నేను ఉరికి పోయి పక్కపొంటి ఈరక్కను తోలుకచ్చిన. గా ఈరవ్వ పొయ్యి మంత్రసాని లచ్చును తోలుకచ్చింది. మేమంత గుడిసె బయటనే ఉన్నాం. మంత్రసాని లచ్చు లోపలికి పొయ్యి మా అవ్వను సూసి. ఈరవ్వను పిలుసుకొని "ఉమ్మనీరు పోతాంది బిడ్డ అడ్డం తిరిగింది కాన్పు కట్టమే. జెల్ది పెద్దాసుపత్రికి తీసుకుపోవాలే" అంది. ఆళ్లు మాట్లాడింది నాకేం అర్థం కాలే కాని మా అవ్వను జెల్దిన ఆసుపత్రికి తీసుకపోవలె అన్నది మాత్రం అర్థం అయ్యింది. "అయ్యో! ఈ తాగుబోతోడు ఎక్కడ సచ్చిండో. గీ నాతిరి పూట దీన్ని ఎవరు తీసుక పోవాలే. తీసుకుపోకుంటే పొల్ల పానాలు పోతయి. ఎట్ల ఎట్లనన్న సేసి తీసుకపోవుడే కావాలి అంది" లచ్చు.

ఇగ ఈరవ్వనే ఓ! నలురిని తీసుకచ్చింది. ఎడ్ల కచ్చురం కట్టి మా అవ్వను తీసుకు పోయింఙ్రు. మా అవ్వకు రవుతం మత్తు పోతాంది. ఆగు దాటే దాక  అందరం గక్కడనే ఉన్నాం. మా అవ్వకు ఏమైతదో అని ఒకటే గుబులు. మేము మా అవ్వతోని గొంత దూరం పొయ్యి. ఇంటికి తిరిగి అత్తన్నం మేము ఇంటికి సేరనే లేదు. ఎడ్ల కచ్చురం తిరిగి రానే అచ్చింది. అగొ గిప్పుడు పోయింఙ్రు, మల్ల అత్తంఙ్రు  ఏంది అని చూసినం. లచ్చు ఏడుపులు, పక్కకు పసి బిడ్డ ఏడుపు. మా అవ్వకు అల్కగ కాన్పు అయ్యింది అని అనుకున్నాం. దగ్గరికి పొయ్యి సూసే సరికి నా గుండె పలిగింది. లచ్చు ఏడుసుకుంటా "మీ అవ్వ ఆడి పొల్లను కని పానమిడిసిందే అవ్వా! రవుతం బాగ పోయుంది.పెద్ద పానం దక్కలే" అని, ఆ బిడ్డను తీసి నా సేతుల పెట్టి "గియాల్టి నుండి నువ్వే గి బిడ్డకు తల్లివి కావాలె" అని సెప్పింది.

ఓ!దిక్కు మా సెల్లె గుక్కతిప్ప కుండ ఎడుత్తాంది. ఏమో! నాకేం సమజ్ అయిత లేదు.మా బాపు గింత జరిగిన ఇంటికి రాలే. గిదంత అయ్యే సరికి తెల్లారింది. అగొ గప్పుడు అచ్చిండు మా బాపు. మా అవ్వ సచ్చిన ముచ్చట సోయికి అచ్చిన మా బాపుకు గప్పుడు తెలిసింది. మా అవ్వ దగ్గర తలాపు కూకొని ఏడిసిండు. నా సేతుల బిడ్డను సూసి! "తూ! మల్ల ఆడిపోరేనా  దీన్ని తీసుకపొయ్యి అవుతల పడేయింఙ్రి. పుట్టంగానే అవ్వను మింగింది" అని సీదరకొట్టుకున్నడు. ఇగ మా అవ్వను కాలేసినంక ఎటోళ్లు అటు పోయింఙ్రు. మా బాపు మల్ల తాగటానికే పోయిండు. మా సెల్లె పాలకోసం ఒకటే ఏడుపు. అవ్వ తెచ్చి పెడితే తిన్నోల్లమ్ గప్పడి దాక ఏ పని సెయ్యలే. నాకేం సెయ్యలో తెల్వలే పాలు కొనడానికి నా తాన పైసల్  లేవు. ఎట్లా అని ఆలోసించిన. మా బల్లె సారు దగ్గరికి పోయిన. జరిగిందంతా గా సారు కూడ కండ్లతోని సూసే. ఇగ నేను ఏమి జెప్పుడు వడ్డది. నన్ను  సూడంగానే జేబుల కెల్లి పైసలు తీసిఇచ్చిండు. సెల్లెకు పాలు కొనమని. నేను గా సారు తోని గిట్ల అన్న "ఎన్ని రోజులు మాకు గీ కట్టాలు, మా బతుకులు ఇగ బాగుపడయా. కండ్ల ముందర పానాలు పోవట్టే. గిట్లనే నాకు తెలిసి ముగ్గురు, నలుగురు సచ్చిపోయింఙ్రు" అని ఏడిసిన.

"మీ బతుకులు బాగు పడుతయ్ నేను చెప్తా ఎట్లనో. ముందుగాల పొయ్యి సెల్లెకు పాలు కొని దాగిచ్చుకొని మల్ల రా బిడ్డా" అన్నడు. గట్లనే పాలు కొని సెల్లెకు కడుపునిండ పట్టిచ్చిన ఆకలి తీరిన మా సెల్లె మంచిగ ఇగ పండుకుంది. నేను మల్ల గా సారు దగ్గరికి పోయిన. "ఏందో ఉపాయం సెప్తా అన్నావ్ గా సారు చెప్పు" అని. "హా..చెప్తా బిడ్డ కూసో.. నువ్వు ముందట పడాలే. మీ ఊరి కోసం పోరాటం చెయ్యాలే. నీతోనే అయితది. కలెక్టరమ్మ దగ్గరికి పొయ్యి మీ బాదలన్ని సెప్పు. నేను దరఖాస్తు రాసి ఇస్తా నువ్వు వెళ్లి ఆ అమ్మ దగ్గర చెప్పు" అని.

గది ఇని ఒక్కసారి నేను లేసిన."ఊకో సారు గిది నాతోని అయ్యే పనా!" గప్పడి దాక ఏడ్సుకుంట ఉన్న నేను ఒక్కసారి నవ్వుకున్న గా సారు మాటలకు. ఇగ అక్కడ ఉండలే మల్ల పైసలు అడుగుతదని సారు గిట్ల సెప్తుండేమో అనుకున్న. కానీ తెల్లారితే మల్ల పాలకు పైసలు లేవు. మా బాపు మమ్ముల పట్టించుకుంట లేడు. ఇగ నేనే పెద్ద సెల్లెను బడికి పంపి. నా సదువు ఆపి సిన్న సెల్లెను ఈపుకు కట్టుకొని కూలి పనికి పోయిన. కానీ సాలి, సాలని కూలి అందరి కడుపు సగమే నిండుడు. ఓనెల గడిచింది. ఇంతలో మా అవ్వ అసొంటి సావు మల్ల మా ఊళ్లే. ఈ సారి తల్లి దక్కింది బిడ్డ పోయుంది. గయ్యన్ని సూసిన నాకు పానం అవిసిపోయింది. మల్ల బల్లె సారు మతికి అచ్చిండు గా సారు చెప్పినట్టు సెత్తే! ఏమో పని అయితదేమో ఓసారి పొయ్యి సూత్త అని. ఆ సారు దగ్గరికి పొయ్యి.. "మీరు సెప్పినట్టు సేత్త సారు నాకు రాసి ఇయింఙ్రి" అన్న.

"అలాగే రాసి ఇస్తా గాని నీతో పాటు ఇంకో నలుగురిని కూడ పట్టుకొని పో" అన్నడు. ఊల్లెకు అచ్చి అడుగుతే ఎవ్వరు సప్పుడు సెయ్యలే. మీదికెల్లి నా మాటలకు ఎగతాళి సేసింఙ్రు. "గీపొల్ల  మన  ఊరిని ఉద్ధరిత్తదట. దీని ఎంబడి పోవుడట" అని. ఎవ్వరు రానన్నరు. నేను ఒక్కదాన్నే నా సెల్లెను ఈపుకు కట్టుకొని పట్నంల కలెక్టర్ ఆఫీస్ కి పోయిన. గా ఆఫీస్ ఎప్పుడు సూడలే మత్తు పెద్దగా ఉంది. మంది సుత బాగవున్నరు. ఎక్కడికి పొయ్యి ఎవలకు సెప్పి కలెక్టర్ అమ్మ ను కలుసుడో. కొద్దిసేపు బిత్తిరి, బిత్తిరి అయిన. ఇగ ఎట్లైన మంచిదే అని లోపటికి పోతా ఉంటే దర్వాజ కాడ ఉన్న పెద్ద మనిషి మేడం మీటింగ్ లో ఉన్నారు. రేపు రా అని బయటకు తోసిండు. నేను ఏడుసుకుంట పొయ్యి, ఓసెట్టు కింద కూసోని గొడ్లు బర్లు అచ్చె ఏళ్లకు ఇంటికి పోయిన. మా ఊళ్లే అందరు ఆడిగింఙ్రు

పని అయ్యిందా అని. కాలే అని సెప్పటానికి ఇజ్జత్ అనిపించింది.

గాల్లు అట్ల అడుగుడు నాలో ఇంక మొండితనం పెంచింది. తెల్లారి మల్ల పోయిన. ఈ రోజు గూడ గట్లనే ఆ పెద్దమనిషి మల్ల రేపు రా అని తోసిండు. కనీసం నేను సెప్పేది కూడ ఇనకుండ. గట్ల ఓ పధేను రోజులు గడిచినయ్. మల్ల గూడ పొయ్యి గా సెట్టుకిందనే మా సెల్లను ఎత్తుకొని కూకొని ఏడుస్తున్న. నన్ను సూసి ఓ! పత్రిక అన్న నా దగ్గరికి అచ్చిండు "ఏమైందమ్మా! ఎందుకు ఏడుస్తున్నావ్. చేతిలో ఈ సంటి బిడ్డ ఎవరు. నిన్ను 15 రోజులుగా ఇక్కడే చూస్తున్న ఎమ్ జరిగిందో చెప్పమ్మా నీకు నేను సహాయం చేస్తా" అన్నడు. నేను జరిగింది అంత గా అన్నకు సెప్పిన. "కలెక్టర్ దగ్గరికి నువ్వు పోవుడు కాదు నీ దగ్గరకే కలెక్టర్ అచ్చేటట్టు నేను చేస్తా..! ఇక నువ్వు ఇంటికి వెల్లమ్మ రేపు రా అంతే చూడు నీ దగ్గరికి కలెక్టర్ వస్తుంది" అన్నాడు. నేను ఇంటికి అచ్చి మల్ల పొద్దుగాల పొయ్యిన.

నిన్న మొన్న నన్ను దేకనోళ్లు ఇయ్యాల అందరు నన్నే సూసుడు ఏందబ్బా అనుకున్న."ఓ అన్న నా దగ్గరికి అచ్చి నీ ఫొటో పేపర్లో అచ్చింది సూడు" అని చూపించిండు. మా ఊరికి పేపర్ కూడ రాదు గందుకే ఆ ముచ్చట నాకు తెల్వలే. మల్ల పొయ్యి నేను గా సెట్టు కిందనే కూకున్న. ఇంతల కలెక్టరమ్మ ఆఫీస్ కి అచ్చింది. ఆ పేపర్ ల వార్త గామేడం కూడ సూడవచ్చు. గందుకే ఆ అమ్మ రాకడ, రాకడే ముందుగాల నా దగ్గరికి అచ్చింది. మేడంను సూసి నేను నమస్తే పెట్టిన. ఆ మేడం నా పక్కపొంటి కింద కూసోని. "అమ్మా మా ఆఫీసు స్టాఫ్ చేసినదానికి నేను నీకు సారి చెప్తున్న". ఆమేడం గట్ల ఆనంగానే అయ్యో! గట్ల అనకండి మేడం అన్నా!

"సరే ఇప్పుడు చెప్పమ్మా నీ ప్రాబ్లమ్ ఏంటి" అని అడిగింది.జరిగింది అంత టక టక సెప్పిన. "ఇగో మేడం మా ఊరికి రోడ్డు కావాలె, ఆగుమీద బ్రిడ్జి కావాలె, సుట్టుపక్కన ఓ ఆసుపత్రి కావాలె. మా ఊరికి బస్ రావలె. గిట్ల నేను చెప్తావుంటే.. ఆ అమ్మ నవ్వింది.

"ఇవ్వన్నీ మీ ఊరి సర్పంచ్ పట్టిచ్చుకొని ప్రభుత్వంతోని చేయించే పనులు. సరే మీ ఊరి కోసం ఇంత చిన్న వసస్సులో ఇంతగా ఆరట పడుతున్నావ్. అంతే కాదు మీకు జర్గుతన్న అన్యాయానికి నాకు చాల భాదేస్తుంది. అందుకే నేను నీ కేస్ పర్సనల్ గా తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. సరే ఇంతకీ నీ పేరు ఏంటి?నీ వయస్సు ఎంత?" అని అడిగింది." మిగితా వివరాలు అన్ని గా దరఖాస్తులో రాసిండు మా ఊరి సారు గాని నా పేరు రాయలే. "మేడం నా పేరు కీర్తి. బల్లె మా సారు కొండక్క మోటుగ ఉందని మార్సిండు.నాకు ఇప్పుడు 16 ఏండ్లు" అని చెప్పిన.

"అప్పుడు గా మేడం గుడ్ ఇంత చిన్న వయస్సులో ఇంత ధైర్యంగా మీ ఊరి కోసం పోరాటం చేస్తున్నావా" అని నన్ను మెచ్చుకుంది. ఇగ తెల్లారి గూడ పేపర్ల మొత్తం నా న్యూస్ తోనే నిండి పోయుంది. కలెక్టరమ్మ నాతో మాట్లాడిదంత పొల్లువోకుండ ఆ పేపర్ల అచ్చింది. గిదంత కొంత మంది పట్నంకి సదువుటానికి పోయిన పొరగాండ్లు కూడ సూసింద్రు. ఆడి పొల్ల ఇంత తెగువ తోనే ఒక్కతే మన ఊరి బాగుకోసం పాకులాడుతా ఉంటే మనం గిట్ల సూసుకుంట ఉండడు ఏంది. అని ఆళ్లు కూడ "ఇక నీ ఎంబడి మేము ఉన్నం కీర్తి. మన ఊరి బాగు కోసం ఎక్కడికి;అంటే అక్కడికి పోదాం" అని నాతో అచ్చింద్రు. ఆళ్లను సూసి మా ఊరు మొత్తం నా ఎంబడి నిలవడింది. ఏ రాజకీయ నాయకుడు వచ్చిన ముందుగాల మా ఊరుకు అన్ని సౌలతులు సేసినంక నే ఊరి పొలిమేర తొక్కమన్నం. కలెక్టర్ మేడం కూడ మా గురించి బాగ పట్టించుకుంది. ఇగ రెండు ఏండ్ల వరకు మా ఊరికి బ్రిడ్జ్, రోడ్డు, అందరికి అందుబాటులో ఓళఆసుపత్రి. ఊళ్ళో సదువు అయిపోయి కాలీగ ఉన్న ఇద్దరు అన్నలకు సబ్సిడీ మీద రెండు ఆటోలు ఇచ్చింద్రు. ఇగ మెల్ల మెల్లగా అన్ని సౌలతులు అయినయ్. సిమెంట్ రోడ్డు, మంచినీళ్లు పంపు, ఇంటి ఇంటికి మరుగు దొడ్లు అయినయి. కాని మా సమస్యలు ఇంకా తీరలే.. దానికోసం మా ఊరు మొత్తం నేను సెప్పినట్టు ఇన్నరు. సారా దుకాణం మూయించాలి అని చెప్పిన. ఊళ్లే అందరు తాగుడుకు బానిసై ఇంట్ల పెళ్ళాం పిల్లలను పట్టించ కుంట లేరు గందుకే ముందుగాల గా దుకాణం మూపియ్యాల" అన్న.

అందరం ఆడోల్లమ్ కలిసి ఆ దుకాణం అన్న దగ్గరికి పొయ్యి నీ ఒక్కని కడుపు నింపుకొనుడానికి ఇంత మంది కడుపులు కొట్టకు అని బతిమాలినం. ఏదో పండగకి, పబ్బానికి తప్పితే ఊళ్లే సారా అమ్మద్దు అని సెప్పినం. ఆ అన్న ససేమిరా అన్నడు. అప్పుడు నేను కొంచెం గట్టిగనే వార్నింగ్ ఇచ్చిన. ముయ్యకుంటే మంచిగ ఉండదని. మెల్లగా ఆ అన్న కూడ ఇన్నడు. మొగోళ్ళు అంత పనికిపోతాంద్రు. ఇగ ఆడోళ్లకు కూడ ఏదన్నా పని సూసుకోవాలి అని మహిళా సంఘాలుగా ఏర్పడ్డం. ఒక్కో గ్రూప్ సేసుకొని బ్యాంకుల అప్పు తీసుకుని. ఎవరికి అచ్చిన పని ఆళ్లు సేసుకున్నం. కుట్టుమిషన్లు, బర్లు, దుకాణం, అల్లికలు లాంటివి. ఇగ నాతిరి పూట నాకు అచ్చిన కాడికి నేర్సుకుంట అన్నోళ్లకు కూడ సదువు సెప్పుతున్న. ఇగ పొట్టతోని ఉన్నోళ్లు, పిల్లతల్లులు ఫుడ్ తీసుకుంటానికి పక్క ఊరికి పోవుడు తిప్పలు అయితందని మా ఊళ్ళో అంగన్వాడీ కోసం దరఖాస్తు పెట్టినం. పెట్టినంక ఓ రెండు ఏండ్లకు సాంక్షన్ అయ్యింది. 10 తరగతి వరకు సదివింది నేను ఒక్కదాన్నే ఆడోళ్లల్ల గందుకే ఈ పోస్ట్ నాకు ఇచ్చింద్రు".

తను చెపుతున్నంత సేపు ఊపిరి బిగ పట్టి అందరం వింటూనే ఉన్నాం. తను యాసతోనే మాట్లాడటం మమ్ముల ఇంకా ముగ్ధుల్ని చేసింది. తను చెప్పడం అయిపోయాక మాకు తెలియకుండానే మా హర్షధ్వానాలతో ఆ స్కూల్ మొత్తం మోగిపోయింది. మా మేడం "కీర్తీ.. ఇక మేము బయలుదేరుతమమ్మా! ఇప్పడికి చాల లేట్ అయ్యింది" అని చెప్పింది. అందరం లేచాం ఒక్కొక్కరు కదులు తున్నరు. నేను కీర్తి దగ్గరికి వెళ్లిన.

"నువ్వు మహిళలందరికి ఆదర్శం నీ అడుగు ఇక్కడితో ఆగకూడదు డిస్టాన్స్ లో మళ్ళి సదువు కొనసాగించు. నువ్వు ఒక అధికారివి అయితే ఇలాంటి పల్లెలు ఇంకా ఎన్నో బాగుపడుతాయ్" అన్న.

"దానికి తను తప్పకుండ అక్క నేను ఆ ప్రయత్నమే చేస్తున్నాను" అంది. ఆలోచనలతో నిండిన గుండె బరువును మోసుకుంటూ ఇక తిరుగుప్రయాణం అయ్యాం!

కథ

# పచ్చి ఎచ్చాల డబ్బా పసరు మందు




- జాజుల గౌరి

హైదరాబాద్


పంట పొలాల్లో పనులు లేనప్పుడు మా నాయనకు కూలి పైసలు వచ్చి జర పైసలు మిగిలిన నాడు, మా అమ్మతో కూడి లస్కర్ కు 11 నెంబరు బస్సు ఎక్కి పోతుంటిమి.

లస్కర్ రైల్వే స్టేషన్ ముందల బస్సు దిగి గాంధీ దవాఖాన ముందల నుంచి మోండా మార్కెట్ కి పోయి కూరగాయలు చిల్లర సౌదలు తీసుకున్నంక తను ఒక పెద్ద సంచి భుజాన పెట్టుకుని ఇంకొక సంచి చేతిలో పట్టుకొని మార్కెట్ల నడుస్తుంటే ఆమె వెనక కొంగు పట్టుకొని నడుచుకుంటా నడుచుకుంటా మోండా మార్కెట్ను నలుమూలల కలియ చూస్తా,కలియ చూస్తా, కాళ్లు సుర సుర మంట కాలుతుంటే చెప్పులు లేని కాళ్లతో అమ్మ ఎనక దబ దబ ఉరికి ఉరికి పోతుంటి.

లష్కర్ల నడుస్తూ పోతుంటే,పోతుంటే ఎదురవుతున్న జనాలని, పక్కన నిండుగా పేర్చుకుని కూసున్నా దుకాణాలని చూస్తా చూస్తా మా అన్నలకు కావలసిన నల్లని మొలతాళ్ళు, అమ్మ కుంకుమ బొట్టు, మైనము డబ్బి, పసి పిల్లలకు కావలసిన కాటుక బొట్టు, కిసర్ పూస, చిన్న గాజులను తీసుకుని దాని ఎదురుగా ఉన్న పచ్చి ఎచ్చల దుకాణం కాడికి నన్ను తీసుకు పోయి సంచుల కాడ నన్ను కాపలా పెట్టి , సెంధూరము, కర్పూరము, కరక్కాయలు, జాజికాయ, వంట ఆముదము, వాము, జూలాబు గోలీలు, జీడిగింజలు, మాచ్చసి ,సున్నం డబ్బా,కాసు, తెల్ల పొంకాలు, బాలెంత ఎచ్చాలు, పటిక, జాజికాయ, జాపత్రి,మరేవో చేతి మందులు పిల్లలకు కిసర్ పూసలు, వంట ఆయిదము, పొగాకు పుల్లలు, మోసంబిరము, పచ్చిఎచ్చాలు కొనేది.

కానీ అప్పుడప్పుడు శనివారం నాడు ప్రత్యేకంగా పాదరసము, సెంధూరము తులం లెక్కన కొనుక్కొని చానా భద్రంగా పొట్లం కట్టి లెక్క అంత అయినాక చెక్కుడు సంచిల కెళ్ళి రూపాలు తీసి లెక్కకట్టి దుక్కనంల ఇచ్చి అన్ని ఎచ్చాలను భద్రంగా సర్దుతా నన్ను తోలుకొని లస్కర్ మహంకాళి మార్కెట్ల మా పిల్లలందరికీ అరటిపండ్లు కొనుక్కుని,నన్ను తీసుకువస్తా షర్బత్ బండి కాడ ఆగి షర్బత్ తాపించేది.

ఇక షర్బత్ తాగిన మంటే సౌధాలు తీసుకునుడు పురాగ అయినట్లు లెక్క.ఇగ మోయలేనంత బరువుని మొసుకుంట మొసుకుంట అల్ఫా హోటల్ కాడి దాకా నడిచివచ్చి డబుల్ డెక్కర్ బస్సు ఎక్కి లోతు కుంట్ల దిగి సౌదల సంచులు మూమోసుకుంట ఇంటికాడికి నడిచి పోయే టోళ్ళం.

మేము ఇంటికి పోయేటప్పటికి మా కోసం గువ్వల్ల అన్నా చెల్లెళ్లు ఎదురు చూసుకుంటా అమ్మ తినడానికి ఏమన్నా తేస్తుందని చూసుకుంటా ఉండేటోలు.

అమ్మ ఇంటి కాడికి పోతనే,బయట అరుగు మీద సౌధాల సంచులు పెట్టి, సరాసరి జాలట్లాకు పోయి, నాకు కాళ్ళు చేతులు ముఖం కడిగి, తను కడుక్కొని నోట్ల నీళ్ళుపోసుకుని పుక్కలించుకుంటా, నెత్తి మీద కొంగు తీసి ముఖము చేతులు తుడుచుకుంట అరుగు కాడికి వచ్చి సంచులను ఇంట్లకు తీసుకొని పోయి, సౌదలన్ని గౌళాలల్ల పట్వలల్ల సర్దుతనే మాకు అరటి పండ్లు పంచిపెట్టేది.

లష్కర్ నుంచి తెచ్చిన పచ్చి ఎచ్చల మందులను మాత్రం ఇనుప డబ్బల పెట్టి తాళం వేసేది. ఎప్పుడన్నా మేము ఎచ్చల డబ్బను తెరవాలంటే తాళం మాకు దొరకకుండా అమ్మ దాచి పెట్టేది.

మాకు సర్ది అయినా, దగ్గు అయిన, కడుపు ఉబ్బరం అయినా, జ్వరం వచ్చిన,దెబ్బలు తాకిన ఆ పచ్చి ఎచ్చల డబ్బనే దిక్కు మాకు. అప్పుడప్పుడు జిందాతిలిస్మాత్ అమృతాంజన్ డబ్బాలు కూడా అందుల చేరుతుండే.

ఇంటి నిండా ఆవులు ఉన్న ఇల్లు మాది. ప్రతి దినం ఏదో ఒక పూట కొన్ని ఆవు పాలు ప్రతి ఒక్కరికి అందేటివి.

చింతపండు తొక్కు చేసిన నాడు మాత్రం అందరం బువ్వల పాలు పోసుకుని అంచుకి ఇంత చింతపండు తొక్కు వేసుకుని కంచు తలేలో బువ్వ కలుపుకుని తినేవాళ్ళం.

ఇంగా ఐతారం వచ్చిందంటే మా ఇంట్లో ఎప్పుడూ పావుకిలో ఈ యాట మాంసం ఉడికేది.

అయితే అప్పుడప్పుడు మాత్రం మా నాయన కాయకష్టం చేసి వస్తాడని, తన ప్రాణం బాగుండాలని, మా అమ్మ శనివారం నాడు లస్కర్ దుకాణం నుంచి వెండి కన్నా తెల్లగా తల తలలాడుతున్న పాదరసం, రాగి రంగులో ఉన్న సింధూరం తీసుకొచ్చి పెడుతుండే.

మర్నాడు పొద్దుగాలనే మా నాయనను ఉపవాసం వుండమని చెప్పి ఏడు ఎనిమిది కల్లా లోతుకుంట కటికోల్ల కిషన్ రావు దుకాణంకు పోయి పావుకిలో యాట మాంసం దాని వెంట రెండు నల్లి బొక్కలు కొట్టించుకుని తీసుకొస్తుండే.

యాట మాంసంలో ఉల్లిగడ్డలు కోసి కడిగి కూర అటికేల వేసి రెండు నల్లి బొక్కలు పక్కన తీసి నల్లి బొక్కలో ఉన్న మజ్జనంతా కట్టె పుల్లతో కెలికి కెలికి బయటకు తీసి ఆ మజ్జను కూరల వేసేది. నల్లి బొక్కలను జాగ్రత్తగా ఒక గిన్నెలో పక్కల పెట్టి, గోధుమ పిండి ముద్దను పిసికి శనివారం నాడు తీసుకొచ్చిన పాదరసంను ఆ నల్లి బొక్కలల్ల జాగ్రత్తగా జార విడిచి పిండి ముద్దతో నల్లి బొక్కలు మూసేది. ఆ పిండి ముద్దలకు నాయన పాత దోతి బట్టను చింపి ముద్ద చుట్టూ కప్పి దారంతో గట్టిగ ముడులు వేసి వనరుగా కూర అటికేల వేసేది.మంచి నూనె ఉప్పు కారం పసుపు అల్లం ఎల్లిగడ్డలు కలే కలిపి కట్టెల పొయ్యిమీద కూర సగం ఉడికినంక టమాట వేసి చివరగా మిరియాల పొడి ఎసి మెత్తగా ఉడికించి భోజువారి మసాలా వేసి గుమగుమ లాడే యట కూరను పొయ్యి మీదికెల్లి దించేది.

నాయన రసం వేసుకునే రోజుని పొద్దటి నుంచి పచ్చి మంచినీళ్లు ముట్టకుండా పొలం కాడికి పోయి వచ్చి ఆవుల కొట్టం సరిచేసి గడ్డం గీసుకుని తానం చేసి ఎదురింట్ల తీరిపారిగా కూసునేటోడు ఇక్కడ ఇంట్లో పనంతా అయిపోయి మా అమ్మ కూర బువ్వ వండే తలకు పదకొండేళ్ల అయితుండే. అప్పటికల్లా మేమంతా తిని సద్దుమణిగుతుంటిమి, మా నాయన కోసం వండిన వంటకాన్ని మా అమ్మ ఎదురింట్లకి తెచ్చి తలేల చల్లారేస్తుండే.

నాయినకు రసం వేయబోతుందని తెలవంగానే మేమందరము మా నాయిన ముందున్న తలే చుట్టు చేరుతుంటిమి. నల్లి బోక్క చుట్టూ ఉన్న పిండిని తీసి పక్కన పెట్టి నాయన అలగ్న నల్లిబొక్కలో ఉన్న పాదరసాన్ని గొంతులకి వోనరుగా వంపుకోంగనే అమ్మ మాకు ఆ నల్లి బొక్క పిండిని తినడానికి ఇస్తుండే కూరల ఉడికి ఉడికి పిండి కమ్మగా తయారై తింటుంటే మస్తు కమ్మగా ఉంటుండే. పాల పండ్లు ఉన్న పిల్లలకు మాత్రమే అమ్మ తినడానికి ఆ పిండిని ఇస్తుండె ఎందుకంటే పాదరసం పండ్లుకు తగిలితే పండ్లు ఊడిపోతాయని చెప్పేది.

ఆ తర్వాత అదే కూర చారుతో నాయన బువ్వ తిని నిద్రపోతుండే . ఆయళ్ల రాతిరి నాయన బువ్వ తిని పడుకునే యాల పచ్చి ఎచ్చల డబ్బాల ఉన్న పొట్లంల కెని చిటికెడు చెంధూరం తీసుకొని కంచు తలెను బోర్లించి గుండ్రాయి తోటి నేరసుగా నూరి, ఉడుకుడుకు అన్నముద్దల ఆ పొడి పెట్టి, నాయనకు ఇస్తే నాయన రెండు మూడు ముద్దలు కుతికెలకు వేసుకొని మింగేటోడు. అట్లా ఆరోజు మా నాయన పత్యం చేస్తుండే.

"అమ్మ నాయినకు ఎందుకు ఇట్లా చేస్తున్నవే" అని రెండు మూడు సార్లు అడిగితే గోవల మీద ఎక్కి నాయన ఉప్పరి పని చేసి వస్తాడు కదా బిడ్డ, నాయన పానం సుస్తూ కాకుండా మంచిగ ఉండాలని గిట్ల చేస్తున్న అంటుండే.

మల్ల మా అమ్మకు జ్వరం వచ్చినప్పుడు జిందా తిలిస్మత్ డికాషన్ల కలుపుకొని తాగుతుండే. ఇంట్ల ఎవరికన్నా సర్ది అయి జ్వరం వస్తే ముందల పొద్దుగాల లేవగానే ఉడుకునీలల్ల ఉప్పు రాళ్లులు వేసి గొంతుల పోయించి లాడించి పుక్కిలించమనేది. పలుగురాళ్ళను తీసుకొచ్చి వాయిలకు జిందా తిలిస్మాత్ ఆకులను ఉడుకుడుకు నీళ్ళల్లో వేసి అండ్ల కాలిన పలుగురాలను కూడా వేసి నిండా బొంతగప్పి కాపడం పట్టేది. ఆ సెగకి ఒంటిల ఉన్నచెమట అంతా కారి ఒళ్ళు నొప్పులు తగ్గి సర్ది జ్వరం కూడా తగ్గిపోయేది.

పని చేసి చేసి అలసిపోయి కాళ్ల నొప్పులు వచ్చినప్పుడు జిల్లేడు చెట్టు కాడికి పోయి కాళ్ళను పారజాపి జిల్లేడు పాలని మోకాళ్ళ చిప్పల చుట్టూ రుద్ది చెట్టు కింద ఉన్న మన్ను అద్దేది. అట్లా గంట రెండు గంటలు ఆ చెట్టు దగ్గరనే కూర్చుని కాళ్ళ చుట్టూ ఆరినంక ఇల్లు చేరి సేద తీరేది. అమ్మ నాయనలకు పెయ్యి నొప్పులు అయితే మాతో వీపును కాళ్లు చేతులను తొక్కించుకునే వాళ్ళు ఆ తొక్కినందుకుగాను ఐదు పైసలు పది పైసలు మాకు ఏమన్నా కొనుక్కోమని ఇచ్చేవాళ్ళు.

మాకు ఎప్పుడన్నా అమ్మవారు పోస్తే నాయన తెల్ల తెల్ల దోతి ,తెల్ల బట్టలలో మమ్మల్ని పడుకోబెట్టేది. అమ్మవారు తగ్గినంక ఐదవ రోజు వేపాకు పసుపు కలిపి నలుగు పెట్టి తానం చేయించేది నోసటన, రొమ్ము నడుమ,ఎడమ అరికాలున నల్లని కాటుకను అద్దేది. అమ్మవారి గుడిలో ప్రతిరోజు బిందెడు నీళ్ళల్లో వేపాకు వేసి సాక పెట్టి దండం పెట్టి వచ్చేది. అమ్మవారు వెళ్ళిపోయినాక, ఒంటికి వేపాకు పసుపు రాసి ఆయిల్ ఆకుతో కాగబెట్టిన నీళ్లతో తానం చేయించేది.

మాకు అమ్మ గడ్డలు అయి గదవలు వాసి నప్పుడు గంధం చెక్కపై కొన్ని నీళ్లు చల్లి బరకు బండమీద నెరుసుగా నూరి ఆ గంధాన్ని చెంపలకు అద్దేది.

ఇంకా ఇంట్లో ఎవరికన్నా కాన్పు జరిగితే, దవఖాన నుంచి వచ్చిన రోజే కుండల వాయిలాకు,యపాకు కలిపి నీళ్లలో వేసి బాగా మసుల పెట్టేది. యపాకుల పసుపు కలిపి ముద్దగా నూరి ఆ పసుపుని బాలింతకు పెయ్యినిండా నలుగు పెట్టి కుండలో మసిలి కాగిన వాయిలాకు,యపాకు ఉడుకుడుకు నీళ్లను పోసి తానం చేయించేది. ఇక పసిబిడ్డలకి కొబ్బరి నూనెతో పెయ్యింత రుద్ది నీళ్లు పోసేది. ఆ తర్వాత వేచ్చని బట్టతో తుడిచినాక పసిబిడ్డకు తల్లికి కలిపి ఉడుకు నిప్పు కనికలను జలిగంటల తీసుకొచ్చి నిప్పులపై వోమ,ఎల్లిగడ్డల పొట్టు, మైచ్చసి కలిపి చల్లేది. మూడు కలిసిన కమ్మటి సాంబ్రాణి ధూపంతో తల్లి పిల్లల వంటికి పట్టేది. ఆ సాంబ్రాణి ధూపం వాసన అటు తల్లి పిల్లలతో పాటు మా ఇల్లంతా కలే తిరుగుతూనే మమ్మల్ని మత్తులో ముంచేది.

కాన్పు అయిన బాలింతలకు ప్రతిపూట అల్లం ఎల్లిగడ్డల కారం టమాట, పచ్చకూర పెట్టేటోళ్లు. మూడేచ్చాలు, లేదా బాలింత ఎచ్చాలను నెలనర్థం పాటు పత్యం చేయించేవాళ్లు.

ఇంకా బాలింతలైతే ప్రతిరోజు ఉడుకుడుకు ఎల్లిపాయ కారం బువ్వ తిని, ఉడుకు నీళ్లు తాగి, పడుకునే ముందల నోట్లో

వేసుకోవడానికి ఓమ ఇచ్చేది. ఇలా నేల పత్యం చేయిస్తూ ప్రతి ఐతారం యాటమాంసంతో భోజనం పెట్టేది. వారంలో ఒకటి రెండు సార్లు పచ్చగూరలను వండి పెట్టేది.

వాన కాలంల, చలికాలంల పసి పిల్లలకు సర్ది అయి మొగుళ్ళు అయి కుస కుస మంటుంటే, పచ్చి ఉల్లిగడ్డలు ఓమ దంచి కలిపి చిన్న చిన్నగా ముదులు వేసి పసిపిల్లల మెడల కట్టేది. కీసరు తగలకుండా కీసర పూసను కూడా కట్టేది. పసిపిల్లల చేతులకు నల్లపూసలు కాళ్లకు రాగి వెండి కలగలిపిన కడియాలను , మెడల వెండి కత్తి బిళ్ళ గొలుసును వేసేది.

ఇంకా పసిపిల్లలకు ఉగుడూ చెట్టు కొమ్మలను గొడ్డలితో నరికి తీసుకొచ్చి ఉయ్యాల తయారు చేసి, పాత మెత్తటి బట్టలతో చిన్నచిన్న బొంతలను కుట్టి అందుల్ల పసిపిల్లలను పడుకోబెట్టి ఊయల ఊపే వాళ్ళు.

ఇంగ జీడిగింజల సుద్దికొస్తే జీడిగింజలు పగలగొట్టి జీడిగింజలలో ఉన్న పలుకుని మాకు తినడానికి ఇచ్చి, జీడిగింజలను మంచి నూనెలో వేసి ఇంగలాల మీద మరగ కాసేది. ఈ నూనేను మా అందరి నెత్తులకు అంటి తన నెత్తికి కూడా మా అమ్మ అంటుకునేది. మా అమ్మలు ఎప్పుడూ కూడా చెప్పులు లేకుండానే నడిచేటోలు. పొలాల పనిచేసేటప్పుడు, వాన కాలం అప్పుడు బురదకి కాళ్లు పగిలితే ఇనప సీకుతో జీడిగింజను గుచ్చి అందులో నుంచి వచ్చే నూనె కాళ్ళ పగుళ్లలో పెట్టుకునేటోళ్లు. జీడిగింజ రసం కొద్దిసేపటికి నల్లగా మారి పుండు మానినంతవరకు అంటూ కొని ఉండి తర్వాత మెల్లమెల్లగా పుండును మాన్పి మాయమయ్యేది.

దెబ్బలు తాకి రక్తం కారినప్పుడు ఆ గాయాలకు మందుగా మా పొలాలలో దొరికే పుట్ పుటాలము ఆకు తెంపుకొచ్చి గాయాలపై రసం పిండి ఆ ఆకు తో కట్టూ కట్టేవారు.

మా నాయన,పెద్దన్న ఉప్పరి పని చేసి సిమెంటులో చేతులు నాని చేతులకు పొక్కులు వచ్చినప్పుడు కొబ్బరినూనెలో పసుపు వేసి పూతగా పూసేవాళ్ళు.

తగిలిన గాయాలకు వాపు వచ్చినట్లయితే వాయిలాకు, పెంక మీద కాపీ ఉడుకుడుకు వాయిలాకును గాయాలకు అదిమి కాళ్లకు కట్టేవాళ్ళు .రెండు, మూడు రోజులల్ల గాయం మాని వాపు మొత్తం తగ్గిపోయేది.

ఎవ్వల కన్నా జ్వరం వస్తే పాలల్ల చిటికెడు పసుపు వేసి తాగించేవాళ్లు. మళ్లీ అందరికీ వాయిలాకు పలుగురాళ్లతో కాపడం పెట్టి మూడు నాలుగు రోజులు ఆరాము తీసుకోమ్మనే వాళ్ళు. జ్వరం తగ్గేటప్పుడు చింతపండు నల్ల మిరియాలపొడి వేసి చారు కాసి పోసేటోళ్ళు. అందుట్ల అంచుకి ఎల్లిపాయల కారం పెట్టేటోళ్లు.

అందరి కడుపులు సాపుగా ఉండాలని పదిహేను రోజులకి నెలకు ఒకసారన్న పెద్దలకు పిల్లలకు జులాబు గోళీలు వేసేటోళ్లు.

జులాబి గోలీలు వేసిన నాడు మా యాతన చూడాలలే . మా అమ్మ మబ్బులనే పిల్లలందరినీ లేపి జులాబీ గోలీలను మిగించి ఆ జులాబీ గోలీల వాసనకు వికారం వస్తుంటే నమలమని బియ్యం ఇత్తలు నోట్లో వేసేది. పొరపాటున కూడా పన్నెండు గంటల వరకు వంట చేసేది కాదు మాకు కడుపులు నొచ్చి నొచ్చి ఏడెనిమిది సార్ల కాలకు పోయినాక అందరికీ తానాలు చేయించి ఉడుకుడుకు బువ్వ వండి, మిరియాల చారు కాసి ఒంటిగంట కల్లా బువ్వ పెట్టేది. అప్పటికి మేము కడుపు మల్ల మల్ల సాపు అయి నిరసించి పోయే వాళ్ళం. ఆ రోజంతా మాకు నీరసమే నీరసం మరుసటి రోజుకు కానీ మేము కోలుకోలేకపోయే వాళ్ళం. అట్లా చేయడం వల్ల ఎలాంటి రోగాలు నొప్పులు పేయ్యికి అంటవని అమ్మ అనేది.

ఇంక మా నెత్తులకు తలంటాలంటే శీకాకాయ, కుంకుడు కాయలను రాత్రి దంచి నానేసి మరునాడు పొద్దున అప్పుడే వార్చిన బువ్వ గంజిని అందులో పోసి మా నెత్తులకు రాసేది తానం చేసినంక మా తల వెంట్రుకలన్నీ నిగనిగలాడేవి.


ఇంగ మా బొట్టు కాటుకల విషయాలకు వస్తే, ఎల్లిపాయలతో కాటుకను తయారు చేసి కపుష్కల పెట్టేది. తుమ్మ చెట్టు కాయలు పక్వానికి వచ్చినప్పుడు అందులో నుంచి తుమ్మకాయల రసం ఇనుప గమాలల పిండేది. నీలి పచ్చగా ఉన్న తుమ్మకాయల రసం ఇనుప గమాలల పడేసరికి ముదురు వంకాయ రంగులోకి మారేది. ఆ రసాన్ని కలిపి కలిపి చిక్కగా అయినాక దానిని ఒక మూకుడులో పోసి రెండు మూడు రోజులు ఎండలో ఎండ పెట్టేది. అది మెల్ల మెల్లగా గట్టిపడి ఆ ముకుడు ల బిర్ర బిగిసుకుపోయేది. ఆ బొట్టు మా పిల్లలందరకు సంవత్సరకాలం బొట్టు పెట్టుకోవడానికి పనికి వచ్చేది. బొట్టు పెట్టుకోవాలంటే అందులో కొన్ని నీళ్లు పోసి వేలుతో దానిని మర్దనం చేయడంతో బొట్టుగా తయారై చేతికి వచ్చేది. ఆ బొట్టును మేము పెట్టుకొననే వాళ్ళం. మా అమ్మలు మామూలుగా అంగట్లో నుంచి తీసుకొచ్చిన కుంకుమను పెట్టుకునేవాళ్ళు. ప్రతి పండగలకి నుదుటన కుంకుమ కాళ్లకు పసుపు తప్పకుండా ఉండేది.

ఆవు పెండ తో ఇల్లును అలికేది.కడపలకు అలుకు పూతలు పూసినప్పుడు కడపలకి పసుపు కుంకుమ లు అద్దేది. ఎర్రమన్నతో అల్లుకు పూతలు పూసి, ఆకిట్ల సుద్దముగ్గును తప్పకుండా వేసేది. ఇంకా పండగ పబ్బాలకి మామిడాకుల తోరణాలతో పాటు వేపాకు రెమ్మలను విరిచి కడపకి కట్టేవాళ్ళు.

తల్లేడు మందికి ఎన్ని బాధలు వచ్చినా కడుపుల దాచుకొని తనకు తన పూర్వీకుల నుంచి వచ్చిన, తనకు తెలిసిన పచ్చి వెచ్చాల పసరు మందులతో మా అమ్మ మమ్మల్ని కాపాడుకుంట వచ్చింది.

కథ

# నాన్నా నువ్వెక్కడ ?



- వేలూరి ప్రమీల.

విశాఖపట్నం. 9492535415

సింధూరం రంగు కిరణాలతో అప్పుడే కొండలచాటు నుండి పైకి వస్తూ, ఉదయించాలని ఉబలాటపడుతున్నాడు సూరీడు. నిద్రపోతున్న లోకానికి మేల్కొలుపులు పాడుతూ పక్షులు, పాటలకు బాణీలు కడుతున్నాయి.

చాలా రోజుల తర్వాత బయటి ప్రపంచాన్ని చూస్తున్న నారాయణ, ఆపాటి కాంతిని కూడా తట్టుకోలేనట్టు కళ్ళు నులుముకున్నాడు. మొక్కల ఆకులపై నిలిచిన మంచుబిందువులు, వెచ్చని కిరణ స్పర్శకు కరిగి జారుతుంటే, ఆ నీటిని దోసిలిలోకి పట్టుకుని, ముఖం తుడుచుకున్నాడు. ప్రాణం లేచి వచ్చినట్లయ్యింది. పొడవాటి లాల్చీ చేతుల్ని కొద్దిగా పైకి మడిచి, గాల్లోకి చెయ్యి ఊపుతూ... రోడ్డుపై అప్పుడే తిరగడం మొదలుపెట్టిన వాహనాలను ఆపాలని ప్రయత్నిస్తున్నాడు.

ఊ... హూ... ఒక్కరూ ఆగే ప్రయత్నం చెయ్యడంలేదు. ఖాళీగా ఉన్న రోడ్డుపై, రేసుగుర్రాల్లా పరిగెడుతున్న లారీలవంక చూసి నిట్టూర్చాడు.

"ఓ... పెద్దాయనా! ఏందీయేల ఈడ నిల్చున్నావు? ఇంటికాడ సెప్పే ఒచ్చినావా?" మాసిన బట్టలూ, నెరిసిపోయి, చెదిరిన జుట్టూ, గెడ్డంతో ఉన్న నారాయణను తేరిపార చూస్తూ అడిగాడు... నల్లగా, బలిష్టంగా ఉన్న ఆ వ్యక్తి.

ఆ పలకరింపుకి చివాలున తలెత్తి చూసాడు నారాయణ.

"ఊర్లోకేనా?" మళ్లీ అతనే అడిగాడు.

అవునన్నట్టు తలూపాడు నారాయణ.

"దా... వొచ్చి బండెక్కు" అడక్కుండానే సాయం చేస్తున్న ఆ వ్యక్తికి అప్రయత్నంగా చేతులెత్తి దణ్ణం పెట్టాడు. మెల్లగా బండిమీద ఎక్కికూచున్నాడు నారాయణ. ఆసరా కోసం ఆ వ్యక్తి భుజం మీద చెయ్యివేసి కూచున్నాడు.

ఆ సమయంలో తన కొడుకు రాఘవని పట్టుకున్నట్టుగా అనిపించిందేమో, కొంచెం కుదుట పడ్డాడు.

"యాడ బోవాల? మాది ఈ పక్కూరే... పాల యాపారం... దినం మొదలైతానే పాలు అమ్ముకోడం, పొద్దుగుంకే దాకా దొరికినకాడికి కూలికి బోడం. నా ఇషయం సరే... తిండితిని ఎన్ని దినాలైతాంది? అట్టా పీక్కుబోయినావు?" బండి నడుపుతూనే పెద్దాయన వివరాలు రాబట్టాలని ప్రయత్నిస్తున్నాడు.

మనసులోని బాధ ఎవరితోనూ పంచుకోడం ఇష్టంలేనట్టు, మౌనంగా ఉండిపోయాడు నారాయణ.

"దయానంద్ నగర్ వైపు తీసుకెళ్లగలవా?" మెల్లగా అడిగాడు.

"పది నిమిసాలు ఓపికపట్టు పెద్దాయనా! నిన్ను మీ ఇంటి కాడ దింపేత్తాను" ధైర్యం చెప్పాడు.

ఇల్లు ఆనవాళ్లు చెబుతూ, మెల్లగా తాముండే కాలనీలోకి జేరుకున్నాడు. ఒక్కసారిగా ప్రాణం లేచివచ్చినట్లైయ్యింది. మళ్లీ తనవాళ్ళందర్నీ చూస్తాడనుకోలేదు.

"ఇక్కడే... ఈ ఇంటిదగ్గర ఆపు!" చెయ్యిపెట్టి చూపించాడు. బండిదిగి, నాదగ్గర ఇవ్వడానికి ఏమీ లేదన్నట్టు తల దించుకున్నాడు.

"ముందు ఇంటోళ్లని కలువు పెద్దాయనా... ఇల్లు గురుతు పట్టేవు, సాలు... మతి లేకుండుంటే యాడ బొయ్యేవాడివో ఏమో" జాగ్రత్తలు చెప్పి, బండి ముందుకి పోనిచ్చాడు ఆ వ్యక్తి.

ఎవరో గేటు తీసిన అలికిడి కావడంతో, పెరట్లో తులసిమొక్కలో నీళ్లు పోస్తున్న జానకి, వెనక్కి తిరిగి చూసింది.

"ఏవండీ! ఎవరొచ్చారో చూడండి..." అంటూ గబగబా బెడ్ రూమ్ వైపు వెళ్లి భర్త రాఘవని పిలిచింది.

స్నానం చేస్తున్నవాడల్లా, టవలు చుట్టుకుని కంగారుగా బయటకి వచ్చాడు.

"మావయ్యా! రండి! లోపలకి రండి!!" చెయ్యి పట్టుకుని, జాగ్రత్తగా నడిపిస్తూ లోపలకి తీసుకువచ్చింది జానకి.

"నాన్నా! ఏమిటిది నాన్నా!? ఇన్నాళ్లూ ఏమైపోయారు? ఎవరికీ చెప్పకుండా ఎక్కడికి వెళ్లిపోయారు? మీకోసం వెదకని చోటు లేదు. పోలీసు కంప్లైంట్ ఇచ్చినా ఫలితం లేకపోయింది. అసలేం జరిగింది?? మళ్లీ మిమ్మల్ని చూస్తామనుకోలేదు" తండ్రిని గట్టిగా కౌగలించుకుని, కళ్లనీళ్లు పెట్టుకున్నాడు రాఘవ.

"మాట్లాడే ఓపిక లేదురా... నీరసంగా ఉంది. కాస్త స్థిమితపడనియ్యి, గుర్తున్నంతవరకూ వివరంగా చెబుతాను" అలసటకి ఒళ్ళంతా భారంగా అనిపిస్తుండడంతో కుర్చీలో జారబడిపోయాడు నారాయణ.

"తాతయ్యా!!" అంటూ మనుమరాళ్లిద్దరూ మేడదిగి, పరిగెత్తుకొచ్చారు.

వేడిగా గ్లాసుతో ఫిల్టరు కాఫీ తెచ్చి, మావగారి చేతికి అందించిన జానకి, స్నానానికి వేన్నీళ్ళు సిద్ధం చేసింది.

★ ★ ★

"అవమానంగా ఉందిరా రాఘవా!" మూడు రోజులుగా పెదవి విప్పని తండ్రి, పంటి బిగువున దుఃఖాన్ని అదిమిపెట్టి, తాను పడిన క్షోభను ఇప్పటికైనా వ్యక్తం చెయ్యడానికి నోరువిప్పినందుకు సంతోషించాడు రాఘవ.

"మనసుకి బాధ కలిగించిన విషయాలు మరొకరితో పంచుకుంటేనే ఆ దుఃఖం తీరుతుందంటారు. మీరు ఇల్లు విడిచివెళ్లి రెండు నెలలయ్యింది. ఇన్నాళ్లూ ఏమైపోయారు? ఇప్పటికైనా చెప్పండి నాన్నా!!" సముదాయిస్తూ అడిగాడు.

ముడతలుపడిన కను చివరల చిప్పిల్లిన కన్నీటితో, మనసు తేలికపరుచుకోవడానికి ప్రయత్నిస్తూ, జరిగినది చెప్పడం ఆరంభించాడు నారాయణ. తాను అనుభవించిన కష్టం తట్టుకోలేకనో ఏమో... చేతులు వణుకుతున్నాయి. గొంతు పెగలడం లేదు. నోరు తడారిపోతుంటే, మంచినీళ్లు కావాలన్నట్టు సైగ చేసాడు.

తండ్రి చేతిలోంచి గ్లాసు అందుకుని కిందపెట్టి, 'నీకేం భయం లేదు... మేమందరం ఉన్నాం!' అన్నట్టు, తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకుని, ధైర్యం చెప్పాడు రాఘవ.

"అది కాదురా! ఆరోజు, ఏకాదశి... వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లి వస్తానని బయల్దేరానా? అక్కడ క్రికెట్ గ్రౌండ్ దగ్గర మలుపు తిరుగుతుంటే... కాలికి ఏదో రాయి తట్టుకుని, ముందుకి పడిపోయాను. అప్పుడే అటువైపుగా ఓ తెల్లని కారు రావడం లీలగా గుర్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందో గుర్తుకురావడం లేదు" రెండు నెలలకిందట జరిగిన విషయాలు, అస్పష్టమైన జ్ఞాపకాలుగా మనసుని గందరగోళ పెడుతుంటే, అతి కష్టం మీద గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు నారాయణ.

"అసలు గుడికి ఎప్పుడూ వెళ్లే రూట్ లో కాకుండా... ఆ క్రికెట్ గ్రౌండ్ వైపు ఎందుకు వెళ్లారు నాన్నా? అక్కడ ఎక్కడా సీసీ కెమెరాలు కూడాలేవు. మీకోసం గుడి చుట్టుపక్కల ప్రదేశాల్లో మాత్రమే వెతికించడం వల్ల, మీ ఆచూకీ తెలుసుకోలేకపోయాం" నిట్టూర్చాడు రాఘవ.

"ఆ... రోజు... ఆరోజూ... ఓ చిన్నపిల్లవాడు దారి తప్పిపోయి ఏడుస్తుంటేనూ, వాళ్ళిల్లు క్రికెట్ గ్రౌండ్ పక్కనే అని చెబితే, బాబుని వాళ్ళ ఇంట్లో అప్పచెబుదామని ఆ రోడ్డువైపు వెళ్ళాను. అవునూ... ఇంతకీ ఆ బాబు ఏమైనట్టు? బాబు తప్పిపోయినట్టు వార్తల్లో ఎక్కడా రాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు నారాయణ.

"లేదు నాన్నా! ఈమధ్య కాలంలో అలాంటి న్యూస్ ఏదీ రాలేదు. అయినా, ఇప్పుడా విషయం ఎందుకు గానీ, మీరు అక్కడ్నుంచి ఎటు వెళ్లారో... ముందు అది చెప్పండి" కుతూహలంగా అడిగాడు రాఘవ.

"ఎంత ఆలోచించినా గుర్తుకు రావట్లేదురా! పక్కనుంచి ఏదో తెల్లటి కారు వెళుతూ, ఆగడం గుర్తుంది అంతే... ఇన్నాళ్లూ ఎవరో మనకి పరిచయం లేని వ్యక్తులు నాతో వున్నారు. ఏమైందో తెలీదు గానీ... ఎప్పుడూ నిద్ర వస్తున్నట్టుగా ఉండేది. మెలకువగా వున్నప్పుడు మాత్రం, తినడానికి ఏదో ఒకటి పెట్టేవారు. ఏవో పేపర్ల మీద సంతకాలు పెట్టమని, తరచూ వేధించేవారు. ఆ ఇల్లు కానీ, అక్కడి మనుషుల్ని కానీ, గతంలో ఎప్పుడూ చూసిన గుర్తు లేదు" జ్ఞప్తికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ చెప్పాడు నారాయణ.

"సంతకాలా? దేనికోసం?" ఆశ్చర్యంగా అడిగాడు రాఘవ.

"ఏవో స్టాంపు పేపర్లమీద సంతకాలు పెట్టమని పదే పదే విసిగించేవారు. నేను ఇంట్లోంచి వెళ్లి, ఎన్నాళ్లవుతోంది? నాకేదీ స్పష్టంగా గుర్తులేదు. ఈ చేతివేళ్ళు ఎందుకో వణుకుతున్నాయి. సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను... మగతగా వుంటోందిరా రాఘవా!" నీరసించిన స్వరంతో చెప్పాడు నారాయణ.

"కాసేపు నిద్రపోండి నాన్నా!" తండ్రిని కుర్చీలోంచి లేవదీసి, మెల్లగా మంచంపై పడుకోబెట్టిన రాఘవకి కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

ఈరెండు రోజుల్లో ఎమ్ ఆర్ ఐ స్కాన్ చేయించాక, తలలో చిన్న చిన్న బ్లడ్ క్లాట్స్ ఉండడం వల్ల, తండ్రికి మైల్డ్ గా పార్కిన్ సన్స్ స్ట్రోక్ వచ్చిందని డాక్టరు చెప్పడంతో చాలా కుంగిపోయాడు.

"జానకీ! నాన్న ఎవరికీ అపకారం చేసిన మనిషి కాదు. నాన్న చెప్పినదాన్ని బట్టి, ఎవరో కావాలనే నాన్నని కిడ్నాపు చేసి తీసుకెళ్లారని అర్థమవుతోంది. దేనికోసం సంతకాలు పెట్టించుకున్నారంటావు? అసలీ రెండు నెలలూ నాన్నని ఎక్కడ ఉంచారు? మానసికంగా ఎంతో ఒత్తిడి కలిగించబట్టే, ఇలా స్ట్రోక్ వచ్చి ఉంటుంది. నాన్న కొంచెం కోలుకున్నాక మెల్లగా ఆయనే అన్ని విషయాలూ చెబుతారు. అంతవరకూ ఆయన్ని డిస్టర్బ్ చెయ్యొద్దు" భార్యతో చెప్పిన రాఘవ, సంతోషంగా సాగిపోతున్న తమ జీవితాల్లో ప్రశాంతత లేకుండా చేసినవారెవరైనా సరే... వారిని వదిలిపెట్టకూడదని, మనసులోనే గట్టిగా అనుకున్నాడు.

★ ★ ★

రోజులు గడుస్తున్నా నారాయణ ఆరోగ్యస్థితిలో మార్పులేదు. చెరుపూ, మరుపుగా ఉంటున్న తండ్రిని చూసి తట్టుకోలేకపోయాడు రాఘవ. తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైన మామగారిని, పసిపిల్లాడిలా సాకసాగింది జానకి. వేళకి తినిపిస్తూ, వీలున్నప్పుడల్లా నలుగురి మధ్యలోకీ తీసుకెళుతూ, మామూలు మనిషిని చేయడానికి ఎంతో ప్రయత్నించింది. ఆమె చేసిన పూజల వల్లో, రాఘవ మొరని

ఏ భగవంతుడు ఆలకించాడో తెలీదు కానీ, నారాయణ కొద్దికొద్దిగా కోలుకుంటున్నాడు. కానీ ఇంతకుముందులా ఉత్సాహంగా లేడు. ఎప్పుడూ సాలెగూడులా చుట్టుముట్టిన ఆలోచనలతో, ఏదో కోల్పోయినవాడిలా ఉంటున్న తండ్రిని, సాధారణ స్థితికి తీసుకురావాలని రాఘవ చెయ్యని ప్రయత్నం లేదు.

గుండెల్లో గూడు కట్టుకున్న బాధను, వ్యక్తం చెయ్యలేకపోతున్న తండ్రి చేతిని, తన చేతిలోకి తీసుకుని, ధైర్యం చెబుతున్నట్టుగా ప్రేమగా చేతిపై స్పృశించాడు.

"ఏమిటి నాన్నా? అసలేమయ్యింది? ఎవరో మన ఆస్తులు బలవంతంగా రాయించుకోవడం ఏంటి? ఆస్తి కోసం మిమ్మల్ని ఇంతగా హింసించిన వాళ్ళని గుర్తుపట్టగలరా? ఎవరు వాళ్ళు?" ఎవరిమీదా తీర్చుకోలేని కోపం, అసహనం కలగలిసిన స్వరంతో అడిగాడు రాఘవ.

"ఎవరనేది గుర్తుపట్టలేను. వాళ్ళని గతంలో ఎన్నడూ చూసిన గుర్తు కూడా లేదు. కానీ, ఇదంతా ఎవరో మన గురించి బాగా తెలిసినవాళ్లే చేసారనిపిస్తోంది. బలవంతంగా ఖాళీ స్టాంప్ పేపర్ల మీద సంతకాలు పెట్టించుకున్నారు. అచ్చం మన డాక్యుమెంట్లను పోలిన డాక్యుమెంట్లే సృష్టించారు. నన్ను బంధించి ఉంచిన చోటుకే రిజిస్ట్రార్ ని తీసుకువచ్చి, మన కుటుంబం అందర్నీ చంపేస్తామని బెదిరించి, నాచేత బలవంతంగా సంతకాలు పెట్టించారు. ఆస్తులు వాళ్ళ పరం చేస్తున్నట్టు, అందుకు సమ్మతిస్తున్నట్టు, నీ సంతకాన్ని ఫోర్జరీ చేసి పెట్టారు. ఇదంతా ముందునుంచీ వేసుకున్న పథకం ప్రకారమే చేసారని నాకు అర్థమైంది. కానీ ఓ తండ్రిగా ఓడిపోయానురా... నీ పిల్లలిద్దరి చదువులకోసం నేనే బాధ్యత పడతానని మీ అమ్మకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయాను. ఏమీ చెయ్యలేని నిస్సహాయుడిగా, ఆస్తి మొత్తం వాళ్ళ పరం చేసేసాను. నన్ను క్షమించరా నాన్నా!!" గుండె పగిలిపోయేలా ఏడుస్తున్న తండ్రిని ఓదార్చడం రాఘవకి సాధ్యం కాలేదు.

బెక్కుతూ మాట్లాడిన తండ్రిని ఓదార్చేంత వయసు లేకపోయినా... "బాధపడకండి నాన్నా! మాకు మీరున్నారు చాలు... ఆస్తిదేముంది? మళ్ళా సంపాదించుకోవచ్చు. ఎంత డబ్బు ఖర్చైనాసరే, గట్టి లాయర్ ని పెట్టి, కోర్టులో కేసు వేయించి, మన ఆస్తి మనకి దక్కేలా చూస్తాను." అంటూ తండ్రికి ధైర్యం చెప్పాడు.

"సంతకాలు పెట్టించుకున్నాక నన్ను చంపేస్తారనుకున్నాను. మళ్లీ మీ అందర్నీ చూస్తాననుకోలేదు. ఊరి శివార్లలో నన్ను ఒదిలేసినవాళ్ళలో ఒకడు ఒరియాలో మాట్లాడుతున్నాడు. రెండు నెలలుగా వాడినెప్పుడూ చూడలేదు కానీ, వాడిని పురమాయించినవాళ్ళు డబ్బు సరిగా ముట్టజెప్పినట్టులేరు... దారి పొడుగునా ఫోన్ లో ఏదో గొడవపడుతూనే ఉన్నాడు. మధ్యలోనే కారు ఆపి, నన్ను దింపేసి, వెళ్లిపోయాడు" జరిగినదంతా కొడుకుతో పూస గుచ్చినట్టు చెప్పిన నారాయణ, అలసటగా ఉండడంతో కాసేపు నడుం వాల్చుతానని చెప్పి, మంచం మీద ఒరిగాడు.

★ ★ ★

"ఏవండీ! పేపరు చూసారా? మా గోపాల్ అన్నయ్యని అరెస్ట్ చేసారట. ఏదో హత్య కేసులో ఇరుక్కున్నట్టున్నాడు. మా పెద్దమ్మకి అర్జెంట్ గా ఫోన్ చేసి, విషయం కనుక్కోవాలి" కంగారుగా చెప్పి, ఫోన్ చెయ్యడానికి లేవబోయింది జానకి.

"అవసరం లేదు జానకీ, ఏం జరిగిందో నాకు అంతా తెలుసు... ఇలా వచ్చి కూచో చెబుతాను" అంటూ చెప్పడం మొదలుపెట్టాడు రాఘవ.

"ఏడాది క్రిందట అమ్మ చనిపోగానే, నాన్న ఒక్కరినీ ఒంటరిగా ఉంచడం ఎందుకని... నిన్నూ, పిల్లల్నీ ఇక్కడికి పంపేసి, నేను ఆస్ట్రేలియాలో ఉండిపోయాను కదా... ఆ సమయంలో అమ్మకి పుట్టింటినుంచి సంక్రమించిన పొలాలూ, మామిడితోటల తాలూకు పత్రాలు, ఉమ్మట్లోనుంచి హక్కుదారులందరికీ పంపకాలు జరిగే విధంగా దగ్గరుండి వ్యవహారాలు చూడ్డానికి మీ పెద్దమ్మ కొడుకు గోపాల్ కి అప్పచెప్పాను గుర్తుందా?"

"ఆ! ఎందుకు గుర్తులేదూ... ఈ ఏడాదిపాటూ మీరు ఇక్కడికి వచ్చేదాకా అడపాదడపా వచ్చిపోతూనే ఉన్నాడు. నాకు చేదోడుగా ఉంటూ, ఇంటా బయటా అన్ని వ్యవహారాలలూ తనే చూసుకున్నాడుగా... తోడబుట్టిన వాళ్ళు కూడా పట్టించుకోని ఈరోజుల్లో, నిజంగా దేవుడిలా ఆదుకున్నాడు. అలాంటి మంచిమనిషిని ఈరోజు అరెస్టు చేస్తే... చూస్తూ ఊరుకుంటామా" ఆవేశంగా చెప్పింది జానకి.

"నువ్వనుకుంటున్నట్టు మీ గోపాల్ అన్నయ్య ఒకరికి ఉపకారం చేసేంత మంచివాడు కాదు జానకీ! ఆస్తి వ్యవహారాలు చూస్తున్నాడు కదా అని, నాన్నగారు పవర్ ఆఫ్ అటార్నీ రాయడంతో, అతనికి దుర్బుద్ధి పుట్టి ఆస్తులన్నీ తనకి దక్కేలా రిజిస్టర్ చేయించుకోవాలనుకున్నాడు. దగ్గర బంధువు కదాని మనం నమ్మినందుకు మనల్నే నట్టేట ముంచాలని చూసాడు. చివరికి ఆస్తులు తాను దక్కించుకోడమే కాకుండా, నాన్నగారి ప్రాణం తియ్యడానికి సుపారీ ఇచ్చి మనుషుల్ని పురమాయించాడు. నాన్నగారు చెప్పినదాన్ని బట్టి, ఆ ఒరిస్సా అతనికీ, మీ గోపాల్ అన్నయ్యకీ చివరి నిముషంలో ఏదో మాట తేడా వచ్చి, అతను నాన్నగారిని ప్రాణాలతో విడిచిపెట్టేసాడని నాకు అర్థమయ్యింది. కానీ వారం రోజుల్లోనే ఆ ఒరిస్సా వ్యక్తి హత్య చేయబడ్డాడు. నాకు అనుమానం వచ్చి, పోలీసులకి విషయమంతా చెప్పాను... తీగ లాగితే డొంకంతా కదిలి, ఆ గోపాల్ చేసిన నిర్వాకాలు ఒక్కొక్కటే బయటపడ్డాయి" జరిగినదంతా రాఘవ చెబుతుంటే... ఇది నిజమా? గోపాల్ ఇంతటి అకృత్యానికి ఒడిగట్టాడా? అన్నట్టు నమ్మలేకుండా చూస్తుండిపోయింది జానకి.

కథ

# ఆమె కథ



- చల్లా సరోజినీదేవి

హైదరాబాద్, 9849826634.

అందరి లాగే ఆమె కూడా పసితనంలో అమ్మా నాన్న ల గారాబు పట్టి నే. అన్నయ్యల కు ఒక్కగానొక్క చెల్లిగా ప్రేమను పంచుకుంది. ఆడుతూ పాడుతూ ఆరోగ్యంగా, అందంగా గడిచింది ఆమె బాల్యం. పెరటి తోట లో అరవిరిసిన చేమంతి లాగ, వసంత ఋతువులో విరబూసిన పచ్చని తరువు లాగ, ముగ్ధ మనోహర రూపం తో , పరువం తెచ్చిన సోయగాలు సంతరించుకుని అందరి దిష్టి తగిలేంత అందంగా తయారయింది ఆమె.

అప్పటివరకూ లేని ఆంక్షలు విధించారు ఆమె ఇంట్లో పెద్దలు. ముఖ్యంగా నాయనమ్మా, ఆమెకు వంత పాడుతూ అన్నింటికీ తల వూపే నాన్న. అసలైతే నాన్నకు ఆమె పైన ఎంతో ప్రేమ వుంది. కానీ తన తల్లి మాటను కాదనలేని బలహీనత తో పాటు నేటి సమాజంలో ఆడపిల్లలకు తరచుగా జరుగుతున్న అన్యాయాల గురించి భయం తో వణికిపో తూ కూతురిని భద్రంగా దాచి, కాచుకోవాలనే తాపత్రయం కూడా వుంది అతనికి. అందుకే 8 వ తరగతి లోనే చదువు మానిపించి ఇంటి పనులు చేయడం లో అమ్మదగ్గిర తర్ఫీదు పొందమని ఆదేశించాడు కూతురికి. ఆ కూతురు వారిజ కు ఇంకా ఎంతో ఎంతో చదువుకోవాలని, ఉన్నత పదవులు చేపట్టాలని ఆశ. అమ్మకు కూడా కూతురి కి బాగా చదువు చెప్పించాలనే వుంది. కానీ భర్త దృష్టిలో ఆమె కేవలం తనకు, తన కుటుంబానికి సేవ చేయడం కోసమే వున్న యంత్రం లాంటిది మాత్రమే." నేను ఈ ఇంటికి యజమానిని. నా మాట మాత్రమే చెల్లాలి. నేను ఏం చేయాలో నాకు సలహాలు ఇవ్వక్కర లేదు. అయినా నీ కూతురు చదివి ఏమైనా ఉద్యోగాలు చేయాలా? ఊళ్లు ఏలాలా? తొందరలోనే మంచి సంబంధం చూసి పెళ్ళి చేద్దాం. ఇంక తన చదువు గురించి ఎవ్వరూ ఎత్త వద్దు. అంతే" అని ఖచ్చితంగా హెచ్చరించాడు. వారిజతో పాటు ఆమె కూడా హతాశురాలై, కుమిలి కుమిలి ఏడ్చింది. ఈ పితృస్వామ్య వ్యవస్థ లో, మూఢ నమ్మకాలను ఇంకా గట్టిగా పట్టుకొని వ్రేలాడే సమాజంలో ఆడవారి మాటలకు, వ్యక్తిత్వానికి అసలు విలువే లేదా? అనుకొని వాపోయారు తల్లీ కూతుళ్ళు. నాయనమ్మ ఓ వైపు " మన నుదుటి రాత ఇంతెనే తల్లీ. మనం వంటింటికే పరిమితం. లోకం ఎంత మారినా, మగవాడి మనస్తత్వం మారలేదు. " అని ఓదారుస్తూ నే, మరో వైపు " అయినా ఆడపిల్ల అంటేనే పరాయి వాళ్ళ సొత్తు అన్నట్లు. ఎప్పటికైనా పెళ్ళి చేసి పంపించాల్సి ఉంటుంది కదా? అందుకే చదువు గురించి అనవసరంగా ఆలోచించకుండా, ఇంటి పనులు చేయడం నేర్చుకో" అంటూ కఠిన హెచ్చరిక జారీ చేసింది. వారిజకు దుఃఖం ముంచుకు వచ్చింది. ఆమె thalliసునంద కీ దిక్కు తోచలేదు. " ఈ సమాజం ఎప్పుడు మారుతుందో? కూతురి బాగోగులు చూడడం కేవలం తండ్రికి మాత్రమే వున్న హక్కు అనే మూఢ విశ్వాసం ఎన్నటికి పోతుందో? నా బంగారు తల్లి ఆశలు ఎలా నెరవేరుతాయి? భగవంతుడా, ఒక తల్లిగా నేను ఏమీ చేయలేనా?" అని నిస్పృహ గా కూలబడింది. తన గురించి తల్లి పడే ఆవేదన గుర్తించి, తండ్రికి ఎదురాడలేని తమ నిస్సహాయత ను తలచుకొని కన్నీళ్ళు నింపుకుంది వారిజ. ఎలాగైనా మళ్ళీ బడికి వెళ్ళాలని గట్టిగా నిర్ణయించుకుంది. "ఈ రోజుల్లో కూడా ఇంత సంకుచితంగా ఆలోచించే తండ్రులు వున్నారా ?"అని అనుకోవద్దు. ఎంత చదివినా, ఎంత ఆధునికత సంతరించుకొన్నప్పటికీ , సగటు మగవాడి మనస్తత్వం అంతే.

అనుకున్నట్లే ఒక మంచి సంబంధం చూసి "రేపే అమ్మాయిని చూసేందుకు వరుడి వైపు వాళ్ళు వస్తున్నారు. దానికి ఎలాగైనా నచ్చచెప్పి, ఒప్పించు" అని భార్యతో చెప్పాడు వారిజ తండ్రి. " నిండా 14 ఏళ్లన్నా లేని పసి దానికి పెళ్ళి ఏమిటీ? నేను తన కన్న తల్లిని. నాకు చెప్పవలసిన అవసరం లేదా? అది చట్ట రీత్యా నేరం అని మీకు తెలియదా? నేను ఒప్పుకోను" అని గట్టిగా ఎదిరించింది సునంద.

"నాకు అన్నీ తెలుసు. కానీ ఈ రోజుల్లో ఎన్నెన్ని దారుణాలు జరుగుతున్నాయో నీకు తెలియదా? ఆడపిల్ల బాధ్యత ఎంత త్వరగా తీర్చుకుంటే అంత మంచిది. అయినా వరుడి తండ్రి నాకు మంచి మిత్రుడు. పైగా ఈ ఊరే. పెళ్ళి జరిగినా అమ్మయి ఈ ఊర్లోనే వుంటుంది కదా? కేవలం ఇల్లు మారుతుంది. అంతే. ఎప్పుడు కావాలంటే అప్పుడు వెళ్ళి చూడవచ్చు. ఇంక వాదనలు వద్దు. నా మాట మాత్రమే విను. " అని వెళ్ళిపోయాడు అతడు. ఏడుస్తూ కూతురి గది వైపు చూసింది తల్లి. ఆమె పడుకొని వుంటుందనుకొంది . కానీ వారిజ పడుకోలేదు. చాటుగా వుండి తల్లి తండ్రుల సంభాషణ విన్నది. " అమ్మ ఎంత ప్రయత్నించినా ఆమె మాట చెల్లదు" అని

గ్రహించింది. అందుకే కష్టమైనా సరే ఆ రాత్రే ఇల్లు విడిచి వెళ్లాలని అనుకొంది.

అందరూ నిద్ర పోయాక ఒక రెండు మూడు జతల బట్టలు తీసుకొని , ఈ జనారణ్యం లోకి ఒంటరి లేడికూన లాగ బయలుదేరింది వారిజ. సామాజిక నియమాలు ఎంత కఠినంగా వుంటాయో తెలియని పసి వయసు ఆ అమ్మాయిది. ఎక్కడికి వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో తెలియదు. చేతిలో రూపాయి లేదు. అలాగే బిక్కు బిక్కు మంటూ నడిచి బస్ స్టాప్ కు చేరుకుంది. అక్కడ ఎక్కువ మంది లేరు. వున్న ఇద్దరు ముగ్గురు నిద్ర తో జోగుతున్నారు. భయం తో ముడుచుకు పోతూ ఓ బెంచీ మీద కూర్చుని చుట్టూ చూసింది వారిజ. ఇంతలో ఒకనడి వయసు స్త్రీ వచ్చి ఆమె ప్రక్కనే కూర్చుంది. ఏమీ తోచక ప్రక్కన వున్నవారిజ ను గమనించి, కుతూహలంగా" ఎక్కడికి వెళ్ళాలి పాపా?" అని అడిగింది. పెద్ద కళ్ళను మరింత పెద్దగాచేసి అయోమయంగా చూసింది వారిజ." ఏదో జరిగి వుంటుందని ఊహించింది ఆ స్త్రీ.

" చూడమ్మా, నా పేరు అనసూయ. నాకు హైదరాబాద్ లో స్వంత ఇల్లు, ఒక ఫ్యాన్సీ షాప్ వున్నాయి. ఈ వూరికి ఒక పని మీద వచ్చాను. తిరిగి వెళుతున్నాను. నాతో వస్తావా"? అని అడిగింది. అవును, కాదు అన్నట్లుగా తల వూపింది వారిజ. నెమ్మదిగా బుజ్జగించి విషయం అంతా తెలుసుకుంది అనసూయ. ఈ రోజుల్లో కూడా ఇంత మూర్ఖులు వున్నారా అని ఆశ్చర్య పోయింది ఆమె. చిదిమితే పాలు గారుతాయేమో అన్నంత అందంగా, సుకుమారంగా వున్న ఆ పసిదానిని అలా ఒంటరిగా వదిలి వేయబుద్ధి కాలేదు ఆమెకు. తనతో పాటు తీసుకొని వెళ్ళి ,ముందుగా ఒక మంచి స్కూల్ లో చేర్పించింది. అనసూయకు చిన్న వయసులోనే పెళ్ళి కావడం, తన గుర్తుగా ఒక కొడుకును ప్రసాదించి ఆ భర్త గుండెజబ్బు తో చనిపోవడం జరిగింది. ఒంటరి మహిళగా ఆమె ఇటు సామాజికంగా, అటు ఆర్థికంగాఎన్నో కష్టాలను ఎదుర్కొన్నది. కొద్దిగా ఆస్తి వుండడం వల్ల ఎలాగో నిలదొక్కుకుని, షాప్ పెట్టుకొని కొడుకును బాగా చదివించి పెద్దవాడిని చేసింది. ప్రస్తుతం అతడు ఉద్యోగ రీత్యా బెంగుళూరు లో వుంటున్నాడు. అందుకని అనసూయ ఒంటరిగానే ఉంటోంది. ఆడపిల్ల , అందులోనూ ఒంటరి గా వుంటే ఈ సమాజంలో ఎంత భయంకర పరిస్థితులు ఎదురవుతాయో అనేది ఆమెకు తెలుసు కదా! అందుకే వారిజను అక్కునచేర్చుకొని ఆదరించింది అనసూయ. ఆమె ప్రాపకం లోనే వుండి + 2 వరకూ బుద్ధిగా చదువుకుంది వారిజ. ఒకటిరెండు సార్లు ఆమె తల్లిదండ్రుల గురించి అనసూయ ప్రస్తావించినా, తను ఒప్పుకోలేదు. మధ్యలో అనసూయ కొడుకు వాసు చాలా సార్లు వచ్చి వెళ్ళాడు. అతనికి తల్లి ఎవరో ముక్కూ ముఖం తెలియని పిల్లను ఇంటికి తెచ్చుకొని ,పెంచడం నచ్చలేదు. తల్లితో అదే విషయంగా వాదించాడు. " ఇంత సంపాదన వుంది. ఒక ఆడపిల్లకు ఆశ్రయం ఇచ్చినంత మాత్రాన ఏమీ తరిగి పోదులే "అని అనసూయ కొట్టి వేసేది. అయితే అతను వచ్చిన ప్రతీ సారీ వారిజని తన ఫ్రెండ్ దగ్గరకి పంపించేది. ఇలా ఎందుకో వారీజకు అర్థం అయ్యేది కాదు. వాసు మంచి పెంపకంలో నే పెరిగినా, మంచిమనసును మాత్రం స్వంతం చేసుకోలేక పోయాడు. ఎలాగైనా వారీజని బయటికి పంపించాలని అతని ఆలోచన. లేకపోతే తల్లి ఆమెకు కూడా ఆస్తిలో వాటా ఇస్తుందేమో అని భయం. అతనికి పెళ్ళి చేయాలని అనసూయ అనుకొంది. కానీ ఇంకా మంచి పొజిషన్ లోకి వచ్చాక పెళ్ళి చేసుకుంటాను అని తల్లికి చెప్పాడు వాసు. కానీ బెంగుళూరు లో అతనికి ఫ్రెండ్స్ కు కొదువ లేదు. జల్సాగా నే గడిపే వాడు. ఒకసారి ఏదో పని ఉందని ముందుగా చెప్పకుండానే ఇంటికి వచ్చాడు వాసు. హాల్ లో కూర్చుని ఏదో పుస్తకం చదువుతూ వున్న అందాల బొమ్మ వారీజను చూసి అవాక్కయ్యాడు. "ఇంత అందంగా ఉందా ఈ అమ్మాయి? " అనుకొన్నాడు. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చి తల్లితో ప్రస్తావించాడు. కొడుకు నిర్ణయం విని విస్తు పోయింది అనసూయ." నీకూ ఆ అమ్మాయికి పదేళ్ళ తేడా వుంది. అయినా తను ఇంకా ఎంతో చదువుకోవాలనే ఆశతో వుంది. ఏదో ఆశ్రయం ఇచ్చామని ఇలా ఆలోచించడం మంచిది కాదు" అన్నది." ఎందుకు మంచిది కాదు అమ్మా? నేను ఏమీ అన్యాయం చేయడం లేదే! పెళ్ళి చేసుకుంటాను అంటున్నాను. తను నాకు బాగా నచ్చింది. ఇంక వయసు తేడా ఏముంది? ఈ రోజుల్లో అదొక అసహజ మే కాదు. ఒకసారి అడిగి చూడమ్మా." అన్నాడు. ఆలోచనలో పడింది అనసూయ. " పెళ్ళి వద్దే వద్దు అనే కొడుకు ఇన్నాళ్ళకు , పెళ్ళికి రెడీ అయ్యాడు. వారిజ కు కూడా పెళ్ళి వయసు వచ్చింది. ఇంక వయసు తేడా వున్న మాట నిజమే. ఇప్పుడంటే అన్నీ చూస్తున్నారు. కానీ ఆ రోజుల్లో ఇవన్నీ చూసే వారా? నాయనమ్మ కు తాతయ్యకు పాతికేళ్ళ తేడా వుం డేదిట. అయినా నా పెళ్ళి వరకూ శుభ్రంగా వున్నారు కదా? వారిజ వంటి అందమైన, బుద్ధిమంతు రాలైన కోడలు ఎంతమందికి దొరుకుతుంది? అడిగి చూస్తే తప్పేముంది?" అనుకొంది. అంత వరకూ ఫోటో లో మాత్రమే వాసును చూసింది వారిజ. ఇప్పుడు అనుకోకుండా ప్రత్యక్షంగా చూసింది. నిజానికి వాసు కూడా మంచి అందగాడు. అందుకే బెంగుళూరు లో బోలెడు మంది గర్ల్ ఫ్రెండ్స్ అతని వెంట పడే వారు. అదే గొప్ప ఆనందంగా భావించేవాడు వాసు. వారిజాను చూసాక , తను అందరిలా తన వశం కాదని అర్థం అయింది. అందుకే పెళ్ళి చేసుకుని , ఆమెను కైవసం చేసుకోవాలి అనుకొన్నాడు. ఆ రాత్రి భోజనాలు తినే సమయంలో వారిజ ను పిలిచి " మా వాడు వాసుదేవరావు. బెంగుళూరు లో జాబ్ చేస్తున్నాడు అని నీకు తెలుసుగా వారిజా! " అన్నది అనసూయ. మిత భాషిఅయిన వారీజ" తెలుసు" అన్నట్లుగా తల వూపింది. " అమ్మా, దాపరికం లేకుండా అడుగుతున్నాను. వాడికి నువ్వు నచ్చావట. ఇన్నేళ్ళకి వాడికి పెళ్ళి మీద మనసు పోయింది. నువ్వు సరెనంటే ........" అని అర్థోక్తి లో ఆగిపోయింది అనసూయ. " ఆంటీ, నేను ఇంకా చదువుకుంటాను" సంకోచిస్తూ , నసిగినట్లుగా అన్నది వారీజ. అక్కడే వుండి వారి సంభాషణ వింటున్న వాసు

వెంటనే కల్పించుకొని" పెళ్ళి అయ్యాక కూడా చదువుకోవచ్చు. ఎంతవరకైనా పర్వాలేదు" అన్నాడు. వారిజతో పాటు అనసూయ కూడా ఆశ్చర్యంగా చూసింది.

" ఇంకేం తల్లీ, చదివిస్తాను అంటున్నాడు కదా? " అన్నది అనసూయ. " అయితే మీ ఇష్టం" అని సిగ్గుతో తల వంచుకొంది vaarija. ఇంక అనసూయ సతోషానికి అవధులు లేవు. వెంటనే పెళ్ళి ఏర్పాట్లు చేయడం మొదలు పెట్టింది. " అమ్మా వారిజా, ఇప్పటికి నాలుగైదు ఏళ్ళు దాటిన వి కదా? ఒక్కసారి మీ ఊరు వెళ్ళి , మీ అమ్మా నాన్న లతో మాట్లాడడం మంచిది అని అనుకొంటున్నాను. మనం రేపే బయలు దేరి వెళ్దాం" అన్నది వారిజాతో.

అమ్మా నాన్న లు, అన్నయ్యలు , నానమ్మా గుర్తు వచ్చి కళ్ళలో నీరు తిరిగింది వారిజాకు. " సరే ఆంటీ" అన్నది. ఇప్పుడు స్వంత కారు కూడా ఉన్నది అనసూయకు.

అనుకున్నట్లే vaarija, వాసూ, అనసూయ ఉదయమే కారులో బయల్దేరారు. మిట్ట మధ్యాహ్నం వేళ ఇంటి ముందు కార్ ఆగే సరికి , ఆ ఇంటి వారితో పాటు చుట్టుప్రక్కల వాళ్ళు కూడా వింతగా చూడసాగారు. ఇంట్లోకి అడుగు పెట్టగానే గోడకు పూలదండలు వేసి వున్న తండ్రీ, నానమ్మల ఫోటోలు కనపడి తెల్లబోయింది vaarija. దుఃఖం ఆపుకోలేక పోయింది. " నాన్నా" అంటూ బోరుమంది. అప్పటిదాకా " ఎవరా?" అని పరీక్షగా చూస్తున్న varijaతల్లి" అమ్మా నువ్వా?" అని కూతురిని కౌగలించుకొని ఏడవసాగింది. కాస్సేపు వాళ్ళను అలాగే వదిలేసి నిశబ్దంగా కూర్చున్నారు అనసూయా, వాసులు. కొంచెం దుఃఖం ఉధృతి తగ్గిన తరువాత " ఎలా జరిగింది అమ్మా? నానమ్మ కేమైంది ? అన్నయ్యలు ఏరీ?" అని అడిగింది వారిja. నెమ్మదిగా అన్ని విషయాలూ చెప్పింది తల్లి. కూతురు ఇల్లు వదిలి పోవడం వల్ల చాలా కృంగి పోయాడు తండ్రి. పైగా చుట్టు పక్కల వారి ఎగతాళి. ఎంత వెతికినా కూతురి జాడ తెలియక మరింత కృంగి పోయాడు. అతని తల్లి కూడా మనుమరాలి కోసం చాలా బెంగ పెట్టుకొని" నా వల్లే అది ఇంట్లోనుండి వెళ్ళి పోయింది" అనే అపరాధ భావం తో కుమిలి కుమిలి ఏడ్చింది. వృద్ధాప్యం, మనో వ్యధ ఆమె శరీరం తట్టుకోలేక పోయింది. నిద్రలోనే కన్నుమూసింది. తల్లి మరణం, కూతురి అదృశ్యం vaarijaతండ్రిని ఎంతో వేదనకు గురి చేసింది. ఒక సారి ఏదో పరధ్యానంగా నడుస్తూ బస్ ప్రమాదం లో చనిపోయాడు అతడు. కొడుకులు ఇద్దరూ జీవిక కోసం వేరే ఊరికి వెళ్ళి పోయారు. అతని పెన్షన్ వస్తుండడం వల్ల, చిన్నదైన స్వంత ఇంట్లో వుంటూ కూతురిని, గతించిన భర్తను, చితికి పోయిన తన జీవన అమృత భాండాన్ని తలుచుకుంటూ జీవచ్ఛవంలా బతుకుతున్నది vaarijaతల్లి సునంద. ఇదంతా విన్నాక వారిజకి చాలా దుఃఖం వచ్చింది. "ఇదంతా నా వల్లనే జరిగింది కదమ్మా?" అన్నది తల్లి వైపు జాలిగా చూస్తూ. " చ చ , నువ్వేం చేసావు తల్లీ? అంతా ఆ దేవుడి నిర్ణయం. నువ్వు అలా వెళ్లడమే ఒకందుకు మంచిdi అయింది. లేకపోతే మీ నాయనమ్మ మాటలకు వంత పాడుతూ, మీ నాన్న ఆ లేతవయసులోనే నిన్ను ఎవరికో ఒకరికి కట్టబెట్టే వారు." అన్నది సునంద. " సరే ఏదీ మన చేతిలో లేదు కదా? నా పేరు అనసూయ. వీడు మా అబ్బాయి వాసు. మీ అమ్మాయితో వాడికి పెళ్ళి నిర్ణయం అయింది. ఇక్కడ మీరూ ఒంటరిగానే వుంటున్నారు కదా? మాతో వచ్చేయండి. కళ్ళారా మీ కూతురి పెళ్ళి వేడుక చూసి సంతోషించ వచ్చు" అని నవ్వుతూ అన్నది అనసూయ. అప్పుడే వాసుని పరిశీలనగా చూసిన సునంద తృప్తిగా తల వూపింది.

అన్నీ మనిషి అనుకున్నట్లు జరిగితే దేవుడిని ఎవరూ తలంచుకోరేమో? అందుకే ఆ దేవుడు అప్పుడప్పుడు తన ఉనికిని చాటుకునేందుకు అనుకోని సంఘటనలు కల్పిస్తుంటాడు. అందరూ ఆశించినట్లే వారిజా వాసుల వివాహం చాలా ఘనంగా జరిగింది. ఉద్యోగాల కోసం దూరంగా వెళ్ళిన varijaఅన్నయ్యలు, భార్యలతో కూడా వచ్చి, చెల్లి అదృష్టానికి సంతోషించి , దీవించి వెళ్ళారు. మాట ఇచ్చినట్లే ఆమె చదువుకు ఆటంకం కలగకుండా , డిగ్రీ లో చేర్పించాడు వాసు. భార్య అందాలు అన్నీ తనివి తీరా అనుభవించాక, ముఖం మెత్తి మళ్ళీ అతడికి బెంగుళూరు భామలు గుర్తు రా సాగారు. చదువు నెపం తో భార్యను తల్లి దగ్గిరే వదిలి బెంగుళూరు వెళ్ళి, పది పదిహేను రోజుల కు ఒకసారి రావడం మొదలు పెట్టాడు వాసు. అతడి పైన అవగింజంత అనుమానం కూడా లేదు అనసూయకు గానీ, వారిజకు గానీ. "ఎంత గొప్ప నక్షత్రమైన చేతికి చిక్కితే గాజు ముక్కతో సమానం అవుతుంది" అన్న సామెత వారిజపట్ల నిజం అయింది. వచ్చే వ్యవధిని నెలకు పెంచాడు వాసు. ఈ లోపే వారిజ కు నెల తప్పింది. అనసూయా, సునంద లు ఎంతో సంతోషించారు. వారిజకూ ఓ వైపు సంతోషంగా నే వున్నప్పటికీ, మరోవైపు తన చదువు కు ఎక్కడ గండి పడుతుందో నని సందిగ్ధంగా వుంది. "అప్పుడే ఈ లంపటం అవసరమా?" అని చిరాకు పడ్డాడు వాసు. అయితే అనసూయ " అదేం మాట రా? ఇన్నేళ్ళకి నా ఆశ నెరవేరింది. ఈ ఇంట్లో పసి వాడు దోగాడి మనలను ఆనంద డోలికల్లో వూగిస్తాడు. ఒకరో, ఇద్దరో అయ్యాక మీ జోలికి రాము ఇక వాళ్ళను మాకు వదిలేసి ఎక్కడికైనా వెళ్ళండి. అమ్మాయి vaarija, ఇవ్వాళ రేపు ఇంటినుండే చదివేందుకు బోలెడన్ని కోర్స్ లు వున్నాయి. నువ్వు బెంగ పడకు. అన్నీ నేనూ, మీ అమ్మా చూసుకుంటాం." అని ధైర్యం చెప్పింది. ఆమె ఇచ్చిన ప్రోత్సాహం తోనే సంతోషంగా తన మొదటి బిడ్డకు స్వాగతం చెప్పింది varija. ముద్దులు మూటగట్టి నట్లున్న తన బాబును చూసుకొని వాసు కూడా గర్వించాడు. ఉద్యోగ పర్వము విసుగు పుట్టించింది అతనికి. ఏదైనా వ్యాపారం చేయాలని,

ఇంటి పట్టునే వుండాలని అనుకొన్నాడు. అలా అనుకున్నదే తడువుగా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి వచ్చాడు. విషయం విన్న అనసూయ నిర్ఘాంత పోయింది. “ఉద్దేశం మంచిదే కానీ, వ్యాపారానికి ముందు బోలెడు పెట్టుబడి కావాలి. ముఖ్యంగా అనుభవం కావాలి. అదేమీ లేకుండా ఉన్నపళంగా వ్యాపారం అంటే ఎలా?” అని వాపోయింది. కొడుకు మాటను కాదన లేక అప్పటివరకూ బ్యాంక్ లో నిలువ ఉంచిన డబ్బు మొత్తం తీసి ఇచ్చింది అనసూయ. టెక్స్టయిల్స్ బిజినెస్ చేద్దామని మరో ఇద్దరితో కలిసి వ్యాపారం మొదలు పెట్టాడు వాసు. ఆ డబ్బు చాలదని సిటీ లో ఎప్పుడో కొని వుంచిన ప్లాట్స్ అమ్మేసాడు. జరుగుతున్నది అంతా ప్రేక్షకురాలై చూడసాగింది vaarija. అయితే తన చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. డిగ్రీ రెండో సంవత్సరం పరీక్షలు , పసివాడిని తన అత్తగారికి, తల్లికి ఒప్పగించి వెళ్ళి రాసింది. వ్యాపారం ఏదో అలా సాగుతున్నది. ఎంత ఒత్తిడి నైనా చిన్నారి కొడుకు ఆటపాటలు చూసి మరిచిపోతున్నారు వాసు, వారిజలు. వాడికి కేశవ్ అని పేరు పెట్టారు. అల్లారు ముద్దుగా అమ్మమ్మా, నాయనమ్మల గారాబం లో చక్కగా పెరుగుతున్నాడు కేశవ్.

రోజులు గడుస్తున్నాయి. సునంద ఎక్కువగా కూతురి దగ్గిరే వుండసాగింది. అందుకు కారణం అనసూయ ఆదరణ, పసివాడి పైన ప్రేమ. ఉన్నట్లుండి వ్యాపారం నష్టాల్లో పడింది అని వాసు భాగస్వాములు చేతులు ఎత్తేసారు.వాసు పూర్తిగా వాళ్ళను నమ్మి, అంతా ఒప్ప గించి తరచుగా ఇంట్లోనే వుండేవాడు. కొడుకుతో ఆడుకోవడం మొదట్లో బాగానే ఉంది. రాను రాను బద్ధకం , నిర్లక్ష్యం పెరిగినవి అతడిలో. అనసూయా, vaarijaలు హెచ్చరించినా పట్టించుకోలేదు. ఫలితంగా పార్టనర్స్ చక్కగా కుచ్చు టోపీ పెట్టారు అతనికి. అయితే దాని వల్ల గుణపాఠం నేర్చుకునే బదులు, ఇంకా పెట్టుబడి కావాలి అని తల్లిని వేధించి, వున్న ఇల్లును తాకట్టు పెట్టించాడు వాసు. కొడుకులోని విపరీత ధోరణి కి అనసూయ చాలా దిగులు పడింది. ఆ బెంగ తోనే ఆమె ఒకరాత్రి నిద్రలోనే చనిపోయింది. కొండంత అండగా వుండే అత్తగారు దూరమవడం వారీజకి ఆశనిపాతం లాగే అయింది. కాలేజీకి వెళ్ళడం మానేసి , ఓపెన్ యూనివర్సిటీ కి అప్లై చేసింది. సునంద కూతురి పరిస్థితికి కన్నీటి పర్యంతం అయింది. షాప్ ఎప్పుడో అమ్మేసారు. వున్న ఇల్లు కూడా తాకట్టు లో వుంది. కారు అమ్మేశాడు వాసు. అప్పటికీ సహనం తో భర్తకు మెల్లగా “ఈ వ్యాపారం వదిలేసి మళ్ళీ ఏదైనా ఉద్యోగం లో చేరితే మంచిది”అని నచ్చచెప్పే ప్రయత్నం చేసింది vaarija. కానీ సుఖంగా ఇంట్లోనే వుండడానికి అలవాటు పడిన వాసు భార్య మాటను పెడచెవిన పెట్టాడు. ఒకరోజు అత్తగారు వింటున్నారనే ఆలోచన కూడా లేకుండా” మీ అమ్మకు ఇల్లుంది. ఇంకా ఇద్దరు కొడుకులూ వున్నారు. అయినా వూరికే మనదగ్గిరే ఎందుకు వుండాలి? అసలే మన పరిస్థితి బాగులేదు” అన్నాడు . ఆ మాటలు ప్రత్యక్షంగా విన్న vaarijaతో పాటు మూడేళ్ల కేశవ్ కు లోపల అన్నం తినిపిస్తూ విన్న సునంద కూడా నిశ్చేష్టులై పోయారు.

Vaarijaరోషంగా “ ఆమె ఏమీ వూరికే పడి తినడం లేదు. తను తినే గుప్పెడు మెతుకులkuపదింతలు పెడుతోంది. “ అన్నది. “ ఆహా, అలాగా? ఏం పెడుతోంది ఏం?” అన్నాడు వ్యంగ్యంగా వాసు.”ఏమిటా, ఈ మధ్య మీరు ఇంటి గురించి ఏమైనా పట్టించుకుంటూ

వున్నారా? ఇంత ఇంటిలో పని చేయడానికి మీరు ఇచ్చే జీతం చాలదు అని పని వాళ్ళు అందరూ మానేసారు. సరుకులు నిండుకొని నెల దాటింది. ఇంటేడు చాకిరీ మా అమ్మే చేస్తున్నది. ఇంటికి కావలసిన సరుకులు అన్నీ మా అమ్మే తెప్పించింది. మీ వ్యాపారం పేరుతో ఉన్నదంతా వూడ్చుకు పోయింది. పసి వాడు త్రాగెందుకు పాలు కూడా తే లేని మీ వ్యాపారం ఎందుకు? చదువు ఎందుకు?” అని గట్టిగా, ఆవేశంగా అరిచింది varija. నిరుత్తరుడై కొద్దిసేపు మౌనంగా కూర్చున్నాడు వాసు. కోపం చల్లారిన vaarijaభర్తను భోజనానికి రమ్మంది. “ ఆకలి లేదు” అని గదిలోకి వెళ్ళి ముసుగుదన్ని పడుకొన్నాడు వాసు. ఇంక రెట్టించలేదు varija. సునంద అప్పటికే బట్టలు సర్దుకొని కూర్చుంది.

“ అమ్మా, నన్ను ఈ స్థితి లో వదిలి వెళ్తవా అమ్మా?” దీనంగా అడిగింది vaarija. సునంద లేని నవ్వును అరువు తెచ్చుకుని “ నీ స్థితికి ఎమైందమ్మా? చీకటి వెలుగుల సమ్మేళనమే జీవితం. ఈ చీకటి ఎప్పటికీ వుండదు. వెలుగు వచ్చే తీరుతుంది. నీ భర్త బాగా చదువుకొన్న వాడు. తెలివైన వాడు. కొద్దిరోజుల కైనా తన తప్పు తెలుసుకొంటాడు. నా వల్ల మీ కుటుంబంలో కలతలు రావద్దు. అయినా నేను ఎంతదూరం వెళుతున్నాను? నీకు ఎప్పుడు అవసరమై నానేను వున్నానని మరిచిపోకమ్మ. బాబు జాగ్రత్త. “ అని మరో మాటకు తావియ్యకుండా వెళ్లిపోయింది. ఏడుస్తూ తను కూడా అభోజనంగానే కేశవ్ పక్కన నిద్రపోయింది varija. ఎప్పుడు తెల్లవారింది కూడా తెలియనంత గా నిద్ర పట్టింది ఆమెకు. తెల్లగా తెల్లవారి న తరువాత కేశవ్ అలికిడికి మెలకువ వచ్చింది vaarijaకు. వీధి తలుపులు దగ్గిరకి వేసి వున్నాయి. వాసు లేచి బయటికి వెళ్ళి వుంటాడు అనుకొని మామూలుగా ఇంటిపనిలో పడింది ఆమె. మధ్యాహ్నం మూడు కావస్తున్నా భర్త వచ్చే సూచనలు కనిపించక ఫోన్ చేసింది. కానీ అవతల వైపు నుండి స్విచ్ ఆఫ్ అని వచ్చింది. “అలుక తీరాక తనే వస్తాడు లే “ అనుకొని కేశవకు తినిపించి, తనూ తినేసి పుస్తకం చదువుతూ కూర్చుంది vaarija. అయినా చదువు పట్ల మనసు లగ్నం కాక , మరోసారి భర్తకు కాల్ చేసింది. మరో రెండు మూడు సార్లు చేసినా అదే సమాధానం విని భయ పడింది. అతడి మిత్రులకు, వ్యాపార భాగస్వాముల కూ ఫోన్ చేసింది. వాళ్ళు మాకు తెలియదు అనే అన్నారు. పైగా “ఈ

వ్యాపారాన్ని నష్టాల్లో ముంచేసి , ఇంత భారాన్ని మా పైన పడేసి ఎక్కడికి పోయాడు?" అని నిలదీశారు. దిక్కు తోచలేదు varijaకు. అలాగే ఏడుస్తూ బెడ్ రూం లోకి వెళ్ళి చూసి నోరు తెరిచింది. బీరువా లాకర్ తెరిచి వుంది. అందులో వున్న నగలూ, కొద్దో గొప్పో వున్న డబ్బూ మాయమైంది. వాసు బట్టలు కూడా లేవు. "అంటే , ప్రెప్లాండ్ గా కావాలనే నన్ను విడిచి వెళ్ళాడు అన్నమాట. సరే, నాకేనా తన అవసరం? తను లేకుండా నేను బ్రతక లేనా?" కోపం గా అనుకొంది. కానీ కాస్సేపటికి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. అమ్మ ఎందుకు ఏడుస్తోంది అనే సంగతి తెలియని కేశవ్ ఆకలి అని ఏడ్చాడు. వాడి కోసం తప్పనిసరిగా లేచి వంట గదిలో కి వెళ్ళింది vaarija. వున్న కొద్ది పాటి సరుకులను దిగులుగా చూసింది. ఒక్కసారిగా నిస్పృహ అవరించి, ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాలి అనిపించింది ఆమెకు. కాళ్లకు చుట్టుకొని ఏడుస్తున్న కన్నబిడ్డ ఆమె ఆలోచనను చేదర గొట్టాడు.అంతలోనే ఆమెకు వికారంగా అనిపించి సింక్ దగ్గరకి పరిగెత్తింది. వాంతి చేసుకొని, ఏవో లెక్కలు వేసుకొని" ఓరి భగవంతుడా, ఏమిటి ఈ పరీక్ష?" అనుకొంది. మళ్ళీ నెల తప్పింది. "అసలే తినడానికి లేని ఈ దశ లో ఇంకో బిడ్డ అవసరమా?" అనిపించింది ఆమెకు.

ఇంతలో తన చిట్టి చేతులతో తల్లి కన్నీళ్ళు తుడుస్తూ" ఆకలవుతొందా అమ్మా? అమ్మమ్మ వస్తుందిగా ? అన్నం తినిపిస్తుం దిగా? నాన్న ఎక్కడి కి పోయాడు?" అని అడిగాడు కేశవ్. ఉప్పెనలా ముంచుకొచ్చిన ఏడ్పును ఆపుకొంటూ" వూరికి వెళ్ళాడు నాన్నా. పద , మనం పార్క్ కు వెళ్దాం" అని అప్పటికప్పుడు వాడిని రెడీ చేసి, తనూ రెడీ అయి దగ్గిరలోనే వున్న పార్క్ కు వెళ్ళింది var– ija. అక్కడ కేశవ్ ను ఆడుకోవడానికి వదిలి, దగ్గిర గా వున్న బెంచీ మీద కూర్చుని చుట్టూ చూసింది. తనలాగే పిల్లలను తీసుకొని వచ్చి , లోకాభిరామాయణం చెప్పుకొంటున్న తల్లులు చాలా మంది వున్నారు. వాళ్లంతా ఎంత సంతోషంగా వున్నారో? ఎవరికీ రేపటి గురించిన చింత లేదు. నేను ఏం పాపం చేశానో కదా? ఇంత చిన్న వయసులో నే ఇన్ని బాధలు పడమని ఆ దేవుడు నా నుదుట ఎందుకు రాసాడో? అన్ని బంధనాలు త్రెంచుకొని వెళ్ళడానికి కూడా వీలు లేకుండా ఈ కడుపు తీపి నీ ఇచ్చాడు. ఏం చేయాలి? ఎలా బ్రతకాలి?" అని పరి పరి విధాల ఆలోచిస్తున్న vaarija " అమ్మా, ధర్మం చెయ్యి తల్లీ" అన్న మాట తో ఉలిక్కి పడి చూసింది. ఎదురుగా చింపిరి జుట్టు తో, చిరిగిన గుడ్డలతో , చంకన చిన్న పిల్లవాడిని ఎత్తుకుని కనపడింది ఒక భిక్షుకి. " నీకే తిండికి లేనప్పుడు ఇలా పిల్లలను కనడం అవసరమా?" అని కోపంగా అంటూ , పర్సు లోనుండి చివరి 5 రూపాయల నోటు తీసి ఆ బిచ్చగత్తెకు ఇచ్చింది varija. మొదట ఆమె అడిగిన ప్రశ్నకు కోపం వచ్చినా,5 రూపాయలు దానం చేసినందుకు సంతోషం కలిగి" దేవుడు ఇస్తే ఎట్లా వద్దంటం అమ్మా. కడుపు గట్టుకొనైన వాళ్ళను పెంచుకోవాలి" అంటూ వెళ్ళిపోయింది ఆ బిచ్చగత్తే. చెళ్లున చరిచినట్లుగా ఉలిక్కి పడింది vaarija. అన్యాపదేశంగా ఆ సూచన తనకే ఇచ్చినట్లు అనిపించింది. " నిజమే, నా కడుపు కట్టుకొనైనా నా బిడ్డలను పెంచుకుంటాను. తండ్రి అవసరం లేకుండానే వాళ్ళను తీర్చి దిద్ది, మంచి అమ్మగా పేరు తెచ్చుకుంటాను." అని దృఢంగా అనుకొంటూ కొడుకును ఎత్తుకొని , ఇంటికి తిరిగి వెళ్ళింది varija. "ఎలాగూ డిస్టెన్స్ ఎద్యుకేషనే కాబట్టి, ఏదైనా ఉద్యోగం చూసుకోవాలి." అని ఆ వేళ టి వార్తాపత్రిక లో వాంటెడ్ కాలమ్స్ వెతికింది. ఒకటి రెండు టీచర్ పోస్టు లు, మరో రెండు ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు తనకు అనుకూలంగా అనిపించి, వివరాలు ఒక పేపర్ పైన రాసుకుంది. కేశవ్ ను నిద్ర పుచ్చుతూ, వాసు చేసిన నమ్మక ద్రోహానికి కుమిలి పోయింది.

నడిచి వెళ్ళే దూరం లోనే తను వెళ్ళాల్సిన ప్రదేశాలు వుండడం తో కొంచెం ఊరట లభించింది vaarijaకు. త్వరగా లేచి వంట చేసి, కేషవకు తినిపించి, తనూ తిని, కొడుకు కోసం ఒక బాక్స్ లో పెట్టుకొని, నీళ్ళ బాటిల్ కూడా సర్ది , ఇంటికి తాళం వేసి బయలు దేరింది varija. ఒకప్పుడు కారులో మాత్రమే వెళ్ళిన vaarijaకాలినడకన వెళ్ళడం ఆమె పైఆమెకే జాలి కలిగించింది. మొత్తానికి నాలుగు చోట్లా తృప్తి కరంగనే ఇంటర్వ్యూ జరిగింది.cell no ఇచ్చింది. రేపటి మీద ఆశతో ఇంటికి తిరిగి వచ్చింది varija. గేట్ దగ్గిరే ఆమె కోసం ఎదురచూస్తున్నారు ఇద్దరు వ్యక్తులు. "ఎవరు మీరు ? మీకు ఏమి కావాలి?" అని భయంగా అడిగింది vaarija. "మేడం, మేము బ్యాంక్ లో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లం. మీ వారికి ఇంతకు ముందే రెండు మూడు సార్లు నోటీస్ లు పంపించినా రెస్పాన్స్ ఇవ్వలేదు. రెండు రోజుల లో ఈ ఇల్లు మాకు హ్యాండోవర్ చేయకపోతే, కోర్టు ద్వారా వేలం వేయించాలి, మాకు మీ వారు ఎక్కడికో వెళ్ళి పోయాడని అతని పార్టనర్ లు చెప్పారు. అంతే కాదు. వాళ్ళతో పార్ట్నర్షిప్ ఎప్పుడో రద్దు చేసుకున్నాడని రాత పూర్వకంగా చూపించి, తన అప్పులతో వాళ్ళకు ఏ సంబంధం లేదని ప్రూవ్ చేసుకొన్నారు. కాబట్టి మీరు రెండు రోజుల లో తను చేసిన అప్పు వడ్డీ తో సహా ఇవ్వగలిగితే సరే. లేకపోతే ...." అని ఆగారు వాళ్ళు. " ఎల్లుండి వరకూ ఎలాగైనా మీకు ఇల్లు ఒప్పగిస్తాను.ప్లీజ్, ఇంతకన్నా నేను ఇంకేమీ చెప్పలేను" అని చేతులు జోడించి , ఇంట్లోకి పరిగెత్తింది varija. సానుభూతి గా చూస్తూ వెళ్లిపోయారు వాళ్ళు. తన దీన స్థితి కి తనే వగచి, కొడుకు కు మాత్రం తినిపించి అలాగే నీరసంగా పడుకొంది varija. హఠాత్తుగా గుర్తు వచ్చి , తన బట్టల అడుగున ఉన్న పాస్ బుక్ తీసి చూసింది. ఎప్పుడో చాలా ప్రేమగా తన పేరున వాసు Rd చేసిన మూడు వేల రూపాయలు అందులో వున్నాయి. ఇంకా కాల వ్యవధి ముగియ లేదు. నష్టానికి అయినా విత్డ్రా చేయాలి. "రేపు వెళ్ళి చూడాలి" అనుకొంటూ నిద్రకు ఉపక్రమించింది varija. ఆకలి వేసినా" బియ్యం కొన్నే వున్నాయి. రేపు బ్యాంక్ లో డబ్బులు రాకపోతే కష్టం. బాబుకు కడుపునిండా పెట్టగలిగితే చాలు. నేను ఒక్కపూట తినైనా ఉండగలను. పసివాడిని పస్తు వుంచలేను కదా?"

అనుకొంది ఆ మాతృమూర్తి. ...........

మరునాడు బాబును తీసుకొనే బ్యాంక్ కు వెళ్ళింది varija. నిజానికి వ్యవధి ముగిస్తే రెట్టింపు వస్తాయి డబ్బులు. కానీ వ్యవధి ముగియకుండనే తీసుకోవడం వల్ల అసలు కన్నా ఒక రెండు వందలు తక్కువే పాస్ చేసారు బ్యాంక్ లో. దానికోసం దాదాపు మూడు గంటల పాటు నిలబడింది varija. నీరసం, మరోవైపు ఆకలి. "స్పృహ తప్పితే ఏమిటి పరిస్థితి?" అనుకొని కాసిన్ని నీళ్ళు త్రాగడం తో తనను తాను నిలదొక్కు కొన్నది. ఎట్టకేలకు డబ్బులు ఇచ్చి , సంతకాలు తీసుకొన్నారు బ్యాంక్ లో. ఆ డబ్బులు జాగ్రత్తగా బ్యాగ్ లో భద్రపరచు కొని , బయటికి వచ్చింది varija. ముందుగా ఒక డజను అరటి పండ్లు కొని , కేశవ్ కు రెండు తినిపించి, తనుకూడ రెండు తిన్నది. ఎంతో శక్తి వచ్చినట్లు అనిపించింది ఆమెకు. అలాగే రోడ్డు పైన నెమ్మదిగా నడుస్తూ, రెండు వైపులా చూడసాగింది. To let బోర్డులు చాలానే కనిపిస్తున్నాయి. కానీ అవన్నీ చాలా పెద్ద ఇళ్లు. చివరికి ఒక పెంకుటింటి కి ముందు toletబోర్డ్ చూసి ఆగి పోయింది vaarija. ధైర్యం చేసి తలుపు తట్టింది. ఒక పెద్దావిడ తలుపు తెరిచింది. ఆమెను చూడగానే తన తల్లి గుర్తు వచ్చింది varijaకు. కన్నీరు కనబడకుండా , చిరునవ్వుతో " పిన్నిగారూ, బయట toletబోర్డు వుంటేనూ!" అన్నది. ఆమె కూడా చిరు గా నవ్వుతూ " అవున మ్మ. ఇదిగో ఈ ప్రక్క పోర్షన్.చిన్న ఇల్లు . ఎంత మంది వుంటారు , ఏమిటి? " అని ఆ తలుపు తెరిచింది. రెండు గదులు, వంటగది. వెనుక చిన్న పెరడు. చిన్నదైనా , శుభ్రంగా, ముచ్చటగా వుంది ఇల్లు. చూడగానే నచ్చింది varijaకు." "నాకు నచ్చింది పిన్నిగారూ. ఇంతకీ అద్దె ఎంతో చెప్పలేదు! " అన్నది varija. "ఇంతకీ ఎంత మంది వుంటారో నువ్వు చెప్పలేదు కదా?" Varijaను అనుకరిస్తూ నవ్వింది ఆవిడ. " ఇప్పటికైతే నేనూ, మా బాబు అంతే" అన్నది varija. " మరి వీళ్ళ నాన్న?" ప్రశ్నార్థకంగా చూసింది ఆవిడ.

" తను బెంగుళూరు లో వున్నారు. అక్కడ చాలా ఖరీదు కదా అన్నింటికీ? కొన్నాళ్ళు గడిచాక మమ్మల్ని తీసుకెళ్తారు" అని అన్నది varija. " అద్దె? " అని మళ్ళీ అడిగింది. " ఎంతో కాదులే అమ్మా? చిన్నగదులే కదా? పదిహేను వందలు అద్దె. కరెంట్ మీటర్ లో ఎంత కాలిస్తే, అంత . ఒక నెల అద్దె అడ్వాన్స్ గా ఇవ్వాలి. నీ పేరు ఏమిటి అమ్మా? నా పేరు మంగ తాయారు. అందరూ మంగ అని పిలుస్తారు." అని నవ్వింది ఆవిడ. Varijaకు ఆమె నవ్వు, కలుపుకోలు తనం, ముఖ్యంగా తన గురించి ఎక్కువ వివరాలు అడగక పోవడం ఎంతో బాగా అనిపించింది." నా పేరు varija. మా వాడి పేరు కేశవ్. రేపే వచ్చేస్తాను పిన్నిగారూ. ఇదిగో అడ్వాన్స్ తీసుకోండి" అని బ్యాగ్ లోనుండి 1500/ లు తీసి ఇచ్చింది. మంగ తాయారు గారు సంతోషంగా అవి తీసుకొని

" అలాగే రండి అమ్మా. సాయంకాలం పని అమ్మాయితో ఇల్లు కడిగించి ఉంచుతాను లే" అన్నది. ఆమె వైపు కృతజ్ఞతగా చూసి,

" మంచిది పిన్నిగారూ" అని ఉత్సాహంగా ఇంటికి వెళ్ళింది varija. ముందుగా ముఖ్యమైన వస్తువులను అన్నింటినీ ప్యాక్ చేసింది. తనకు అవసరం లేనివీ, కదిలించలేనివీ అలాగే ఉంచేసింది. తృప్తిగా బాబును దగ్గరకి తీసుకొని నిద్రకు ఒరిగింది vaarija. మరునాడు ఉదయం లేవగానే ముందుగా బ్యాంక్ వారికి ఫోన్ చేసింది. "ఓ గంటలో వస్తాం" అన్నారు వాళ్ళు.అప్పటికే అన్నీ సర్దుకొని రెడీ అయి కూర్చుంది varija. ఈ లోగా ఒక ఆటో రిక్షా ను మాట్లాడి , సామాను అందులో ఎక్కించసాగింది . అంతకు ముందు వచ్చిన వాళ్ళే వచ్చారు. చాలా గౌరవంగా, ఆదరణ గా మాట్లాడారు. ఇంట్లో వున్న సామాను ను చూసి "ఎందుకలా వదిలేసారు? "అని అడిగారు." ప్రస్తుతం నాకు ఈ వస్తువులతో అవసరం లేదు. ఈ ఇంటిని అమ్మేస్తారు కదా? దానితో పాటు ఇవీ అమ్మేయండి. ఏమైనా మాకు ఇవ్వగలిగితే , అప్పుడే ఇవ్వండి. ధన్యవాదాలు" అని కేశవ్ ను తీసుకొని ఆటో ఎక్కింది varija. ఆమె వెళ్ళినవైపే సానుభూతిగా చూసారు వాళ్ళు. క్రొత్త ఇంట్లోకి అడుగు పెట్టి ఉన్నంత లోనే పొందికగా ఇల్లు సర్దుకొన్నది varija. మంగమ్మ కూడా మధ్యలో వచ్చి కాస్సేపు అవీ ఇవీ మాట్లాడింది. కేశవ్ చేతిలోని ఫోటో ఆల్బమ్ అందుకొని చూసింది. " ఏమో అనుకున్నా, మీ ఆయన సినిమా హీరో లాగే వున్నాడే?" అంటూ మెచ్చుకుంది. జవాబుగా చిన్న నవ్వు నవ్వింది vaarija. సేమ్యా పాయసం చేసి దేవుడి ముందు పెట్టి దండం పెట్టుకొంది. కొంచెం ఒక స్టీల్ గిన్నెలోకి తీసుకుని మంగ మ్మ ఇంటికి వెళ్ళింది vaarija. పడక కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్న పెద్దాయన ను చూసి అతడే మంగమ్మ భర్త అయి వుంటాడు అనుకొని " నమస్తే బాబాయి గారూ" అన్నది . ఆమె గొంతు వినగానే వంట గదిలో నుండి గబగబా బయటికి వచ్చి" ఏమిటమ్మ , ఏమైనా కావాలా?" అని అడిగింది మంగమ్మ.

" ఏమీ లేదు పిన్నిగారూ, కొంచెం ప్రసాదం ఇద్దామని వచ్చాను" అంటూ పాయసం గిన్నె అందించింది vaarija. సంతోషంగా అది తీసుకొని " ఈ పూటకు వంటేమీ చేయకు. మా ఇంట్లోనే తినాలి" అన్నది ఆవిడ. " అయ్యో, వద్దు పిన్నిగారూ, ఆల్ రెడీ బియ్యం కుక్కర్ లో పెట్టేసాను. మీరు అనవసరంగా శ్రమ పడకండి" అన్నది vaarija. " భలే దానివి తల్లీ. వచ్చి ఒక గంటన్నా కాలేదు. అప్పుడే వంట మొదలు పెట్టావా? ఇందులో శ్రమ ఏం వుంది! కనీసం కూరలు అయినా ఇస్తానుండు. అహ , కాదులే నేనే తెస్తాను " అని మళ్ళీ లోపలికి వెళ్ళింది మంగమ్మ. ఆమె భర్త రంగా రావు గారు నవ్వుతూ " ఈ చాటర్ బాక్స్ తో ఇప్పటి దాకా నేను ఒక్కడినే వేగుతున్నాను. ఇప్పుడు నువ్వు దొరికావు. నీకు ఇక ఆ దేవుడే దిక్కు తల్లీ " అన్నాడు.

Varijaకూడా నవ్వింది.

అది మొదలు వారిజ ను ఆ దంపతులు తమ స్వంత కూతురి లాగే చూసే వారు. వాళ్ళ అబ్బాయి లిద్దరూ ఉద్యోగాలు చేస్తూ విదేశాల్లో వున్నారు. వీళ్ళను కూడా తమతో రమ్మని ఇద్దరూ అడిగినా , చుట్టపు చూపుగా ఇద్దరి దగ్గిరకి వెళ్ళి, కొడుకులు, కోడళ్ళ తోను, మనవళ్ళ తో నూ కొన్నాళ్ళు గడిపి వచ్చారే గానీ , అక్కడే ఉండలేదు. అందుకే vaarijaతోడు ఒంటరి తనం లో వున్న వాళ్ళకు ఒక ఆలంబన గా, దాహార్తి నితీర్చే ఒయాసిస్ లాగ తోచింది. Varijaకు ఒక స్కూల్ లో టీచర్ గా జాబ్ దొరికింది. వేలకు వేలు దానంగా ఇచ్చిన ఆమెకు నాలుగు వేల రూపాయలు ఆ సమయం లో అపురూపంగా నే వున్నాయి. కొంచెం స్థిమిత పడ్డాక సునంద కు ఫోన్ చేసింది varija. అప్పటికి వాసు వెళ్ళిపోయి నెల గా వచ్చింది. " విషయం అంతా విన్న సునంద ఆగమేఘాల మీద పరుగెత్తుకొని వచ్చి, బస్ స్టాండ్ నుండి కూతురి కి కాల్ చేసింది. ఒక గంట పర్మిషన్ తీసుకుని , ఆటోలో బస్ స్టాండ్ కు వెళ్ళి తల్లిని తీసుకొని ఇంటికి వచ్చింది vaarija. తన కూతురు అందలాల్లో వుంటుందని ఎంతో మురిసి పోయింది సునంద. ఆమె ఆనందం మూడు నాళ్ల ముచ్చట అయిందని ఎంతగానో బాధ పడసాగింది . నర్సరీ లో చేరిన కేశవ్ ను తను వచ్చే వరకూ అక్కడే డే కేర్ లో వుంచేది varija. సునంద రాగానే వాడి పూర్తి బాధ్యత సంతోషంగా తీసుకొంది.ఇప్పుడు నిశ్చింత గా అటు ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూనే చదువు మీదా శ్రద్ధ పెట్టింది varija. తన గర్భం గురించి తెలిసిన సునందకు సంతోషించాలో, బాధ పడాలో తెలియలేదు. ఎలాగైనా వాసు తిరిగి వస్తే బాగుండును అని అనుకొంది.Vaarija తన జీవితం లో ఎదురైన ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నది. అంచెలంచెలుగా ఎదిగి, తానేమిటో నిరూపించుకున్నdi. దారిలో ఆమె వెళుతుంటే " ఏయ్ పిల్లా, ఒంటరిగానే వుంటున్నవట గదా? నేను తోడు రానా?", " అరేయ్, ఇంత అందమైన పెళ్ళాన్ని గాలికి వదిలేసి వెళ్ళినోడు ఏం మగాడురా?"," ఏమో అసలు సంగతి ఈ చిలుక దగ్గిరే వుందేమో! ఎవరికి తెలుసు?" అని రకరకాలుగా ఎగతాళి చేసి , వేధించిన జులాయిలకు, పెద్ద మనుషుల్లా కనపడుతూనే " ఏమైనా అవకాశం దొరుకుతుందేమో!" అని గోతి కాడ నక్కల లాగా ఎదురుచూసిన కొంతమంది పురుష పుంగవులకు బుద్ధి చెప్పేంత స్థాయికి చేరింది vaarija. కేశవ్ తరువాత పుట్టిన రాగిణి బాధ్యత కూడా సునంద కే వొప్పగించింది . అటు పిల్లలిద్దరూ చదువులో ముందుండే విధంగా గైడెన్స్ ఇస్తూ, తనూ అకుంఠిత దీక్షతో చదివి, సివిల్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్స్ కూడా రాసింది.రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభ ఆమె స్వంతం అయింది. " ఇన్నాళ్లు అయినా మీ అల్లుడు రాలేదే?" అనిఅడిగిన మంగమ్మకు దాచకుండా విషయం అంతా చెప్పింది సునంద. " దీపం లాంటి పిల్లను వదిలి వెళ్ళిన ఆ దౌర్భాగ్య వెధవ , ఏం సుఖ పడుతాడు లే!" అని తిట్టింది ఆవిడ.

"పోగొట్టుకొన్న చోటనే వెతకాలి" అని అంటారు కదా? Vaarijaఅదే చేసింది. సామాజిక స్పృహ తో స్పందిస్తూ, అనాథలు, ఆర్తులు అయిన వారిని ఎందరినో చేరదీసి ఒక దారి చూపించడం ఆమె నిత్య కృత్యం అయింది.

తనలాంటి ఒంటరి మహిళలకు ఆశ్రయం ఇవ్వటమే కాకుండా, వారికి మంచి జీవికను కూడా కల్పించేది varija. తాను పోగొట్టుకున్న పరువూ, ఆస్తీ, అంతస్తు, పదవీ అన్నీ సాధించింది. Varijaగురించి పేపర్ లో చదివిన వాసు, ఆమెను వెతుక్కుంటూ వచ్చాడు. కానీ ఆమె భర్తగా అతడిని మనసులో నుండి ఎప్పుడో తొలగించింది. కాకపోతే పిల్లలకు జన్మనిచ్చిన తండ్రిగా గుర్తింపు ఇచ్చింది.

"మీ నాన్న" అని పిల్లలకు చూపించి, గౌరవించాలని చెప్పింది. "నేను గా మీకు విడాకులు ఇవ్వలేదు. కానీ నిస్సహాయ స్థితిలో, పసివాడితో సహా నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళి మీరే దూరం అయ్యారు. పైగా డబ్బు, నగలూదోచుకొని నా దృష్టిలో ఒక దొంగగా ముద్ర వేయించుకున్న ఘనులు తమరు.ఈ జనారణ్యంలో ఒక అనాథ లాగ , సింగిల్ పేరెంట్ గా సామాజికంగా,ఆర్థికంగా నేను ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నాను అనేది నాకు మాత్రమే తెలుసు.మా అమ్మ నాకు అండగా నిలిచి , ధైర్యాన్ని కలిగించింది. నా పిల్లలను పసితనంలో ఆమె చూసుకోవడం వల్లనే నేను ఉన్నత విద్య లు చదువగలిగాను. ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నాను. మీరు ఎత్తుకెళ్లిన డబ్బులతో మీరూ స్థిర పడే వుంటారు. మంచిదే. నా పిల్లలు ఇప్పుడు పెద్ద చదువులు చదువుతున్నారు. వాళ్ళు స్థిర పడితే పెళ్ళిళ్ళు చేయాల్సిన బాధ్యత మనది. అందుకే నా పిల్లల తండ్రిగా మాత్రమే మీకు ఈ ఇంట్లో, అదీ ఆ ,యా సందర్భాల్లో స్థానం తప్పకుండా వుంటుంది. అంతే . మీ జీవితం మీది. నా జీవితం నాది. ఒకరి గురించి మరొకరు కల్పించుకొని బాధ పడవద్దు. ఆ అర్హత ను ఇద్దరం కోల్పోయాం." అని ఖచ్చితంగా చెప్పింది varija. ఇద్దరి గురించీ తెలిసిన సునంద ఏమీ చేయలేక తనలో తనే బాధ పడుతుంది. అమ్మ చెప్పింది అనే ఇంగితం తో రాగిణీ, కేశవ్ లు అప్పుడప్పుడూ వచ్చే తండ్రిని నాన్నగా గౌరవించి , మాట్లాడుతారు. నవ్వుతూ పలకరించుతారు. Varijaకూడా బాగానే మాట్లాడుతుంది. కానీ వజ్ర సదృశంగా మారిన ఆమె హృదయంలో చెలరేగే ఆవేదన ఎవరికీ తెలియదు. సునందకు తెలిసినా , ఏం చేయలేని అసహాయురాలు. "అంతటి అపురూపమైన మహిళా రత్నాన్ని చేయి జార్చు కొన్నాను కదా!" అని తరచుగా బాధ పడుతు వుంటాడు వాసు.

కథ

# "చిమ్మ చీకట్లలో - దివ్యకాంతులు"




ఝాన్సీ కె.వి. కుమారి

రాజమండ్రి 9010823014


కుమారి సాయం సమయపు ఆహ్లాదకరమైన వాతావరణంలో కాలేజీ ప్రాంగణమంతా ఆహూతులతో నిండి ఉంది .. విద్యార్థులు , వారి తల్లిదండ్రులు , పుర ప్రముఖులు కార్యక్రమం కోసం ఎదురుచూస్తూ ఉన్నారు . వేదిక మీద నుండి వినిపిస్తున్న గానాలతో కొందరు స్వరాలు కలుపుతున్నారు. . కొందరు తలలూపుతున్నారు . అందరి తలంపులలో

' కాబోయే ప్రిన్సిపల్ ఎవరా ' అనే ఉత్కంఠ క్షణక్షణానికి పెరిగిపోతున్నది . వేదిక మీద పాట పూర్తవుతూనే యాంకర్ ఎడ్వీనా మైక్ అందుకొని

" ఆహూతులైన సభాసదులందరికీ స్వాగతాంజలి ! నేటి కార్యక్రమాన్ని ఫాదర్ విలియమ్స్ సెబాస్టియన్ అయ్యగారి ప్రార్థనతో ప్రారంభించుకుందాం.. అందరూ లేచి నిలబడదాం .. " అంటూ వేదిక మీద ఉన్న ఫాదర్ గారికి వేరొక మైక్ అందించింది . ఫాదర్ వేదిక ముందుకు వచ్చి "అందరం ప్రార్థనలో ఏకీభవించుదామండి.. కళ్ళు మూసుకోనండి .. ప్రార్థన – సృష్టికర్త అయిన మా తండ్రీ , ఈ పట్టణంలో సెయింట్ థెరీసా సంస్థల పాఠశాలలను , కళాశాలలను ప్రారంభించిన నాటి నుండి , గత ఏడు దశాబ్దాలుగా .. మీ కృపతో ఆవరించి విద్యాదివ్వెలను వెలిగించేందుకు.. నిరక్షరాస్యతా చీకట్లను తొలగించేందుకు.. సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు.. తద్వారా పేదరికాన్ని రూపుమాపేందుకు మీరిస్తున్న సహాయానికి.. నడిపింపుకు.. విజయాలకు.. మా హృదయపూర్వక వందనాలు తండ్రీ ! ఇప్పుడు , ఇక ముందు కూడా , మీ కృప కాపుదల భద్రత ఇక్కడ నడిపిస్తున్న బిడ్డలందరకు.. చదువుకుంటున్న విద్యార్థులకు , వారి తల్లిదండ్రులకు .. ఈ పట్టణ ప్రముఖులందరికి, అధికారులకు .. తోడై యుండును గాక ! అలాగే ఈ సాయంత్రం ముఖ్య అతిథిగా ఈనాటి కార్యక్రమాన్ని అలంకరించిన ఈ పాఠశాల పాత విద్యార్థి నేటి మా జిల్లా కలెక్టర్ డాక్టర్ రాజగోపాల్ గారికి మీరు తోడుగా ఉండి , వారి పరిపాలనంతటిలో ఘన విజయాలను అనుగ్రహించమని మేమందరము ఏకీభవించి అడిగి ప్రార్థిస్తున్నాము ప్రభువా .. ఈనాటి ఈ కార్యక్రమంలో సిస్టర్ ఎస్తేర్ జోసెఫిన్ అమ్మగారిని నూతన ప్రిన్సిపల్ గా ఆశీర్వదించి.. నేటి నుండి రాబోయే కాలమంతా .. మీ జ్ఞానముతో నింపి బలపరిచి నడిపించి గొప్ప విజయాలను అనుగ్రహించమని .. నేటి కార్యక్రమానికి ప్రారంభం నుండి ముగింపు వరకు మీరే మాతో ఉండమని.. మహిమ మీరు పొందమని వేడుకుంటున్నాము, మా పరమ తండ్రీ .. ఆమేన్! "

అందరూ 'ఆమేన్' చెప్పగా , " దయచేసి అందరూ సుఖాసినులైతే.. సెయింట్ థెరీసా సంస్థల ప్రియమైన అమ్మ ' మదర్ సుపీరియర్ ' ఏంజెలీనా ఫాతిమా అమ్మగారు తమ హస్తాలను ప్రస్తుత ప్రిన్సిపల్ గా రిటైర్ అవుతున్న సిస్టర్ లిడియ మ్మ గారికి , అలాగే కొత్త ప్రిన్సిపల్ గా చార్జి తీసుకుంటున్న సిస్టర్ ఎస్తేర్ జోసెఫిన్ అమ్మగారికి శుభాకాంక్షలు తెలిపి.. తమ హస్తాలను వారిరువురి శిరస్సులపై ఉంచి ఆశీర్వదించి దీవెనలు అందించవలసిందిగా కోరుతున్నాము " యాంకర్ పలుకుతూ ఉండగానే మదర్ సుపీరియర్ ఏంజెలీనా అమ్మగారు ఇద్దరు ప్రిన్సిపల్ ల తలల మీద తమ హస్తాలను ఉంచి మౌన ప్రార్థనతో దీవించారు ! సిస్టర్ లిడియమ్మ గారి తలమీద ఉన్న ప్రిన్సిపల్ గుర్తు కలిగిన అందమైన క్యాప్ ను కొత్త ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ జోసెఫిన్ అమ్మగారి తల మీద పెట్టడంతో సభలోని వారంతా లేచి నిలబడి చప్పట్ల వర్షం కురిపించారు . ఇప్పుడు సిస్టర్ లిడియమ్మ గారిని మాట్లాడవల్సిందిగా కోరుతున్నాం " అని మైక్ ను అమ్మ గారికి అందించింది..

" యేసుక్రీస్తు ప్రభువుకు మహిమ కలుగును గాక ! ఆయనకే స్తుతులు మనమందరం చెల్లించుకోవలసినవారం ! పెద్దలందరికీ , ఆహూతులకూ , విద్యార్థులకూ , వారి తల్లిదండ్రులకూ.. దేవుని దీవెనలు మెండుగా కలుగును గాక ! నేటివరకు నా భుజం మీద ఉన్న ప్రిన్సిపల్ అనే ఈ బాధ్యతల ముళ్ళ కిరీటం నుండి నాకు విమోచన కలిగించి .. ఆ భారాన్ని తలకెత్తుకున్న మన కొత్త ప్రిన్సిపల్ సిస్టర్ ఎస్తేర్ జోసెఫిన్ అమ్మగారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు ! ఏ సంస్థలో తను విద్యార్థిగా జాయిన్ అయ్యారో.. ఆ సంస్థలోనే అంచలంచెలుగా ఎదుగుతూ .. నిత్య విద్యార్థిగా .. తన విద్యను కొనసాగిస్తూ .. నేడు అదే కళాశాలలో ప్రిన్సిపల్ గా ఉన్నతమైన బాధ్యతలు తీసుకోవడం .. చాలా అద్భుతం ! ఆమె స్టూడెంట్ గా వచ్చి , పెద్ద హాస్టల్ వార్డెన్ అయినారు ! తర్వాత కాన్వెంట్ స్కూల్ కి , హైస్కూల్ కి హెడ్ మిస్ట్రెస్ అయినారు , ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్స్ ట్రైనింగ్ కాలేజీకి ప్రిన్సిపల్ గా సేవలు అందించారు .. అన్ని సంవత్సరాలు .. విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహించి వాళ్ళు ఆయా స్థాయిలలో తమ గమ్యాన్ని ఎంచుకునేందుకు ఆ గమ్యాన్ని చేరేందుకు అమ్మ గారి యొక్క సలహాలు సూచనలు ఆ బిడ్డలకు నిరంతరము అందుతూనే ఉన్నాయి

! అన్నింటిని మించి మా అందరి ప్రార్థనలే కాక , ఆమె ప్రత్యేకంగా వీరందరి కోసం ప్రార్థనలు చేసేవారు తండ్రి వారి ప్రార్థనలను, మా అందరి ప్రార్థనలను విన్నారని ఈరోజు రుజువు .. మన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజగోపాల్ గారు, మన జిల్లా కలెక్టర్ గారు .. ఒకప్పుడు మన కాన్వెంట్ స్కూల్ బెస్ట్ స్టూడెంట్ ! మీకందరికీ తెలుసు .. మన కాన్వెంట్ .. బాయ్స్ అండ్ గర్ల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ .. పిల్లలందరికీ బలమైన పునాది వేస్తుంది ! ఆ పునాది ఎటువంటిదో.. ఇప్పుడు .. మన కళ్ళారా చూస్తున్నాం ! (చప్పట్లు)

మన బిడ్డ మన జిల్లాకే నిర్ణయాధికారిగా రావడం .. మాటల్లో చెప్పలేని గొప్ప ఆనందం ! గొప్ప అతిశయం కూడా !! (చప్పట్లు) వారి అనుభవాలు మనం జాగ్రత్తగా వినాలి ! నేర్చుకోవాలి !!

మరోసారి, మన ప్రియతమ జోస్పిన్ అమ్మగారికి గొప్ప విజయాలు కలగాలని మనందరం ప్రార్థించాలి .. కోరుకోవాలి ! సేవా కాలమంతా క్షణం తీరికలేని సవాళ్ళమయం ! తోటమాలికి ఎన్ని సమస్యలు ఎదురవుతాయో మనందరికీ తెలుసు , ఎన్ని ఎరువులు , నీళ్లు అందించినప్పటికీ .. పేరాసైట్లు మింగేస్తాయి .. పూలూ, పిందెలూ రాలిపోతూ ఉంటాయి .. అతివృష్టి అనావృష్టి పంటకు ఎంతో నష్టం .. ఇక .. రకరకాలైన తెగుళ్ళు గురించి చెప్పనే అక్కరలేదు .. తోటమాలి జీవితం లాంటిదే విద్యాసంస్థల నిర్వాహకుల సేవా జీవితం కూడా ! (చప్పట్లు) మీరంతా అర్థం చేసుకున్నందుకు ధన్యవాదాలు ! మన సమాజాలను ఆవరించిన నిరక్షరాస్యతా చీకట్లపై యుద్ధాన్ని ప్రకటించి , సాక్షర సమాజాన్ని రూపించే మహా యజ్ఞంలో .. అక్షర జ్యోతులను వెలిగిస్తున్నాం ! కేవలం మీ అందరి సహకారం వల్లనే ఏటేటా మన సంస్థల నుండి ఎందరో భావి ఉపాధ్యాయులు డాక్టర్లు ఇంజనీర్లు కలెక్టర్లు అధికారులు పాలకులు బయటకు వెళుతున్నారు ! దానికి గుర్తుగా మన ముఖ్య అతిథి .. మన మధ్య .. వేదిక మీద ఉన్నారు !(చప్పట్లు)

అంతేకాదు , ఈ సాయంత్రం .. ఆహూతులైన మీలో కూడా ..ఎందరో ..ఆయా బాధ్యతలను నిర్వహిస్తున్న వారు, అమ్మగారి మీద, నా మీద ఉన్న ప్రేమాభిమానాలతో ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు మీ అందరికీ ఆ దేవాది దేవుని దీవెనలు మీ దేశసేవ కార్యక్రమాలన్నింటిలోనూ తోడైయుండి విజయాలను ఇచ్చును గాక ! ఆమేన్ ..ఆమేన్ ! మీరందరూ మాకు నిరంతరం.. కొత్త శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చే.. రక్తం ! హల్లెలూయ !

ఒక్క మాట చెప్పి నేను ముగిస్తాను నా తల మీద ఉన్న ప్రిన్సిపల్ అనే ముళ్ళ కిరీటాన్ని అమ్మగారి తల మీద అమరుస్తుండగా ఆమె కళ్ళల్లో నాకు కనిపించింది ఏంటో చెప్పనా ... ప్రసవానంతరం .. డాక్టర్ గారు తన చేతుల్లో పెట్టిన పసి గుడ్డును అపురూపంగా .. అబ్బురంగా .. భయంతోనూ .. భక్తితోనూ వణుకుతున్న తన చేతులతో అందుకుంటున్న కన్నతల్లి హృదయం ! అంతేకాదు , ఆమె కళ్ళల్లో సన్నని నీటి పొర కూడా నేను చూశాను (చప్పట్లు) మావి బాధ్యతల ముళ్ళ కిరీటాలే గాని, బంగారు కిరీటాలు కాదండి .తన తలపై కడ్డీల్లాంటి ఇనప తీగలతో తలలోపలికి గుచ్చుకుపోయే కఠిన ముళ్ళుగా .. కిరీటం అల్లి సిలువ కొయ్యపై కేవలం మూడు మేకుల ఆధారంతో వేలాడుతున్న దేహానికి తలపై రాజుగారికి కిరీటం అంటూ ఎగతాళి చేస్తూ .. గుచ్చుతూ ..సుత్తులతో , బండ రాళ్లతో మోదుతుంటే .. ఎగజిమ్ముతూ .. ధార గట్టిన ఆ పరిశుద్ధ రక్తం.. కళ్ళను మసకబారుస్తుంటే.. మనలో ఒక్కొక్కరిని చూస్తూ ..' నా బిడ్డా , ఇది నీకోసమే ! ' అంటున్న ప్రభువు ప్రేమామృతధారలే ..

నిత్యం మనల్ని నడిపిస్తున్నాయి ! ఈ విద్యాసంస్థలకు విజయాలను ఇస్తున్నాయి ..!

విద్యాసంస్థలను నడపడమే .. మహా ఒత్తిడితో కూడుకున్న పోరాటం కాగా .. సమాజంలో ఎదురయ్యే రకరకాల సమస్యలకు వార్డెన్ గా తన సేవా జీవితాన్ని ప్రారంభించిన నాటి నుండి సిస్టర్ అమ్మగారు ఎదుర్కొన్న సమస్యల చిట్టా .. చాలా పెద్దది . మన పట్టణంలో వ్యాపారం చేసుకుంటున్న జగన్మోహన్ రావు గారు తమ అనుభవాలను పంచుకునే అవకాశం ఇమ్మని కోరుతున్నారు, వారి మాటలు విందాం ..” (చప్పట్లు)

లిడియమ్మ గారి నుండి మైక్ అందుకున్న జగన్మోహన్ రావు గారు మాట్లాడ్డం మొదలుపెట్టారు “ ఫాదర్ అయ్యగారికి . అమ్మగార్లందరికి, మన కలెక్టర్ సాబ్ గారికి , సభలోని పెద్దలకు, పిల్లలకు, అందరికీ .. నా నమస్కారాలండి .. మాది ఈ పక్కనే ఉన్న నాయుడు గూడెం అనే చిన్న పల్లెటూరండి , నేను బడికి వెళ్లి చదువుకోలేదండి, మా నాన్నకు ఉన్న కొద్ది పొలంలో కూరగాయలు పండించి అమ్మకు రమ్మని నా నెత్తిన పెట్టే వాడండి , కొంత కాలానికి ఏలూరు వచ్చి కూరగాయల మార్కెట్లో ఓ కొట్టును చూసుకుని అమ్ముకోవడం మొదలు పెట్టామండి , నా పెళ్లి చేశారు మగపిల్లాడే పుడతాడని ఆశ పడుతుంటే అమ్మాయి పుట్టిందండి .. మా అమ్మ ఏడుపండి .. బంధువులందరూ శాపనార్థాలండి .. పిల్లని ఇంట్లో ఉంచడం కూడా అరిష్టమని .. పారేయమని .. ఒకటే గొడవండి .. ఆరోజు, మా అమ్మ నాన్న మార్కెట్ కి వెళ్ళిపోయారండి , నా భార్య పిల్లకి స్నానం చేయించి బట్టలేసి పడుకోబెట్టి తను స్నానానికి వెళ్లిందండి ఇక నేనొక్కడినే ఉన్నా .. నాకో ఆలోచన వచ్చిందండి .. గబగబా పిల్లనెత్తుకొని ,ఓ కండువా మీదేసుకొని , రోడ్డుమీదకెళ్ళా , రిక్షా కోసం నుంచున్న , వాళ్ళమ్మ కాసిన్నీళ్లు దిమ్మరించుకొచ్చి , పిల్ల కోసం చూస్తే, పిల్లా లేదు.. నేనూ లేను.. తనకేదో భయమేసి నా మీద అనుమానం వేసి తన దగ్గర ఉన్న డబ్బులు వెతుక్కుని గబగబా రోడ్డుకొచ్చేసింది..

అల్లంత దూరంలో నేను పిల్లనెత్తుకొని రిక్షా ఎక్కడం చూసి, ఎంటనే తాను ఓ రిక్షా ఎక్కేసి మా బండెనక పోనీయమందటండి .. ఇంతలో పిల్ల ఏడవటం మొదలెట్టిందండి .. అప్పుడండీ ...నా గుండె కరిగిపోయిందండి ..

నాక్కూడా ఏడుపొచ్చేసిందండి .. అమ్మో ఈ బంగారు తల్లిని కాలువలో పడేద్దునా .. దేవుడా, నన్ను క్షమించయ్యా .. అనుకున్నానండి.. అంతలో రోడ్డు పక్కనే చిన్నపిల్లల బొమ్మలతో ఇస్కూలు బోర్డు కనిపించిందండి ఈ గేటు దగ్గర ఆపయ్యా అన్నానండి దిగానండి ఎదురుగా ఆ యేసయ్య బొమ్మ కనపడిందండి ఒక్క క్షణం .. నా గుండెకాయ కేకేసిందండి తండ్రీ,నేనేమిటో నీకు

తెలుసయ్యా , అందుకే,నీదగ్గరకే తీసుకొచ్చావయ్యా ..

నువ్వు దేవుడంటన్నారు అదినిజమైతే ఈ నా బిడ్డను కాపాడు అని మనసులోనే దేవుడికి దండం పెట్టుకున్నానండి గేటాయనతో చెప్పా.. పెద్దమ్మ గారిని కలవాలయ్యా అని.. అటు ..తొందరగా పో.. తర్వాత దొరకరు అన్నాడండి రిక్షాయనికి డబ్బులు ఇచ్చేసి తండ్రీ నన్ను కాపాడు అని గబగబా పరిగెత్తానండి ఆ చెట్టు కింద దేవదూతల తెల్లని బట్టలతో ఓ అమ్మ కనబడితే "అమ్మా, ఇక్కడ చంటి పిల్లల్ని పెంచుతారంట కదామ్మ, మేం పేదోళ్ళం అమ్మ పిల్లని పెంచుకోలేక .." అన్నానండి, ఇంతలోనే మా భార్య వచ్చేసిందండి నా మాటలకు తను కూడా తల ఊపింది కానీ అయ్యా మీకందరికీ, కలెక్టర్ గారికి కూడా ఒక్క మాట చెప్పాలండి , పిల్లని కాలువలో పడేద్దామనుకున్నా .. నన్ను ఆ పని చేయనీకుండా.. నా తండ్రి నాతో అబద్ధం ఆడనీయక ఉన్నదున్నట్టు చెప్పించేసాడయ్యా అప్పుడనుకున్నా.. అమ్మో నా ఆలోచనలన్నీ ఆ తండ్రికి తెలుస్తున్నాయి తప్పుడు మాటలు మాట్లాడనీయడం లేదని ! అయ్యా, ఇక అప్పట్నుండి ఆ దేవుణ్ణి తలుచుకుంటూ .. అబద్ధాలు దొంగ మాటలు తప్పుడు పనులు పూర్తిగా మానేశానయ్య అమ్మ నాన్నకు దొంగ లెక్కలు చెప్పి డబ్బులు తీసుకోవడం, తప్పుడు తూకాలతో , రేట్లతో జనాల్ని మోసం చేయడం అప్పుడప్పుడు సిగరెట్లు సారాలు తాగడం ఇవన్నీ ఉండేవండీ.. ఇక ఆనాటి నుండి అయన్ని మానేశానండి..

ఆ చిన్నమ్మ గారు పెద్దమ్మ గారి దగ్గరకు మమ్మల్ని తీసుకెళ్ళింది మా ఆవిడే.. పిల్ల పుట్టిం దగ్గర్నుండి జరిగినవన్నీ చెప్పేసిందండి .. అమ్మా, , మీ నీడలో నన్ను నా పిల్లని బతకనీయండి లేకపోతే నా తలకాయ పగలగొట్టుకుని ఇక్కడే చస్తానమ్మా. బతకనిస్తే మీరే పని చెప్తే అది చేస్తానమ్మా. రేత్రి పగలు కష్టపడతానమ్మా. ఈ బుడ్డి పిల్లలకు మల్లె నా పిల్ల క్కూడా నాలుగు అక్షరాలు నేర్పండమ్మ .. నాకు ఈ మొగుడు వద్దు, సంసారం వద్దు, అమ్మ, ఒక్క మాట అడుగుతా .. ఇక్కడ ఇంతమంది ఆడపిల్లలు చక్కగా చదువుకుంటంటే ..వాళ్లకి నా పిల్లే ..ఎందుకు బరువైందమ్మా.. నా పిల్ల ని చంపాలని వాళ్ళెందుకుచూత్తన్నారు... ఆళ్ళందరూ ఆడోళ్ళేనమ్మా ... ఆడ మగ లేకపోతే లోకం నడుస్తుదామ్మా .. ఆడ మగని లోకంలో పెట్టింది ఆ దేవుడే కదామ్మా.. మీరందరూ పెళ్లిళ్లు మానేసి ..అమ్మ నాన్నల్ని వదిలేసి .. ఎక్కడెక్కడ నుండో వచ్చి ఈ పిల్లలందరిని పెంచుతున్నారు

ఇదెంత గొప్పతనం అమ్మా... నా పిల్లని కూడా అట్టాగే. .. చదివించండమ్మా..అని..బావురుమని ఏడ్చేసిందండీ ...

"ఆగండి.. మిగిలింది నేను చెప్తా " ఉన్నట్టుండి సభలో నుండి ఓ కేక ... అందరూ అటు చూశారు , వేదిక వైపు పరిగెత్తుతూ ఒక పెద్దామె , ఆమె వెనక ఓ యువతి యువకుడు ,'అమ్మా ఆగమ్మా ..,' అంటూ పరిగెత్తుకొస్తున్నారు..

ఆమె వేదిక పైకి ఎక్కి, రొప్పుతూ.. మాట్లాడుతున్న జగన్మోహన్ రావు చేతిలోని మైక్ ను లాక్కుంది " అయ్యల్లారా, అమ్మల్లారా, ఆ పిల్ల తల్లిని నేనే నమ్మ ..ఆ పిల్ల ఇదిగో ఈ అనిత , ఈమె తమ్ముడు వివేక్ .ఈరోజు ఈ పిల్లలిద్దరూ డాక్టర్లు,ఈ చదువు చదివించినవారు, వీళ్ళకి ఈ పేర్లు పెట్టినవారూ .. జోసెఫిన్ అమ్మగారేనమ్మ .. ఈరోజు ఇలా ఉన్నామంటే మమ్మల్ని కాచి కాపాడిన ఆ దేవాది దేవుని పాదాలకు మా జీవితాల్ని ఇచ్చుకుంటున్నామమ్మా .

హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనను అందరూ అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగానే.. ఆ తల్లిదండ్రులు, ఆ పిల్లలిద్దరూ వేదిక పైనున్న ఫాదర్ గారికి,

అమ్మగార్లందరికీ,కలెక్టర్ గారికి పాదాభివందనం చేస్తున్నారు .. తన చేతిలోనే ఉన్న మైక్ లో ఆ తల్లి , మళ్ళీ మాట్లాడటం మొదలు పెట్టింది .. అమ్మల్లారా అయ్యల్లారా ఆరోజు అమ్మగారోళ్ళు మమ్మల్ని ఎక్కించుకొని, మూడు కార్లలో మా ఇంటికి వచ్చి,అత్తమామలు బంధువులు చుట్టుపక్కల వారందరికీ ఖరాఖండిగా చెప్పారండి " ఆడ మగ సమానమని , ఇద్దరూ ఉంటేనే లోకముంటుందని, ఈ చిన్న సంగతి తెలియని అజ్ఞానం నుండి బయటపడమని, ఇందిరమ్మ గారు పాలిస్తున్న ఈ దేశంలో ఇంకా ఇలాంటి మూఢనమ్మకాలు ఉండకూడదని , గట్టిగా చెప్పారండి.

అమ్మగారోళ్ళే, పిల్లల్ని హాస్టల్లో పెట్టి .. చదివించారండి, అప్పుడు జోసెఫిన్ అమ్మగారు వార్డెనమ్మగా ఉన్నారండీ .. అక్షరంముక్క రాని నన్ను కూడా.. అమ్మగారోళ్ళే చదివించారండి!

జోస్ఫిన్ అమ్మగారు నన్ను నర్సుని చేశారండి ..

సభలోని వారంతా నిలబడి చేస్తున్న కరతాళ ధ్వనులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.. కొందరి కళ్ళు నీళ్లతో నిండాయి

" నిజంగా ఈ కాన్వెంట్లు, ఈ హాస్టళ్లు, ఈ బడులు... లేకపోతే మన పిల్లలు ముఖ్యంగా మన ఆడపిల్లలు ఎలా చదవగలిగేవారండి..."

" ఏవండీ , పెళ్లిళ్లు పేరంటాళ్ళు వదిలేసి అమ్మానాన్నలను కూడావదిలి ..దేశంలో పిల్లల్ని , పేదసాదలపిల్లల్ని పెంచి, చదివించి , అవకాశాలని స్తే .. ఎవరైనా గొప్పవాళ్ళు కాగలరని, గొప్ప పనులు సాధించగలరని , ఆకాశం హద్దుకాదని .. ఈ కాన్వెంట్ స్కూళ్ళ అమ్మగార్లు రుజువు చేస్తున్నారండీ "

" అయ్యా , పేదోడు బువ్వ తింటే .. అచ్చరం దిద్దుకుంటే .. ఈ దేశంలో డబ్బున్నోడు భోరున ఏడుత్తాడ్రా ! మనల్ని బాగుసేత్తన్నారనే ..అమ్మగారోళ్ళని బడులు పెట్టనీయక .. లంచాలు మింగి .. ఫీజులు మింగే నల్లడబ్బుగాళ్ళతో ప్రయ్యేటు బడులు పెడతన్నారు .. దేశంలో దొంగలు పడ్డారనేది ..అందుకేరా బాబూ .. "

"అమ్మగార్ల త్యాగపూరిత జీవితాలు .. దేశాన్ని వెలిగిస్తున్నాయండీ .."

ఇలా సభలోని వాళ్ళు మాట్లాడుకొంటుండగా , వేదిక మీదనుండి సిస్టర్ లిడియమ్మ గారి స్వరం వినవచ్చింది ..

" సభలోని వారంతా దయతో.. కూర్చొన వలసిందిగా మనవి .. జోసెఫిన్ అమ్మగారేమిటో

... మనకు కళ్ళ ముందే .. ప్రత్యక్షమయింది ..! అమ్మగారికి చాలా కృతజ్ఞతలు తెలుపుకుందాం .. ! దేవునికి స్తుతి

గుండెలనిండా అర్పించుదాం !

జగన్మోహన్రావుగారి కుటుంబానికి అభినందనలు అందజేద్దాం .. now back to our business ... ఇక మన ప్రోగ్రాంలో ముఖ్యమైన అంశంలోకి వచ్చేశాం ..మన ఈనాటి ముఖ్య అతిథి మన జిల్లా కలెక్టర్ గారు డాక్టర్ రాజగోపాల్ గారిని తమ సందేశం ఇవ్వవలసినదిగా కోరుతూ .. ఆహ్వానిస్తున్నాం.."

(చప్పట్లు)

లిడియమ్మగారు , తన చేతిలోని మైక్ ను కలెక్టర్ గారికి అందించారు.. కలెక్టర్ గారు ఎదురెళ్ళి.. మైక్ అందుకొని .. మదర్ సుపీరియర్ అమ్మగారికి,

ఫాదర్ గారికి, లిడియమ్మ గారికి , జోసెఫిన్ అమ్మగారికి పాదాభివందనం చేసి.. వారందరి దీవెనలు, ముద్దులు అందుకొని తమ సందేశాన్ని ప్రారంభించారు ..

" వేదిక మీద ఉన్న ఆత్మీయ తండ్రి గారికి, ఆత్మీయ అమ్మగార్లందరికీ, నా గుండెనిండుగా ... కృతజ్ఞతాంజలులు ! అమ్మా, ఈ రాజగోపాల్ మీరు రూపించిన బిడ్డ ! సభలోని అమ్మలకూ , నాన్నలకూ , సోదర సోదరీమణులందరికీ మన యేసయ్య పరిశుద్ధ నామంలో శుభాకాంక్షలు !

ప్రభువు మహా కృపను బట్టి మనందరం ఇలా కలుసుకున్నాం .. ఆ తండ్రికే స్తుతి ఆరాధన !

ఈ ప్రాంగణమంతా నా పుట్టిల్లండీ ! ఏడు సంవత్సరాలు ఈ గాలి , ఈ నీరు , ఈ ప్రేమ, ఈ శాంతి .. తనివిదీరా .. ఆస్వాదించానండీ ! జాయినైనరోజున ఏడ్చాను .. ఇదివద్దని , ఫేర్వెల్ రోజున ఏడ్చాను ..ఇది వదలనని ! ! ప్రేమను, శాంతిని ఎవరు వద్దనుకుంటారండీ ... ప్రేమ , శాంతి మీదే నాకు బలమైన పునాది కట్టారండీ.. ఈ అమ్మలందరూ .. ఇక్కడే ! గుండెలో ఆ పునాది ఉంటే .. మనల్ని ఏ.. సునామీలు కదిలించవు .. బెదిరించవు ! మన కళ్ళ ముందు ఎంత అద్భుతం చూశామండీ .. జగన్మోహన్ రావు గారి కుటుంబం ! దేవుడు ఎంత అద్భుతంగా ఆ భర్తను , భార్యను తీసుకు రావాల్సిన చోటికే తీసుకువచ్చారు .. వారి జీవితాలనే మార్చేశారు !

మరణంలో నుండి .. జీవంలోకి ! చిమ్మ చీకట్ల లోనుండి .. దివ్య కాంతుల లోకంలోకి !

అంతే, ఆ కుటుంబం ఎంతగా దీవించబడింది !

జగన్మోహన్ రావుగారు ఆ మరణంలోనే ఏడుస్తూ కూర్చోలేదు, తెగించి , బయటికి వచ్చాడు .. దేవుడు అతన్ని నడిపించాడు ..జీవంలోకి ! అనేకుల జీవితాలు, ఆలోచనలు మారిపోయాయి ! తెగించాడు .. పిల్లను పారేసేందుకే, కానీ , దేవుడు ఆ 'మూఢనమ్మకాలకు బానిస ' అయిన ఆ తండ్రి గుండెనుకరిగించాడు ..

"ఈ బిడ్డ నీ రక్తం !పారేయబడే పిల్ల కాదు, కుమార్తె.. ! రక్తంలో రక్తం, ప్రాణంలో ప్రాణం .. " అని, పేగును కదిలించాడు , కళ్ళు తెరిపించాడు ! చేరవలసిన గమ్యానికి ప్రభువే నడిపించారు !

తండ్రి చేతుల్లోనే ప్రాణాలు కోల్పోయే మృత్యుకూపం లోనుండి..

అనేక మందికి ప్రాణం పోసే జీవదాత అయింది అనిత ! ఆ తల్లికూడా .. తన బిడ్డను పొంచివున్న క్రూర జీవులనుండి రక్షించమని .. దేవునితో పోరాటం చేసే ఉంటుంది,

వార్డెనమ్మ గారితో పోట్లాడిందిగా .. దేవుని సైన్యం బయల్దేరింది..మూడు కార్లలో .. యుద్ధం జరిగింది తీవ్రంగా ..ఫలితం ..ఆరోజే అనేకులు మూఢనమ్మకాల మూర్ఖత్వాలనుండి విడుదల పొంది ఉంటారు !

ఇందాక లిడియమ్మ గారు చెప్పేరే.. వారి ప్రార్థనలు ఎందరినో.. కాపాడుతున్నాయని ! అమ్మలూ, అయ్యలూ, మీ ప్రార్థనలు చీకట్లను వెలుగు కిరణాలుగా మారుస్తూనే ఉన్నాయి .. ధన్యవాదాలు మీకందరికీ, ప్రార్థిస్తూనే ఉండండి !

జోసెఫిన్ అమ్మగారి గ్రామం ఆనందపురానికి విజిట్ కి వెళ్ళాను,అద్భుతమండీ , తన ఏడవ ఏటనుండి పదకొండో ఏడు వరకూ ..ఆ గ్రామాన్ని అమ్మ తీర్చి దిద్దారు . తన ఊరి పిల్లల్లో బాధ్యతా స్ఫూర్తి నింపారు ! ఇక , ఈ జీవితమంతా వాళ్ళు దాన్ని కోల్పోరు ! "నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించు " అన్న ప్రభువు మాటను , మన అమ్మగారు చిన్న వయసులోనే అరటిపండు ఒలిచి పెట్టినట్టు చెప్పారట..

" నీకున్నది లేని వారితో పంచుకోవడమే " అని, అదే .. ఆమె చిన్నవయసులోనే చేసి చూపించారట .. ఇప్పుడు కూడా , ఆ గ్రామం లోనివారు అదే చేస్తున్నారట ! అమ్మకు తలిదండ్రులు పెట్టిన పేరు ' కరుణ' .. కరుణ ఆ గ్రామంలో నిత్యం ప్రవహిస్తూనే ఉందట ! నాడు ఆమె ద్వారా, నేడు ఆ పిల్లలు, పెద్దల ద్వారా !

"ఆడపిల్లలు వద్దు.. ఒంటరిగా ఏమీ చేయలేరు" అనే గుడ్డివాళ్ళను ...ఆ ... గ్రా మానికి తీసుకువెళ్లాం.. వాళ్ళ కళ్ళు తెరిపిద్దాం !

ఆడ పిల్లలు చదవాలని ..వాళ్ళు చదివినప్పుడే ..చదువు విలువ ఆయా కుటుంబాలకు అందుతుందని .. ప్రతీ ఇంటికెళ్ళి , అమ్మా నాన్నలకు వివరించిచెప్పినప్పుడు ..వాళ్ళే .. ఇష్టంగా , రానురాను.. ఆరాటంగా పంపేవారట ! ఆయా సబ్జెక్టుల్లో బలహీనంగా ఉండే పిల్లలకి తానుగా నీ , అమ్మ, నాన్నగార్లు టీచర్లు గనుక , వాళ్ళు గానీ చెప్పేవారట ! బడికి సెలవులప్పుడు .. పెద్ద క్లాసువాళ్ళకి ఇంగ్లీషు వాళ్ళ నాన్నగారు , మిగిలిన క్లాసులవాళ్ళకి వాళ్ళమ్మ గారు.. అన్ని సబ్జెక్టులు.. తెలుగు , సోషల్ , సైన్సు , లెక్కలు చెప్పేవారట!

ఒకపూట చదువైన తర్వాత.. రెండో పూట .. వీధికి నలుగురైదుగురు చొప్పున ఇంటింటికీ తిరిగి, అనారోగ్యం, డబ్బులున్నాయా , కావలసిన సరుకులు ..

సమస్యలేవైనా ...పిల్లలే సరిచేసేవాళ్ళట .. సరిచేయలేనివి .. మాస్టార్లకు,అంటే వాళ్ళమ్మ నాన్నగార్లకు చెప్పి .. పరిష్కరించే వాళ్ళట ! అందుకే , వాళ్ళందరిమధ్యా ఐక్యత, శాంతి , ఆనందం కలిసిన యేసయ్య ప్రేమ సమృద్ధిగా ఉంటాయట.. వాళ్ళ ఊరిపేరే ఆనందపురం కదా ..

మరొక గొప్ప విషయమేమంటే .. వాళ్ళమ్మ, నాన్నగార్ల ఇంటిని .. వారి తదనంతరం ..

కీర్తి శేషులు శ్రీమతి మాణిక్యమ్మ, శ్రీ సైమన్ గార్ల గృహం ఆనందపురం గ్రామ ప్రజలకు ప్రేయర్ హోం. ! మరియు షెల్టర్ హోం. !

నాకు చిత్రమేమంటే .. చిన్నవయసులోనే ఇంత పెద్ద ఆలోచనలు, పనులు ఎలా చేయగలిగేరా .. ! ఇంట్లో గొడవ లైనా .. వీళ్ళే సరిచేస్తారట !

అమ్మా , ఈ రోజు ఫేమిలీకోర్టులనేవి ..ఆనాడే .. ఎలా చేశారు ? యేసయ్యే.. మీకీ తలంపులన్నీ పెట్టి... చేయించారు..

అమ్మా , నాకేదైనా సమస్య ఎదురైతే .. మీరే నాకు సూపర్ కలెక్టర్ !

(చప్పట్లు )

ఆ ఊరిని అమ్మ 'చారిటీ సిటీ'గా మలిచారు, 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ', 'సాక్షరగ్రామం' .. ఇదంతా తాను,తన స్నేహితులతో.. ఆ రోజుల్లోనే సాధించారు !

అమ్మ స్కూల్ హెడ్ మిస్ట్రెస్ అయినప్పుడు మదర్ సుపీరియర్ అమ్మగారిని , ప్రిన్సిపల్ అమ్మగార్లను, మరి కొందరు అమ్మలను తీసుకుని ఆ నాటి కలెక్టర్ గారిని కలిసి వాళ్ళ ఊరికి పక్కా స్కూల్ బిల్డింగ్, గ్రంధాలయం, ఇంటింటికీ మరుగుదొడ్లు, నీళ్ళ పంపులు, వీధిదీపాలు, ఊరిలోకి బస్సు సర్వీసులు సేంక్షన్ చేయించారట .. అన్నీ పక్కాగా పని చేస్తున్నాయి.వాళ్ళు అమ్మకు పెట్టిన పేరు ' మా గడ్డ బిడ్డ ' ! వాళ్ళూరిపేద పిల్లల్ని, చుట్టుపక్కల ఊళ్ళ పిల్లల్ని మన హాస్టల్లో చేర్చి ఉచిత విద్య అందించడం వల్ల.. ఇప్పుడు.. అందరూ ఉద్యోగాలు చేస్తున్నారు.. పేదరికం పై యుద్ధం ప్రకటించారు ! మనదగ్గర చదివినటీచర్లు,ఇంజనీర్లు, డాక్టర్లు, పాలకులుగా సేవలందించే వాళ్ళు.. మన అమ్మ రూపించినసైన్యమేనట !

(చప్పట్లు)

ఈ రోజు సాంస్కృతిక కార్యక్రమంలో ఆనందించేందుకు ఆనందపురవాసులు , ఉద్యోగులు ఒక 'ట్రీట్ బేగ్'ను తయారు చేశారు..స్వీట్లు,హాట్లు,ఫ్రూట్లు, పులిహోర పాకెట్లతో..! దానిమీద ప్రింట్ చేసిన వాక్యాన్ని చదువుతున్నాను ...

" మా ఆనందపురం మాస్టార్లు శ్రీమతి మాణిక్యమ్మ గారు , శ్రీ

సైమన్ గారల కుమార్తె సిస్టర్ ఎస్తేర్ జోసెఫిన్ అమ్మగారు సెయింట్ థెరీసా కళాశాల ప్రిన్సిపల్ గా నియమితులైన శుభ సమయంలో .. మా ఆనందపుర వాసుల చిరు సత్కారం !

మన పరలోకపు తండ్రి

మిమ్ములనందరినీ

దీవించును గాక ! "

(చిన్న సూచన : ఈ బేగ్ను పారేయకండి, జ్ఞాపిక గా ఉంచగలరు ) ఇది.. మనం పాటించవలసిన మంచి సూచనే .. నేను దాచుకుంటాను !

సర్పంచి వేణుగోపాల్ ఇప్పుడు నాకు మంచి మిత్రుడయ్యాడు.. ఆతని కుమార్తె కూడా మన ఓల్డ్ స్టూడెంటేనట, ఇప్పుడు గైనికాలజిస్టట ...

అయ్యలారా, అమ్మలారా.. తోటి మనుషులను ప్రేమించి, తపనపడి, క్రియాశీలక మైన సేవ చేసే వారు .. ఇప్పుడు తగ్గిపోతున్నారు .. సేవలుచేసే నీతిమంతుల సంఖ్య పెరగడం దేశానికి క్షేమకరం ! మన అమ్మలే ఈ నాటి స్త్రీలకు గురువులు ! నా ఆనందాన్ని పెంచి, నేను .. మరింతగా సేవ చేసేందుకు అమ్మ స్ఫూర్తి.. నాకు మార్గదర్శి !

అమ్మకు, నాకు ..మీ ప్రార్థనలు, దీవెనలు మెండుగా ఉండును గాక !

నా ఆలోచనలు మీతో పంచుకునే అవకాశాన్నిచ్చినందుకు.. మీకందరికీ ధన్యవాదాలు !

దేవుని కృప మనందరికీ తోడైఉండునుగాక ! "

(అందరూ లేచి నిలబడి, ఆనందంగా చప్పట్లు కొట్టారు ..)

"దేవుని ప్రార్ధించే .. బిడ్డయ్యా ! మాటల నిండా ప్రేమే !"

"ఈ కలెక్టర్ గారు వచ్చినప్పటినుండి .. లంచాలజాతి అదృశ్యమైందటండీ .."

కలెక్టర్ గారిని గురించి తెలుసుకున్న సంగతులను, సభలో చెప్పుకొంటున్నారు ..

లిడియమ్మ గారు కలెక్టర్ గారికి ధన్యవాదాలు తెలిపారు..

" ప్రిన్సిపల్ జోసెఫిన్ అమ్మగారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను " అంటూ మైక్ ను అందించారు .

జోసెఫిన్ అమ్మగారు " ఈ కార్యక్రమానికి విచ్చేసి .. మీ దీవెనలు , ప్రార్థనలు నాకు నిత్యమూ తోడైఉంటాయనే నమ్మకాన్ని రెట్టింపు చేసినందుకు.. మీ కందరికీ ..పేరు పేరునా వందనాలు ! ఆనందపుర వాసుల ట్రీట్ ను ఆనందించండి .. మన ముఖ్య అతిథి మన జిల్లా కలెక్టర్ డాక్టర్ రాజగోపాల్ గారి సలహాలు, సేవలు మన కాలేజీకి నిత్యం అందుబాటులో ఉంటాయని, ఉండాలనీ కోరుతున్నాను .. అందరికీ, మరోసారి థేంక్యూ, ధన్యవాదాలు ! God Bless you All !

ఇప్పుడు వేదికను , కల్చరల్ ప్రోగ్రామ్ ను ఎడ్వీనాకు అప్పగిస్తూ మేము మీవద్దకు వస్తున్నాం ..." అని ముగించారు.

అతిథులకు ఏర్పాటు చేయబడిన హాలు వైపునకు బయలు దేరారు

చప్పట్ల వర్షం కురిపిస్తూ..అందరూ లేచి నిలబడ్డారు ...

సభలోని ప్రతి ఒక్కరి నోటా జోసెఫిన్ అమ్మగారిని గురించిన మాటలు.. ఆలోచనలే ....వారి ఆధ్వర్యంలో మన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న ఆకాంక్ష అందరిలో ..

వారి చేతిలోకి వచ్చిన ట్రీట్ బేగ్ ను పరిశీలిస్తూ , ప్రింట్ చేయబడిన వాక్యాన్ని చదువుతున్నారు ...

తెలిసిన మొహాలు కనిపిస్తాయా ...అని వెతుకుతున్నారు.,..

జోసెఫిన్ అమ్మగారిని అభినందిచేందుకు .. ప్రముఖులు బారులు తీరారు ..

సమాజాన్ని ఆవరించిన అజ్ఞాన తిమిరాన్ని కాల్చి విజ్ఞాన జ్యోతులను ప్రజ్వలింప చేసేందుకు .... పేదరికాన్ని తరిమికొట్టి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేందుకు... క్రైస్తవ మిషనరీలు అందిస్తున్న సేవలను తెలియని వారికి తెలిపేందుకు .. నా కలాన్ని కదిలించి కథనం చేయించిన విజ్జమ్మాబుజ్జమ్మకు ..

అక్క దీవెన : నీ ఆలోచన సఫలమగును గాక !!

కవిత

# "జడ"త్వమ్ !?



**ఎం. వి. ఉమాదేవి**
**7842368534**

ఆడా మగా తేడాతెలిపే గుర్తు
శిరసుగిరుల నుండీ పాయలుగా దూకే
జలపాతం నీలికురులు !
వేలెడు పిలకలు రిబ్బన్లు కట్టి
ఊరికే ఊడిపోయే రెండుజళ్ళు
కళ్ళలో పడే ముందువెంట్రుకలు... !
నేడు ఓ మాదిరి పొడుగు జడ!
యవ్వనం యవ్వారాలు అన్నీ అద్దం దువ్వెనలని అడుగు
చెప్తాయి !
గంట సేపు తీసింది పాపిటనచ్చదు..
ముంగుర్లు వాణిశ్రీ, జయప్రదల్లా మెలితిప్పి చెవులదగ్గర
షేపులు... !
పూలజడ మోజు రాత్రికిబోర్లా పడుకోడంతో తీరే పోయే !
మెత్తని నల్లని జుట్టుకి రీటా.. పరిమళం
అమ్మమ్మ ఊర్లో కొబ్బరినూనెలో దవనం ఆకు కచ్చురాలు
ఘుమ ఘుమ..
మొగలిపూలతో కుట్టిన బిళ్లలు
జడని మెరిపిస్తూ.. !
బళ్ళో అంటిన పేలబాధ..
సీతాఫలం గింజలతో పీడవదిలే!
ఒక్క వెంట్రుక రాలని మెలనిn
అనేక పనులమధ్య,
తలదువ్వుకోవడం చికాకుపని
అలా వదిలేసి అట్టలు కట్టింది
సోమవారం శివుడికి,మంగళవారం మారుతీ, గురువారం
సాయి అంటూ చేసే అభ్యంగన స్నానాలు...
పుణ్యం సంగతి అలా ఉంచి,
చిక్కులుపడిన దారపు కండె !
వయసు బెదిరింపులు చూడు
భుజం పైకెత్తనివ్వని నొప్పి
దశాబ్దాల చేతులసేవనిపుడు
గుర్తు చేస్తుంది... !
చిన్నపుడు అమ్మ తలదువ్వడం
నచ్చేది కాదు..
ఇప్పుడు...ఈ క్షణం అమ్మ ఆ గరుకుచేతుల్తోనే..చిక్కులు తీసి
జడేస్తే ఎంత బాగుండును... !?
పట్టుకుచ్చులాంటి జుట్టు..
పంటకోసేసిన వరిదుబ్బుల్లా..
మలిసంధ్య క్రీనీడలు ఫైవ్ మినిట్స్ లోనో,
సూపర్ వాస్మాల్ లోనో దాచలేవు...
దువ్వలేని జుట్టు భారమే..
హాయిగా షావుకారు జానకిలా
క్రాఫ్..
ఏం, హుందాగా ఉందిగా ఆవిడ...
జడ లేకున్నా.. జడత్వం మాత్రం ఉండరాదు
పక్కన మనిషిబాధకు పట్టనట్టు గా !
ఏమైనా.. వేసవిలోరాత్రి తలస్నానం చేసి
జడలో నాలుగు మల్లెలు తురుముకున్న తృప్తి..
స్టూల్ వేసుకొని మాకోసం సన్నజాజులు కోసే నాన్న
అపురూపం !
జీవితకాలపు తీపి గుర్తు..
ఈ నిస్సత్తువ జడత్వాన్ని తొలగిస్తూ.. !

# సంతానం



**ఆసూరి ఉషారాణి**

**తిరుపతి, 9441646016**

రాధిక మౌనంగా రోదిస్తోంది. కాదు ఏడుస్తోంది. మూగగా వెక్కు తోంది. ఎందుకు ? సమాజం తన మీద వేసిన ముద్ర వల్ల. ఏ ముద్ర ? "గొడ్రాలు" అ పిలుపును ఏ స్త్రీ ఆహ్వానించదు. మరి ఈ రాధిక విషయంలో జరిగినదేమి? ఏముంది? భర్త సంతాన విషయంలో డాక్టర్ దగ్గర చూపించు కోవడానికి సిగ్గు పడుతున్నాడు. కాని రాధిక మాత్రం గోడ్రాలు అన్న నింద మాత్రం మోయాలి. ఇదెక్కడి న్యాయం? అడిగే వారెవరు?

"ఇంకో మాట మాట్లాడకు. నీలోనే లోపం ఉంది." పురుష పుంగవుడు అనే భర్త విశ్వం ధీమాగా అంటున్నాడు.

మనము విడి పోదాము. చాల ధీమాగా అన్నాడు భర్త విశ్వం

"మనం విడి పోయిన తర్వాత మీరు తిరిగి వివాహం చేసుకోండి." రాధిక అంది

అది నా ఇష్టం. నీ సంగ తేమిటో"?

"నా విధి వ్రాత ఎలా ఉంటె అలా" అంది రాదిక.

★ ★ ★

కాల చక్రం ఎవరి కోసం ఆగదుగా. ఓ నాలుగేండ్లు గడిచాయి.

విశ్వం ఇంటి గేటు చప్పుడయ్యింది. తొంగి చూసాడు. విశ్వం భార్య రాగిణి తొంగి చూసింది.

"ఎవరో ఒక ఆవిడ రెండేండ్ల పసి బాలుడితో లోపలి కొస్తోంది" అంటోంది రాగిణి.

నవ్వుతూ రాధిక లోపలి కొచ్చింది.

"ఏమిటి సార్ ఎలా ఉన్నారు? అన్నట్టు మీ ఆవిడా? పిల్లలా?" ఐ మీన్ మనం విడి పోయి నాలుగేండ్లు అయ్యింది కదా? తమరు వెంటనే పెళ్లి చేసుకొని ఉంటారు ఏడాదికి ఒక్కరు చొప్పున ముగ్గురు పిల్లలన్నా ఉండాలి కదా? బై ది బై మనం విడి పోయాక నాకు ప్రభుత్వ ఉద్యోగ మొచ్చింది. మా ఆఫీస్ లో పని చేసే అతను పెళ్లి చేసు కున్నాడు. నేను అన్ని అతనికి చెప్పే చేసుకొన్నాను. మీరు మీ శ్రీమతికి అన్ని చెప్పారా? లేదా? మా అబ్బాయి అనూష్: " ఇప్పుడు చెప్పండి లోపం మీలోనా? నా లోనా? ఎంత సేపు ఆడాళ్ళని ఆడి పోసుకోవడమే " అంటున్న రాధిక వంక నోరు తెరచి చూస్తున్నాడు. విశ్వం.

"మాకెక్కడండి పిల్లలు? వీరిలోనే లోపం పిల్లలు మాకు పుట్టరంట. ఇన్ని రోజులు తనలో ఏ లోపం లేదన్నట్టు ప్రవర్తిస్తున్నారు. నా గొంతు కోశారు. " కళ్ళ నీళ్ళు పెట్టుకుంది రాగిణి.

"ఏడవకమ్మ రాగిణి. నా కూతురిలాగా భావిస్తున్నా.ఇప్పుడే మంచి సంబంధం చూసా? నీకు నే దగ్గరుండి పెళ్లి జరిపిస్తా. వీడికి బుద్ధి రావాలి" అంటున్న మామ గారి వంక ఆశ్చర్యంగా చూసింది రాగిణి.

"నాన్న" అరిచాడు విశ్వం

"నోరు ముయ్యరా వెధవ? బాగా అడిగావు రాధిక. ఇలాంటి వారికి బుద్ది రావాలి. పెద్ద పురుషుడని ఫోజు." పళ్ళు నూరుతున్నాడు తండ్రి.

"ఎంత సేపు ఆడదాని పైనే తప్పులు రుద్దుతూ. ఛీ నీ బతుకు o బతుకేనా?" అంటున్న తండ్రి వంక భయంతో ఇక ఏ తిట్ల దండకం వల్లి స్తాడో అని చూస్తున్నాడు విశ్వం.

కథ

# పెద్దక్క ముచ్చట



సుమతి చురకంటి

హైదరాబాద్ 9866344106

నా చిన్నప్పుడు ఇంట్లో అమ్మమ్మ వాళ్ళు మాట్లాడిన భాష – యాస

పెద్దక్క

నేనప్పుడు చాలా చిన్న పిల్ల ను ‘ మా అమ్మ నాకు పట్టా గొలుసులు కొన్నది. దానికి గుజ్జెలు వుండె . నడుస్తుంటే గల్లగల్ల సప్పుడొచ్చేది. పిల్లలం అందరం అయిదారుగురు వుండేటోల్లం. తొక్కుడు బిల్ల ఆడుకునేది . పచ్చ గడ్డే ఎక్కడ్నో నాపట్టాలు పోయినయ్. మా అమ్మేం కొట్టలేదు యాడ బోయిన యని ‘ నేనే దేవునికి మొక్కుకున్న దొరకాలని. మా మేనమామ ఇంటికెల్లినం శానా రోజులున్నం. మా అత్త శానామంచిది . నన్నెన్నడు ఏమనలేదు . మా అక్క జెల్లెల్ల పిల్లలం చానా మందిమి .మా మావ తోట కాన్నుండి మామిడి పండ్లు చిత్పాల పండ్లు దెచ్చి మంచాల కింద మగ్గబెట్టివుంచేది మేమొస్తమని . ఆడ .. పెత్తనమంతా పెద్దక్కదే . పెద్దక్క అంటే తెల్వదా నీకు.

మా అమ్మ మామామ మా శిన్నమ్మ అందరి కంటే పెద్దది. మా అమ్మమ్మకు తొమ్మిది మంది సంతు . మా పెద్దక్కని అందరూ పెద్దక్కనే పిలుస్తరు. మేం చిన్న పిల్లలం అంతా ఇరవై మందిమి గూడా పెద్దక్క అనే అంటం . ఆడ ఆమె ఎందుకుండేదో పెండ్లయ్యిందో కాలేదో మాకేం తెల్వదు .ఎం వండాలె ఏం కూర జెయ్యాలె. ఎవరికి చీరలు జాకిట్లు బెట్టాలె.. ఏ శల్లెకు సారి బొయ్యాలె’ ఏ శెల్లెకు పురుడు బొయ్యాలె ఇట్టాంటి యన్ని మా మావకు జెప్పేది . ఆమేది జెప్తె అదే చేస్తోడు మామ. మా పెద్దక్క మంచంలనే వుండి పెత్తనం చేసేది . మామావ ఇల్లు శలా పెద్దగా వుండేది. పెద్ద వసారాలో మంచం మీద అక్కుండేది . పక్కనే పెద్ద చేతికఱ్ఱ మంచం కింద ఊందాని వుండేది. మల్ల ఊందాని ఏందని అడగొద్దు . ఆమెకు దగ్గొచ్చి నప్పుడు ఉమ్మి వచ్చినప్పుడు అందుల ఊ 0చేది . గంట బోర్లించి దాని మీద గంట ఎలకల బెడితే ఎట్టుంటది . అగో అట్టుంటది . అండ్ల గిలాసేడు నీల్లు పోసి వుంటది. అండ్ల ఉమ్మేస్తది . పొద్దుమాపు జీతగాడు అది పారబోసి మల్ల పెట్టేటోడు.

వడ్లు ‘పజ్జొన్నలు .. కందులు గుమ్ముల్లో గరిశల్లో పోయించేది ఆడ కూసోనే అన్ని పనులు ఎవ్వలికేది జెప్పాల్నో అది చెప్పి చేయించేది . అంత పనితనం నా కు గూడా లేదు .

ఏంది మీకు గరిశే అంటే తెల్వదా అంటూ పక పకా నవ్వి .. గరిశంటే చిన్న అఱ్ఱ. అఱ్ఱంటే గూడ తెల్వదా మీరు రూం అంటరు గదా! గది అని గూడ అంటరు.

దానికి కిటికీ వుండదు . తలుపులు గూడ వుండవు .మరెట్ల బోతమో జెప్పుండి ‘ హహ దానికి దర్వాజాకు అడ్డంగా పన్నెండు చెక్క లుంటయి. ఆటిని కింది నుండి పెట్టుకుంట రావాలె. ఆటిమీద ఒకటి రెండు మూడు నంబర్లు యేసుంటాయి . కిందినుంచి మూడో నాలుగో చెక్కలు పెట్టి దాన్నిండా వడ్లు పోస్తరు మల్లో రెండు చెక్కలు పెట్టి మల్ల నింపుతరు. అట్ల నింపే కాడికి నింపి ఇవతలికి దుంకేటోడు జీతగాడు. బైటికొచ్చి పై రెండు చెక్కలు గూడ పెడ్తే పురుగు బూసి ఏది పట్టదు .

ఇంత సదువుకున్నారు గుమ్మంటే తెలవదటా బాగుంది కత . సరే అదిగూడ చెప్త పటు . ఇంటెనక చాలా జాగుండేది మాకు గరిశల బొయ్యంగ మిగిల్న వొడ్లు పిల్ల పెండ్లికని దాసేటోల్లు . అట్ల దాయటానికే గుమ్ములు తయారు జేసేటోల్లు . వరిగడ్డి తోటి ఇంత లావున తాడోతిగ పేని వడితిప్పి కింద బూమీ్మది నుండి గుండ్రంగా పెద్ద కైవారం తో సుట్లు సుట్లు ఒక దాని మీ దోటి అట్నే అట్నే పైదాక పెట్టుకుంట బోతే గుమ్మి అయినట్టు . దాని మీద మట్టి పెండ కలిపి మెత్తితే గోడ తో కట్టినట్టే వుంటది. నీ అసుంటమ్మ కాసే ఓపికున్న మ్మ ఎఱ్రమట్టితో అలికి సుట్టు ముగ్గులు ఏసుకుంటరు

అండ్ల వొడ్లు పోసి పైన మల్ల గడ్డితో గుడిసె కప్పినట్టు కప్పేటోల్లు . ఇగ వానొచ్చినా ఎండొచ్చినా ఏం గాదు . ఇయ్యన్ని ఇప్పుడాడున్నయ్ బిడ్డా ! నా చిన్నప్పుడు మచ్చట్లు . అమ్మ పాయె నాయిన పాయె మామేనమామలు పెద్దక్క అందరూ పైకి బోయిరి నేనే వున్నా మొండిగా . కరోనా అట ఈ రోగమేందో ఏమో గానీ చిన్న చిన్నోల్లు సచ్చిపోతుండ్రని వింటుంటే బాధయితాంది. నాలాంటోల్లని .. లేవలేని శాతగానోల్లని తీసుకపోవచ్చుగా దేవుడు . గీ ముచ్చట్లన్నీ మీకు చెప్పటానికే నన్నుంచిండేమో అని కొంగుతో కండ్లొత్తుకుంటూ మళ్ళీ నవ్వింది పకపకా ....

కథ

# అరిటాకు



డా॥బండారి సుజాత

హన్మకొండ, 9959771228

"ఏమైందక్కా! అలా ఉన్నావు అన్నది" శాంత.

"ఏమీ లేదు శాంత. ఏదో ఒక ఆలోచన. ఏం చేయాలో తెలుస్తలేదన్నది" శ్రీమతి.

"చూడక్క! చెప్పుకుంటే బాధ కొంత తీరుతది అన్నది శాంత. బాధలు తీరినా తీరకపోయినా నీ లోపల నువ్వే కుమిలిపోతే ఎట్లా? నిన్నటి నుండి చూస్తున్నా మొహంలో నవ్వు మాయమైంది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే మోహంలో కళే పోయింది. పిల్లలు బాగున్నారా ? అమ్మవాళ్ళు బాగున్నారా? అంటు ప్రశ్నల వర్షం కురిపించింది" శాంత.

"అంతెందుకు మీ ఇంటి ముందు చెట్లే నువ్వు బాధలోవున్నావని చెబుతున్నాయన్నది" శాంతి.

"అదేమిటి శాంతి " శ్రీమతి .

"అవునక్కా! సాయంకాలం కాగానే చెట్లకు నీళ్లు పెట్టి, మల్లెపూలు తెంపి మాలకడుతూ, గులాబీలను తెంపి ఒక చుక్కకొబ్బరినునె పువ్వు మధ్యలో వేసి గిన్నెలో నీళ్ళుపోసి గులాబీలు వేసిఫ్రిజ్ లోపెడతావుకదా ! రేపటి దేవుడు పూజ కొరకు. అంతేకాక అల్లిన దండల్లో దేవుడికి పెట్టి నాకు, సుధకుఇస్తావు కదా! రెండు రోజుల నుండి మూగనోము పట్టావు. నేను సుధ అడుగుదామను కుంటున్నాము కాని బాధపడతావని ఊర్కున్నాము" అన్నది శాంత.

శాంతి సుధలు శ్రీమతికి పక్క, పక్క ఇల్లు. ఎవరికి ఏ కష్టం వచ్చినా, అవసరం వచ్చినా శ్రీమతి ఆమె భర్త హరి ఆదుకుంటూ ఉంటారు. అందరివి మధ్యతరగతి కుటుంబాలే అందుకే ఒకరికి ఒకరు దగ్గరయ్యారు.

శ్రీమతి, హరిలది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు పిల్లలు నవ్య, కావ్య. తాము ఎక్కువ చదువుకోకున్నా తమ పిల్లలను బాగా చదివించాలన్న ఆశ వాళ్ళది. శ్రీమతి ఇద్దరుపిల్లలు నవ్య, కావ్య పై చదువులు చదువుతున్నారు. హాస్టల్లోఉండమంటే ఉండక, నిత్య, సుమలతో కలసి రూం తీసుకొని ఉంటున్నారు. ఒకటి రెండు సార్లు వెళ్ళి చూసి వచ్చింది శ్రీమతి.

'ఇంటి దగ్గర ఒక్క పని చేయని పిల్లలు ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటున్నారు. ఒక వేళ చేస్తామన్న తానే చదువుకొమ్మనేది. పనులన్ని పంచుకొని చేస్తున్నారు. ఇదీ ఒకందుకు మంచిదే, పనులు చేయడం, బాధ్యతలు పంచుకోవడం కూడా తెలిసి వస్తాయి' అనుకున్నది శ్రీమతి. నవ్య, కావ్య, నిత్య, సుమలందరూ కలిసే ఇల్లు తీసుకొన్నారు.

"నిత్య వాళ్ళ అమ్మ నాన్న మార్కెట్లో కూరగాయల హోల్ సేల్లో అమ్ముతుంటారు. సుమ వాళ్ళది వ్యవసాయకుటుంబమే, వరంగల్ దగ్గర ఊర్లే కనుక అందరూ కలిసి రూం తీసుకొని ఉంటున్నారు. ఇంకొక సంవత్సరమైతే పెద్దమ్మాయి నవ్య చదువైపోతుంది. ఏవో పరీక్షలు కూడా రాస్తున్నానని చెప్పింది" అన్నది శ్రీమతి.

"కావ్యలో ఈ మధ్య మార్పు కనబడుతోంది, ఏదో పరధ్యానంగా ఉంటోంది. అమ్మ మీద బెంగేమొ ఇంటికి వెళ్ళమని" చెప్పింది చెల్లెలికి నవ్య.

"ఏమీలేదక్క పరీక్షలూ కాగానే ఇద్దరం కలిసే ఇంటికి వెల్దమన్నది" కావ్య.

అమ్మా కావ్యకు ఏమైందో అర్థం కావడంలేదు, చెల్లి బాధగా వుంటున్నదని తల్లికి ఫోన్ చేసి చెప్పింది నవ్య. భర్తకుకూతురి విషయం చెబితే బాధపడతాడని, నెమ్మదిగా కూతురితో మాట్లాడి అసలు విషయం తెలుసుకున్న తరువాత భర్తకు చెబుతాననుకున్నది శ్రీమతి. నవ్య తమ రూమ్మేట్ నిత్య ఆలస్యంగా రూమ్ కి వస్తుందని చెప్పింది తల్లితో. ఎందుకాలస్యంగా వస్తున్నావంటు అడిగితే ఊరినుండి తమకు తెలిసినవాళ్ళు వచ్చారని అంటున్నది అన్నది నవ్య తల్లితో.

"కావ్యను ఎక్కడికి, ఎవరితో పోతున్నావని గట్టిగా అడిగితే రూమ్మేట్ నిత్యతో రెండుసార్లు వెళ్ళానని చెప్పింది. ఆమె ఎక్కడికి వెళ్ళినా తీసుకు వెళుతుందని, నేను వద్దంటే వినటం లేదని చెప్పింది" కావ్య

నిత్యతో. "ఇంకెప్పుడు ఆమెతోవెళ్ళకు కాలేజీ ఎగ్గొట్టిఅలా తిరిగితే నీ చదువేమైతదో తెలుసా"అని కూతుర్ని ఫోన్ లో మందలించింది శ్రీమతి.

నవ్య చెప్పిన మాటలుగుర్తుకొచ్చి,

ఏం లేదు శాంతి పిల్లలు గుర్తుకొస్తున్నారని, ఇప్పుడే నవ్య ఫోన్ చేసింది. వాళ్ళ రూమ్మేట్ నిత్య ఊరెళ్ళిందని, నిత్య ఆస్పత్రిలో ఉన్నదని, రహీం అనే అతను ఆమె గొంతు కోశాడని నవ్య చెప్పింది.

నవ్య చెప్పగానే అనుకున్నంతా అయింది అని బాధపడింది శ్రీమతి.

కావ్యకు తెలియగానే భయంతో ఏడ్చింది అమ్మా నేను చూసుకుంటాను, నువ్వు, నాన్న నిత్య దగ్గరకు వెళ్ళండి. వాళ్ళ అమ్మా నాన్నలను చూసుకొండి అన్నది నవ్య.

"అయ్యో ! ఇదేందక్కా, గొంతుకోసుడేంది? వాడేమన్న మనిషేనా? ఇప్పుడు ఆ అమ్మాయి ఎట్లున్నదట. అసలేం జరిగిందన్నది" శాంత. ఇవ్వాళ, రేపుఆడపిల్లలు నవ్వుతూ మాట్లాడినా, ఓ రెండు సార్లు వాని వైపుచూసినా ప్రేమేనని వెంటపడి వేదించే రోజులివి. నిత్య వాళ్ళ ఊరునుండి 'రహీం' వస్తే, నిత్య తనతో పాటు కావ్యను కూడా పార్క్ కు తీసుకెళ్ళేదిస. అతనితో ఒక్కదాన్ని వెలితే బాగుండదని కావ్యను కూడా తీసుకు వెళ్ళిందని, చెప్పడంతో వాళ్ళిద్దరి మధ్య నువ్వెందుకు ఈసారి అడిగితే రానని చెప్ప మని చెప్పాను .అంతేకాదు అమ్మకోప్పడుతుందని చెప్ప మని చెప్పాను.

నవ్యకూడా మీరు మీరు చూసుకోండి మా అమ్మ కోప్పడుతోందని చెప్పిందట నిత్యతో, అప్పటినుండి రోజు రూమ్ లో ఏదో ఒక మాటనడం చేస్తుందట నిత్య.

"సంవత్సరం మధ్యలో హాస్టల్ లో వేయాలన్న ,వేరేరూం తీసుకోవాలన్న చాలా ఖర్చని ఆలోచిస్తున్నామన్నది శ్రీమతి. ఆ పిల్లలు కూడా మంచి వాళ్ళే. మరి ఇప్పుడు ఎందుకు ఇలాతయారయ్యారోఅర్ధం కావటం "లేదన్నది శ్రీమతి.

"ఎందుకైనా మంచిదని నిత్య తల్లిదండ్రులతో మాట్లాడితే బాగుంటుందని మాట్లాడిన. రెండు సంవత్సరాల నుండి పిల్లలు కలిసి చదువుకుంటున్నారు. ఎవరికి కష్టమొచ్చినా అందరిగురించి ఆలోచిస్తాను .అయినా మీకు తెలుసుకదా! అందరికి సహాయం చేస్తూనే వుంటాం కదా " అన్నది శ్రీమతి.

"నిత్య వాళ్ళ అమ్మానాన్నలతో మాట్లాడిన" ."మా ఇంటికాడ నుండి బస్టాండ్ దూరం . మాది పల్లెటూరు కదా! మా ఊర్లోనుండి ఆటోలువెళ్తుంటాయి. అతడు మా ఊర్లోని ఆటో అబ్బాయి 'రహీం' . నిత్య వచ్చేటప్పుడు ,వెళ్ళేటప్పుడు అతనికి ఫోన్ చేస్తే వచ్చి తీసుకెళ్తుంటాడు .మంచి నమ్మకమైన అబ్బాయన్నారు. అతను రెండు రోజులు వరంగల్ లో వుంటే మన కావ్యతో కలిసి అన్నీ చూపించిందట.అతను తనకు సహాయం చేసినపుడు బాగుండదని అతనితో కలిసి తిరిగిందట అంతే ఇంకేం లేదమ్మ అన్నారన్నది "శ్రీమతి.

"నిత్య తల్లిదండ్రులకు తెలిసిన వాడే కదాని ఉర్కున్నది శ్రీమతి. అంతేకాదు , ఎవరితో బయటకు వెళ్ళవద్దని ఏదైనా కావాల్సి వస్తే నాన్న వచ్చి కొనిస్తాడని, గట్టిగా కూతుళ్ళకు చెప్పింది శ్రీమతి. పిల్లలిద్దరూ సరే" అన్నారు.

"కానీ ఈమధ్యలో నిత్య ఇంటికి వెళ్ళినప్పుడు నిత్యవాళ్ళింటికి రహీం వస్తున్నాడని, ఇద్దరు కలిసి మాట్లాడుకుంటున్నారని తెలిసిన వాళ్ళద్వారా విన్నది. పల్లెటూరు విషయాలన్నీ త్వరగా బయటపడతాయి. అతనితో నిత్య మాట్లాడుతుంటే పెళ్లి చేసుకుందాం "అన్నాడు రహీం.

"దానితో నిత్యకు కోపం వచ్చి ఏం మాట్లాడుతున్నావు? పెళ్ళి చేసుకోవడమేమిటి? నీ ఆటోలో ఎక్కినంత మాత్రాన నిన్ను పెళ్లి చేసుకోవాలా ? అన్నది నిత్య.

"ఇంకే ఆటోలు లేవా ఊరికి పోయినప్పుడు ,వచ్చినప్పుడు నన్నే ఎందుకు పిలుస్తావన్నాడు" రహీం.

"తెలిసినవాడివని మా అమ్మనాన్న కు కొంచెం భరోసా .మా అమ్మా, నాన్న
పనులకు వెళ్తారు. ఎప్పుడు ఇంట్లో వుండరు కనుక నువ్వొచ్చి తీసుకెళ్తే వాళ్ళకు భయం ఉండదనుకున్నారు" అన్నది నవ్య.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావనుకని వేరే పనులున్నా మానుకొని నువ్వు ఫోన్ చేసినప్పుడల్లా వచ్చి నిన్ను తీసుకెళ్ళేవాణ్ణి అన్నాడు రహీం.

నిత్య తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పగానే ఏదో తెలిసినవాడివి ,మంచి ,చెడు తెలిసినవాడివి ఒక్కూరువాడివని నిన్ను తీసుకుపొమ్మన్నాము. రోజులు మంచిగా లేవని నీతో పంపితే నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్ధమవుతోందా !

నువ్వు ఇట్లా మాట్లాడితే బాగుండదు లేని పోని ఆశలు పెట్టుకోకు "అని మందలించారు నవ్య తల్లిదండ్రులు.

"నేను వరంగల్ వచ్చినప్పుడు కాలేజీ మాని నాతో ఎందుకు తిరిగావు అనడంతో, మేము ఇక్కడ ఉంటున్నాం నువ్వు ఫోన్ చేశావని వచ్చాను. నాకు ఎంతో సహాయం చేస్తున్నావు.నువ్వు వచ్చినప్పుడు సాయంకాలం నీకు కంపెనీ ఇస్తే బాగుంటుంది అనుకున్నాను. కానీ ఇన్ని ఆలోచనలు నీలో ఉన్నాయని నాకు తెలియదు.పోనీ నీకు ఎప్పుడైనా , ఎక్కడైనా చెప్పానా? నేనేం చెప్పనిది నువ్వన్ని ఊహించుకుంటున్నావన్నది" నిత్య.

"అయినా నేను గ్రూప్స్ కు ప్రిపేర్ అవుతున్నాను.ప్రేమ ,పెళ్ళి గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదనగానే , రహీమ్ కోపంగా వచ్చి గొంతు పట్టుకుని నొక్కుతుంటే అరవడంకూడా రాక అతన్ని నెట్టేసి రోడ్డు మీదకు పరిగెత్తివచ్చింది . ఊర్లో మధ్యాహ్నం ఎవరూవుండరు. కానీ ఇలా చేసిండని తల్లిదండ్రులకు ,స్నేహితులకు చెప్పలేదట. చెబితే బాగుండు. కోపంతో ఏదో చేశాడు.ఒకవేళ చెబితే పోలీసులకు చెబుతారని ఊర్కొని ఇప్పుడు చావుకు తెచ్చుకున్నదన్నది" శ్రీమతి.

ఈ సారి రహీంను పిలవకుండా వేరే ఆటో తీసుకొని బస్టాండ్ కువచ్చి వరంగల్ వచ్చింది నిత్య.

"మళ్లీ పదిరోజుల తర్వాత నిత్య ఇంట్లోకి వెళ్లగానే వచ్చిన రహీం ను చూసి భయపడకుండ ధైర్యంగా ,బయటకు వెళ్ళు నీకు నాకు ఏ సంబంధం లేదు ఏదో ఊరు వాడివని అనుకుంటే నీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నావనగానే కోపంతో కూరగాయలు కోసే చాకుతో ఆమె మెడ కోసి బయటకు పరిగెత్తి నవ్వుతుంటే ,అతనితో వచ్చిన స్నేహితులు ఏమైందిరా ? చేతులకు ఆ రక్తమేమిటి

అంటుంటే ,దాన్ని చంపేసాను అన్నాడట, అప్పుడే బయటకు వచ్చిన ఒకతను ,ఎవరుమీరు ,ఏమైంది చేతులకు ఆ రక్తమేమిటి అనగానే 'రహీం ' పరుగెత్తుతుంటే , అతనితో వచ్చిన స్నేహితుల్లో ఒకడు ఆఇంట్లో ఒక అమ్మాయిని చంపానంటున్నాడు. అని చెప్పాడట. నువ్వు చూసావా అంటే మేము చూడలేదనగానే, అతడు ఆసుపత్రికి అంబులెన్స్కు ఫోన్ చేసి, పోలీసులకు ఫోన్ చేసాడట. పట్టపగలు చుట్టుపక్కల వాళ్ళను పిలిచి లోపలికెళ్ళారట. కారుతున్న రక్తంతో నిత్య స్రృహకోల్పోయిందట. అందరూ కలిసి ఒక టవల్ తడిపి నిత్య గొంతుపై వేసి , ఆమె చనిపోయిందనే అనుకున్నారు. సరైన టైంలో అంబులెన్స్ వచ్చి తీసుకెళ్లడంతో నిత్య బతికిందట .ఇప్పుడు హాస్పిటల్లో ఉంది అన్నది నవ్య.

"రహీంను, అతని స్నేహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎందుకు చేశావు ? ఈ పనంటే నేను ప్రేమించాను. పెళ్లి చేసుకోవాలనుకున్నా ఆమె నాకు ఇష్టం లేదంటే చంపేసా" అన్నాడని, నవ్య చెప్పిందన్నది శ్రీమతి.

"మొన్నటికి మొన్న మా చుట్టాలమ్మాయిని ఆమె భర్త పెళ్లయినా కూడా సెల్లుతో ఎవరితో మాట్లాడతున్నావని కొట్టాడట. ఆ పిల్ల నేను మాట్లాడింది ఎవరో కాదు మా పెద్దమ్మ కొడుకు అని చెప్పినా వినలేదట.సెల్లు పగలకొట్టి ఆ పిల్లను బాధ పెడుతున్నాడు ఆబాధ ఎవరికి చెప్పుకుంటది" అన్నది శాంత.

"అప్పుడే వచ్చిన సుధ చూడుశాంతక్క ఆడపిల్లలు కూడా ఏం తక్కువతినలే , ఆడపిల్లలతో చాటింగ్ చేసినావని మా తమ్మునితో మా మరదలు గొడవ పెట్టుకున్నది. కాదు మా కాలేజీలో ఆత్మీయ సమ్మేళనం ఉన్నది అందరం కలుసుకుందామని మా క్లాసుమేట్లందరం ఒకరితో ఒకరు మాట్లాడుకుంటున్నామని చెప్పాడట.అయినా నమ్మకుంటే , అయితే వచ్చే నెల ఇరువదిఐదవ తారీకు నాతో వస్తావు కదా! అప్పుడు వాళ్ళందర్నీ చూపిస్తానని చెప్పాడట ఇప్పటివరకు ఊ అన్నదటఅన్నది " సుధ.

"ఏమో రోజులసలే మంచిగలేవు. నవ్వుతూ మాట్లాడినా ,ఓ నాలుగు సార్లు ఫోన్ చేసినా గాని ప్రేమ అనుకుంటే ఎట్లా అన్నది సుధ. క్షమించమని వెంటపడేవాడు ఒకడు, వెంటపడి చంపే వాడు ఒకడు . ప్రేమించిన పెళ్లిచేసుకోమ్మనేవాడు ఒకడు. వేరే వాళ్ళతో మాట్లాడితే అనుమానపడేవాడు ఒకడు. పోని అనుమానపడేటోడు ఆడోల్లను ఇంట్లో వుంచుతడా అంటే అదీలేదు. ఆమె సంపాదించే డబ్బులుకావాలి. ఆమె ఎటిఎం కావాలి. ఆమెకు డబ్బులవసరమైతే నీకెందుకు అన్నీ తెచ్చిన తరువాత అనేవాళ్ళెందరో, మాట్లాడకుంటే ఎందుకు మాట్లాడుతలేవంటారు. నాలుగు సార్లు నవ్వుతూ మాట్లాడిన వాడు ఏదో ఊహించుకుంటాడు.ఆసిడ్ చల్లేవాడొకడు. పరువు మర్యాదలని ప్రాణాలు తీసే వాళ్ళతో, మనం ఎటువైపు పోతున్నామో అర్థం కావడం లేదన్నది" శ్రీమతి.

పోనీ పెళ్ళయితే సుఖంగా ఉంటున్నారా? అంటే అదీ లేదు. ఎంత చదువుకున్నా మగబుద్దులు పోతలేవు. ఆడ బతుకులకన్నీ సమస్యలే. ముడులు విప్పుకొంటు, విప్పుకొంటు వెళ్ళినాఎక్కడో ఒకదగ్గర భల్లున పగిలిపోతున్నారు. దిక్కుతోచని స్థితిలో ఎంత పెద్ద హోదాలో ఉన్న అన్నీమరచి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆ టైంలో అసలేం గుర్తుకు రాదునుకుంటా. ఎందుకైనా మంచిదని ఆచితూచి అడుగు వేసినా వచ్చే ప్రమాదాలు తప్పడం లేదు ఎటుపడ్డా ఆడపిల్లల జీవితాలు అరిటాకులే అవుతున్నాయన్నది" శ్రీమతి. అవునక్కా ! నువ్వు చెప్పేది నిజమే, పెద్ద పెద్ద ఉద్యోగాల్లో వున్నవాళ్ళు, సంపాదించుకొంటు కుటుంబాన్ని పోషిస్తూ, మాట పట్టింపులతో, క్షణికావేశంతో బతుకును బలిచేసు కుంటున్నారన్నది శాంత.

అవును ఎవరైనా కొంచెం ఆలోచించాలి. బాధలులేనోళ్ళెవరు. సరే అక్కా !మనం వెళ్ళి నిత్యను చూసొద్దామా ?" అన్నది సుధ.

"తప్పకుండా పిల్లలు కూడా బాదపడుతున్నారు. వాళ్ళను కూడా ఇంటికి రమ్మన్న. అందరం కలిసే వెలుదామన్నది శ్రీమతి.

కవిత

# నిజం



నస్రీన్ ఖాన్
హైదరాబాద్ 9618683519

పట్టపగలే..!
గుడ్లగూబ ఒకటి అరుస్తుంది
ఆ చెట్టు నుంచి ఈ చెట్టుకు
ఈ చెట్టు నుంచి ఆ చెట్టుకు
గబ్బిలాలు ఎగురుతుంటాయి
ఏదో అదృశ్య హస్తం చరిచినట్లు
రివ్వున పక్షులు గాల్లోకి ఎగిరి పోతాయి
టీవీలు కంఠశోషతో మూర్ఛిల్లుతాయి
దిక్కులన్నీ రోదనలతో పిక్కటిల్లుతాయి
కాలం స్తంభించిపోతుంది
మెదడు మరో దృశ్యానికి తావీయదు
మరో సంఘటన
కొత్త పేజీ సృష్టించుకుంటుంది
ఆ భయంకర దృశ్యం
మరుగున పడుతుంది
గతి తప్పని చక్రం తిరుగుతూనే
ఉంటుంది
ఆ తర్వాత..?
షరా మామూలు నిట్టూర్పులు
అంతా పద్ధతిగా... సవ్యంగా...
సమాజం వాకిటిలో
మార్పు బీజం నాటనంతవరకూ
ఇంతే...
కచ్చితంగా ఇంతే...

కథ

# విశ్రాంత జీవనం


డా. లక్ష్మీ రాఘవ

తిరుపతి 9440124700




రజని కి చాలా ఏడుపు వస్తూంది ఆ వార్త తెలిసినప్పటినుండీ.

అక్క గురించి ఇలా వినాల్సివస్తుందనుకోలేదు..

మొదటినుండీ అక్క జీవితంతనకు ఆదర్శం.

ఒక మంచి టీచర్ గా,ఆ పైన హెడ్ మిస్ట్రెస్ గా ఎంతో సమర్ధవంతంగా చేసిన ఒక మంచి మనిషికి చివరకు ఇలాగా?

అప్పుడప్పుడూ ఫోనులో మాట్లాడుతూనే వుంది కదా. తనతో ఎందుకు ఒక్కమాట చెప్పలేదు? అక్క గురించి ఇలా.. అని ఎవరో చెప్పడం ఏమిటి ?అక్క కొడుకు సురేష్ అయినా తనతో చెప్పలేదే అన్న కోపం తో వాడికి ఫోను చేసి మాట్లాడాలనిపించకమెసేజ్ పెట్టింది 'అక్క అడ్రసు పెట్టు' అని.

వెంటనే పంపాడు.

ఇప్పుడైనా వాడికి  నాకు చెప్పాలని పించలేదా ...అన్నదే మరీ బాధ.

ఏమైనా నేరుగా మాట్లాడాలసిందే అనుకుని హైదరాబాదు బస్సు ఎక్కింది.

అడ్రెస్ సులభమే చాలా తొందరగానే చేరుకుంది

అక్కడి వాతావరణం చూస్తే అది ఆశ్రమం లాగా లేనే లేదు. ఏదో రిసార్ట్ కు వచ్చినట్టు వుంది.

లోపలకు వెళ్ళడానికి  ఫ్రంట్ ఆఫీసులో పేరు అడ్రెస్, మొబైల్ నెంబరూ రాయాలి. ఎవరిని చూడటానికి వచ్చామో వారికి ఫోను చేసి అడిగి లోపలకు పంపుతారు ఒక ఎస్కార్టు తో.

అక్క జానకి  వున్న రూముకు చేరగానే అక్కను చుట్టుకు పోయింది రజని కన్నీటితో.

"ఎందుకక్కా నాకు చెప్పలేదు? నీవు ఇక్కడ వున్నావని తెలియగానే సురేష్ ను బాగా తిట్టాలని పించింది. నీవు వాడికోసం ఎంత కష్టపడ్డావు? వాడి సంసారం లో నీవు అడ్డుగా వున్నవని ఇట్లా ఆశ్రమం లో చేరిపిస్తాడా?

వెనక్కి వెళ్ళాక వాడి దగ్గరకు వెళ్ళి కడిగేస్తాను...అయినా నీకు నేను లేననుకున్నావా?" అంది ముక్కు చీదుకుంటూ.

"ముందు మంచినీళ్ళతాగు..." అని గ్లాసు అందించి నవ్వింది జానకి.

"ఇదో ఇలా మెత్తగా నవ్వుతూ వుంటావనే అలుసు" నీళ్ళ గ్లాసు ఎత్తి గట,గటా తాగింది.

"అయితే నీకు చెప్పలేదనీ కోపంగా వుందన్నమాట "

"అవును మరి. నిన్ను ఆశ్రమం లో చేర్చారని నాకు చెప్పాలి కదా."

"పిచ్చి మొద్దూ. నేను ఇక్కడకు రావడానికి కారణం సురేష్ కాదే. నేనే."

"నీవా? అయినవారిని అందరినీ వదిలేసి ఇక్కడ ఎందుకు ?"

"ఒక ప్రశాంత జీవితం కోసం. నీలాగే సురేష్ చాలా బాధ పడ్డాడు. పోనీయ కూడదని శతవిధాల ప్రయత్నం చేశాడు. నిజమే... జీవితం అంటే పెళ్ళీ, పిల్లలూ, చదువులూ, వారి ఉద్యోగాలూ ఆపై పెళ్ళిళ్ళూ చక్రంలా తిరుగుతూనే వుంటాయి. నేను ఆ చక్రం నుండీ బయటకు రావాలనుకున్నాను. చివరి రోజుల్లో నాకు కావాల్సిన జీవితం కోసం ఇక్కడ చేరాను. పెన్షన్ వుంది.ఒకరి మీద ఆధార పడిలేను. ఇక్కడ టైం కి తిండి, యోగా, సాయంకాలం చిన్న వాక్, మళ్ళీ ఒక ప్రవచనం, ధ్యానం తరువాత డిన్నర్. అవసరమైతే డాక్టర్... చాల సిస్టమాటిక్ గా జరిగి పోతుంది. ముఖ్యం గా దేనిగురించీ ఆలోచించాల్సిన పనిలేదు. నాకు ఇలా ప్రశాంతత కావాలనిపించింది. ఇన్నాళ్ళూ చుట్టూ వున్న ప్రపంచాన్ని చూసే తీరిక కూడా లేకుండా  నేనూ నాకుటుంబం, పిల్లలు, ఆదాయం వీటి కోసమే కష్టపడ్డాను. ఇంకా ఏదో కావాలనిపించింది. ఏమి చేయడానికీ ముందు ఆ చక్రం నుండీ ముందు బయటకు రావాలి కదా. అదే ఆలోచించాను. ఈ హోమ్ గురించి విన్నాక ఇక్కడ నాకు బాగుంటుంది అనిపించింది.

ఇక్కడ వున్నవారందరూ  పిల్లలు దగ్గర వుంచుకోకూడదని పంపేసినవారు కాదు. ఎక్కువమంది తమకు తాముగా వచ్చినవారు. వయసు రీత్యా అనుభవాలలో రాటుదేలినవారు. సైకాలజీ చదివినదాన్నికదా అందుకే ఒక ఆలోచన చేశా. వారానికి ఒక్కసారి మాకు ఎదురైన సంఘటనలూ, సమస్యలూ వాటి సమాధానాలూ చెప్పుకుంటే మనసుకు సాంత్వన లభిస్తుంది కదా అని. అది మొదలు పెట్టాక చాలా సక్సస్ అయ్యింది. ఏమి చెప్పినా అందులో  పాత్రలు వాటి పేర్లు వుండవు కనుక ప్రతి ఒక్కరూ తామయితే  ఎలా రియాక్ట్

అయ్యే వారో ఫ్రీగా చెబుతారు. ఎంతో గొప్ప వ్యక్తిత్వాలు కనబడుతాయి. ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది. పిల్లల పెంపకం నుండీ ఎదగడం వరకూ గుర్తుచేసుకునే వారే కాక , బాల్యంగుర్తుకు తెచ్చుకుని మురిసిపోయే విశేషాలే కాక జోకులేసుకుంటూ వాతావరణాన్ని తేలిక చేసుకుంటాము. ఇవే కాకుండా ఇక్కడ ప్రవచనాలలో మాకు నచ్చిన అంశాలను, పురాణాలలో కొన్ని ప్రత్యేక వ్యక్తిత్వాలనూ, ధ్యాన పద్ధతులనూ ఇలా అనేక విషయాలను చర్చించుకుంటాము.

ఒకసారి ఇవి వూహించుకో. ఎంత బాగుంటుందో...ఇన్ని రోజులూ వున్న చిన్ని జీవితం నాదిగా బతికాను. ఇప్పుడు

నాలాటి నలుగురితో ఎన్నో పంచుకుంటూ వుంటే ఎంత సంతోషం ,,, ఇది నాకు కావాలనుకుని ఇక్కడకు వచ్చాను. నిజంగా హాయిగా వున్నాను రజినీ. పాపంఅనవసరంగా సురేష్ ని అనుమానించావు..."అంటూ వున్న అక్క ముఖాన్ని ఆనందం గా చూడసాగింది రజిని!

ఎంతైనా ఆమె దృష్టి లో అక్క ఎప్పుడూ స్పెషలే మరి ...

ఎప్పుడూ తల్లిదండ్రుల్ని ఆశ్రమంలో చేర్చేసి చేతులు దులుపుకున్న కొడుకులగురించే ఎక్కువ విన్న రజిని, విశ్రాంత జీవనం ఇలా వుండాలి అని కోరుకోవచ్చని తెలిసి బోలెడు ఆశ్చర్యపోయింది!

**కవిత**

# అల్జీమర్స్




**హిమజ**
**హైదరాబాద్,**


నాకేదో జ్ఞప్తికి తేవాలని చూడకు
మరేదో అర్థం చేయించాలని యత్నించకు

నన్నిలా విశ్రాంతిగా ఉండనివ్వు
నువ్వు నాతో పాటు అలా ఉండు
నీ చేయి నా చేతిని పట్టుకొని
ఉంటే చాలు

మీ అంచనాలకు అతీతంగా
ఒకానొక అయోమయ స్థితి లో నేను
బాధగా రోగగ్రస్తంగా
నాకు నేనే లేనట్లుగా
నాకు తెలిసిందొక్కటే –
నువు నాతో వున్నావని
కోరేదొక్కటే –నాతోనే ఉండాలని

నిందించకు నన్ను ,శపించకు
ఏడవనూ వద్దు నాకై
నిస్సహాయను – నాకిలా ఎందుకైందో
తెలియని దాన్ని
ఎంత ప్రయత్నించినా
మీరనుకున్నట్టు ఉండలేని దాన్ని
నాపై కొంత ప్రేమని కరుణని చూపించు

కణాల విధ్వంసంతో
నా మెదడు ఇచ్చే ఆదేశాలను
నా దేహం ,నా కాళ్ళు
ఖాతరు చేయకున్నా
హృదయంతో లంకె
విడిపోలేదీ దేహానికి
నీపై అనురాగంతో
ముడిపడేఉంది అదింకా

నీకివరకు నచ్చిన సుగుణాలు అందాలు
ఇప్పుడేవీ నాలో లేకున్నా
నా పక్కన నిలబడి
నిబ్బరాన్నివ్వడానికి వెనుకాడకు
నా చివరాఖరి శ్వాస దాకా
తోడై నాతో ఉండు

~~~~~~

'Do not ask me to remember ' –Owen Darnell
కవితకి స్వేచ్ఛానువాదం
~~~~~~

కథ

# అతివ మనసు



లంక సీత

ఢిల్లీ 9868145541

పిల్లలిద్దరూ సస్కూల్ కి వెళ్లారు. ఆయన టూర్ వెళ్లి 5 రోజులయ్యింది . సుజాతకి మనసంతా ఏదో గందరగోళంగా వుంది. ఫలానా కారణమని తెలియదు. కాలక్షేపానికి ఏదయినా చదువుదామంటే కొత్త పత్రికలేం లేవు. పిల్లలు రెండు గంటలకి గాని రారు. ఏం తోచక సుజాత అలా మంచం మీద వాలి పై కప్పు కేసి చూస్తూ ఆలోచిస్తోంది. ఆయన టూర్ వెళ్లి ఎందుకు ఫోన్ చేయలేదు, వుత్తరం గూడా రాయలేదు. ఎప్పుడు టూర్ వెళ్లినా దారిలోంచే పది సార్లు ఫోన్ చేయడం, చేరిన వెంటనే రెండు పేజీల వుత్తరం రాయడం.....అందులో విశేషాలేం వుండవు. ముద్దులతో సుజికి అంటూ మొదలుపెట్టి..ఏదో నాలుగు లైన్లు రాసి మళ్ళీ నువ్వు లేకుండా ఒక్కడిని ఉండలేకపోతున్నాను అని వ్రాయడం తప్ప...ఇంటినుంచి వెళ్లిన మర్రోజే విశేషాలు యేముటాయి నా మొహం....

అటువంటిది ఇప్పుడేమైంది. ఆయనలో ఏదో మార్పు కనపడుతోంది. ఆ మధ్య టూర్ లో పని ఎక్కువగా ఉంటోంది నెక్స్ట్ టైం నుంచి మా అసిస్టెంట్ రమ్య ని గూడా తీసుకు వెళ్ళాలి అన్నారు. ఈసారి టూర్ కి యిద్దరు కలిసే వెళ్లారు. ఏమయిందో మరి ? టెలిఫోన్ లేదు ఉత్తరము లేదు. అప్పుడే వెళ్లి ఐదు రోజులయింది. మళ్ళీ తనలో తానె తప్పుగా ఆలోచిస్తున్నానేమో అనుకుంది.

ఛ! ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను. ఆయనకు నేనంటే ప్రాణం. ఎప్పుడు పరాయి స్త్రీల గురించి మాట్లాడటం గాని కామెంట్స్ చేయడం గాని చేయని మనిషి ని గురించి తప్పుగా ఆలోచిస్తున్నాను అనుకుంది. పిల్లలు వచ్చేదాకా పోనీ టి. వి. చూస్తే కాస్త మనసు మారుతుందని హాల్ళ్ళోకి వెళ్లి టి.వి. పెట్టింది.

టి.వి. లో సీరియల్ వస్తోంది...... స్టోరీ ఈ రకముగా వుంది..

రమేష్ ఆడిట్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్నాడు. అతను ఆడిట్ పని మీద కర్నూల్ టూర్ వెడతాడు . అక్కడ ఆఫీస్ లో ఎక్కౌంట్స్ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ నళిని యితని పక్కనే కూర్చుని అకౌంట్స్ గురించి వివరిస్తోంది. పొద్దున్న పది గంటల నుంచి ఆడిట్ వర్క్ నడుస్తోంది. అప్పటికే సాయంత్రము ఆరు గంటలయింది. నళిని "సర్ టైం ఆరయింది రేపు తొందరగా వస్తాను వర్క్ కంప్లీట్ చేయడానికి" అంది. ఓ. కె. అని మళ్ళీ వర్క్ లో పడ్డాడు రమేష్. అది చూసి నళిని "సార్ ఉదయమునుంచి వర్క్ చేస్తున్నారు మిగతాది రేపు చూసుకోవచ్చు" అంది.

బాగ్ భుజాన్ని వేసుకుని కొంచెం తటపాయిస్తూ " సర్ మీకు అభ్యంతరం లేకపోతె ఈ రోజు డిన్నర్ మా ఇంట్లో చేయండి" అంది. అంతకంటేనా! హోటల్ భోజనం కంటే ఇంటి భోజనమే మంచిది అనే ఉద్దేశ్యంతో సరే అన్నాడు. నళిని తో వాళ్ళ ఇంటికి వెళ్లాడు. నళిని ఒక్కర్తే ఉంటుందని రమేష్ కి తెలియదు. రమేష్ కాస్త ఇబ్బందిగా ఫీల్ అవుతుంటే నళిని చెప్పింది నేను మా తమ్ముడు ఉంటున్నాము. మా తమ్ముడు ఎలక్ట్రిసిటీ బోర్డు లో ఉద్యోగము. ఎనిమిది గంటకి వస్తాడు అని చెప్పింది. నళిని వంట పూర్తీ అయి తమ్ముడు కోసం వెయిట్ చేస్తున్నారు. అప్పటికే రాత్రి 9 .30 అయింది. అప్పుడు వచ్చింది నళిని తమ్ముడు ఫోన్ "అక్కా ఈ రోజు నైట్ డ్యూటీ అతను రాలేదు అందుకనే నేను నైట్ డ్యూటీ కూడా చేయాలి నువ్వు భోజనం చేసి పడుకో " అని ఫోను చేసాడు. అప్పటికే ఆలస్యమైందని నొచ్చుకుంటూ నళిని తామిద్దరికి భోజనాలు వడ్డించింది. రమేష్, నళిని భోజనాలు చేసేప్పటికీ పదిన్నర అయింది. "ఇంత రాత్రి వేళ హోటల్ కేం వెడతారు మా తమ్ముడు రూమ్ ఖాళీయే ఇక్కడే పడుకోండి" అని మొహమాట పెట్టింది నళిని. పొద్దుటినుంచి ఆడిట్ వర్క్ తో కాస్త తల నొప్పి, అలసట అనిపించి హోటల్ కి వెళ్లే ఓపిక లేక సరే అన్నాడు.

సుజాత ఏ మూడ్ నుంచి బయట పడదామని టి. వి. పెట్టిందో అదే ఆలోచన టి. వి. వాళ్ళ సీరియల్ లో వస్తోంది. సుజాత భయపడిపోయింది టక్కున టి.వి. ఆఫ్ చేసేసింది. ఇదేమిటి ఇలాంటిదే గనుక నిజమైతే నా బ్రతుకేం కాను అని వొణికిపోయింది.

ఇంతలో పిల్లలు స్కూల్ నుంచి వచ్చారు. అప్పటికి కాస్త తేరుకుని పిల్లలకి అన్నాలు పెట్టింది. "అమ్మా నువ్వు తినవా?" అని అడిగారు పిల్లలు. "నాకు కొంచెం తల నొప్పిగా వుంది తరువాత తింటాను " అంది. వెంటనే కొడుకు లేచి అమృతాంజనం తెచ్చి తల్లి నుదిటి మీద రుద్దాడు. వీడికి అన్ని వాళ్ళ నాన్న పోలికలే. ఆయనా అంతే నాకేమయినా వస్తే ఒకటే ఖంగారు పడిపోతారు ఆయనకి నేనంటే ప్రాణం అనుకుంది. అటువంటి భర్తనా నేను అనుమానిస్తున్నాను పాపిష్టిదాన్ని అని మనసులో అనుకుంది.

అప్పుడు మోగింది హాల్లో టెలిఫోను. "సుజీ నేను........గుంటూరు నుంచి మాట్లాడుతున్నాను. నేను ఇంటినుంచి బయలుదేరి ఎయిర్ పోర్ట్ కి వెళ్లి చెక్ ఇన్ అయి బోర్డింగ్ కోసం వెయిట్ చేస్తుంటే అమ్మకి సీరియస్ గా ఉందని వెంటనే బయలుదేరి రమ్మని

నాకు ఫోను వచ్చింది. ఆ ఖంగారులో ఏమీ తోచలేదు. వెంటనే గుంటూరు వెళ్ళిపోయాను. గత ఐదు రోజులుగా అమ్మని ఐ.సి.యూ. లో ఉంచారు. రాత్రి పగలు ఏం వార్త చెబుతారో అని ఐ.సి.యూ. ముందరే కూర్చున్నాము. ప్రస్తుతము అవుట్ అఫ్ డేంజర్ అని చెప్పారు.

అందుకనే నేను నీకు ఫోను చేయడం గాని లెటర్ వ్రాయడం గాని చేయ లెకపోయాను" అని భర్త చెప్పడంతో సుజాత నిస్త్రాణగా ఫోను పట్టుకుని అలాగే నిలబడిపోయింది. ఇటు నుంచి ఏం సమాధానము లేకపోయేప్పటికీ సుజాతకి కోపం వచ్చింద ని అనుకుని------.

సారీ సుజీ....అదిగో నీకు కోపం వచ్చింది కదూ ...నేను వచ్చాక నీ కోపమంతా నా మీద చూపించు ఫరవాలేదు. నేను రావడానికి ఇంకా వారం పట్టచ్చు. అమ్మ డిశ్చార్జ్ అయి ఇంటికి తీసుకు వెళ్ళేదాకా ఉండి వస్తాను. నా కోసం బెంగ పెట్టుకుని అన్నం తినడం మానేయకు. పిల్లలు జాగ్రత్త. అని ఫోను పెట్టేసాడు. సుజాత అలాగే సోఫా లో కూలబడిపోయింది. నేనెంత పాపిష్టి దాన్ని దేముడు లాంటి భర్త ని అనుమానించాను అని తెగ పశ్చాత్తాపపడిపోయింది. ఆయన వచ్చాక కాళ్ళ మీద పది క్షమించమని వేసుకుంటాను అనుకుంది. ఎప్పుడెప్పుడు భర్త వస్తాడా అని ఎదురు చూస్తూ వుంది.

వారం రోజులు యిట్టె గడిచిపోయాయి. రాజీవ్ ఇంటికి వచ్చాడు. సుజీ ని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. పీక్కుపోయిన మొహం, కళ్ళు గుంతలు కట్టి ఎన్నో రౌజుల నుంచి లంఖణాలు చేసిన దానిలాగా కనబడుతోంది. చూస్తూనే ఏమైంది సుజీ అంటూ ఖంగారుగా అడిగాడు. సుజాత ఒక్క సారిగా ఏడుస్తూ అతన్ని వాటేసుకుని వల వాలా ఏడ్చేసింది. రాజీవ్ ఖంగారు పడిపోయాడు. పిల్లలకేమయినా అయిందేమో, జరగ కుడనిదేమయినా జరిగిందేమో అని ఖంగారుపడ్డాడు. కొంత సేపు ఓదార్చక సుజాత ఏడుపు స్వరం తో ముందు "నన్ను క్షమించాననండీ " అంటూ అతని కాళ్ళ మీద పడింది. ఆమె భుజాలు పట్టుకుని లేపి సంగతేమిటని అడిగాడు. అప్పుడు తను అతని గురించి తప్పుగా ఆలోచన చేసిన సంగతి చెప్పి క్షమించాననని అనేదాకా ఏడుస్తూనే వుంది.

ఓసి పిచ్చి సుజీ "నువ్వే కాదు ఏ ఆడదయినా అలానే ఊహిస్తుంది . ఇందులో నీ తప్పేమి లేదు అది స్త్రీ సహజ ఆలోచన" అన్నాడు. సరే ఇప్పుడు చెప్పు ఒక వేళ అలానే జరిగిందనుకో ఏం శిక్ష విధించాలనుకున్నావు " ? అన్నాడో లేదో గట్టిగా తన చేతితో అతని నోరు మూసింది. "నా భర్త శ్రీరామ చంద్రుడు అల్లా ఎప్పటికీ జరగదు." అంది.

ఆహా ! "అంత నమ్మకం వున్నప్పుడు అలాంటి ఆలోచనలు ఎందుకు వచ్చాయి ట? "అదంతా పీడ కలలాగా మర్చిపో " అంతే గాని ఇలా మొహం పీక్కు పోయి, నీరసించిపోయి లేనిపోని సమస్యలు తెచ్చుకోకు.

"నా కంటికి నువ్వు తప్ప ఎవరు కనపడరు. లే బాగా ఆకలి అవుతోంది అన్నము తిందాము పద. ఈ వారం, పదిరోజులనుంచీ నీ చేతి భోజనము చేయక ఎలా చిక్కిపోయానో చూడు" అంటూ వాతావరణము తేలిక పరుస్తూ సరసమాడాడు.

సుజాత తేలిక పడిన మనసుతో దేముడి ముందు మోకరిల్లి క్షమాపణ కోరుకుంది. వెంటనే భర్తకు ఆప్యాయంగా భోజనము వడ్డించింది.

కవిత

# ఆరాధన




వాసంతి శ్రీ
చెన్నై 9444402770


నింగిలోని చందమామ పిలిచినట్లు ఉందేసఖి
మధురమైన గానంలో మునిగినట్లు ఉందేసఖి

అందలేని అందాలను అందుకున్న తరుణంలో
అవనిలోని కష్టాలను మరచినట్లు ఉందేసఖి

వెన్నెల్లో ముచ్చట్లే తాపాలను రేపుతుంటె
నిశిరాతిరి నిదురరాక తలచినట్లు ఉందేసఖి

నీలికళ్ళ విరిచూపులు మెరుపులుగా మెరుస్తుంటె
తారలన్ని భువికివచ్చి నిలిచినట్లు ఉందేసఖి

చిగురాకుల పచ్చదనం కనువిందులు చేస్తుంటే
వాసంతపు కుహుకుహూలు పిలిచినట్లు ఉందేసఖి

కథ

# చీకటిలో చిరుదీపం



యేముల/ సిరిపురం వాణిశ్రీ
కరీంనగర్ 9392023988

ఒక వృద్ధాశ్రమంలో జరిగే కార్యక్రమానికి హాజరయింది భార్గవి. సూటు బూటులో హుందాగా ఉన్న యువకుడు వేదిక పైన ఉపన్యాసమిస్తున్నాడు. భార్గవి ఒంటరి మహిళ. భర్త చనిపోయి చాలా కాలం అయింది. సంతానం లేదు. అప్పుడప్పుడు వృద్ధాశ్రమంలో జరిగే

సభలకు హాజరవుతూ ఉంటుంది.

"వేదికపై మాట్లాడే వారెవరండి ?" తన పక్కసీటులో కూర్చున్న స్త్రీని ప్రశ్నించింది భార్గవి.

"మన జిల్లా కొత్త కలెక్టర్ వరుణ్ తేజ. ముఖ్య అతిథిగా వచ్చారు" అని సమాధానం ఇచ్చింది ఆ మహిళ. 'అతను ఎందుకు పదేపదే తనవంక చూస్తున్నాడు' మనసులో అనుకుంది భార్గవి.

"నేనిప్పుడు కలెక్టర్ కావడానికి కారణమైన వారిని, మీకు పరిచయం చేస్తాను" అన్నాడు వరుణ్ తేజ.

సభ మధ్యలో కూర్చున్న భార్గవి మేడమ్ గారు వేదిక మీదికి రావాల్సిందిగా కోరుతున్నాను తనవంక చూస్తూ పిలుస్తున్నారు కలెక్టర్ గారు.

"మేడం మిమ్మల్నే వెళ్ళండీ.." అంటూ పక్కన కూర్చున్న మహిళ చెబుతోంది. ఏమి అర్థంకాక వేదిక మీదికి వెళ్ళింది భార్గవి.

"సభికులారా! ఈరోజు కలెక్టర్ గా మీ ముందున్నానంటే అందుకు కారణం

భార్గవి మేడమ్. మాది పేద కుటుంబం. నాన్న చిన్నప్పుడే చనిపోయారు. మా అమ్మ మేడమ్ ఇంట్లో అంట్లుతోమి, వంట చేసేది. నేను పదవ తరగతి

చదువుతున్నప్పుడు, అమ్మ అనారోగ్యం

పాలయింది. పదవ తరగతి పాసయ్యాను. చదువుకుంటే

ఇల్లెలా గడుస్తుంది? అని కూలీ పనికి వెళ్ళాను. అమ్మను చూడడానికి వచ్చిన మేడమ్ మా పేదరికం గమనించి డబ్బు సహాయం చేశారు. కూలీ పని మాన్పించారు. నన్ను ఉన్నత చదువు కోసం హైదరాబాద్ పంపించారు. పది సంవత్సరాలు అక్కడనే ఉన్నాను. నాపేరున బ్యాంక్ ఖాతా తెరిచి

అందులో ప్రతినెలా మేడం డబ్బులు వేసేవారు. అమ్మ ఈమధ్యనే చనిపోయింది. మేడమ్ గారి చలవ వల్ల నేను కలెక్టర్ నయ్యాను. అని భార్గవికి నమస్కరించాడు. వంటమనిషి వసంత కొడుకు వరుణ్ తేజ ఇంత వాడయ్యాడా నేను గుర్తుపట్టలేకపోయాను. ఆశ్చర్యంతో అతన్ని చూసింది.

ఉచితాసనంపై భార్గవిని కూర్చుండబెట్టి

పూలమాల వేసి శాలువ కప్పి సన్మానించాడు వరుణ్ తేజ.

"భార్గవి మేడమ్ సంతానం లేదని ఎవరినైనా దత్తత తీసుకుంటే బాగుండును, అని పలుమార్లు అమ్మతో చెప్పి బాధ పడేవారు. కానీ ఎవరినీ పెంచుకోలేదు. ఇప్పటికీ ఆ కోరిక అలాగే ఉంటే నేను దత్తపుత్రుడుగా ఉండి రుణం తీర్చుకుంటాను" అని సభాముఖంగా ప్రకటించాడు వరుణ్ తేజ.

"భార్గవి మేడమ్ మీ అభిప్రాయం నిస్సంకోచంగా" చెప్పండి.

భార్గవి మైకందుకొని "అందరికి నమస్కారం. నేను చేసిన చిన్న సహాయానికి నన్ను పొగుడుతున్నారు కలెక్టర్ గారు. అది అతని గొప్ప వ్యక్తిత్వం. డబ్బు సహాయం చేసినంత

మాత్రాన ఎంతమంది కష్టపడి ప్రయోజకులు కాగలరు. కానీ ఇతడు కష్టపడి చదివి కలెక్టర్ అయ్యాడు. నాకు చాలా సంతోషంగా ఉంది. కలెక్టర్ తల్లిగా ఉండడానికి అదృష్టం కావాలి. వరుణ్ తేజను దత్త పుత్రుడుగా

స్వీకరిస్తున్నాను" అని ఇనందంగా తెలిపింది భార్గవి.

"అమ్మా! నన్ను దీవించమ్మా!" అని భార్గవి కాళ్లకు నమస్కరించాడు వరుణ్ తేజ. "మనసారా ఆయుష్మాన్ భవ!" అని దీవించింది భార్గవి.

జీవితంలో ఒంటరిగా అనాథ లా మిగిలిన భార్గవి కంటికి 'చీకటిలో చిరుదీపం'లాకనిపించాడు వరుణ్ తేజ.

కథ

# ముంతాజ్



గుగులోత్ తులసి.

కొత్తగూడెం 9908733389.

అర్ధరాత్రి సమయం పన్నెండు దాటింది. చిమ్మ చీకటి బయట ఎవరు తిరగడం లేదు. ఎవరో తలుపు కొడుతున్నట్టు శబ్దం. వెన్నెల మనసులో ఏదో భయం..

ఈ మధ్యే కొత్తగా అద్దెకు వచ్చారు, ఎవరూ తెలియదు. పైగా సిటీ, ఎవరింట్లో వాళ్ళు తలుపులు బిగించి పక్కవాళ్ళకు కూడా ఎవరో తెలియకుండా బ్రతుకుతున్నారు.

ఎవరై వుంటారు? అనుకుంటూ

"అమ్మి! ముందు బయటకు చూడు, తర్వాత తలుపు తీద్దాం" అని తన కూతురుకి వెన్నెల చెప్తుండగానే అమ్మి తొంగి చూస్తూనే, "మమ్మీ.. తను మొన్న బతుకమ్మ ఆడేటప్పుడు అక్కడ మనతో కలిసి డాన్స్ వేసింది కదా ఆ అమ్మాయి".

"అవునా! అదేంటి ఈ టైమ్ లో వచ్చింది. ఇంకా తలుపు కొడుతూనే వుంది ఆ పిల్ల" వెంటనే వెన్నెల తలుపు తీసింది. వెన్నెలకు మాట్లాడే సమయం ఇవ్వకుండానే ఆ అమ్మాయి "ఆంటీ.. ఆంటీ.. నేను ఈ రోజు మీ ఇంట్లో నిద్రపోతాను, ప్లీజ్ ఆంటీ" అంది చాలా కంగారుగా, భయం గా ఉన్నట్లు అనిపించింది.

వెన్నెల తనతో "అది కాదు, మీ అమ్మ, నాన్న లేరా" అని అడిగింది.

"ఊరికి వెళ్లారు ఆంటీ నన్ను ఒక్కదాన్నీ వదిలేసి వెళ్లారు"."అదేంటి ఈ టైమ్ లో నిన్ను వదిలి ఊరేళ్లడం ఏమిటి?". "ఏమో ఆంటీ ప్లీజ్ మీదగ్గర ఈ రాత్రికి వుంటాను" అంటూ నిల్చుంది గుమ్మం ముందు. అర్ధరాత్రి ఆడపిల్ల వెళ్ళిపో అనడానికి మనసొప్పలేదు. అంతే వయసున్న కూతురుని చూస్తూ, "మీ వాళ్లకు ఫోన్ ఉంటుందిగా నెంబర్ చెప్పు" అంటే.. మొఖం అనుమానంగా పెట్టి వెంటనే ఆ పిల్ల "లేదాంటి" అని సమాధానం. "ఏంటి నువ్వు, ఏమి లేకుండా ఎలా వుంటారు? బతుకమ్మలు ఆడేటప్పుడు వచ్చిన అమ్మాయివే కదా? నువ్వు దసరా నవరాత్రుల్లో బతుకమ్మ ఆడేటప్పుడు అక్కడే ఎక్కడో దగ్గర నుండే వచ్చావు" వుండు మీ ఇంటికి వెళ్దాం అని నైటీ మార్చుకుంటూ.. "ఏవండీ.. మొన్న ఒక్కమ్మాయిని చూసా బతుకమ్మలు ఆడేటప్పుడు ఆ అమ్మయి వచ్చింది. ఏమైందో ఏంటో ఇక్కడ పడుకుంటా అంటుంది... నిద్రపోనివ్వనా?"అని భర్తను అడిగింది వెన్నెల.

"ఏయ్ నీకేం పని లేదా? ఎవరో ఏంటో తెలియదు పైగా అర్ధరాత్రి, ఆ పిల్ల వెనుక ఎవరైనా వస్తే, ఏదైనా చేస్తే ఏంటి ఈ గొడవ. ఆ పిల్లని ఉంచావో అన్నీ దొంగతనం చేస్తే నిద్రపోయాకా? లేనిపోనివి అన్నీ నెత్తిన పెట్టుకోకుండా పొమ్మను" భర్త చెప్పేవి వింటూనే బట్టలు మార్చుకొని రూమ్ డోర్ దగ్గరగా వేసి హాల్ లోకి వచ్చింది. వెన్నెల వస్తూనే "ఏదే ఆ పిల్ల?", "మమ్మీ నువ్వు మీ ఇంటికి పోదాం అనేసరికి మా ఇంటికా? వద్దు వద్దు అనుకుంటూ బయటకు పరిగెత్తుకు పోయింది" అన్నది అమ్మీ. వెన్నెల వెంటనే గేట్ దాకా పోయి చూసింది. రోడ్ మీదకు తొంగి చూసింది. చుట్టూ చిమ్మ చీకటి ఒక్కరూ కూడా కనపడలేదు. అక్కడక్కడా కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. ఆలోచిస్తు చీకట్లో ఎటుపోయింది? కాసేపు ఆడపిల్ల ఇంటికి రావడం ఆలస్యంఅయితేనే గుండెలు అదిరిపోతాయ్ మరి! ఈ పిల్ల తల్లిదండ్రులకు ఆ ఆలోచన లేదా? అయ్యో ఎటు పోయింది అనుకుంటూ లోపలకు వచ్చింది. "అమ్మి!.. నీకు ఆ అమ్మాయి ఇల్లు తెలుసా? నువ్వు సైకిల్ మీద వెళ్తావ్ కదా! ఆ అమ్మాయి వచ్చే రూట్ లో". "హా.. మమ్మీ తెలుసు. ఆ అమ్మాయి మన లైన్ లోనే చివర ఇంట్లో ఉంటుంది అనుకుంటా! ఎప్పుడూ అదే ఇంట్లో నుండి వస్తుంది కానీ అది ఎవరిల్లో నాకు తెలియదు.

"మనం వెళ్దాం.. వుండు" అని బెడ్ రూమ్ డోర్ చిన్నగా తీసి చూసింది. భర్త, కొడుకు గాఢ నిద్రలో వున్నారు. శబ్దం రాకుండా డోర్ దగ్గరకు వేసి బయటకు వచ్చి ఇంటి తలుపు వేసి, గేట్ తీసి, చీకట్లో ఆ అమ్మాయి ఇల్లు వెతుకుతూ వెళ్తుంటే.. కుక్కల అరుపులకు భయపడి, మమ్మీ..అంటూ మీదకు దూకి ఎత్తుకొని తీసుకెళ్ళు మమ్మీ భయం వేస్తుంది అంది అమ్మి.

"ఎంత దూరం ఉందొ ఏమో నువ్వు దగ్గర దగ్గర నా అంత వున్నావ్ యెట్లా మోయ్యాలి.నడువ్, నన్ను గట్టిగా పట్టుకో. అవును అమ్మి ఆ పిల్ల పేరేంటి?". "నాకు తెలియదు మమ్మీ".

"మీరు మాట్లాడుకున్నారు కదే" . "మాట్లాడితే పేరు అడగలేదు. ఆమె నన్ను ఫ్రెండు అన్నది. నేను ఆమెను ఫ్రెండు అన్నాను అంతే" అంటూ చీకట్లో వెతుకుతూ ఆ పిల్ల వచ్చిన ఇంటికి చేరారు. పెద్ద బంగ్లా, పెద్ద పెద్ద గేట్లు, పెద్ద వరండా అక్కడ దీవాన్ మీద ఎవరో దుప్పటి కప్పుకొని నిద్ర పోతున్నారు.

"ఏవండీ.. సార్" అని పిలుస్తుంటే అస్సలు పలక లేదు. ఇంకా గట్టిగా పిలిచినా ఉలుకుపలుకూ లేదు.. వెంటనే వెన్నెల గేట్ చప్పుడు ఒకచేత్తో చేస్తుంటే ఇంకో చేతిని అమ్మి గట్టిగా పట్టుకొని కుక్క పిల్లలా దగ్గరకు అతుక్కొని నిల్చొని చూస్తుంది. అక్కడ బయట నిద్ర పోతున్న వ్యక్తి ఏదో మాట్లాడుతున్నాడు. కానీ వినిపించడం లేదు. మొత్తానికి బాగా తాగి వున్నాడని అర్థం అయింది.. ఓరి దేవుడా!!ఇప్పుడేం చేయాలనుకొని. మళ్ళీ గట్టిగా గేట్ శబ్దం చేస్తుంటే చాలా సేపటికి ఇంటి తలుపు తీసి ఒకాయన బయటకు

వచ్చాడు. ఆ ఇంటి ఓనర్ అనుకుంటా.. "ఎవరు మీరు?" అని అడిగారు. "మేము ఈ లైన్ లోకి కొత్తగా అద్దెకు వచ్చాం సార్.. మీ ఇంట్లో ఒక పాప ఉండాలి మీ పాపే నా సార్". "హా..మా ఇంట్లోనే ఉంటుంది కానీ మా పాప కాదు" అని అతను మాట్లాడుతూనే వున్నాడు. వెన్నెల బుర్రలో ఆలోచనలు వేగంగా పరిగెడుతున్నాయి. తనే సమాధానాలు వెతుక్కుంటుంది. వీళ్ళింట్లో పనిచేస్తుందఘమో లేదా అక్కడ నిద్రపోతున్న ముసలోడి మనవరాలేమో! తాగి పట్టించు కోలేదేమో? అయ్యో పాపం ఒక్కపూట నిద్రపోనిచ్చిన అయిపోవు అనుకుంది.. ఎదురుగా వున్న మనిషి "అయినా ఈ టైమ్ లో వచ్చి అమ్మాయి గురించి అడుగుతున్నారు ఎందుకు" అని అడిగాడు. "ఇందాక ఇంటికి వచ్చింది సార్. ఇంట్లో పడుకుంటా అని అడిగింది. మీ నాన్న నెంబర్ చెప్పు. అనేసరికి పారిపోయింది. ఏమైందా అని వెతుకుతూ వచ్చాను" అని చెప్పింది వెన్నెల.

"ఓ ! అవునా వుండండి వాళ్ళ నాన్నని పిలుస్తా" అని పెద్ద బంగ్లా దాటి కొంచం ముందుకు పోయాడు. బంగ్లా లోపల కిందకు ఒక చిన్న ఇల్లు వుంది అగ్గిపెట్టెలా గదులు. ఏదో పేరు పెట్టి పిలుస్తున్నాడు ఇంటి ఓనర్...

అదేంటి పని మనిషి కాదు, పనిచేసే వాడి మానవరాలు కాదు, నాన్న ఉన్నాడా? చిన్నదో పెద్దదో ఒక ఇల్లు వుందా? మరి ఎందుకు ఆ పిల్ల అర్ధరాత్రి బయటకు రావాల్సి వచ్చింది. ఎందుకో వెన్నెల మనసు కీడు శంకించింది. లోపల నుండి కళ్ళు నలుపుకుంటూ షార్టు, షర్ట్ లో వయసు ఒక ముప్పై ఎనిమిది అలా ఉండొచ్చు ఒక వ్యక్తి వచ్చాడు. "మీరేనా ఆ పాప తండ్రి?" అని అడిగింది వెన్నెల..

"ఆ అవును మేడం మీరెవరు?". "ఇప్పుడు నేనెవరో నీకు వివరించలేను గానీ నీ కూతురేది?" "ఏమో మేడం! ఎటు పోయిందో నాకు తెల్వదు" అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. ఆ సమాధానానికి వెన్నెలకు తెలియకుండానే పిడికిలి బిగిసింది గట్టిగా వస్తున్న కోపాన్నీ ఆపుకుంది.

"ఏయ్ నువ్వు మనిషివేనా, తండ్రివేనా! ఆడపిల్ల అర్ధరాత్రి ఎటు పోయిందో తెలియదు అంటావా.? లోకం యెట్లా వుంది నీకు తెలియదా? చిన్నా పెద్ద లేకుండా ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. నీకు బుద్ధి లేదు. చిన్నపిల్ల0అందులోను ఆడపిల్ల! ఎటు పోయిందో అంటావా? పైగా ముసలోడిలా, వెతక లేని వాడిలా, అసలు కంగారే లేకుండా మాట్లాడుతున్నావు" అని గట్టిగా అరిచేసింది వెన్నెల.

"మమ్మీ.." అని పాప పిలిచే సరికి చిన్నగా మాట్లాడుతూ "ఏంటి మీరు? చిన్న పిల్లనం అలా ఎలా వదిలేస్తారు?" అని అడిగింది. ఇంటి ఓనర్ "అది చిన్న పిల్లా? వేస్ట్ ముండ" అని అన్నాడు.

అంత చిన్న పిల్లని అలా అనడం

ఆయన వయసుకు కరెక్ట్ కానే కాదు, ఏదో తేడాగా వుంది అనుకుంటూనే వాళ్ళు చెప్పేవి విన్నది. "మొన్న ఒక్కళ్ల దాబా మీద పడుకుందంట వాళ్ళు తిట్టారు. ఒకరోజు మెయిన్ రోడ్ మీద కార్ కింద నిద్రపోయిందట, దానికి పోయే కాలం వచ్చింది. ఏమైందో ఏమో వెతికి వెతికి విసిగి పోయామ్. అందుకే వదిలేశాం" అని సమాధానం విని. మౌనంగా కూతురుని తీసుకొని ఇంటికి వెళ్ళడానికి వెను తిరిగింది వెన్నెల. ఆగి... ఆ పిల్లకి అమ్మ లేదా! అని అడిగితే లేదు చనిపోయిందన్నారు. ఇంటికి వెళ్ళింది గానీ నిద్రపట్టలేదు వెన్నెలకు. తెల్లారితే దసరా సెలవులు ముగిసి స్కూల్స్ మొదలు. పిల్లల కోసం ఎక్కడో ఫారెస్ట్ ప్రాంతం నుండి సిటీకి వచ్చారు. ఉద్యోగం మాత్రం ఆ అడవి ప్రాంతంలోనే. పొద్దున్నే లేవాలి ఇంట్లో పనులు అవేమి వెన్నెలకు పట్టడం లేదు.

అమ్మ లేదు. నేను నా కూతురుని గారం చేస్తుంటే చూసి అలాంటి ప్రేమ తనకు ఉంటే బాగుండు అని, తననే ఎందుకు వెతుకుతూ వచ్చిందో అప్పుడు అర్ధం అయింది వెన్నెలకు. తన వయసు వున్న తన కూతురుని తీసుకొని బతుకమ్మ సంబరాల్లో రోజూ బొమ్మలా తయారు చేసి ఎంతో ప్రేమగా చూస్తుంటే. ఆ పిల్ల చూస్తూ అదే ప్రేమ తనకు కావాలని వెతుకుతూ వచ్చిందేమో! అది తల్చుకోగానే వెన్నెలకు ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ పిల్లకు ఏదైనా అయితే నేను తప్పు చేసానా? చ ఛా..!

ఒక్కరోజు షల్టర్ ఇవ్వలేకపోయానా? బోలెడు నేరాలు జరుగుతున్నాయి ఆ పిల్లకు ఏదైనా అయితే నేను భరించగలనా? అనే ప్రశ్నలతో గడిపింది. తెల్లారి ఇంట్లో పనులు చేసుకొని ఉద్యోగ భాద్యతలు నెరవేర్చడానికి వెళ్లిందనే గాని ఏదో ఆపరాధ భావన ఆమెను నలిపేస్తుంది.

ఎప్పుడూ అల్లరి చేస్తూ, అందరిని పలుకరిస్తూ వుండే వెన్నెల. మౌనంగా ఏదో ఆలోచనలో ఉండటం గమనించి

కోలిగ్స్ ఏంటి అలా వున్నావ్? అంటే. రాత్రి జరిగిన విషయం చెప్పింది.

చైల్డ్ వెల్ఫేర్స్ ఉంటాయి కనుక్కుందాం. కుదిరితే ఏదో ఒకటి చేద్దాం. కంగారు పడకని ధైర్యం చెప్పారు. మనసు కొంచం నెమ్మది అయింది. స్కూల్ అయిపోయి ఇంటికి బయలు దేరింది. దారంతా అమ్మాయి ఆలోచనలతో బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంటే, ఇంటి దగ్గరకు వచ్చేసరికి, ఇంటి ముందు ఎవరో ముగ్గురున్నారు.

ఎవరబ్బా ఇంటి ముందు ఏదో అయింది అనుకుంటూ వెళ్తుంటే కొడుకు ఎదురొచ్చి, "మమ్మీ...నీ కోసం అరగంట నుండి వెయిటింగ్ వాళ్ళు" అని చేతిలో బ్యాగ్ తీసుకొని వెళ్ళిపోయాడు.

ఇంట్లోకి పోకుండానే గేట్ బయటే ఆగింది వెన్నెల. వాళ్లలో ఒకడు ఆ పాప తండ్రి.

'అబ్బా.. రాత్రి ఇంట్లో తెలియకుండా వెళ్ళాను. అయిపోయా ఇవ్వాళ నేను ఇంట్లో తిట్లు నాకు' అనుకొని "ఏంటి వచ్చావ్" అని అడిగింది వెన్నెల.

"నా పేరు రషీద్ మేడం" పక్కనే వున్న అతన్నీ చూపిస్తూ "మా బావ" అని చెప్పాడు. "మీరు రాత్రి వచ్చారు కదా! భాద అనిపించి వచ్చానండి.. ఆ పిల్ల మా మాట వినట్లేదు. పారిపోతుంది ఇంట్లో ఉండటం లేదు. కొట్టినా ఏం చేసినా అంతే" అని

చెప్తూపోతున్నాడు..

"మరి ఆ పిల్లకు అమ్మమ్మ వాళ్ళు లేరా" అంటే, "మొదటిది లవ్ మ్యారేజి" అని నవ్వుకుంటూ "వేరే క్యాస్ట్ మేడం రానివ్వరు. వరంగల్ ఆమెది చనిపోయినా రాలే" అన్నాడు.

వెన్నెల మనసులో విషయం ఇంత సీరియస్ గా ఉంటే నవ్వుతున్నావా? ప్రేమపెళ్ళా! నీలో ప్రేమ ఎక్కడ కనిపించట్లేదు అనుకున్నది లోపల. పైకి చెప్పేది వింటుంది. "ఆమె చనిపోయాక ఇంకో పెళ్ళి చేసుకున్న. ఆమెకు ఇద్దరు పిల్లలు మొదటి దానికి ఇద్దరు. మొత్తం నలుగురు పిల్లలు మేడం" అన్నాడు.

"మరి ఆమె ఎటు పోయింది? ఈ పిల్లను చూసుకోవచ్చు కదా" అంటే.. "లేదు మేడం ఈ పిల్లకు ఆమెకు పడదు.

ఈ పిల్లతో వేగలేను అని, కొడుకును తీసుకొని పారిపోయింది వాళ్ళ పుట్టింటికి" అని చెప్పాడు.

ఇంకా ఇద్దరు అమ్మాయిలు అనాదాశ్రమంలో వున్నరన్నాడు. ఎన్ని చెప్పిన వెన్నెల అతన్ని నమ్మలేకపోతుంది.

రషీద్ తో వచ్చిన అతను "వీడికి చదువురాదు. ఆ పిల్లని బడికి పంపినా హాస్టల్లో జాయిన్ చేసినా ఉండట్లేదు. మీరు ఏదో ఒకటి చేయండి మేడం" అని చెప్పాడు. వెన్నెల "ఏదో ఒకటి చేస్తాగాని. ఈ రోజు సోమవారం నాకు లీవ్ కష్టం. ఆదివారం ఖాళీ. కానీ ఆ పిల్లని ఎటు పోనివ్వకండి. ఇంట్లో ఉంచండి. నేను మాట్లాడతా.. ఎందుకు అలా చేస్తుందో కనుక్కొని ఏదో ఒకటి చేద్దాం" అని చెప్పింది.

మీరు వెళ్ళండని లోపలకు భయం భయంగానే వెళ్ళింది. మొత్తం విన్నభర్త "ఓహో.. రాచకార్యాలు మొదలు పెట్టావా" అని వెటకారంగా "ఏదైనా అయితే నాకేం సంబంధం లేదు" అని చెప్పాడు.

పుస్తకంలో పేజీలు తిప్పినంత త్వరగా మూడు రోజులు గడచిపోయాయి. గురువారం సాయంత్రం బస్సు దిగి ఇంటికి వెళ్లే దారి దగ్గర ఒక వ్యక్తి "మేడం! మేడం!" అని పిలిచాడు ఆగి చుట్టూ చూసింది వెన్నెల. లూనా బండి వేస్కొని ఒకతను దగ్గరగా వచ్చాడు.

"నువ్వా! ఆ రోజు రషీద్ తో వచ్చింది నువ్వే కదా!". "అవునండి మీకో విషయం చెప్పాలి మేడం". "ఏంటి చెప్పు". "ఆ రషీద్ మంచోడు కాదు. వాడి వల్లె ఆ అమ్మాయి అలా అయింది. రెండో భార్య పారిపోయింది. ఈ పిల్లని ఇంట్లో పనికి ఉంచాడు. పిల్ల ముందే వేరే ఆడోళ్ళను తెచ్చుకొని.. ఇక అవన్నీ మీకు చెప్పలేను. ఆ ఇల్లు చూసారు కదా, ఆ అమ్మాయి పెద్దదయి ఆరు నెలలవుతుంది. వీడి దగ్గర అలాంటి పనులు చూసి ఆ పిల్ల పాడై పోతుంది. మీరు రక్షించండి. ఏదైనా చేసి ఆ అమ్మాయిని కాపాడండి మేడం. ఆ పిల్లని పట్టుకొచ్చి ఇంట్లో గొలుసులతో కట్టి ఉంచాడు. పారిపోతుందని" అన్నాడు.

"ఏంటి గొలుసులతో కట్టేసారా? అసలేం మనుషులు మీరు", " పారిపోతుందని అలా చేసాం మేడం. మీరు ఆదివారం మాట్లాడతా అన్నారు కదా! అని అప్పుడు దొరకకపోతే అని కట్టేసాం" అన్నాడు.

"వస్తున్న పద.." అని ఇంటికి వెళ్లి బ్యాగ్ పడేసి అమ్మితో కలిసి ఆ పిల్ల ఉండే ఇంటికి వెళ్ళింది. గేట్ తీసి ఆ చిన్న ఇంటి వైపు వెళ్ళబోతుంటే ఈ సారి ఓనర్ భార్య ఎంట్రీ.

"ఎవరు మీరు? ఎక్కడికి వెళ్తున్నారు..?

"నేను ఆ అమ్మాయిని చైల్డ్ కేర్ లో జాయిన్ చేద్దాం అని అనుకుంటున్నా మేడం" అన్నది వెన్నెల.

"మీరేమన్నా ఆఫీసరా?" ఓనర్.

"కాదండి మొన్న రాత్రి మీ ఇంటికి వచ్చాను". "ఓ మీరా...రండి రండి..

వాళ్ళ నాన్న లేడు నన్నే చూసుకోమని చెప్పి వెళ్ళాడు. మొన్న బాగానే వుంది, పెట్టినవన్ని తిని, నా కళ్ళు కప్పి పారిపోయింది. వామ్మో మాములుది కాదది. దానికి సెల్ కూడా వుంది. వచ్చే పోయే మగాళ్ళందరితో మాట్లాడుతుంది. వాళ్ళింట్లో అన్నీ వున్నాయి. నాన్న మంచిగానే చూసుకుంటాడు. Tv కూడా పెట్టించాడు. ఇదే మంచిది కాదు... పైగా దీనికో లవర్. వీడియో కాల్స్ మాట్లాడుతుంది. ఈ పాటికి అన్నీ అయిపోయి ఉంటాయి" అసలు వెన్నెలతో పక్కన చిన్న పిల్ల ఉందని కూడా చూడకుండా మాట్లాడేస్తుంది మహానుభావురాలు.

"ఒక్క నిమిషం ఆగండి.." అని

"అమ్మి.. సైకిల్ తెచ్చావ్ కదా! ఇంటికి పో, నేను వస్తాను" అని చెప్పి గేట్ దాక పోయి ఇల్లు చేరే వరకు చూస్తూ ఇంటి దగ్గరకు పోయింది అని అనిపించాకా, కొడుకుకు ఫోన్ చేసి చెల్లి వచ్చిందా! అని అడిగింది. హ...మమ్మీ అని ఆన్సర్ వచ్చేసరికి సరే వస్తాను టైమ్ పడుతుంది. డాడీకి చెప్పు. హోమ్ వర్క్ చేసుకోండి అని చెప్పి కాల్ కట్ చేసింది..

"ఇక చెప్పండి. ఆపిల్లని కట్టేశారట కదా గొలుసులతో! మాట్లాడదామని వచ్చాను" అంది. "అమ్మో మేము చెప్పి చెప్పి, ఆమెను అడిగిఅడిగి విసిగిపోయాం. పెళ్ళి చేసుకుంటావా అని కూడా అడిగా నేను. దానికి మద పిచ్చి, కరెంటు బిల్ ఇవ్వడానికి వచ్చే వాళ్ళని కూడా గుడ్ల గూబలా చూస్తుంది" అని చెప్తూనే వుంది.

వెన్నల ఆపి "ఇన్ని చెప్తున్నారు.. చిన్న పిల్ల అండి పట్టుమని పదమూడు యేండ్లు లేవు. ఆ పిల్ల గురించి మీరిలా మాట్లాడటం బావ్యం కాదు".

"అవునండి వాళ్ళ నాన్నే సెల్ చూసి. నీకు మద పిచ్చి పట్టింది అని కొట్టాడు మొన్ననే". "నేను ఆ పిల్లతో మాట్లాడాలి" అంది వెన్నెల.

రండి.. అని కొంచం లోపలకు వున్నా ఆపిల్ల ఇంటికి తీసుకు పోయింది ఆవిడ.. చీకటి.. కాళ్ళు,చేతులు గొలుసులుతో కిటికీకి లాక్ చేసి వుంది. అన్నీ విడిచిన బట్టలు కుప్పగా. వాసనా ఇల్లంతా భరించలేనట్లు. శుభ్రమే లేదు. పక్కన ఒక ముసలామె నిద్రపోయి వుంది.. బయట ఇంకా ఎవరో ఒకబ్బాయి కాపలా. వీళ్ళ నాన్నకు ఫోన్ చేయమని చెప్పి ఆ పిల్లతో మాట్లాడటానికి దగ్గరకు వెళ్ళింది వెన్నెల..

ఆ ఓనర్ భార్య ఈమె తెలుసా నీకు అంటే. తెలుసు ఆంటీ..

నీతో మాట్లాడటానికి వచ్చింది.

ఇంట్లో లైట్ లేదు వెన్నెల సెల్ లైట్ ఆన్ చేసి నేను మాట్లాడతా మీరు వెళ్ళండి అని ఓనర్ భార్యతో చెప్తే, ఆమె మూతి ముడుచుకుంటూ ముందు దాకా వెళ్లి అక్కడ నుండి నక్కి వింటూ వుంది.. చుట్టూ పరిస్థితులు సరిగా అనిపించలేదు వెన్నెలకు.

“చెప్పు.. నీతో మాట్లాడాలి అని వచ్చాను. నాకు నీ పేరు కూడా తెలియదు. నీ వల్ల నిద్ర కూడాపట్టటం లేదు నాకు. నీ గురించీ అందరు ఇలా చెప్తున్నారు ఏంటి?. నువ్వు అంత చెడ్డ పిల్లవా? నీ వయసేంత! చిన్న పిల్లవి. వీళ్ళందరూ చెప్పే పనులు చేయడానికి ఒక వయసు ఉంటుంది. అందరు చెడ్డ పిల్ల అని అంటున్నారు. అందరూ మంచిపిల్లా అనేలా బ్రతకాలని లేదానీకు? నువ్వు చూసే. నీ చుట్టూవున్న ప్రపంచం బురద. బయటకు రా. నేను చేయి అందిస్తా..

పెద్ద ఇల్లు, కావాల్సినవన్నీ ఉంటాయి. మంచి ఫుడ్ కూడా ఉంటుంది. నేను చదువుకోవడం వల్ల కదా. ఇక్కడి వరకు వచ్చాను. నువ్వు కూడా చదువుకుంటే నాలా అవుతావు. చూడు ఇల్లు ఎలా కంపు కొడుతుందో! నీట్ గా పెట్టుకొని చక్కగా చదుకోవాలి. నువ్వు బాగుండాలి అంటే నువ్వు చదువుకోవాలి. నీకు నీ వయసు ఫ్రెండ్స్ లేరా? రాత్రులు పారిపోయి ఎక్కడ నిద్ర పోతున్నావు”.

“మా ఫ్రెండ్స్ ఇంట్లో!” అని సమాధానం తలవంచుకొని. “నిన్ను చెడ్డ పిల్ల అంటుంటే ఇంకో సారి నీతో నీ ఫ్రెండ్స్ ని మాట్లాడానిస్తారా. నిన్ను ఇంటికి రానిస్తారా” అంటుంటే. “లేదక్కా రానివ్వరు” అని సమాధానం తలోంచుకొనే. “మొన్నటి దాకా ఆంటీ, ఇప్పుడు అక్క. సరేలే ఏదో ఒకటి... చెప్పు నీకు లవర్ అంట నిజామా ?” అంటే. “అవునక్కా కానీ ఇప్పుడు మాట్లాడటం లేదు”. “సరే.. నువ్వు చిన్న పిల్లవి, ఇవన్నీ ఎందుకు నీకు? పెళ్ళి చేసుకుంటావా అని అడిగే వయసు నీది కాదు కదా”. “నువ్వు నన్ను హాస్టల్ కి పంపుతా అన్నావ్ అంట కదక్కా ఎప్పుడు పంపుతావు?”

“పంపుతా.. కానీ ఇవన్నీ వింటుంటే నువ్వు వుంటావా! చదువుకుంటావా! అనే ప్రశ్నలు నన్ను వేదిస్తున్నాయి. నువ్వు అక్కడ నుండి పారిపోతే”.

“లేదక్కా పారిపోను నువ్వు చెప్పినట్లు వింటాను.. ఎందుకో నాకు నీ మాట వినాలి అనిపిస్తుంది”. “నిజమే చెప్తున్నావా..”. “ఒట్టు అక్క..నిజమే”..

“సరే నిన్ను ఇలా చూస్తుంటే భాదగా వుంది. పారిపోను అంటే లాక్ తీపించేస్తా”. “పోను అక్కా”.

ఆ లోపు రషీద్ వచ్చాడు. లాక్ తీసేయండి, నేను మాట్లాడాను ఆమె ఎటు పారిపోనని అంటుంది. ఆమెను చైల్డ్ కేర్ ఆఫీసర్స్ వచ్చి తీసుకుపోతారు. పంపేసేయ్ రషీద్ పట్టించుకోనప్పుడు. నీ దగ్గర వుండి వె

వేస్ట్. హాస్టల్ కి పంపేయ్ వాళ్ళు చదివిస్తారు అన్నీ ఇస్తారు” అని చెప్పి ఇంటికి వచ్చేసింది. అక్కడ మాట్లాడిన మాటలు, తను విన్న మాటలు మనసుకు చాలా భారన్నీ పెంచేసాయి. అక్కడైతే యేవో చెప్పి వచ్చింది గాని ఏ ఆఫీసర్స్ తో మాట్లాడలేదు. శనివారం ఆఫీస్ నుండి వస్తూ తెలిసిన ఒక మేడంకి కాల్ చేసి చైల్డ్ కేర్ ఆఫీసర్ నెంబర్ తీసుకున్నది. ఇంటికి వెళ్లి ఫ్రెషై కొడుకుని తోడు తీసుకొని బయటకు పోదాం పదా అని ఆ ఆఫీసర్ కి కాల్ చేసింది. విషయం చెపుదాం అనుకున్నది అనుకోకుండా వాళ్ళు తనుండే ఏరియాలోనే దగ్గరలో వున్నారు. కాల్ చేస్తే ఐదు నిమిషాల్లో వచ్చేసారు. అందరూ కలిసి ఆ పిల్ల ఇంటికి పోయారు. అన్నీ డీటెయిల్స్ తీసుకొని వాళ్ళ నాన్నను పిలిచి అమ్మాయిని మోటివేట్ చేసి, హామీ పత్రం మీద వాళ్ళ నాన్న సంతకాలు తీసుకొని, ఆధార్ కార్డ్స్ అన్నీ తీసుకున్నారు. బడ వుంటావా అని ఆఫీసర్ అడిగితే వుంటా అని చెప్పింది. మంచి భవిషత్ వుంది. ఇదిగో ఈ మేడం నీ కోసం ఆరాట పడుతున్నారు నువ్వు చదువుకోవాలి అని ఆఫీసర్ చెప్తుంటే చదుకుంటాను అని చెప్పిందా పిల్ల.. ఇదంతా చూస్తున్న ఆఫీసర్ వెన్నెల కొడుకును ఉద్దేశించి “ఏంటి మేడం మీకు తోడా మీ అబ్బాయి” అంటే అవునండి స్త్రీకి ఎవరో ఒకరి తోడు ఉండాలంట ఎప్పుడూ. అందుకే తోడు తెచ్చుకున్న అని చెప్పింది.

“సరే నువ్వు సంతకం చేయి అమ్మాయి” అని హామీ పత్రాలు ఇస్తుంటే తీసుకొని రాసింది. ఎప్పుడు ఆ పిల్ల, పిల్ల అనడమే గాని పేరు తెలియదు.. ఆ పేపర్స్ తీసుకొని మీరు కూడా సంతకం చేసి మీ నెంబర్ రాయండి అని చెప్పిన ఆఫీసర్ దగ్గర హామీ పత్రాల మీద సంతకాలు పెట్టి పైన ఏం పేరు వుందా అని చూసింది వెన్నెల. ‘ముంతాజ్’

అని పేపర్ మీద రాసి వుంది.

ప్రేమ గుర్తు తాజ్ మహల్ ని గుర్తు చేసింది ఆ పేరు ముంతాజ్.

అన్నీ ఫార్మాలిటీలు పూర్తయ్యాక వాళ్ళ వ్యాన్లో అప్పుడే తీసుకొని వెళ్లిపోయారు. ఆడపిల్లలు పడే భాదలు ఎలా వుంటాయో కొన్ని వివరిస్తూ అమ్మాయిలు అంటే “భాద్యత”గా భావించాలి అని కొడుకుతో చెప్తూ ఇంట్లోకి వస్తుంటే సరే మమ్మీ అని చెప్పాడు.

కొన్ని రోజులకు ఫోన్ చేసి ముంతాజ్ గురించీ ఆఫీసర్ ని కనుక్కుంటే బాగానే వుంది. కొద్ది రోజుల్లో వేరే చైల్డ్ హోమ్ లో జాయిన్ చేస్తాం. అప్పటి వరకు మా అండర్ లో ఉంటుంది. వివరాలు ఎవరికి చెప్పము మేడం. ఆమె అయితే

బాగుంది మేడం. చెప్పినట్లు ఉంటుంది. మీరేం చెప్పారో ఏమో ఎవరు చెప్పినా మారలేదు అన్నాడు ఆఫీసర్...

"ఏమి చెప్పలేదు నువ్వు నా కూతురువే నిన్ను తిడుతుంటే తల్లి బాధ పడుతుంది కదా! నీకు నేను జీవితాంతం నీకు అందుబాటులో ఉండాలి అంటే నువ్వు హాస్టల్ లో ఉండాలి. నిన్ను చూడటానికి నేను వస్తాను. నువ్వు నా కూతురులా చదువుకుంటేనే భవిషత్ బాగుంటుంది. ఆనందంగా బ్రతుకుతావు. అని చెప్పాను. జాయిన్ చేస్తే చెప్పండి" అని చెప్పింది వెన్నెల... "సరే మేడం తప్పకుండ చెప్తాము" అని కాల్ కట్ చేసారు. ఎన్నో రోజులు నిద్రపోని వెన్నెల ఆ రాత్రి చాలా ప్రశాంతంగా నిద్రపోయింది..మనసులో దీపావళి వెలుగులు నిండిపోయాయ్.. దేవుడా ఆ దీపం వెలిగేలా చేయి అనుకుంటూ రోజు దేవుడిని ప్రార్థించింది.

★★★

కవిత

# డీజండర్లుగా మారితే




జి. విజయలక్ష్మి

హైదరాబాద్ 9703564878


అతివల మధ్య అగ్గి పెట్టి ఆజ్యంపోసి
బాంబుల తోరణాలు కట్టి
మారణాయుధాలు జండాలుగా పట్టి
పసివాళ్ళ మానభంగాల సాక్షిగా
కుటుంబ ఆత్మహత్యల మెజారిటీలతో
విలువలేని విజయఢంకా మోగిస్తూ
మహిళాసక్తులతో, మహిళా శక్తులతో ప్రమేయంలేని
కుళ్ళు వ్యవస్థలో
నైతిక విలువలు లేని నేలపై నిలువ నీడలేదు మాకు
క్షణం క్షణం భయంతో శరణాగతులమైన మాకు
ఏ రక్షణ కల్పిస్తారు?
చట్టాలను చేసి పట్టాలను పంచి
రేషన్లను రిజర్వేషన్లను పెంచి
కంటితుడుపు చర్యలతో మభ్యపెట్టలేరు
రాజకీయాల రంగుల బొమ్మలుగా జేసి
వారపు అంగడి బొమ్మలుగా మలచి
మూసీలో విసిరేస్తే కమలాలమై వికసిస్తాం
ఝాన్సీలై జన్మిస్తాం.
చట్టాల చిట్టాలలో ముక్కిపోయి
అవినీతి కంపు కొడుతున్న మీ సెక్షన్లని సవరించండి.
వధువుగా అమ్ముడై అనాడు వరుని కొనుక్కొని ఈనాడు
కన్యలుగా కాటికేగి కన్నవాళ్ళ కడుపుతీపి కాటిసుంకంగా
చెల్లించి
నవమాసాలు మోసి ప్రాణాన్ని ఫణంగా పెట్టి
జన్మనిచ్చిన తల్లి కులం చెల్లదనే పిచ్చి వ్యవస్థలో
దమ్ముంటే మార్చండి అస్తవ్యస్త అసమర్థపు చట్టాల్ని
మాతృదేశాన్ని మానభంగం చేస్తున్న రాజకీయ వ్యవస్థలో
మాతృత్వానికి విలువలేదు.
పనిరేటు లింగ భేదంతో కాదు
శక్తిసామర్థ్యాలు మేధోసంపత్తితో
జంతుజాలాలు చెట్టుచేమలు
ప్రకృతిలో లీనమై స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటుంటే
పురుషహంకార వికారాలను ప్రతిక్షణం వాంతి చేసుకుంటూ
కబంధ హస్తాల మధ్య నలిగిపోతున్నాం
అమలు జరగని సమాన ఆస్తిహక్కులు
వరకట్న మద్యనిషేధాలు
మహిళా కోర్టులు
నిజంచూసిన కనుగుడ్లను పీకి
నల్లకోటు జేబులో వేసుకొని
అత్యాచారం జరిగి ఆత్మహత్య చేసుకోలేక
న్యాయంకోసం బోనెక్కితే
శరీరంతోపాటు ఆత్మని ముక్కలు ముక్కలుగా చేసి విస్కీలో
మంచుముక్కలా తాగే న్యాయవ్యవస్థలో
ద్రోహికి, దోషికి శిక్ష విధించగలరా?
లేక
ప్రతి మహిళా మానప్రాణాల రక్షణకి
బులెట్ ప్రూఫ్ జాకెట్, ఏకపార్టీసెవెన్ గన్ ఇవ్వగలరా?
ఇంటికోడలు అగ్ని ప్రమాదానికి గురైతే
అత్త ఆత్మరక్షణకి ఏ ఆయుధం వాడిందో
సిబిఐ దర్యాప్తు జరిపించగలరా?
నీలిచిత్రాలు, బూతు సాహిత్యం ప్రేరణలతో
వావి వరసలు మరచి వయో పరిమితులు దాటి
విషపు కాటుతో
నాలుగేళ్ళ పసిమొగ్గల్ని సైతం నేలరాలుస్తుంటే
చేతులు ముడుచుకున్న చట్టం చేతులు పొడుగని డప్పు
కొట్టుకుంటుంది
సిఎంలు, పిఎంలు దీక్షాసులుగా కాదు
డీజండర్లుగా మారితే
మా ఆత్మఘోషలు అర్థమవుతాయి
భూమ్మీద సగమైన మేము పార్లమెంటులోనూ సగమైతే మా
సమస్యల్ని మేమే పరిష్కరించుకుంటాం.

**అనువాద కథ**

# రంగు వెలిసిన కల



వనజ తాతినేని.

"ఏమే, ఏ లోకంలో వున్నావ్ నువ్వు, అసలు భూలోకంపైనే నివసిస్తున్నావా, పాతాళ లోకం లోనా!?ఎన్ని సందేశాలు పంపాను. ఒక్కదానికి సమాధానం లేదు. ఇవాళ నీకిష్టమైన రోజు కదా, అందుకే వచ్చానిలా" అంటూ ఆమెను చుట్టేసింది స్నేహితురాలు.ఆ చేతిలో ఓ కానుక. లిల్లీ పూల గుచ్ఛం. స్తబ్దత నిండిన గదికి మదికి చైతన్యం ఇచ్చేలా.

నవ్వి స్నేహితురాలి ఆలింగనం నుండి దూరంగా జరిగింది ఆమె.

"ఎన్నాళ్లిలా జఢత్వంలో మునిగి వుంటావ్. జీవితం అంటే విద్యార్థులు బోధనలే కాదు స్పందన సంతోషం కూడా వుండాలి. ఏమంటావ్ మరి"

మౌనం వహించింది.

"నువ్వింకా అతని ప్రేమలో వున్నావా" ఆశ్చర్యంగా ప్రశ్నించింది. "లేదు లేదు, తనువు మనసు రెండూ గాయపడ్డాయి, వైరాగ్యం వచ్చేసింది" "ఏం జరిగిందసలు? తెలుసుకోవచ్చా నేను, నీకు అభ్యంతరమైతే వద్దులే మరి"

అనునయించే ఆత్మీయురాలి ముందు తన అంతరంగాన్ని విప్పి చెప్పడం మొదలెట్టింది ఆమె. స్నేహితురాలు ముందు గది వైపు వెళ్లి ఒకసారి బయటకు చూపు సారించి ఓరగా తలుపు మూసి వచ్చింది.

★ ★ ★

పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం నేను యూనివర్సిటీ లో చేరిన కొద్దిరోజుల్లో అతన్ని చూసాను. పదేళ్లైనా ఎంత గుర్తుందీ అంటే.. అది ఈ వేళే జరిగినట్టు. సహాధ్యాయిని తో కూడి నడుస్తున్నాను. "పసిపాపల నిదుర కనులలో ముసిరిన భవితవ్యం ఎంతో

గాయపడిన కవి గుండెలలోరాయబడని కావ్యాలెన్నో ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో... గుంపు మధ్యలో నుండి చీల్చుకువస్తున్న ప్రశ్న గేయ.. నా అడుగుల వేగాన్ని మందగింపజేచింది. పిచ్చాపాటి మాటలు ఆగిపోయాయి. అసంకల్పితంగా గుంపు వైపు కాళ్లు కదిలాయి. కరతాళ ధ్వనులతో పాటు ఒన్స్ మోర్ ప్లీజ్! అభ్యర్ధనల్లో నా గొంతు కలిసింది. మునివేళ్లపై కాళ్ళు పైకెత్తి నా ముందున్న వాళ్ళ భుజాల పైనుంచి ఆ గాయకుడిని చూసాను. ఎడమ మోచేతిపై తలను ఆనించి విలాసంగా సిమెంట్ బెంచీ పై పడుకుని వున్నాడు. అతని కాళ్ళు బెంచీపై కూర్చున్న వేరొకరి ఒడిలో. మిత్రుడు కాబోలు. తల్లి బిడ్డ పాదాలను ప్రేమతో సవరించినట్లు సవరిస్తున్నాడు. ఎండ తగలకుండా పనామా కేప్ ను ముఖం పై పెట్టుకుని వున్న అతను కేప్ ను తలపైకి జరుపుకుని ఒకసారి చుట్టూరా చూసాడు. వేగవంతంగా అందరిని చూసిన కళ్లు వెనుకనున్న నా వైపు చూసి నిలకడగా నిలిచి విశ్రాంతి తీసుకున్నాయి. ఆపై గొంతు సవరించుకుని. గేయాన్ని అందుకున్నాడు. భావవాహిని గాన వాహిని పరిసరాలను స్తంభింపజేసింది. పాట పూర్తవగానే అతను లేచి గుంపును చీల్చుకొని వడివడిగా నడిచాడు.అతని వెనుక యువకులు యువతులు పరుగుదీసి పోటీ పడి అతనికి అభినందనలు తెలుపుతున్నారు. నేను ఉన్నచోటనే నిలబడి చూస్తున్నాను.

అతనిది మోహన రూపం మధుర గాత్రం. నా కన్నె హృదయాన్ని తెరవబోతున్న తాళం చెవిలా ఉన్నాడతను. నిత్యం పాట కోసమో అతని కోసమో వెతుక్కొంటూనే వున్నాను. నెలలు గడుస్తూ వున్నాయి. అతను కూడా నన్ను చూస్తూనే వుండేవాడు. సూటిగా కళ్లల్లో కళ్లు పెట్టి చూస్తూ కలవరం కల్గించేవాడు. యూనివర్సిటీ ప్రాంగణంలో వొంటరిగా తిరిగే స్త్రీ కాని పురుషుడు కాని వుండటం అరుదుగా కనబడే దృశ్యం.చదువులు పెరిగినట్టు నవీన సంస్కృతి అలవడింది కదా! అలాంటిచోట నేను వొంటరిగా వుండటం చూపరులకు వింత. వారికి తెలియదు అతని ఊహల తోడుగా నేను జంటగా వున్నానని, ఎద నిండా మథనం జరుగుతూనే వుందని. నోరు విప్పి మాట్లాడనన్నమాటే కానీ రాసుకునే కవిత్వం నిండా అతనితో మాటలే, అతని కథలే.అతను పాడుతున్నప్పుడు ఉపన్యసిస్తున్నప్పుడు మగ నెమలి పురి విప్పి ప్రదర్శన చేస్తున్నట్లుగా ఆడ నెమళ్ళు మగ నెమలి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లుగా అనేకమంది స్త్రీలు అతన్ని చుట్టుముట్టి వుండేవారు. అతను నాకు కాకుండా పోతాడేమోనని బెంగ నన్ను వెంటాడేది. అదేమిటో.. అతన్ని చూస్తూనే వశం తప్పేది మనసు.

"నా హృదయం నా మనసు నా శరీరం అన్నీ నువ్వే. నా ప్రేమ మాత్రమే కాదు నువ్వు నా జీవితం" అనుకుంటూ లోలోపల పలవరించేదాన్ని. గొంతు దాటి బయటకు రాని భావావేశమేదో మూగ బాధై గుండెను మెలిపెడుతూనే వుండేది. ఏ క్షణాన అతన్ని కలగన్నానో ఆ క్షణం నుండి నా మనసు మనసులో లేదు. అతని దొంగ చూపులు కూడా నాతో దాగుడుమూత లాడినట్లు నను వెంటబడి తరుముతున్నట్టే వుండేవి.

నా తలపు వలపు గమనించిన సహాధ్యాయి నన్ను హెచ్చరిస్తూ వుండేది. మనలా అతను చదువు కోసమే అక్కడికి రాలేదు అతనికి సంఘాల తోను ఉద్యమాలతో సంబంధం వుంది. వారిదంతా వేరొక ప్రపంచం. మనం వారితో కలవలేం. కలిసి మనలేం. ముందుకెళ్ళకు" అంది. అవన్నీ నాకభ్యంతరంగా తోచలేదు. వీలైతే అతని మార్గంలోకే నేను వెళతాను. లేదా అతని బిడ్డలకు తల్లినై అతని ఆశయాలతో పెంచుతాను అనుకున్నాను మనసులో. చూపుల సంభాషణల తోనే ఆ సంవత్సరమంతా అలా గడిచిపోయింది. సంవత్సరాంతర సెలవులు. ఇంటికి వెళ్ళాలి.రెండు మాసాలు అతన్ని చూడకుండా వుండగల్గడం అసాధ్యం. ప్రాణాన్ని వదిలేసి పోగలనా!? అతను నదికి ఆవలి వొడ్డునున్న నగరంలో స్నేహితులతో కలసి వుంటున్నాడని లోకల్ రైలు లో ప్రయాణించి యూనివర్సిటీకి చేరుకొంటాడని తెలుసుకున్నాను. అతన్ని కలిసి నా మనస్సు విప్పి చెప్పాలని ఆ నగరానికి వెళ్ళాను. అతని స్నేహితునితో కబురు పంపాను.రాలేదతను. పరిచయస్తులు యిచ్చిన సమాచారంతో అతను తిరిగే తావులన్నీ వెతికాను.ప్రయాస వృధా అయింది. పగటి కాలమంతా ఓపికగా నది తీరంలో కూర్చున్నాను. కానీ రాత్రి సమయం అవుతున్నా అతను కనబడకపోవడంతో నిరాశగా హాస్టల్ గదికి చేరుకున్నాను. వారం రోజుల తర్వాత యూనివర్సిటీ లో ఒంటరిగా కనిపించాడు. అతన్ని సమీపించాను. ఎన్నో చెప్పాలనుకున్న నేను ఒక్కసారిగా మూగదాన్ని అయిపోయాను. ఎట్టకేలకు నోరు పెగిల్చుకొని "అలా షికారు కి వెళదామా మీ నగరానికి. నది వొడ్డు చాలా బాగుంది" అని అడిగాను. "పని వుంది. బేనర్ లు వేయాలి కరపత్రాలు తయారుచేయాలి" అన్నాడు.

బిడియంగా అతని పక్కనే కూర్చొని చేతి వేళ్ళు చూసుకుంటూ నేను ప్రేమిస్తున్నాననే సంగతిని చెప్పాను. సమాధానంగా సన్న నవ్వు నవ్వాడతను.సిగ్గు పడి లేచి వచ్చేసాను.

★ ★ ★

ఆ నగరానికి ఈ నగరానికి మధ్య కొండలను కలుపుతూ వంతెన. కింద పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న నది. అవిశ్రాంతంగా తిరిగే వాహనాలు. నడకదారిలో చేతిలో చెయ్యేసుకొని తిరుగుతున్న యువ జంటలు. వారిని చూస్తూ తమ జీవితాల్లో అలాంటి కాలం కరిగిపోయిందని భారంగా నిట్టూర్చే చిన్నపిల్లల తల్లిదండ్రులు. సాయంత్రపు నడక కోసం వచ్చి కుర్ర జంటల చిలిపి చేష్టలను ముద్దు ముచ్చట్లను చూసి ముఖం చిటపడలాడించుకుంటూ వెరపు లేదని గొణుక్కొంటూ తిరుగుతున్న వృద్ధులు. ఎవరి పనుల్లో వారుండగా తన పనిలో తామున్న నీటిలోని కొంగలు. ఇవన్నీ చూస్తూ నేను. అక్కడ నేను వుండటానికి కారణం వుంది. అతను కలుద్దాం అన్నాడు. ఎగిరి గంతేసింది హృదయం. ఉత్సాహం పొంగిపొర్లుతుంది.. పాట పెదాలపైకి తన్నుకొస్తుంది. ఇష్టమైన పాట తనన తననన తనన తననన

తనన తననన తానన తననననా.. హమ్ చేస్తూనే వున్నాను. ఆత్రం భూమి మీద నిలవనివ్వడం లేదు. చెప్పిన సమయానికన్నా ముందే అక్కడికి చేరుకున్నాను. వంతెన ఆ చివర నుండి ఈ చివరి వరకూ చూపులతో జల్లెడ వేస్తున్నా. చెప్పిన సమయం దాటిపోయింది. అతనొస్తున్న జాడ కనబడలేదు. వస్తాడో రాడో నన్న అనుమానం పొడజూపింది. ప్రకృతిని పరిశీలిస్తూ కూర్చున్నాను.అంతకన్నా చేయగల్గింది ఏముంది గనుక.

నది మధ్యలో చీలిన ఒక పాయ వెంబడి అక్కడక్కడ పెరిగిన రెల్లు పొదలు. దట్టంగా పూసిన రెల్లుపూలను చూస్తుంటే నదిలో ఉవ్వెత్తున లేచిన సముద్ర కెరటాల్లా గోచరించాయి. ఆ రెల్లు పూలకు కిరీటం పెట్టినట్లుగా మెరుస్తున్న సాయంకాల సూర్య కిరణాలు. ఓహ్. ఎలాంటి అద్భుత దృశ్యాలకు ఆనవాలం ఈ నదీతీరం!! ఇలాంటి అద్భుతమైన దృశ్యాన్ని అతనితో కలసి పంచుకోలేనందుకు చింతించాను. ఎంతకీ రాడేమిటి విసుక్కుంది మనసు.నారింజ రంగులో వున్న సూర్యుడు ఎర్రని రంగులోకి మారి కొండల మధ్య అదృశ్యమవ్వకముందే మరో దిక్కున చంద్రోదయం. లోన హర్ష రాగ నాదం బయటేమో వెన్నెల ధారాపాతం. నది నీటిలో అలల పడవపై తేలి ఆడుతున్న చంద్రుడు. నది ఒడ్డున వరుసగా పెంచిన పున్నాగ చెట్లు. పూచిన పూలలో వీచే గాలిలో సుమధర పరిమళం. అతని గురించిన ఊహలతో తనువంతా అదో మైకం.

ఎట్టకేలకూ గంట నిరీక్షణ తర్వాత అతనొచ్చాడు. దుమ్ము కొట్టుకుపోయిన శరీరం చిరిగిన బట్టలు. అలసిన కళ్ళలో ఎర్రని జీరలు. చాలా ఆలస్యం అయినట్లుంది కదా అంటూ చేయందుకున్నాడు. ఆ మునివేళ్ళ స్పర్శకి ఒళ్లు ఝల్లుమంది.

"అలా నడుస్తూ మాట్లాడుకుందాం పద" అన్నాను చొరవజేసి. ఈ పున్నమి వెన్నెల రేయంతా అతని చేతిలో చెయ్యేసుకుని తిరుగుతూ చంద్రుడికి వీడ్కోలు పలకాలని ఆశగా వుంది. అతనవేమి పట్టనట్లుగా నా చేతిని వొదిలేసి నాలుగడుగుల దూరంలో నాకు అందకుండా ఈలపాట పాడుకుంటూ వెళ్తున్నాడు. అతని వేగాన్ని అందుకోవడానికి నేను అమిత ప్రయాస పడాల్సి వచ్చింది. ఇంత ఆహ్లాదకర వాతావరణంలో ప్రేమికులు ఇలాగేనా మసలడం!? నిస్పృహ కలిగింది. పున్నాగపూల పరిమళం. చుట్టూ పరికించి చూసాను. దూరంగా పచ్చని పచ్చికపై ఒత్తుగా రాలిన పున్నాగపూలు. సంభ్రమంగా అటువైపు నడిచి కొన్ని పూలను యేరుకున్నాను. అతను నన్ను చూస్తూ పక్కనున్న ఆమెతో మాట్లాడుతున్నాడు. ఆ మాటలు యెంతకీ తెగడం లేదు. ఓ బెంచి బల్లపై కూర్చుని పున్నాగ పూలను జడలా అల్లుతూ కూర్చున్నాను. ఆ బెంచీ పైనే కూర్చుని వీలైతే అతని హృదయానికి దగ్గరగా తలవాల్చి అతని పాటలో లీనమైపోవాలి అని మధురోహలు చేసాను. ఎంతకీ అతని సంభాషణ తెగేటట్టు లేదు. లేచి వెళ్ళి మాలలమ్ముతున్న పూలమ్మి దగ్గర ఆగి

ఒక్కటంటే ఒక్క గులాబీ పువ్వు ను అదీ ఎఱ్ర గులాబీ ని కొన్నాను. చేతినిండా లిల్లీ పూల గుచ్ఛాలను కొన్నాను.అడిగి మరీ గుండ్రంగా బంతి లాంటి లిల్లీ పూల చెండును కట్టించుకొన్నాను. అప్పుడొచ్చాడతను. దగ్గరకొచ్చి విసుగ్గా ముఖం చిట్లించి ఇవి ఇప్పుడు అంత అవసరమా? అన్నాడు. పున్నాగపూలన్నా లిల్లీపూలన్నా నాకు చాలా యిష్టం. అవి రెండూ అక్కచెల్లెళ్లేమో, ఎంత సుమధుర పరిమళం అనీ.. అంటూ గులాబీని అతనికి ఇచ్చి "ఐ లవ్యూ" అన్నాను.

అతను నవ్వి.. "నా గది ఇక్కడకు దగ్గరే. అదిగో లైబ్రరీ ప్రక్కన కనబడుతూ వుందే అదే! వెళ్దాం పద" అన్నాడు.

అతని పక్కనే నడుస్తూ.. అశువుగా కవిత్వం వినిపించాను.

"వెలుగు నీడల త్రోవ ప్రక్కన నిలబడి రేయింబవళ్ళ క్రీడని చూస్తున్నాడు చంద్రుడు మంచు దుప్పటి కప్పుకున్న ధరణిపై చందనాలు చల్లిపోవగా వచ్చాడు చంద్రుడు తాంబూలంతో పండిన పెదవులతో ఎవరో ముద్దాడినట్లు ఉన్నాడు చంద్రుడు

మూసిన తలుపులని తడుతూ ఇల్లిల్లూ తిరుగుతూ పెత్తనాలు చేస్తున్నాడు చంద్రుడు పడతి ప్రేమలో తడిసి విరహ వేదన చెంది ఆ చెలిని కూడ మబ్బు చాటుకేగెను చంద్రుడు" పూర్తి చేసి అతని చేతిని ముద్దాడుతూ.. నువ్వు నా చంద్రుడివి అన్నాను. కొంటెగా కనుగీటుతూ.. భుజంపై చెయ్యేసాడు. నా సగము మేని తానైనట్టు పరవశం.

అతను నా పక్కన నడుస్తూనే ఎదురుపడే అమ్మాయిలను పరీక్షగా చూస్తున్నాడు. పార్క్ లో వొంటరిగా వున్న ఒక స్త్రీని ఆగి మరీచూస్తున్నాడు. ఆ యువతి కూర్చున్న భంగిమ వస్త్రధారణ తేడాగా వుంది. అతను వెనక్కి మళ్లీ ఆమెతో మాట కలిపి వీడుతున్నప్పుడు వెకిలిగా ఒక అశ్లీలపు మాటను విసిరాడు.

"వారు ఎవరైనా ఎలాంటి వారైనా కానీయ్ , స్త్రీల గురించి అలా మాట్లాడటం అసహ్యంగా వుంది, నాకు నచ్చలేదు" అన్నాను కోపంగా.

"ఇందులో తప్పేముంది. నా ఉద్రేకాన్ని రెచ్చగొట్టే ఏ స్త్రీని వొదులుకోకూడదు అన్నది నా సిద్ధాంతం. రేపు చూడాలి దీని సంగతి" అన్నాడు ఆ స్త్రీని ఉద్దేశించి. ఆ మాటతో అతని స్వభావం పూర్తిగా అవగతమైనట్లైంది నాకు.

"చాలామంది స్త్రీలతో సంబంధం వుందా నీకు" "ఉంటే మాత్రం నీకెందుకు అభ్యంతరం" "కనీసం నా ఈ ప్రశ్నకైనా ఆకుకు అందకుండా పోకకు కందకుండా సమాధానం ఇవ్వొచ్చుగా"

నా ప్రశ్నకు సమాధానమివ్వకుండా.. "ఆర్ యూ వర్జిన్" కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా అడిగాడతను. సమాధానం చెప్పేలోగానే అతని పెదాలపై వెకిలి నవ్వు వెటకారమైన మాటొకటి నా చెవిని తాకింది.

"అవును" అని చెప్పాలనుకున్న మాట ఆగిపోయింది. ఉండేలు దెబ్బ కి విలవిలలాడి కుప్పకూలిన పక్షిలా మనసు. భుజంపై చేయి తోసేసి వడివడిగా పార్క్ బైటికి నడిచాను. రైలు స్టేషన్ వైపు నడుస్తూ ఆలోచించాను.

అతని నడకలో కానీ నడతలో కానీ పట్నవాసపు పట్టభద్రుడి సంస్కారం లవలేశం కూడ గోచరించడం లేదు. పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన నాకు ఆ అశ్లీలపు మాటలు వినడం ఎంత అలవాటైనా సరే అవే మాటలు ఇంకో భాషలో అతని నోట వినడం అసహ్యంగా వుంది. పుస్తకం ముఖ చిత్రం అందంగా వున్నంత మాత్రాన లోపల వున్నదంతా చదివించదగ్గ విషయం కాదేమో అన్న ఆలోచన నాకెందుకు కల్గలేదో! విచారించాను. ఇదంతా అతని గురించి నేను ఉన్నతంగా ఊహించుకోవడం వల్ల వచ్చిన చిక్కు. కానీ అతనిలో వున్నది వున్నట్టుగా స్వీకరించడం మానేస్తే అతను నాకు దక్కకుండా పోతాడు. అలా జరగడానికి వీల్లేదంతే! ఎంతగా ప్రేమించానతన్ని నేను!!!జార విడుచుకుంటానా!? బంధమై అల్లుకోవడమే నా లక్ష్యం.

అతనిని మనసారా వాంఛించి మోహించి రాబోయే మధురక్షణాలను పదే పదే ఊహించుకుంటూ నిత్యం మురిసిపోవడం కలలు కనడం కంటే ఆ క్షణాలను అనుభవిస్తే పోలా! ఇప్పుడే అనుభవిస్తే పోలా! అనవసరపు అలకలు ఈ మాట పట్టింపులు ఎందుకు! పైగా నాకెంతో ఇష్టమైన శరత్పూర్ణిమ నాటి ఆహ్లాదకర రేయిని చెడగొట్టుకోవడం ఎందుకు? క్షణంలో మనసు మార్చుకుని వెనుదిరిగి అతనున్న ఇంటి వైపు దారి తీసాను.

అపరిశుభ్రంగా వున్న వీధి గుమ్మంలో నుండి అడుగులు వేస్తూ మేడ యెక్కుతూ చుట్టూ చూసాను. మనుష్య సంచారం పెద్దగా లేని వీధి. పాత కాలపు మిద్దె అది.ఇరుకుగా దుమ్ము పేరుకున్న మెట్లు. నేను వెళ్లే సరికి అతను పుస్తకాలు ముందు కూర్చుని వున్నాడు. నన్ను చూసి.. "వచ్చావా, రా, మరి ఇందాక అంత బెట్టుపోవడం ఎందుకో" అన్నాడు ఎగతాళిగా.

గాలి వెలుతురు లేని ఇరుకుగది అది. రంగు మాసిన చిత్రాలు బూజు పట్టి కళావిహీనంగా వున్నాయి. చేగువేరా లెనిన్ ఇంకా నాకు తెలియని ఎవరెవరివో చిత్రాలతో పాటు చలనచిత్ర నాయికలు. అరవై కేండిల్ బల్బు వెలుగు చిమ్ముతున్న మసక వెలుతురులో కనబడిన దృశ్యం. చెల్లాచెదురుగా పడి వున్న పుస్తకాలు, విడిచి విసిరి పారేసిన బట్టలు, ఖాళీ మద్యం సీసాలు తిని పడేసిన ఆహార పొట్లాలు. ఆ అపరిశుభ్ర వాతావరణం చూసి జుగుప్స కలిగింది. ఒక్క క్షణం అడుగు వెనక్కివేసాను. ఈ గదిలో మానవ మాత్రులేనా నివసించేది అని సందేహపడ్డాను. మళ్ళీ అంతలోనే బ్రహ్మచారుల నిరుద్యోగుల ఉమ్మడి వసతి గృహం ఎలా వుంటుందిలే ఇలా కాకుండా అని మనసుకు సర్ది చెప్పుకున్నాను.

అతనికి తనపై తనకు శ్రద్ధ లేదన్న ఆరోపణలో నుండి జాలి పుట్టుకొచ్చింది. శ్రద్ధగా చూసుకోవడానికి నేనో లేదా నా లాంటి వారు ఎవరో వొకరు ముందు ముందు రాకపోరులే అనుకున్నాను. అయినా ఈ మనిషికి పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడంలోనే ఆరోగ్యం వుంటుందన్న స్పృహ కూడా లేదేమిటో! పోనీ చేయదగ్గ ముఖ్యమైన పనులు వున్నట్లు వుండదు. నలుగురిని వెంటేసుకొని రికామీ గా తిరగడం తప్ప. తన ఆరోగ్యంపై తన దేహం పై శ్రద్ధ లేనివాడు గొప్ప గొప్ప ఆశయాల కోసం ఇతరుల జీవితాల్లో వెలుగు నింపడం కోసం ఏ మాత్రం పనిచేయగలడు? అలా అని అతనికున్న అంకిత భావాన్ని శంకించలేను అనుకుంటూ ద్వందరీతిలో పొంతనలేని ఆలోచనలెన్నో చేసాను.

నేనిప్పుడే వస్తానంటూ అతను బయటకు వెళుతూ "కంగారు పడకు" అన్నాడు. ప్రశ్నార్ధకంగా చూసాను.

"నా రూమ్మేట్స్ ఎవరైనా రావొచ్చు. అమ్మాయిలను తీసుకురావడమే నీ పనా అని కోప్పడతారు. నేను గదికి తాళం పెట్టి వెనుక వైపు నుండి వస్తాను "

వెనుక వైపు తలుపున్న సంగతి నేను గమనించనే లేదే అనుకుంటూ.. కిటికీ దగ్గరకు నడిచాను. బయట కనబడినంత మేరా పచ్చగా ఆహ్లాదంగా వుంది. ఆ పచ్చదనంపై వెన్నెల విరజిమ్ముతూ పలుచగా పొగమంచు పరచుకుంటూ వుంది.ఆ వెనుక నదీతీరం. ఈ మురికి గది కన్నా బయట ఎంతో హాయిగా వుంది. అతను వచ్చాక ఆ సంగతి చెప్పి ఆరుబయలు విహారానికి వెళితే బాగుండును అనుకుంటూ చేతిలోని లిల్లీపూల గుచ్ఛాన్ని నీళ్లు పోసిన గ్లాసులో అమర్చి లైట్ ఆపేసి కిటికీ దగ్గరకు నడిచాను. వెన్నెలతోపాటు బయట విసిరి పారేసిన చెత్తను చూసాను. మొదట మాములుగా తర్వాత పరీక్షగా. చూస్తున్నవి తొడుగులు అని అర్ధమయ్యాక ఎందుకో తేలికగా తీసుకోలేకపోయాను. మనసు ముడుచుకుంది. ఈ కాలంలోనూ అతనికి కూడా ఇదంతా సాధారణమైన విషయం కదా! ఎందుకంత ఆలోచన!? అని బుద్ధి మందలించింది.

అతను వెనుక వైపు నుండి లోపలికి వచ్చాడు.తలుపు గడియ వేసి రావడం రావడం జబ్బను పట్టుకుని మూలనున్న చాప వైపు లాక్కుని పోయాడు. నివ్వెరపోయాను, ఏమిటలా జంతువులా! అవే నయమేమో !

అతని చర్యను మనస్సు తిరస్కరిస్తుంది.ఒక్కోసారి చేతి వ్రేళ్ళ కొనల మృదు స్పర్శే మనోహరం. మరోసారి బాహు బంధమే దుర్భరం. అవును,అడిగి అడగని మధ్య వ్యత్యాసం అనంతం కదా!

ఉత్తర క్షణం అతని నుండి విడిపించుకుని వెళ్లిపోతే! అంతకన్నా అపహాస్యం ఇంకోటి వుందా!? ఆలోచిస్తున్నాను. ఆ క్షణాన ఆ వైరుధ్యాల వల్మీకంలో నుండి కోరిక బుస్స్ న పైకి లేచిందేమో! అతని నడుమును చుట్టేసిన నా చేతులు.

ఇద్దరం లేచి బట్టలు ధరించాక "పద పద..త్వరగా నిన్ను బయటకు పంపాలి. వాళ్లొస్తే గదిని సానికొంప చేస్తున్నానని నన్ను గిరాటు వేస్తారు". అంటూ భుజం పట్టుకొని ముందుకు తోసాడు.వెంటనే చేయి పట్టుకుని వెనుక తలుపు గుండా బయటకు తీసుకొచ్చి కొన్ని అడుగులు వేసిన తర్వాత ఏదో మర్చిపోయినట్టు లోపలికి వెళ్లాడు. తిరిగొచ్చి నేను గదిలో వుంచిన లిల్లీపూల గుచ్ఛాన్ని రోడ్డు పక్కన విసిరేసాడు. నా చేతిలో వొక వస్తువుని వుంచి " ఈ సారి వచ్చేటప్పుడు ఇవేమి పెట్టుకొని రాకు,గాజులు కూడా" అన్నాడు. గుప్పిట తెరిచి చూస్తే అది నా లోలాకులలో ఒకటి. "ఇక్కడి నుండి త్వరగా వెళ్ళు" తరిమినట్లు అనేసి వెనక్కి మళ్లాడు.

మనసు పడిన వాడితో సమాగమానికి మధురోహలతో చెంగు చెంగున గెంతిన మనసు ఒక్కసారిగా టప్ మని గాలి తీసిన బుడగలా అయిపోయింది. కొసరి కొసరి తీపి ముద్దులతో మృదువుగా హృదయరంజకంగా మధురంగా సాగాల్సిన క్రీడ, యాంత్రికంగా ఆత్రంగా అనుభూతి రహితంగా నా శరీరాన్ని ఆక్రమించుకోవడాన్ని మనసు జీర్ణం చేసుకోలేకపోతుంది. అంతే కాదు నన్ను దాహం తీరిన తర్వాత గ్లాసును పక్కన పెట్టినట్లు పెట్టేయడంతో దిమ్మెరపోయాను. శృంగారంలో రకరకాల ఉద్దీపనలు వుంటాయని చదివాను.ఏవేవో ఊహించాను. అవేమి లేకుండా ఏక పక్షంగా భౌతిక సుఖం జుర్రుకోవడం రేప్ తో సమానం. కాకపోతే ఆ కలయిక నా అంగీకారంతో జరిగింది కాబట్టి అంతటి మాట నేను అనలేను. ఏ మాత్రం రసావిష్కరణ లేని నా తొలి సమాగం అది.

చెబుతున్న ఆమె కంఠం వణికింది.

ప్రతి స్త్రీ యవ్వన ప్రవేశకాలం నుండి తమ తొలి సమాగం కోసం ఎన్నో కలలు కంటారు. కానీ నా దురదృష్టం ఏమిటంటే... ఎవరిని కల కన్నానో అతనే నిరాశను మిగిల్చాడు. అతను వీధిలో నన్ను వదిలేసి వెళ్లాక శూన్యం నిండిన మనసుతో రైలు స్టేషన్ చేరుకొన్నా. శరత్పౌర్ణమి వెన్నెల నగరంపై దేదీప్యమానంగా వెలుగుతుంది. నా లోపలేదో చీకటి కుమ్మరించినట్లువుంది. తెలిమబ్బు తునకలు వినీలాకాశంలో వొక్కొక్కటి తేలిపోతున్నాయి.నా చుట్టూరా గాఢంగా అలముకున్న లిల్లీ పూల వాసన. అప్పుడు గుర్తొచ్చింది ఎదపై దాచుకొన్న లిల్లీ పూల చెండు. నలగని ఆ చెండు ని చూసి కళ్లు చెమర్చాయి. తేలిపోతున్న కాళ్ళతో మనసు నిండా దుఃఖంతో హాస్టల్ కి చేరుకున్నాను.అతన్ని మనసారా ప్రేమించాను కాబట్టే నాకు ఈ ఆశాభంగమా,నేనతని ప్రేమకు అర్హురాలిని కాదా!?

మాటలు ఎంత శక్తివంతమైనవి. ఎదుటివారిని గాయపరచటానికి ఎన్నడూ ఉపయోగించకూడదని అతనికి తెలియదా! పైగా మాటల ద్వారానే మనుషులను సంఘటితం చేసి వ్యవస్థ పై పోరాడాలనే సంగతి అతను మరిచాడా?మిగిలిన రాత్రంతా అతని గురించి ఆలోచిస్తూనే వున్నా.

అతనిది భౌతిక వాదమే తప్ప నైతిక విలువలు కానీ ఆధ్యాత్మిక విలువలు లేని స్వేచ్ఛా జీవనం. నాలో వున్న భావుకత నా

హృదయ దౌర్బల్యానికి చిహ్నం.అది అంటు రోగం కానందుకు అతనికి అది ఏ మాత్రం అంటనందుకూ నేను చింతించడం లేదు కానీ... అతనికి స్త్రీల స్నేహం పట్ల ప్రేమల పట్ల నమ్మకం లేదు. అతని హృదయంలో ఎవరికీ స్థానం లేదు. అనేకమంది స్త్రీల సాంగత్యాన్ని అతను కోరుకుంటాడు. అశ్లీల భాషలో సంభాషణ నెరపడం అతని అలవాటు. ఆ అశ్లీల భావాన్ని అతను ఆనందిస్తాడు. అది నేను ఎలా మనసుకు తీసుకున్నానంటే తినే ముద్ద ముద్దకు పలుకురాయి తగిలినట్టు. అతని మనస్తత్వానికి సున్నితత్వం ప్రేమ లాంటివి సౌకుమార్యాలు పొసగవు. నేను వున్నది వున్నట్టు స్వీకరించలేను. కొన్ని నటనలు నాకసలు అతకవు. ప్రదర్శించినా అవి ఎంతో ఎబ్బెట్టుగా వుంటాయన్న సంగతి నాకు తెలుసు. కొన్నాళ్ళు నిశ్శబ్దంగా దూరంగా వుందాం అనుకొన్నాను.అది నా మధ్యతరగతి జడ్డి మనస్తత్వం కూడానూ.

ఇంకా చెప్పాలంటే.. అతనికి రెండు గుణములు తక్కువ, తనకు తోచదు ఒకరు చెప్పినా వినడు. అతనిని వొదులుకోవాలా లేదా అన్న సందిగ్ధ దశలో వుండగానే భగవంతుడు నాకొక మేలు చేసాడు. అతని వెకిలి స్వరూపాన్ని మొత్తాన్ని నాకు ఆ మర్నాడే బయలుపరిచాడు. నాకా సమయంలో “Man is the measure of all things” అని పైతాగరస్ కోట్ గుర్తుకు రావడం సమంజసమే!

యూనివర్సిటీ ప్రాంగణంలో .. అతను గుంపుతో ఎదురయ్యాడు. చాలా కాలం తర్వాత నేనూ ఒంటరిగా లేను. నన్ను చూసిన అతని మిత్ర బృందం అతనితో సంభాషణించడం విన్నాను.

“చిలక చిక్కిందా” “మరులు గొన్న చిలక రాకేమి చేస్తుంది,దానంతట అదే గదికి వచ్చి వాలింది”. “అయితే రాత్రంతా నీకు పండగేనన్నమాట” వీపు వెనుక భళ్ళున నవ్వులు. “ఆకారం పుష్టి నైవేద్యం నష్టి. మొత్తానికి అదొక చవిటి పర్ర” ఆ మాటలు వింటున్న నా హృదయానికి తీవ్ర అఘాతం తగిలినట్టైంది. అక్కడికక్కడ భూమి యెందుకు కృంగి పోలేదోనన్న అవమానం! శరీరం వణికింది. దవడలు పిడికిళ్లు గట్టిగా బిగుసుకున్నాయి. రైలింజన్ నుండి వెలువడ్డ పొగలా చెవుల నుండి వెచ్చని ఆవిర్లు.విసురుగా వెనక్కి వెళ్ళి బేగ్ ని అతని ముఖంపై విసిరి కొట్టి అసహ్యంగా చూసి ఖాండ్రించి ఉమ్మేసాను. అతను వెకిలిగా నవ్వి అసహ్యపు మాటనొకటి వదిలి వెళ్ళాడు. నాతో వున్న గుంపు నన్ను చూసి జాలిపడింది.అవమాన దుఃఖం నన్ను కమ్మేసింది. నేలన కూలబడి పోయాను. అది సుత యూనివర్సిటీ వొదిలేసే వరకూ అతని వైపు కన్నెత్తి చూడలేదు నేను. వీటన్నింటి మధ్య కోల్పోయిందేమిటో పొందినదేమిటో నాకై నాకు స్పష్టంగా తెలుసు.శరీరం నాది,హృదయం నాది, భావనలు కూడా నావే, బాధ కూడా ముమ్మాటికీ నాదే!

ఇప్పుడు నాకు శరత్ పూర్ణిమ చల్లని వెన్నెలనూ లిల్లీ పూల గాఢమైన పరిమళాన్ని ఆస్వాదించే మనసు లేదు.అదెప్పుడో ఆవిరై పోయింది.

ఆ నాటి ప్రణయం రంగు వెలిసిన కల. మరలా కలలు కనే సాహసం కూడా చేయలేదు.

భారంగా ముగించింది ఆమె.

★ ★ ★

నిశ్శబ్దాన్ని బద్దలు చేసుకుని స్నేహితురాలి సోదరుడు లోనికి వచ్చాడు.

“మొదట నన్ను క్షమించాలి మీరు. కావాలని కాకపోయినా మీ సంభాషణను వినాల్సి వచ్చింది” అన్నాడు. ఆమె స్నేహితురాలి వైపు చురుగ్గా చూసింది. కావాలనే అతన్ని వెంటబెట్టుకొని వచ్చావు కదూ.. అన్నట్టు.స్నేహితురాలు చెవి పట్టుకొని చూపి క్షమించమన్నట్టు చూసింది.

“కనులుంది కలలు కనేందుకే కదండీ. రంగు వెలిసిన కల గురించి ఆలోచన వద్దు. ఇకపై మంచి నిర్ణయం తీసుకోండి” అని సోదరిని బయలుదేర తీసాడతను.

ఎవరితోనూ పంచుకోకూడదనుకున్న విషయం ఇలా బహిర్గతం అయినందుకు కొంత సిగ్గిల్లింది ఆమె. మళ్ళీ అంతలోనే పరాయి వ్యక్తులు ఎవరున్నారులే, ఒకరు ప్రియ నెచ్చెలి, మరొకరు నాతో జీవితాన్ని పంచుకోవాలని ఎదురుచూస్తున్న మనిషి.

★ ★ ★

మరునాడు ఆమె ఇంటికి చేరుకొనే సరికి గుమ్మం ముందు.. రెండు కుండీలు కనిపించాయి. ఒక దానిలో నాటడానికి పెరిగినంత ఓ పున్నాగ పూల మొక్క, రెండవ దాంట్లో త్వరలో విరియటానికి సిద్ధంగా వున్న లిల్లీ పూల కుదురు. కుండీలని పక్కన పెడుతూ వాటి క్రింద వుంచిన కాగితాన్ని తీసి చూసింది. అందులో... “నేనింత వరకూ ఏ స్త్రీ ని ప్రేమించలేదు. మీ పాతగాయాల పచ్చిదనమే కాదు మచ్చ కూడా కూడా మానిపోయేంత వరకూ ఎదురు చూస్తాను. నన్ను విశ్వసించి ప్రేమించగలరా!? రంగు వెలసిన కల స్థానంలో ఇంద్రధనుస్సు ని సృష్టిద్దాం మీరు వానై నేను ఎండై”

ఉద్విగ్నతకు లోనై గుమ్మం మెట్లపై కూర్చుని కనులు మూసుకుంది ఆమె. ఆనాటి రంగు వెలసిన కలను తుడిచేయగలనా నేను అనుకుంటూ.

సమాప్తం

(రష్యన్ రచయిత Panteleimon romanov Story Without cherry blossom ప్రేరణ తో)

# నీలాకాశంలో నిధి



## (పిల్లల నవల - రెండవ భాగం)

- శాంతి ప్రబోధ
హైదరాబాద్, 9866703223

ఒక రోజు పక్షి పిల్ల నేలమీద పడి గిలగిలా కొట్టుకుంది. అది నిధి చూసింది. నాన్నకి అమ్మకి చూపింది.

దాని రెక్కలకి దెబ్బ తగిలినట్లుంది. అందుకే అది ఎగరలేక కింద పడిపోయింది అని చెప్పారు. నిధికి ఆ పక్షి పిల్లని చూస్తే చాలా బాధ కలిగింది.

అయ్యో.. పాపం. వాళ్ళ అమ్మ నాన్న ఇక్కడ లేరు. ఎట్లా అని ఆ బాధ్యత తను తీసుకుంది. జాగ్రత్తగా కాపాడింది నిధి. దానికి ఆహారం పెట్టింది. నీళ్లు తాగించింది. ఊపిరి నిలిపింది. రెండు రోజుల తర్వాత ఆ పిట్ట పిల్ల కనిపించ లేదు. అయ్యో.. ఏమైపోయిందో అని కంగారుగా ఇల్లంతా వెతికింది. ఎక్కడా కనిపించలేదు దుఃఖం పొంగుకొచ్చింది.

ఏడుపు మొహంతో అమ్మకి చెప్పింది.

నువ్వేం బాధపడకు. అది ఎగిరి పోయింది. తన అమ్మని  నాన్నని వెతుక్కుంటూ పోయింది అని చెప్పింది అమ్మ.

నిజమేనా అని సందేహంగా అమ్మ మొహం లోకి చూసింది నిధి. మేము కనిపించక పోతే నువ్వు మా కోసం వెతుక్కుంటావు. అవునా.. మేం కనపడగానే మా దగ్గరికి పరిగెత్తుకు వస్తావ్ కదా. అలాగే ఆ పక్షి పిల్ల కూడా వెళ్ళిపోయింది అని అమ్మ చెప్పింది. అప్పుడు నిధి బాధ ఎగిరిపోయింది.

నేను పిట్ట పిల్లలాగా ఎగిరిపోతే..!

ఎక్కడో పడిపోతే అమ్మ లేదని నేను ఏడుస్తానా.. అమ్మ దగ్గరికి వచ్చేస్తానా..  అక్కడ ఉండకుండా అమ్మను వెతుక్కుంటూ వచ్చేస్తానా.. సందేహం. ఆ వెంటనే వచ్చేస్తాను. అమ్మ కోసం నాన్న కోసం ఏడుస్తూ వచ్చేస్తాను అనుకుంది నిధి.

నాకంటే కాళ్లు చేతులు నోరు ఉన్నాయి.  నేను ఎవరో ఎక్కడికి పోవాలో చెప్తాను. వచ్చేస్తాను. ఆ పిట్ట పిల్ల చెప్పలేదు కదా.., తన రెక్కలు చూసుకుందా.. మాట్లాడుతుందా.. అమ్మని చేరుతుందా.. మరో సందేహం వచ్చి అమ్మని అడిగింది.

అబ్బా.. మళ్ళీ మొదలు పెట్టావా.. నువ్వు నీ డౌట్లు. నాకు టైం అవుతూ ఉంది అని అమ్మ తన బడికి వెళ్ళి పోయింది. నాన్న వచ్చి నిధి భుజం తట్టాడు. ఏంటి? నువ్వు కూడా ఆ పిట్ట పిల్లలాగా ఎగరాలని అనుకుంటున్నావా అన్నారు. అబ్బా.. నాన్న భలే తెలుసుకున్నాడు నా మనసులో మాట అనుకుంది. ఊ.. అన్నది దిగులుగా మొహం పెట్టి. నాన్న కళ్ళలోకి చూస్తూ అమ్మ రకరకాల బట్టలు కొంటుంది. పక్షి రెక్కలు కొనొచ్చు కద నాన్నా. ఎప్పుడూ కొనదు. ఫిర్యాదు చేసింది. రెక్కలు అలా దొరకవు తల్లీ అన్నాడు నాన్న. ఎందుకో నిధికి ఆ మాటలు నచ్చలేదు. ఆ విషయం ఒకరోజు అమ్మని అడిగింది. ఈ సారి నా పుట్టిన రోజుకి రెక్కలు కొనమని అడిగింది. నిధి ఏమన్నదో అమ్మకి మొదట అర్థం కాలేదు. ఆ తర్వాత అర్థమయి పకపకా నవ్వింది. ఓసి పిచ్చి మొహమా.. అట్లా పక్షి రెక్కలు మనం పెట్టుకోవడానికి దొరకవు అని చెప్పింది.

ఆ.. నాకు తెలియదు. నాకు రెక్కలు కావాలి. మొన్న పిట్టపిల్ల రెక్కలకు దెబ్బతగిలి పడిపోయింది. అది బాగయ్యాక ఎగిరి పోయింది. నాకు రెక్కలు వస్తే నేను కూడా ఎగిరిపోతా  అని నీ భయం. అందుకే నాకు రెక్కలు కొనట్లేదు.  నాకు తెల్సు. ఊ.. ఊ .. నాకు రెక్కలు కావాలి దీర్ఘం తీసింది నిధి. అక్కని చూసి చెల్లెలు కూడా నాకు కావాలి అని ఏడుపు మొదలు పెట్టింది.

రెక్కలు మార్కెట్ లో దొరకవు. ఎన్నిసార్లు చెప్పాలి బడి నుంచి వచ్చిన అమ్మ విసుగ్గా అన్నది. బజారులో అన్నీ దొరుకుతాయి. కొత్త కొత్తవి ఎన్నో తయారు చేస్తున్నారు. ఎన్నిరకాల డ్రెస్సులు షాపుల నిండా.  వాటిలో ఎగిరే రెక్కలు ఎందుకు దొరకవో నిధికి అర్థం కాలేదు. చాలా సార్లు. అమ్మనడిగింది.  అవి ఎవ్వరూ తయారు చేయలేదని చెప్పింది. ఎవ్వరు తయారు చేయకపోతే నేనే తయారు చేస్తాను. నేను బాగా చదువుకుంటాను . పెద్దయ్యాక రెక్కలు తయారు చేసి ఎగిరి పోతాను. నాతో మిమ్ములను కూడా తీసుకుని పోతా అని అమ్మతో నాన్నతో ముద్దు ముద్దుగా చెప్పేది నిధి.

అమ్మమ్మ ఇంటి దగ్గరే నిధికి పక్షుల మీద ప్రేమ పుట్టింది. ఆ పక్షుల లాగా ఎగిరితే ఎట్లా ఉంటుందో అనే ఊహ మొలిచింది. ఆ ఊహే ఆకాశపు అంచులు తాకి రమ్మన్నదేమో ..

"పిట్టమ్మ పిట్ట – ఏమి పిట్ట

చిలకమ్మ పిట్ట – ఏమి చిలుక
పచ్చ చిలుక – ఏమి పచ్చ
ఆకుపచ్చ" అంటూ అమ్మమ్మ పక్షులను చూస్తూ పాటలు కట్టి పాడింది.

ఆ పాటలు వినడం, అమ్మమ్మ తో కలిసి పాడటం నిధికి ఎంతో ఇష్టంగా ఉండేది.

నిధి మాటలు విని అమ్మమ్మ చిలక పలుకుల చిన్నారి అని ముద్దుగా పిలిచేది. అమ్మమ్మ ఇల్లు, ఆ ఇంటి చుట్టూ ఉన్న మొక్కలు ఇప్పటికీ నిధికి గుర్తే.

ఇంట్లో ఉన్నా, వాకిట్లో ఉన్నా పక్షుల కిలకిలలు ఎంత హాయిగా ఉండేవో , పిచ్చుకల కిచకిచలు , రివ్వున ఎగిరే అందమైన పక్షులు ఎంత అందంగా ఉండేవి . ఒక్కోసారి చాలా పక్షులు వందలు, వేలు కలిసి ఎగురుతుంటాయి. అప్పుడు వాటిని చూస్తుంటే ఆకాశంలో మబ్బులు కదులుతున్నట్టు ఉంటుంది .

ఆ పక్షులలో ఒక పక్షి నైతే ఎలా ఉంటుంది. ఎంచక్కా అలా అలా ఎంత దూరమైనా ఎగిరి పోవచ్చు. అలసిపోతే రెక్కలు విప్పార్చి చెట్టు కొమ్మపై కూర్చోవచ్చు. ఆకలైతే ఆ చెట్ల పండ్లు తినొచ్చు బారులు తీరుతున్న కొంగల గుంపు చూస్తూ ఇవన్నీ ఎన్ని ఊర్లు చూసి వస్తాయో ..ఆకాశానికి ఆవల ఏముందో వాటికి తెలుసేమో అనుకునేది. అమ్మమ్మ ఊరు చాలా అందమైన పల్లెటూరు. పచ్చని పొలాలతో, రకరకాల మొక్కలు, పక్షులు, రంగురంగుల సీతాకోకచిలుకలతో, తుమ్మెదలతో ఎంత బాగుండేది. తను జామ చెట్టు కొమ్మ మీద కూర్చున్నప్పుడుఒకసారి జారి కింద పడిపోయింది. కానీ ఆ పక్షులు పడిపోవు. చెట్టు కొమ్మల పై రెమ్మల పై కూర్చుని దోర జామ కాయలు వెతుక్కుని ఎంచక్కా తినేస్తాయి. హాయిగా ఆకాశంలో చక్కర్లు కొడతాయి. హద్దులు లేని ప్రయాణం చేస్తాయి . ఎగిరే ఓపిక ఉంటే ప్రపంచమంతా తిరిగేస్తాయ్. అసలు రోడ్ మ్యాప్ లేకుండా, గూగుల్ మ్యాప్ లేకుండా ఎక్కడెక్కడికో ఎట్లా వెళ్లి వస్తాయి.. అది పక్షులకే సాధ్యమేమో ..అని ఇప్పటికీ అనుకుంటూ ఉంటుంది నిధి.

మనిషి విమానం కనుక్కోవడానికి కారణం పక్షే అంటారు నాన్న. నీ లాంటి వాళ్ళు పక్షిలాగా ఎగరాలనుకుని విమానం కనుక్కున్నారు అనే నాన్న పక్షి రెక్కలు ఎవ్వరూ తయారు చేయలేదు అని అంటారు. అంత పెద్ద విమానాన్ని కనుక్కున్న వాళ్ళు చిన్న రెక్కల్ని , నేను ఎగరడానికి సరిపోయే రెక్కలు కనుక్కోలేదు. ఏంటో.. ఆశ్చర్యపోతుంది

విమానంలోంచి వెళ్తే ఈ ఊర్లన్నీ ఎలా కనిపిస్తాయో.. పక్షులకు కనిపించినట్లే కనిపిస్తాయా.. ఊహించడానికి ప్రయత్నిస్తుంది . ఊహకి అందక బాధ పడి పోతుంది . ప్చ్.. విమానం ఒక్కసారి కూడా ఎక్కలేదని దిగులు పడుతుంది.

నా కన్నా ఆ పక్షులు నయం. ఎంచక్కా తుర్రున ఎగిరి ఎక్కడికయినా వెళ్లిపోతాయి. పక్షులకేసి ఆరాధనగా చూస్తుంది. ఒక్కోసారి వాటిని చూసి అసూయ పడుతుంది.

వాటిలా వినీలాకాశంలో రివ్వున ఎగిరి చక్కర్లు కొట్టి రావాలని ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది నిధి.

అమ్మమ్మ ఇంటి జ్ఞాపకాలు నిధికి ఎంతో ప్రియమైనవి. అక్కడ ఉన్నప్పుడు రాత్రి పూట మిద్దె మీద వచ్చే సన్నజాజుల వాసన ఆస్వాదిస్తుంది. అక్కడ మెట్లమీద కూర్చుని కుప్పలు పోసిన నక్షత్రాలు లెక్కించ ప్రయత్నిస్తుంది.

మబ్బుల చాటున దాగిన చందమామతో ముచ్చట లాడుతుంది.

మాటల్లో చెప్పలేని ఎన్నెన్నో అనుభూతులు మదిలో నింపుకుంటూ కలలో విహరిస్తూ ఉంటుంది నిధి.

ఊహ ప్రపంచంలోని మనవరాలిని చూసి ముచ్చట పడి పోయే వారు అమ్మమ్మ తాతయ్య.

ఆ ఊహా శక్తికి ఊతం ఇస్తూ ఆరు బయట కూర్చుని అమ్మమ్మ, తాతయ్య కథలు చెప్పేవారు.

ఆ కథల్లో ఆకాశం, పక్షులు ఉండి తీరాల్సిందే. అవి లేని కథలు అసలు కథే కాదు అనేది నిధి. ఇప్పుడయితే, ఎవరు కథ చెప్పినా ఆకాశ వీధుల్లో తిరిగే మామయ్య లాంటి వీరుడు కూడా ఉండాల్సిందే. అమ్మమ్మ తాతయ్య ఇప్పుడు లేకపోవడం నిధికి పెద్ద లోటే.

అమ్మమ్మ తాతయ్యలకి ఏం తొందరొచ్చింది. అప్పుడే చుక్కల్లో కలిసిపోయారు. వాళ్ళుంటే సెలవుల్లో ఎంచక్కా వాళ్ళ దగ్గరకి వెళ్ళేది అని చాలా సార్లు అనుకుంటుంది నిధి.

ఆకాశంలోకి చూస్తుంటే నిధి మనసు గాలిలో ఎగిరే దూది పింజల్లా ఎటో ఎటో ఎగిరి పోతూ ఉంటుంది. ఆమె ఆలోచనలు రూపం లేని మేఘాల్లా గజిబిజిగా అటూ ఇటూ ప్రయాణిస్తుంటాయి. తనలో పరుగులు పెట్టే భావాల్ని మాటల్లో చెప్పడం తెలియదు నిధికి. బొమ్మలన్నీ చిందర వందరగా కలగాపులగంగా పడేసే చెల్లెలు రిధి పనిలాగే ఆకాశం కూడా కనిపిస్తుంది ఒక్కోసారి .

తను పెయింట్ చేసుకుందామని రంగుల్ని పేపర్ ముందు పెట్టుకుంటుంది. చెల్లి వచ్చి అన్నీ కలిపేస్తుంది. ఒక్కసారి రంగులన్నీ పిచ్చి పిచ్చిగా కుమ్మరించినట్టు ఆకాశం కనిపిస్తుంది. ఆ రంగుల కలయికతో సంబరంగా చూస్తుంది నిధి.

చెల్లి అడ్డదిడ్డంగా వేసిన రంగులు చూసి ఆకాశం అట్లా అద్దుకుందా లేకపోతే ఆకాశాన్ని చూసి చెల్లి అలా చేసిందా అని ఆలోచిస్తుంది .

ఊహూ చెల్లికి తెలియదు . ఊరికే అలా అల్లరి చేసి అన్నీ ఒలకబోస్తుంది . కలిపేస్తుంది .

నా ఆకాశం అల్లరిది కాదు. మంచిది కదా .. అనుకుంటుంది . తన ఆలోచనలకు తనలో తానే నవ్వుకుంటుంది నిధి.

నిధి ఉండే ఊరు అటు పట్నం కాదు . అలాగని మరీ పల్లెటూరు కాదు. ఒక మాదిరిగా ఉన్న మండల కేంద్రం.

వాళ్ళది రెండంతస్తుల మేడ. నిధి వాళ్ళు మొదటి అంతస్తులో ఉంటారు. నిధి క్లాస్మెట్ కిషోర్ వాళ్ళు రెండో అంతస్తులో ఉంటారు.

పెద్ద వాళ్ళు డాబా మీదకి ఎక్కువ రారు .

నిధి బడి నుంచి రాగానే

ఆటలు ఆడి పాటలు పాడి – అలసి వచ్చానే

తియ్య తియ్యని తాయిలమేదో – తెచ్చి పెట్టమ్మా అని పాట పాడేది . ఆ పాట అమ్మమ్మ దగ్గర నేర్చుకుంది నిధి .

అమ్మ పెట్టిన తాయిలం తీసుకుని డాబా ఎక్కి కబుర్లు చెప్పే నిధికి ఏమైందో ఈ మధ్య ఆ పాట పాడడం మానేసింది. తాయిలం కోసం ఎదురు చూడటం మానేసింది. డాబా పైకి పోవడం మాత్రం మానలేదు.

రాత్రిపూట డాబాపై కూర్చుని ఆకాశంలోని చీకట్లోకి, చీకట్లోంచి మెరిసే నక్షత్రాలు మీరు ఎప్పుడైనా చూశారా ?

నిధికి ఆరు బయట ఆకాశంలోకి చూస్తూ కూర్చోవడం ఇష్టం. చీకటి ఆకాశంలో మిల మిల మెరిసే నక్షత్ర కాంతులు అంటే మరీ మరీ ఇష్టం. అవి ఆమెను మైమరపిస్తాయి. ఆ చుక్కల్లో చుక్కై ఆకాశంలో దాగి పోవాలని అనుకుంటుంది.

ఆకాశం , నక్షత్రాలు , మేఘాలు .. చందమామ , వెన్నెల అన్నీ తన నేస్తాలే అనుకుంటుంది. వాటిని చూస్తుంటే నిధి మొహం పూవులా వికసిస్తుంది.

తనలో కలిగే ఊహల్ని, ఊసుల్ని చెల్లికి చెబితే అర్థం కాదు. అమ్మకో నాన్నకో చెబుదామంటే వాళ్ళు నవ్వుతారేమోనని సందేహం.

తుర్రున ఎగిరే పక్షితోనో, నింగితోనో , నేలతోనో , నెలవంకతోనో, చుక్కలతోనో, మబ్బు తునకతోనో కబుర్లు చెబుతుంది. తన సంతోషం , బాధ , కోపం అన్నీ వాటితో పంచుకుంటుంది నిధి.

ఒకసారి నాన్నతో కలిసి బస్ కోసం ఎదురు చూస్తున్నది నిధి .

అప్పుడేమైందంటే ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నారు. అవి నిధిని ఆకర్షించాయి.

ఇంతకీ వాళ్ళేం చెప్పుకుంటున్నారు?

జపాన్ నక్షత్ర జలపాతం కురిపిస్తుందనీ, చైనా కృత్రిమ చందమామని తయారు చేయాలనుకుంటున్నదనీ చెప్పుకుంటున్నారు.

అదెలా జరుగుతుంది? అంతులేని ఆశ్చర్యంతో నోరెళ్ళ బెట్టి విన్నది నిధి.

నాన్నని ఆ విషయం ఎన్నోసార్లు అడిగింది.

ఈ ప్రపంచంలో ఎక్కడో ఎవరికో కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయి. వాటిని ఎలా సాధించుకోవాలా అని పట్టు పట్టి ప్రయత్నం చేసి, వాళ్ళ ఊహల్ని నిజం చేసుకుంటారు కొందరు.

బహుశా ఆ చైనా, జపాన్ వాళ్ళ తమ ఊహలని నిజం చేసి చూపించారు అన్నమాట అన్నాడు నాన్న.

చాలా గ్రేట్ కదా నాన్నా.. అడిగింది.

అవునన్నట్లు తలూపి, అవునురా తల్లీ.. అనుకున్నది సాధించే వరకు అటువంటి వాళ్ళు నిద్రపోరు. తమ కలలు పండించుకోవడం కోసం నిరంతరం కృషి చేస్తారు. లేదంటే వారి కలలు కల్లలు అయిపోతాయి.

నిధికి తన కోరిక ఎట్లాగయినా తీర్చుకోవాలన్న తపన మరింత పెరిగింది. అనుకున్నది సాధించుకోవాలి. నేను రెక్కలు కట్టుకుని ఎగరాలి అని కోరిక మరింత బలపడింది. తనకి కోరిక ఉంటే సరిపోదు. కృషి ఉండాలని నాన్న మాటలను బట్టి ఆమెకు అర్థమయింది.

రెండేళ్ల క్రితం మామయ్య పంపిన వీడియో చూసింది కదా

ఆ వీడియో నిధిపై గొప్ప ప్రభావం చూపింది.

అప్పటి నుంచి నీలాకాశంతో పాటు నీలి సముద్రం, చిక్కటి అడవి కూడా నిధి ఇష్టాల జాబితాలో చేరి పోయాయి .

ఈ మధ్య కళ్లు మూసుకుంటే చాలు పైన నీలాకాశం కింద నీలి సముద్రం నిధి ఊహా ప్రపంచంలోకి వచ్చి పదే పదే ఊరిస్తున్నాయి.

తమ మధ్యకు రమ్మని, రా రమ్మని ఆహ్వానిస్తున్నాయి .

తనే నింగికి , నేలకు మధ్య ఆకాశ వీధుల్లో జుయ్ జుయ్ అంటూ విహరిస్తున్నట్లు కలలు కనడం ఎక్కువైంది. ఆ కలలు రెక్కలొచ్చిన పిట్టలా నిజంగా ఎగిరమని ప్రోత్సహిస్తున్నాయి. ఆ దృశ్యం ఊహించుకుంటూ ఊరట పొందుతుంది నిధి. ఆ ఊహల్లోనే ఎంతో ఆనంద పడుతుంది .

మామయ్య గ్రేట్, చాలా చాలా గ్రేట్ అని చాలా సార్లు తనకు తానే చెప్పుకుంది.

నేను పక్షిలా ఎగరాలని ఎప్పటి నుంచో కలకంటున్నాను. కానీ మామయ్య.. అలా ఎగిరేసి వచ్చాడు. అచ్చంగా రెక్కలొచ్చిన పక్షిలాగే ఎగిరాడు. అట్లా ఎగిరిన దాన్ని హ్యాంగ్ గ్లైడింగ్ అంటారని చెప్పాడు. అటువంటి హాండ్ గ్లైడింగ్ నేను చేస్తానని అన్నది అమ్మతో.

ఆహ్హాహ్హా.. ఇక్కడ అటువంటి ఆటలు లేవు తల్లీ.. అన్నది అమ్మ.

మామయ్య ఆస్ట్రేలియా వెళ్ళాడు కద .. అక్కడ హ్యాంగ్ గ్లైడింగ్ చేశాడు. ఇక్కడైతే నేనెప్పుడూ ఆ పేరు కూడా వినలేదు అన్నాడు నాన్న. మరి ఎట్లా నాన్నా .. నేను పక్షిలా ఎగరాలంటే ఆస్ట్రేలియా వెళ్లాలా .. వెళదాం నాన్నా.. ప్లీజ్ ప్లీజ్ అని బతిమాలింది. ముందు నువ్వు బాగా చదువుకో.. పెద్దయ్యాక ఎలా అన్నది ఆలోచిద్దాం అని సముదాయించాడు నాన్న.

నిధి అప్పటికి మౌనంగా ఊరుకుంది కానీ ఎట్లాగయినా ఆస్ట్రేలియా వెళ్లి పక్షిలాగా ఎగిరి రావాలి. ఎప్పుడు అడిగినా రెక్కలు దొరకవు. అవి ఎవరు తయారు చేయరు అని చెప్పింది అమ్మ. నాన్నది కూడా అదే మాట కానీ ఆస్ట్రేలియాలో వాళ్ళు తాయారు చేసుకున్నారు. ఎంచక్కా ఎగురుతున్నారు. నేనుకూడా తయారు చేసుకుంటే.. నిధిలో ఆలోచన మొగ్గ తొడిగింది.

ఓ రోజు క్లాసులో టీచర్ ఒక సామెత అడిగింది. అదేంటంటే

ఆకాశం ఉంది కానీ మేఘం కాదు

తోకతో ఉంటుంది కానీ ఎద్దు కాదు

అటు ఇటు ఎగురుతుంది కానీ పక్షి కాదు. పట్టు తప్పితే చాలు – పరుగులు పెడుతుంది. ఏంటదీ --- టీచర్ పొడిచిన సామెతకి జవాబు గాలిపటం అని జవాబు చెప్పాడు ఓ అబ్బాయి. ఆ పొడుపు విడుపు నిధిని చాలా అలోచించి చెప్పింది.

గాలిపటమే ఎందుకు అవ్వాలి? హ్యాంగ్ గ్లైడర్ ఎందుకు కాకూడదు అని ప్రశ్న వేసింది? హాంగ్ గ్లైడర్ ఏంటి అని టీచర్ ప్రశ్నించింది. ఊహూ.. హ్యాంగ్ గ్లైడర్ కాదు టీచర్. ఎందుకంటే అది పడిపోదు అని తనకు తానే జవాబుచెప్పుకున్నట్లు చెప్పింది. సర్ది చెప్పుకుంటుంది.

టీచర్ కి హ్యాంగ్ గ్లైడింగ్ అంటే అర్ధం కాలేదు. క్లాసులో పిల్లలకు కూడా అదేంటో తెలియదు అని వాళ్ళ మొహాలు చూస్తే అర్ధమయిపోతున్నది.

హ్యాంగ్ గ్లైడింగ్ అంటే ఏంటి వెనక బెంచిలోంచి ఎవరో గట్టిగా అరిచారు. చెప్పమన్నట్లు నిధి వైపు చూసింది టీచర్.

అప్పుడు నిధి లేచి నుంచుని క్లాసులో పిల్లలందరి వైపు చూస్తూ చెప్పడం మొదలు పెట్టింది. మా మామయ్య ఆస్ట్రేలియా వెళ్లకపోతే, హ్యాంగ్ గ్లైడింగ్ చేయకపోతే నాకు తెలిసేది కాదేమో పక్షిలాగా మనుషులమైన మనకు రెక్కలు లేవు కదా.

బట్టలు వేసుకున్నట్టు రెక్కలు పెట్టుకోలేం కదా. అలా అతికించుకున్నా ఎగరలేం కదా.. కానీ, రెక్కల పక్షిలాంటి హ్యాంగ్ గ్లైడింగ్ చేయగలరు. మనుషులే తన తెలివితేటలతో అది సాధించారు. అందువల్లే కదా మామయ్య హ్యాంగ్ గ్లైడింగ్ చేస్తూ పక్షిలాగా ఆకాశంలో విహరించి వచ్చింది. అని చెప్పింది. అందుకే మామయ్య లాగా హ్యాండ్ గ్లైడింగ్ నేను కూడా చేయాలి. అలా చేస్తే పక్షిలా ఎగురుతున్నట్టే కదా. అలా నాకోరిక నెరవేర్చుకోవాలి.

మరి ఎప్పుడు ఎగరాలి?

అట్లా ఎప్పుడెప్పుడు ఎగరాలి? అని ఆత్రుతగా ఉన్నది నిధికి.

నేను మామయ్యలాగే హ్యాంగ్ గ్లైడింగ్ చేస్తే అందరు ఏమనుకుంటారు ? ఆ క్షణములో నాకేమనిపిస్తుందో..

నాలాగే నా ఫ్రెండ్స్ అంతా అద్భుత దృశ్యంగా చూస్తారేమో.. అనుకుని చిన్నగా నవ్వుకుంటుంది నిధి.

అసలు తన ఫ్రెండ్స్ ఎవ్వరికీ హ్యాండ్ గ్లైడింగ్ అంటే తెలియదుగా..

వాళ్ళకి చెప్పినా అర్ధమయినట్లు లేదు. వాళ్ళ మొహాల్లో ప్రశ్న కనిపించింది. ఒక్కసారి హ్యాంగ్ గ్లైడెర్ చూస్తేనే వాళ్ళకి అర్ధమవుతుంది అని అనుకున్నది నిధి.

నేనట్లా ఆకాశ మార్గాల్లో విహరిస్తుంటే నా ఫ్రెండ్స్ బుగ్గ మీద వేలేసుకుని కళ్ళు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా చూస్తూ ఉంటారేమో.. ఆ రోషన్ గాడికి నేనంటే నచ్చదుగా.. కోపంగా రాళ్లు విసురుతాడేమో.. ఏమో. లేకపోతే ఇక్కడ కూడా నాకు పోటీగా వచ్చేస్తాడేమో అనుకుంటుంది .

ఆ వెంటనే , వాడి కసలు ఈ సాహస క్రీడ గురించే తెలియదు. వాడి మొహం వాడే మొస్తాడు. రాదు అని సర్ది చెప్పుకుంది. మరి మా టీచర్స్ ఏమని అనుకుంటారో. ప్రౌడ్ ఆఫ్ యు మై డియర్ నిధి అంటారేమో.. నువ్వు మా స్కూల్ కి గర్వకారణం అంటారు కావచ్చు . ఆ ఊహకి నిధి మనసు ఆనందంతో ఉప్పొంగింది. మరి, మీకెవరికైనా తెలుసా..? మీరెప్పుడైనా విన్నారా..? లేదు కదా! కొంతమందికి మాత్రం పారాచూట్ అంటే తెల్సు అంతే కదా! ఎంత ధైర్యం మామయ్యకి ! మా మామయ్య చేసినట్లు హ్యాంగ్ గ్లైడింగ్ చెయ్యాలని అనుకుంటున్నా. కానీ, మామయ్యకు ఉన్నంత ధైర్యం తనకు ఉన్నదా..తనను తాను ప్రశ్నించుకుంది. ఆలోచించింది, ఇట్లా ఇప్పటికి చాలా సార్లే ఆలోచించింది. ఒకసారి చెట్టు కింద కూర్చుని, ఒక్కోసారి మెట్లపై కూర్చుని, మరో సారి కిటికీలోంచి ఆకాశాన్ని

చూస్తూనో రక రకాలుగా ఆలోచించింది. ఆ ఆలోచనలు ఎక్కడి నుంచి ఎక్కడికి పరిగెత్తినా చివరికి ఆకాశ మార్గంలో రెక్కల పక్షిలా విహరించడం దగ్గరకొచ్చి ఆగేవి.

కోరికలు అందరికీ ఉంటాయి . ఆశలు అందరికీ ఉంటాయి. కానీ వాటిని నెరవేర్చుకునేది కొందరే. కోరిక ఉంటే చాలదు. ఆ ప్రయత్నం మొదలు పెట్టాలి. అందుకు తగిన కృషి ఉండాలి. నీ మీద నువ్వు నమ్మకం పెంచుకోవాలి. అప్పుడు అనుకున్నది సాధించడం కష్టమేమీ కాదు అని టీచర్ చెప్పిన మాటలు గుర్తొస్తాయి. ప్రతి రోజు , ప్రతి క్షణం తన కళ్ళ ముందుకొచ్చి ఊరించే కోరిక ఇక కోరికగా ఉండ కూడదు . నా కలను ఎప్పటికీ మర్చి పోను. వదులుకోను . ఎగరడం ఎలాగో మర్చిపోను. ఏదో ఒక రోజు ఎగిరిపోతాను . గాలిలో తేలుతూ వెళతాను. నా ఇష్టం వచ్చినట్లు గిరికీలు కొడుతూ ఆకాశం వీపు మీద కూర్చుని తిరిగేస్తాను. నా రెక్కలు విస్తరించుకుని ఆకాశమంతా తిరిగేస్తాను .

ఇన్నాళ్ళు ఆ కోరిక నెరవేర్చుకునే వయసు లేదు. ఇప్పుడు ఆ వయసుకు దగ్గరవుతున్నది. ఇక ఆ ప్రయత్నం చేస్తాను. స్థిరంగా నిశ్చయించు కున్నది నిధి. అమ్మకు చెబితే ఏమంటుంది..?

మొదట పకపకా నవ్వుతుంది. నేను నవ్వుతూ అనట్లేదు నిజంగానే చెబుతున్నాను అన్నప్పుడు నా వైపు పరిశీలనగా చూస్తుంది. నా మోహంలో పట్టుదల కనిపిస్తుంది. అప్పుడు నన్ను దగ్గరకు తీసుకుని హత్తుకుంటుంది.

వద్దురా బంగారు తల్లీ.. అంత సాహసం వద్దురా. నువ్వింకా చిన్న పిల్లవి . పెద్దగా అయ్యాక అప్పుడు ఆలోచిద్దాం అని నచ్చ చెప్పాలని ప్రయత్నిస్తుంది .

నేను మొండికేస్తే భయపడిపోతుంది . ససేమిరా వద్దని అంటుంది. అందులో సందేహమే లేదని సన్నగా నవ్వుకుంది నిధి. ముందు నాన్నని అడిగితే. సర్లే, ఆలోచిద్దాం లేరా తల్లీ అంటూ అప్పటికి దాటవేస్తారు. కానీ నేను ఊరుకో కూడదు . గట్టి పట్టు పట్టాలి నిశ్చయంగా అనుకుంటుంది నిధి. ఇట్లా చాలా సార్లు అడగాలని అడగలేక పోయింది. మరి రెండు నెలల్లో నిధి పుట్టిన రోజు. ఆ పుట్టిన రోజు కానుకగా హ్యాంగ్ గ్లైడింగ్ చేయాలి. ముందు నాన్న దగ్గర కూర్చుని నెమ్మదిగా చెప్పాలని ఉబలాటపడింది నిధి .

★ ★ ★

ఆ రోజు ఆదివారం. అమ్మ నాన్నలు ఇద్దరూ టీచర్స్. ఇద్దరికీ సెలవేగా. ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం భోజనాలయ్యాయి. కాస్త తీరికగా కూర్చుని ఫోనులో ఏదో కెలుకుతున్నారు నాన్న. అమ్మ ఆరిన బట్టలను మడతలు పెడుతున్నది. చెల్లెలు రిధి బొమ్మల కథల పుస్తకాలలో బొమ్మలు చూస్తూ చేతులు, కళ్లు తిప్పుతూ ఏదో చెబుతున్నది. తనలో తనే నవ్వుకుంటున్నది. చెల్లెల్ని చూసి చిన్నగా నవ్వుకుంటూ నెమ్మదిగా నాన్న పక్కన చేరింది నిధి. అమ్మా నాన్నలతో తన మనసులో మాట చెప్పడానికి ఇదే మంచి సమయం అనుకున్నది. పక్కన చేరిన నిధిని ఏంటన్నట్టు చూశాడు నాన్న. ఏం చెప్పాలో, ఎట్లా చెప్పాలో అర్థం కాలేదు నిధికి. ఒక్క క్షణం అట్లాగే కూర్చుంది. ఏదో గుర్తొచ్చినట్లుగా అమ్మవైపు తిరిగింది.

"అమ్మా.. అప్పుడు మామయ్య పంపిన ఫోటోలు, వీడియోలు నీ ఫోన్ లో ఉన్నాయి కదా .." అడిగింది .

"అప్పుడు అంటే ఎప్పుడు " అన్నది అమ్మ తన పని చేసుకుంటూనే .

"మామయ్య హ్యాంగ్ గ్లైడింగ్ చేశాడు చూడు అవి" అని వివరించింది అమ్మకి. "ఇప్పటికే లెక్కలేనన్ని సార్లు చూశావ్ . ఇంకేం చూస్తావు" చిన్నగా నవ్వుతూ అన్నది అమ్మ .

"అమ్మా.. ప్లీజ్ ప్లీజ్.. టీవీ లో ప్లే చేయవా.. " బతిమాలింది.

"ఇప్పుడేందుకే.."

"నాకు మళ్లీ చూడాలనిపిస్తున్నది. అమ్మా.. ప్లీజ్.. ప్లీజ్" అంటూ మళ్ళీ అమ్మని బతిమాలింది. అంతలో రిధి వచ్చి నేనూ చూస్తానన్నది..

పోనీ ఇదీ మంచిదేలే. ఇంటి పట్టున ఉంటుంది. లేకపోతే ఆ పిల్ల గ్యాంగుతో కలిసి ఎండలో తిరుగుతూ ఉంటుంది. ఈ మధ్య మగపిల్లలతో కలసి కబుర్లు, ఆటలు బాగా పెరిగాయి. క్షణం ఇంట్లో ఉండదు. ఎంత సేపూ ఆ పిల్లలతోనే అని మనసులో అనుకుంది అమ్మ.

"ఐదు నిముషాలు ఆగు. ఈ బట్టలు మడత పెట్టడం అయిపోగానే పెడతా" అన్నది అమ్మ .

నిధి చూడాలనుకున్న ఆ ఫొటోలన్నీ రెండేళ్ల క్రితం మామయ్య ఆఫీసు పని మీద సిడ్నీ వెళ్ళినప్పటివి . అక్కడ ఉన్నన్ని రోజులు శని, ఆదివారాలు అక్కడి ప్రదేశాలు చూడడానికి వెళ్ళే వాడు. తాను చూసిన ప్రదేశాలు , ప్రాంతాలను ఫోటోలు తీసి పంపేవాడు. వీడియోలు తీసి పంపించేవాడు.

ఫోను చేసి అక్కడి వింతలు, విశేషాలు నిధి అమ్మానాన్నలతో చెప్పేవాడు.

నిధి మామయ్య సిడ్నీలో చూసిన ఓపెరా హౌస్, హార్బర్ బ్రిడ్జి , మాడం తుస్సాడ్స్, సీ లైఫ్ అక్వేరియం .. బ్ల్యూ మౌంటైన్స్, బుద్దిస్ట్ టెంపుల్, బీచ్ లు అన్నీ నచ్చేసాయి నిధికి. వాటన్నిటికంటే నచ్చింది, చాలా ఇష్టపడింది మరొకటి ఉన్నది.అదే మామయ్య

చేసిన హ్యాంగ్ గ్లైడింగ్. మొదట నమ్మలేకపోయింది. కానీ కళ్ళ ముందు కనిపిస్తుంటే నమ్మకుండా ఎలా ఉండగలదు?!

అది చూస్తుంటే మామయ్య ఒక అద్భుతంగా కనిపిస్తాడు ఆ చిన్నారి కళ్ళకి. మామయ్య ఆస్ట్రేలియా లో ఉన్నప్పుడు వీడియో కాల్ లో మాట్లాడుతా .. నువ్వు ఇంకా మామూలుగానే ఉన్నావుగా.. రెక్కల పక్షిలాగానో , సూపర్ మాన్ లాగానో ఉంటావేమో అనుకున్నా అన్నది. అప్పుడు మామయ్య పగలబడి నవ్వాడు.

అలా వెళ్ళినప్పుడు ఎలా ఉంది అని ఎన్నెన్నో ప్రశ్నలు వేసింది.

ఇండియా వచ్చేశాక ఒకరోజు నిధి వాళ్ళింటికి వచ్చాడు మామయ్య.

అప్పుడు మామయ్యని అస్సలు వదల్లేదు. యక్ష ప్రశ్నలు వేసి విసిగించకే.. వాడిప్పుడే పారిపోతాడు అన్నది అమ్మ. అయినా నిధి ప్రశ్నలు , సందేహాలు ఆగలేదు. అడిగిన విషయాలే మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకుంది .

ఆ విషయాలన్నీ బట్టలు మడత పెడుతున్న అమ్మకి గుర్తొచ్చాయి .

నాన్న ఫోన్ లో ఏదో చూస్తున్నాడు .

నాన్న పక్కన చేరిన నిధి "నాన్నా.. ఎంత ధైర్యం కదా మామయ్యకి !" కళ్ళు ఇంత పెద్దవి చేసి అన్నది. నాన్నకి అర్ధం కాలేదు. ఆ మాటలెందుకు వచ్చాయో.. అర్ధం కానట్లు నిధి మొహంలోకి చూశాడు . "అదే నాన్నా మామయ్య విమానంలో కాకుండా గాలిలో ఆకాశంలోకి వెళ్లాడు కదా.. నిజ్జంగా అలా వెళ్లి రావడం చాలా గ్రేట్ కద నాన్నా.. " తండ్రి కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది నిధి. అప్పుడు అర్ధమయిన నాన్న "ఊ.. మీ మామయ్యకి సాహసవీరుడు అని బిరుదు ఇద్దామా.. "అంటూ నవ్వేశాడు. "నాన్నా .., మామయ్య లాగా హ్యాంగ్ గ్లైడింగ్ చేసిన వాళ్ళు మీ ఫ్రెండ్స్ లో గానీ , తెలిసిన వాళ్లలో గానీ ఎవరైనా ఉన్నారా ?" "ఊహూ.. లేరురా.. " తల అడ్డంగా ఊపుతూ అన్నాడు నాన్న "అవునా .. అయితే మామయ్యకి సాహస వీరుడు అవార్డు ఇచ్చేద్దాం " హుషారుగా అంటూ నవ్వేసింది .

"అందుకే నాన్నా.. మా మామయ్య చాలా చాలా గ్రేట్ అని ఎప్పుడూ అనుకుంటాను.. "నాన్న వైపు చూస్తూ అన్నది. ఆ మాటలకు అమ్మ ముసి ముసిగా నవ్వుకుంది .

"రోడ్డు మీద కార్లో తిరిగినట్టు ఎంచక్కా ఆకాశంలో తిరిగేశాడు. మొదట, మామయ్యని అలా చూసినప్పుడు నాకు చాలా భయమేసింది తెలుసా..

ఆమ్మో.. పడిపోతే ఏమైనా ఉందా.. అనుకున్నా.. ఆ పసిఫిక్ మహా సముద్రంలోనో దట్టమైన ఆకుపచ్చ రంగు అడవుల్లోనో , ఎత్తైన కొండల్లోనో లోతైన కోనల్లోనో పడిపోతే.. అని నా ఒళ్ళు జలదరించింది. ఆ తర్వాత అమ్మ ఫోన్ తీసుకుని అప్పుడప్పుడు చాలాసార్లే చూశాను. ఎన్ని సార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలని ఇష్టం వస్తున్నది. ఇప్పుడు అస్సలు భయమేయట్లేదు తెలుసా.." అని కళ్ళు పెద్దవి చేసి చాలా ఉత్సాహంగా నాన్నతో చెప్పింది నిధి.

"దీనికి మామయ్య పంపిన వీడియో చూసినప్పటినుండి, ఆ దృశ్యాలు చూస్తూ ఎన్ని ప్రశ్నలో.. వేసిన ప్రశ్న వేయకుండా వేస్తూనే ఉంది. మా తమ్ముడు వచ్చినప్పుడు కూడా అంతే. ఎన్ని ప్రశ్నలు వేసిందో. ఎప్పుడు హ్యాంగ్ గ్లైడింగ్ గురించే కలవరిస్తున్నది" అన్నది అమ్మ . "అవును, నేనూ గమమనిస్తూనే ఉన్నాను" చిన్నగా నవ్వుతూ అన్నాడు నాన్న. ఆ తర్వాత మళ్ళీ తనే అమ్మను చూస్తూ నిధి తలపై చేయి వేసి తన దగ్గరకి లాక్కున్నాడు. "సినిమాల్లో హీరోలు చేసే సాహసాలంటే నిధికి ఇష్టం. ఆశ్చర్యంతో కళ్లింతవి చేసుకుని చూస్తుంది. భయపడుతూనే మళ్ళీ మళ్ళీ చూస్తుంది. ఆ సాహసాలను చేసే హీరోలను చాలా గొప్ప వాళ్ళుగా, బలవంతులుగా భావిస్తుంది ఆరాధిస్తుంది. అలాంటి నిధికి తన మామయ్య చేసిన సాహసాల్లో సినిమా హీరోలు చేసేవి ఏపాటివి అనుకుంటుంది" అన్నాడు నాన్న.

"నాన్నా.. వాళ్ళు నిజంగా ఆ సాహసాలు చేయరట. చేసినట్టు చూపిస్తారని, దాన్ని నటన అంటారని అమ్మ చాలా సార్లు చెప్పింది. ఒకప్పుడు అమ్మ చెప్పిన మాటల్ని నమ్మేదాన్ని కాదు. వాళ్ళని చూస్తూ కూడా అమ్మ అది నిజం కాదని చెబుతుందేంటి అని అమ్మతో గొడవ పడేదాన్ని" నవ్వుతూ అన్నది నిధి.

"అవునవును, దీని దృష్టిలో నాకేమీ తెలియదు. అందుకే, తప్పని చెప్పమని నాన్న దగ్గర చేరేదిగా.. "నవ్వింది అమ్మ.

"నేను భయపడతానని అమ్మ అట్లా చెబుతుందిలే అనుకునేదాన్ని. అందుకే అమ్మ మాటల్ని నమ్మ లేదు .

మొదటి సారి మామయ్య సాహసం చూసాక ఆలోచించాను. మామయ్యది కూడా నటనేనా అని. నటన కాదని అమ్మ చెప్పింది. నిజ్జంగానేనని. సినిమాల్లో హీరోలు చేసేది నటన. అంతా నటనే నాన్నా.. వట్టి నటనే.

మామయ్యలాగా వారు నిజ్జంగా సాహసాలు చేస్తారా.. ఉహు.. చేయరు కదా. చేసినట్టు చూపిస్తారంతే . మరి, వాళ్ళు హీరోలు ఎట్లా అవుతారు. కాదు కదా.. నిజ్జంగా సాహసాలు చేసింది మామయ్య. తను నటించలేదు. అంటే, మామయ్యే అసలైన హీరో.." అన్నది, అమ్మ నాన్నల్ని చూస్తూ."ఓ అదా సంగతి" అన్నాడు నాన్న . "అవునండీ.. దాని మనసులో మామయ్య పెద్ద హీరో అయి తిష్ట వేసుక్కూర్చున్నాడు" అన్నది అమ్మ .

"నాన్నా నువ్వు టివి లో ఫోటోలు పెట్టవా" నాన్నని అడిగింది .

"రెండు నిముషాలాగు అమ్మ వచ్చి పెడుతుంది" అని నాన్న సీరియస్ గా ఫోన్ లో ఏవో వెతుకుతున్నాడు .

అమ్మ పనిలో ఉందిగా.. అమ్మే వచ్చి పెట్టాలా ఏంటి? నువ్వు పెట్టొచ్చుగా నాన్నా.. అని నాన్న వెంట పడింది.

అప్పుడు నిధికి ఏడాది క్రితం జరిగిన ఓ సంఘటన గుర్తొచ్చింది.

★ ★ ★

అప్పుడు సంక్రాంతి సెలవులు. ఆ రోజు వర్షపు జల్లు పడి తగ్గింది. పిల్లలంతా మెట్లపై నుంచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇంటి ముందు కుడి వైపు పెరిగిన మామిడిచెట్టు ఆకులు గాలికి అటు ఇటూ కదులుతున్నాయి. వాటిని తదేకంగా చూస్తున్న నిధి ఇలా అన్నది .

'ఆకులు గాలిలో నాట్యం చేస్తున్నాయి

కొన్ని ఆకులు నాలాగే కలలు కంటున్నాయి ఆకాశపు రహస్య కోటలో ఏమున్నాయి అని వెళ్లి చూసి రావాలని ఆరాట పడుతున్నాయి. ఆ చెట్టు ఆకుల మధ్యలోంచి సాలీడు చక్రాలపై సూర్యకిరణాలు సాలెగూటిపై చిక్కుకున్న నీటి చుక్క వెండి మువ్వలాగా మెరుస్తున్నది ఎంత అద్భుతంగా ఉన్నది' నిధి నోటి నుంచి వచ్చే మాటలు వింటున్న మిత్ర బృందం ఆశ్చర్యంగా చూస్తున్నది.

'దీనికేదో పూనిందిరా.. ఆ మాటలు ఏమన్నా అర్థమయ్యాయా.. 'అన్నాడు రాహుల్. నిధికేసి ఆరాధనగా చూస్తున్నాడు కిరణ్. 'ఒసే.. కలల లోకంలోంచి బయటికిరా..

ఇక్కడ అద్భుతాలు ఏమీ జరిగిపోవడం లేదు' అరిచాడు విశాల్. 'మనుషులు నేలమీద నడుస్తారు. పరుగుపెడతారు. దూకుతారు. గెంతుతారు. పాకుతారు. దేకుతాతారు. నీళ్లలో ఈదుతారు. కానీ ఇదేంటో.. గాలిలో నడవాలంటుంది. పక్షిలా ఎగరాలంటుంది.. ఇప్పుడేమో ఇంకేదో మాట్లాడేస్తున్నది. ఎట్లారా బాబూ దీనితో వేగేది.. ' తల పట్టుకున్నాడు ఆకాశ్ .

'నాలుగు రోజులు పోతే ఇంకేం చెబుతుందో.. రెక్కల గుర్రమెక్కి ఆకాశంలో దూసుకుపోయే వీరులు కనిపించారని చెబుతుందేమో..' వెటకారంగా అన్నాడు అంకిత్..

ఆ మాటలకు మొహం విచారంగా పెట్టింది నిధి. 'ఒరే.. నోర్మూయండి రా. మనందరం అట్లా అంటే దాని నోట్లోంచి వచ్చే నాలుగు మాటలు కూడా రావు. ఊర్కోండి' ఖచ్చితంగా చెప్పాడు కిరణ్ .

నిధి పక్కన నుంచుని, 'ఎందుకలా ఉన్నావు. ఆ పక్షులు చూడు ఎంత సంతోషంగా ఉన్నాయో.. అవి ఎప్పుడూ విచారంగా ఉండవు. పక్షులు దూరం దూరంగా పై పైకి ఎగిరిపోతున్నాయి' అన్నాడు కిరణ్. అతనివైపు కృతజ్ఞతగా చూసింది. కిరణ్ చూపించే అభిమానం నిధికి నచ్చుతుంది. మాములుగా అవడానికి ప్రయత్నిస్తున్నది. అంతలో 'నిధీ.. ఇవ్వాళ మీ మామయ్య గురించి అందరికీ చెబుతానని ప్రామిస్ చేశావ్ ' అంటూ గుర్తు చేశాడు వరుణ్.

తన లోకంలోంచి ఈ లోకంలోకి వచ్చిన నిధి మామయ్య సాహసం గురించి కథలు కథలుగా తన మిత్ర బృందానికి చెప్పింది. వాళ్లంతా ఆశ్చర్యంతో విన్నారు. కళ్ళు పెద్దవి చేసి విన్నారు. మళ్లీ మళ్లీ చెప్పించుకుని విన్నారు. కిరణ్, కిషోర్ లకు ముందే తెలిసినా మళ్ళీ విన్నారు.

అయినా.. వాళ్ళకి హ్యాంగ్ గ్లైడింగ్ అంటే అర్థం కాలేదు. 'మంత్రం చెబితే చాలు గాల్లో ఎగిరే తివాచీలు ఉండేవట. మా బామ్మ చెప్పిన కథలో చెప్పింది. అలాగే మీ మామయ్య కూడా వెళ్ళాడేమో' అన్నాడు వరుణ్.'అదేం కాదు మా మామయ్య నిజంగానే వెళ్ళాడు. కావలిస్తే కిషోర్ ని కిరణ్ ని అడగండి' రోషంగా అన్నది నిధి.

'అవును. నిధి వాళ్ళ మామయ్యని మేమూ చూశాం. కానీ గ్లైడింగ్ చేయడం చూళ్ళేదు' అన్నాడు కిషోర్.

'నిజానికి మామయ్య శనివారం హ్యాంగ్ గ్లైడింగ్ చేయాల్సింది. కానీ, వాతావరణం సహకరించక మరుసటి రోజుకి మార్చుకున్నాడట. ఆరోజు దక్షిణపు దిశగా గాలులు వీస్తున్నాయి. అవి గ్లైడింగ్ కి అనువు కాదట. అందుకే ఇంకా కొంత సమయం వేచి ఉన్నారట. అప్పుడు కూడా సరైన గాలి కోసం నాలుగు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. గాలి దిశ మారింది. తూర్పు నుంచి వచ్చే గాలులు గ్లైడింగ్ చాలా అనుకూలం అట. తూర్పు గాలులు వచ్చేటప్పుడు ఎగిరాడట' చెప్పింది నిధి. 'నిజ్జంగా .. ' అన్నాడు వరుణ్. 'అవును, నిజంగానే మా మామయ్య ఆకాశంలో 500 మీటర్ల ఎత్తు ఎగిరాడట'. 'నిజమా.. ' అన్నాడు రాహుల్. 'అలా పై పైకి వెళితే కొంత దూరం వెళ్ళాక మనం ఎగరలేమట.. నడవలేమట. గాలితోనో సూర్య శక్తి తోనో ఎగిరి పోగలిగితే.. 'అన్నాడు కిరణ్

'అబ్బ.. ఆశ, దోశ, అప్పడం' కిరణ్ ని వెక్కిరిస్తూ అన్నది రవళి. 'మీ మామయ్య గ్రేట్' అన్నాడు అంకిత్ .

'ఇది ఎప్పుడూ అదే మాట అంటుంది. మామయ్య సినిమా వాళ్ళకంటే పెద్ద హీరో అని' అన్నాడు ఆకాష్. 'చెప్పడం కాదమ్మా.. చూపించు. అప్పుడు నమ్ముతా. నిజంగా మీ మామయ్య హీరో అని' సవాల్ విసిరాడు విశాల్. అవును, నిజమే నేను చూసాను కాబట్టి నాకు అర్థమయింది . లేకపోతే ఎట్లా తెలుస్తుంది . తెలియదు కదా.. వాళ్ళకి ఆ వీడియో, ఫోటోలు చూపించాలి అనుకుంది నిధి.

ఆ మిత్ర బృందంలో కిరణ్, అంకిత్ , ఎనిమిదో తరగతి చదువుతున్నారు. విశాల్ ఏడో తరగతిలో ఉన్నాడు. నిధి, కిషోర్,

రాహుల్, అతని కవల చెల్లెలు రవళి, అంకిత్ తమ్ముడు ఆకాశ్, వరుణ్ ఆరోతరగతి లో ఉన్నారు. వరుణ్ ఈ మధ్యనే ఈ మిత్ర బృందంలో చేరాడు .

అనుకున్నట్లుగానే, ఓ రోజు అమ్మ చూడకుండా ఫోన్ తీసుకుని బయటికి వచ్చింది. మిత్రులకు చూపించింది.

అందరూ ఎంతో ఉత్కంఠతో చూశారు. ఊపిరి తీసుకోవడం కూడా మరచిపోయి చూశారు. నిజ్జమే.. మీమామయ్య అచ్చం డేగ ఎగిరినట్టు ఎగురుతున్నాడని ఒకరు అంటే. విమానం వెళ్లినట్టు వెళ్ళిపోతున్నాడని మరొకరు అన్నారు. వావ్.. ఎంత స్వేచ్ఛగా విహరిస్తున్నాడు.

గాలిపటం కంటే చాలా పైకి వెళ్ళాడు అని ఒకరంటే. మీ మామయ్యని చూస్తే కుళ్ళుగా వుంది అని మరొకరు అన్నారు. 'ఆకాశంలో నక్షత్రాలను అందుకున్నాడేమో' అన్నది రవళి.

'నక్షత్రాలు భూమికన్నా చాలా పెద్దవి' చెప్పాడు విశాల్.'అవునా.. ఆకాశంలో నక్షత్రాలని ఎవరు పెట్టారు అనుకునేదాన్ని' నవ్వుతూ అన్నది రవళి.'నక్షత్రాలు, గ్రహాలు రాత్రి ఆకాశాన్ని వెలిగిస్తాయి. అవి సూరీడికన్నా పెద్దవి. ఆకాశంలో రాత్రిపూట అటు ఇటు వేగంగా కదులుతూ మెరిసే నక్షత్రాల్లా కనిపిస్తే అవి విమానం కావచ్చు . గ్రహాలు కావచ్చు' అన్నాడు కిరణ్.

'ఆకాశంలో గ్రహాలు కూడా ఉన్నాయట. నాసా నుంచి, శ్రీహరి కోట నుంచి పంపిన ఉపగ్రహాలు కూడా ఉన్నాయట. మనం ఆకాశాన్ని చాలా సేపు చూస్తూ ఉంటే మన కంటికి కూడా కనిపిస్తాయట' చెప్పాడు అంకిత్ . రకరకాలుగా వ్యాఖ్యలు చేస్తూనే ఒకటికాదు రెండు కాదు. నాలుగైదు సార్లు చూశారు కిషోర్ రాహుల్ విశాల్.

అమ్మకి ఫోన్ రావడంతో పరుగున వెళ్లి అమ్మకి ఫోన్ ఇచ్చేసి వచ్చింది నిధి.

'ఏవో కలలు కంటుంది కదా.. వాళ్ళ మామయ్య గురించి కలలు కంటుందేమో అనుకున్నా.. నిజమే వాళ్ళ మామయ్య హీరోనే' అన్నాడు వరుణ్. 'ఓస్ ఇంతేనా.. ఇది మనమూ తాయారు చేసుకోవచ్చు' తేలిగ్గా అన్నాడు కిషోర్. 'నిజ్జంగా.. అంత సులభంగా చేసుకోవచ్చా' ఆశ్చర్యంతో అడిగింది నిధి. 'అవును, గాలిపటాలు చేయడం నాకు వచ్చుగా .. అట్లాగే ఇది చేసుకోవచ్చు' అన్నాడు కిషోర్ .

'గొడుగు పట్టుకుని గాలికి ఎదురుగా పోతే అది మనని లేపుకుని వెళ్లి పోతుంది కదా.. ఇది కూడా అట్లాగే ఉన్నట్టుంది' అన్నాడు రాహుల్.

అప్పుడు నిధికి నాన్నమ్మ మాటలు గుర్తొచ్చాయి. గాలిలో గొడుగుతో వెళ్లినప్పుడు ఎగిరిపోతున్నట్లు ఉండేది. పెద్ద గాలిలో గొడుగు వేసుకుపోతే అది మనని ఎత్తుకుపోయి ఎక్కడో పడేస్తుంది అనేది.

**కవిత**

# బాలలం - భావి భారత పౌరులం




**లకావత్ సునీత,**
**SWRW Degree College, ఇబ్రహీంపట్నం.**


బాలలం మేము బాలలం
స్వేచ్ఛగా తిరిగే గాలులం
బాలలం మేం బాలలం
భావి తరాలకు రెక్కలం
యువతరం మేము యువతరం
హక్కుల కోసమై పోరాడతం
యువతరం మేము యువతరం
ప్రజలకు బాసటగా నిలిచెదం

పౌరులం మేము పౌరులం
ఈ దేశాన్ని మార్చగల యోధులం
పౌరులం మేము పౌరులం
ఈ దేశాన్ని కాపాడే సైనికులం

రైతులం మేము రైతులం
ఈ దేశా నికి వెన్నెముకలం
రైతులం మేము రైతులం

చెమటతో భూమి దాహార్తిని
తీర్చుతాం
వనితలం మేము వనితలం
పుడమి జన్మకు కారకులం
వనితలం మేము వనితలం
సృష్టిని నడుపు సారధులం

కవిత

# మనస్సున కళ్ళు



కె. మెరెల్ మెరబ్,
SWRW Degree College, ఇబ్రహీంపట్నం


విచ్చుకునే కనురెప్పలకు
ప్రతిరోజు కొత్త రోజు,
రక్తం ప్రవహించే వేగంతో
నవరసాలే కాక
ఎన్నో కళలను చూపించే చూపులు,

సృష్టిలోనే అద్భుతం
నెమలి ఈక రంగుల కళ్ళు,
చెడు దుమ్మును
భయాన్ని కప్పెసే కనురెప్పలు,
జీవిత రష్మలను ఆస్వాదించే

లోతైన నిధులు,
నయనానికి సంబంధం లేకున్నా
సాధ్యం చేసే
మంచి మనసున్న జీవులు.

# బాల బహుళ






**సాన్వి కలిత**
3 వ తరగతి,
ఆర్కేడ్ ఇంటర్నేషనల్
స్కూల్




**శ్రేష్ఠ సాయి. టి**
5 వ తరగతి,
విశాఖపట్నం

కవిత

# స్నేహామయం




స్వప్న మేకల
హైదరాబాద్ 9052221870


కొన్ని పరిచయాలు
పరిచయానికే పరిమితం..
మరికొన్ని పరిచయాలు
బంధాల తాలూకు అనుబంధాల
విలువలని సరికొత్తగా వర్ణిస్తాయి.. !!

కొన్ని స్నేహామయమై
కాలం చెట్టుకి పూసిన పువ్వులా
ఒకేలా నవ్వుతాయి..
ఒకేలా విరబూస్తాయి..
ఒకేలా ఆలోచిస్తాయి..!!

ప్రతి ఆలోచన..ఆచరణ వెనుక
నీడల్లే తోడుంటూ ప్రతిబింబంగా మారి
నువ్వెంటో తెలిపి మరువలేని
స్నేహాన్ని అజన్మాంతం మరలా మరలా
అందిస్తాయి..!!

కదిలే కాలం సాక్షిగా వెన్నంటే ఉండి నడిపించే స్నేహా
మధురిమలు
మరలరాని మరువలేని ఆత్మీయ బంధాలుగా మరిచిపోలేని
సుగంధాలుగా కడవరకు
నిత్యం పరిమళిస్తూనే ఉంటాయి..!!

## కొత్త పుస్తకాలు



'థేరీ గాథలు'
(తొలితరం బౌద్ధ సన్యాసినుల కవిత్వం)
అనుసృజన: బొల్లోజు బాబా
పేజీలు: 182,
వెల: 150.
ఛాయా రిసోర్స్ సెంటర్, హైదరాబాద్,
ఫోన్: 040 23742711




"ఈస్తటిక్ సెన్స్"
వనజ తాతినేని
కథల సంపుటి
ఫోన్: 9985981666
లోగిలి డాట్ కామ్ ద్వారా లభ్యం..
ఇక్కడ logili.com
ఇంకా హైదరాబాద్ నవోదయ లో
https://www.telugubooks.in/ లో కూడా లభించును



'అనుకోకుండా.. ఓ రోజు'
కథల సంపుటి
రచయిత్రి: పి. ఎల్. ఎన్. మంగారత్నం
ఫోన్: 9701426788
పేజీలు: 173,
వెల: 200/-

## 'బహుళ వార్షిక ప్రత్యేక సంచిక ఆర్థిక బాధ్యులు'



డాక్టర్ వంగరి త్రివేణి
రూ. 5K



డాక్టర్ నందిగామ నిర్మల కుమారి
రూ. 5K



సుమతి చురకంటి
రూ. 5K



క్రిష్ణ, S/O, మోటారాం చౌదరి,
పవన్ ఎలక్ట్రానిక్స్
రూ. 5K

Printed at JD Publications, Hyderabad

Price : 100/-